# ఆదివాసులు

## ఛత్తీస్‌గఢ్, కంధమాల్‌పై వ్యాసాలు, నివేదికలు



బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

# ఆదివాసులు

## ఛత్తీస్‌గఢ్, కంధమాల్‌పై
## వ్యాసాలు, నివేదికలు



బాలగోపాల్

# ఆదివాసులు

<u>ఛత్తీస్‌గఢ్, కంధమాల్‌పై వ్యాసాలు, నివేదికలు</u>

మానవహక్కుల వేదిక ప్రచురణ
**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 35
ప్రచురణ కాలం: అక్టోబర్ 2015
కాపీలు: 1000 వెల: 100 రూపాయలు
కవర్: అక్బర్
డిటిపి: కెవిఆర్
ముద్రణ: నవ్య ప్రింటర్స్

ప్రతులకు:
**ఎస్. జీవన్ కుమార్**
3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ,
గణేష్‌నగర్, రామంతపూర్,
హైదరాబాద్-500 013
ఫోన్: 040-27039519

**ప్రజాశక్తి, నవోదయ బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

# మా మాట

**ఇ**ది మా 35వ ప్రచురణ. ఇందులో ప్రధానంగా ఛత్తీస్‌గఢ్, కంధమాల్ పరిణామాలపై బాలగోపాల్‌గారు రాసిన వ్యాసాలు, నివేదికలు ఉన్నాయి. 'ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం', 'కంధమాల్ నుండి కరావళి దాకా ప్రజాస్వామ్యంపైన సంఘ్‌పరివార్ దాడి' పేరుతో రెండు నివేదికలు మే 2007లో, అక్టోబర్ 2009లో మానవహక్కుల వేదిక ప్రచురణలుగా వచ్చాయి. ఆదివాసుల గురించి బాలగోపాల్‌గారు రాసిన అన్ని వ్యాసాలనూ కలిపి మూడు సంపుటాలుగా తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోంది. మొదటి రెండూ పర్‌స్పెక్టివ్స్ సంస్థ ప్రచురిస్తుండగా మూడోదైన ఈ పుస్తకం మా సంస్థ ప్రచురణగా వస్తోంది.

ఛత్తీస్‌గఢ్ నివేదిక ఎనిమిదేళ్ల నాటిదైనా అక్కడి పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదు. అవే ఎన్‌కౌంటర్లు, దాడులు, ఘర్షణలు, వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. 2007 తర్వాతి ఘటనలను కూడా మేము 'The Terrible Cost of an Inhuman Counter-Insurgency' పేరుతో ఇంగ్లీషులో, 'నక్సలిజంపై రాజ్యం అణచివేత–మూల్యం చెల్లిస్తున్న ఆదివాసులు' పేరుతో తెలుగులో 2013, 2014 సంవత్సరాలలో తీసుకొచ్చాం. కంధమాల్ విషయానికొస్తే ఏడేళ్ల తర్వాత ఇప్పుడక్కడి పరిస్థితి గురించి రెండు మాటలు చెప్పుకోవాలి. ఆనాడు బాధితులు 11,348 మంది మీద ఫిర్యాదు చేస్తూ, 3,232 కేసులు పెట్టారు. పోలీసులు 827 కేసుల్లో మాత్రమే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి ఆ తర్వాత 273 కేసుల్ని తొలగించారు. మిగతా వాటిల్లో 33 కేసుల్లో మాత్రమే ఇంతవరకు తీర్పు వెలువడింది. ఎక్కువమంది నిందితులు 2–3 ఏళ్ల శిక్షతో బయటపడ్డారు. ఇది ఒక పార్శ్వం కాగా ఆ రోజు భయపడి పారిపోయిన 56,000 మంది క్రైస్తవులలో పదివేలమంది దాకా ఇప్పటికీ తిరిగి వెళ్లలేదు. మృతులకు కొద్దిపాటి నష్టపరిహారం మినహా ధ్వంసమైన చర్చిలకు, ఇతర నిర్మాణాలకు ఎటువంటి పరిహారం అందలేదు. 11 వేల మంది పిల్లలు ఈ ఘర్షణల తర్వాత చదువులు మానేసి బాలకార్మికులుగా వలసపోయారని ఒక అధ్యయనం వెల్లడించింది. ఈ దమనకాండకు ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్చిబిషప్ రాఫెల్ చీనత్ నాయకత్వంలో ఒక బృందం ఇటీవల రాష్ట్రపతిని కలిసి కంధమాల్‌లో తమకు సత్వర న్యాయం చేకూర్చవలసిందిగా కోరింది. మతం పేరుతో ఆదివాసీ ప్రాంతాలలో సైతం సంఘ్‌పరివార్ సృష్టించగల విద్వేష వాతావరణానికి, పాల్పడగల హింసకు కంధమాల్ ఒక పెద్ద ఉదాహరణ. ఇప్పటికీ కుదురుకోని అక్కడి పరిస్థితులు సంఘ్‌పరివార్ పట్ల మనం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెపుతున్నాయి. దానికోసమే ఈ పునర్ముద్రణ.

**మానవహక్కుల వేదిక**

30.9.2015

# ఇందులో...

హితవు చెప్పగల బుద్ధిజీవుల కోసం... . . . . . . . . . . . .5

దంతెవాడ దమనకాండ ఇంకెంత కాలం? . . . . . . . . .9

బస్తర్ మారణకాండ ఇప్పట్లో ఆగేనా? . . . . . . . . . .16

ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం . . . . . . . . . . . .21

విచారణలు, విషాదాలు! . . . . . . . . . . . . . . . .125

ఈ వేట ఆపమని నినదిద్దాం . . . . . . . . . . . . .129

సంఘ్‌పరివార్ హింసాకాండను
వ్యతిరేకిద్దాం రండి . . . . . . . . . . . . . . . . .133

కంధమాల్ నుండి కరావళి దాకా
ప్రజాస్వామ్యంపైన సంఘ్‌పరివార్ దాడి . . . . . . . . .139

లాల్‌గఢ్: ఎవరి బాధ్యత ఎంత? . . . . . . . . . . . .195



# హితవు చెప్పగల బుద్ధిజీవుల కోసం...

మధ్యతరగతి బుద్ధిజీవుల కంఠశోష వృథా అనే అభిప్రాయం బాగా ప్రాచుర్యం పొంది ఉంది. బుద్ధిజీవులు సహితం రాయకుండ ఉండలేక రాస్తుంటారు గానీ చేతిలో అధికారం గానీ తుపాకీ గానీ లేనప్పుడు మనమేం చెప్పినా ఏం ప్రయోజనం అని నిస్పృహ చెందుతుంటారు. చేతిలో అధికారము, తుపాకులు ఉండేవారు తమ అవసరాల కోసం ఈ అభిప్రాయాన్ని ప్రోత్సహించడం దానికి బలం చేకూరుస్తున్నది. వివేచన అంటే భయపడే అధికార వర్గాల సంగతి పక్కన పెట్టండి. వివేచనతో కూడిన శాస్త్రీయ దృక్పథం ప్రపంచ మార్పుకు అవసరం అని నమ్మేవారు సహితం బుద్ధిజీవుల పాత్రను కించపరచడం తరచుగా చూస్తుంటాం.

ఛత్తీస్‌గఢ్ పోయివస్తే ఈ అభిప్రాయం తలక్రిందులయ్యే అవకాశం ఉంది. ఆ రాష్ట్రంలో ఒక నోరున్న ప్రజాతంత్ర మేధావి వర్గం ఉండి ఉంటే ఇప్పుడు జరుగుతున్న దుర్మార్గాలు జరిగేవా అన్న సందేహం అక్కడ రెండు రోజులు గడిపి వచ్చినాక కలుగక మానదు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వమైనా, మావోయిస్టులైనా అప్పుడు ఇంత అనాలోచితంగా ప్రవర్తించగలుగుతారా అన్న అనుమానం రాక మానదు.

గొప్పలు చెప్పుకోవడం కాదు గానీ ఛత్తీస్‌గఢ్‌ను ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే ఈ తేడా అర్థం అవుతుంది. మన రాష్ట్ర పోలీసుశాఖలో ఒక బలమైన వర్గం లోపాయికారీగా నయీం వంటి నక్సలైట్ వ్యతిరేకుల హింసాత్మక చర్యలకు మద్దతు యిస్తూ ఉందిగానీ ప్రభుత్వమే 'కోబ్రాలు మావాళ్ళే'నని ప్రకటించుకోలేదు. పైపెచ్చు ముఖ్యమంత్రి, హోంమంత్రి కోబ్రాలను అదుపుచేస్తాం అని అప్పుడప్పుడు హూంకరిస్తుంటారు కూడ. ప్రైవేట్ హంతక ముఠాలతో తెల్లబట్టల పోలీసులు కలిసి వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలను హతమారుస్తున్నారు గానీ అధికారికంగానే యూనిఫారంలో ఉన్న పోలీసులు వారితో కలిసి దాడులకు దిగరు. పోలీసులు మారుమూల అడవులలోకి చొరబడి




నక్సలైట్లను జంతువులను వేటాడినట్టు వేటాడి చంపుతుంటారు గానీ చచ్చిన తరువాత మాత్రం వారికి మానవశవాలకు చేసే చట్టపరమైన సంస్కారాలన్నీ తప్పనిసరిగా చేస్తారు. స్థానిక అడవివాసులను కొట్టయినా, తన్నయినా మృతదేహాలను బయటకు మోయించుకొచ్చి పంచనామా, శవపరీక్ష నిర్వహిస్తారు. కుక్కలకూ నక్కలకూ విడిచిపెట్టి ఎంతమందిని చంపామన్న లెక్క సహితం రాసుకోకుండ ఉండరు.

అనాగరిక పరిపాలనకు కూడ కొన్ని హద్దులు ఉంటాయి. ప్రజాసామాన్యం తన నిరసన ద్వారా అమలు చేసే హద్దులను మించింది లేదుగానీ అది లేనప్పుడు బుద్ధిజీవుల విమర్శ ఒక మేరకు పనిచేయగలదు. మన దగ్గర ఆ పాత్ర నిర్వహించే ప్రజాతంత్ర భావాలుగల బుద్ధిజీవుల వర్గం ఉండటం – పత్రికలలో కాలమిస్టుల నుండి వివిధ ఉద్యమసంస్థల ప్రతినిధులు, రచయితల దాకా – ప్రభుత్వానికి పైకి కనిపించని కొన్ని హద్దులు గీయగలిగిందని అటువంటి వర్గం లేని రాష్ట్రాలను చూస్తే తెలుస్తుంది.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రోత్సహిస్తున్న 'సల్వాజుడుం' మన దగ్గర రహస్యదాడులు చేస్తున్న కోబ్రాలు, టైగర్‌లతో అన్ని రకాలుగా పోల్చదగినది కాని మాట వాస్తవమే. బలవంతంగా సల్వాజుడుం దాడులలో భాగం చేయబడుతున్న ప్రజలను మినహాయించి ఇష్టపూర్వకంగా అందులో భాగమైనవారినే లెక్కించినా, అది వేల సంఖ్యలో ఉంది. అయిదు వేల మంది ప్రభుత్వం దగ్గర తుపాకులు తీసుకొని స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా నియమితులయ్యారంటే సల్వాజుడుం కేవలం పిడికెడు మంది దుర్మార్గుల గుంపు కాదని అర్థం అవుతుంది.

అయినప్పటికీ చట్టాన్నీ ప్రజాస్వామ్య పాలనా నియమాలనూ బాహాటంగా గాలికి వదిలి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సల్వాజుడుం చేతికి 'శాంతి భద్రతల' నిర్వహణ అధికారాన్ని అప్పగించి పారామిలటరీ బలగాలను తోడు ఇవ్వడం ఆందోళనే కాక చాలా ఆశ్చర్యం కూడ కలిగించే విషయం. సమాజంలో ఒక వర్గానికి తుపాకులిచ్చి మీ శత్రువులను మీరు చంపుకోండి, మా పారామిలటరీని తోడు తీసుకోండి అని ఏ ప్రభుత్వమైనా అనగలుగుతుందని మనం సులభంగా ఊహించలేం – లోపాయికారీగా ఎన్ని జరుగుతున్నప్పటికీ. ఛత్తీస్‌గఢ్‌లో రాష్ట్ర గవర్నర్ స్వయంగా సల్వాజుడుం వీరోచిత 'పోరాటాన్ని' అభినందించి యువకులందరూ ఆ ఉద్యమంలో భాగం కావాలని ఉపన్యాసం ఇచ్చాడు. వాళ్ళేమో అంతే బహిరంగంగా పదునయిన కత్తులు, విల్లంబులు, ప్రభుత్వం ఇచ్చిన




తుపాకులు పట్టుకొని రహదార్లపైన చెక్‌పోస్టులు నెలకొల్పి తనిఖీలు చేస్తూ, ఖర్చులు వసూలు చేసుకుంటూ, తమను విమర్శించే వార్తలు రాసే విలేకరులను తన్ని ఊళ్ళ నుండి తరిమేస్తూ, తమ మాట సాగని గ్రామాలను తగలబెట్టి బూడిదచేస్తూ, చందాల పేరిట వ్యాపారవర్గాలను దోచుకుంటూ యథేచ్ఛగా ఊళ్ళు ఏలుతున్నారు.

ఇది చాలా అనాగరికమనీ ప్రమాదకరమనీ ప్రభుత్వాన్ని మందలించే స్థాయిగల పెద్దమనుషులు ఆ రాష్ట్రంలో కరువయ్యారు. ఘోరమైన ఈ చిత్రాన్ని వార్తలకెక్కించే పత్రికా రంగమే కరువయ్యింది. ప్రధానమైన హిందీ దినపత్రికలు రాయపూర్, బిలాస్‌పూర్ ప్రాంతాన్ని దాటి దక్షిణానికి దాదాపు రావు. వచ్చేవన్నీ స్థానిక పత్రికలు. అవి స్థానిక రౌడీలను విమర్శించి బతకడం కష్టం.

హితవు చెప్పగల పెద్దమనుషుల లేమి ప్రభుత్వానికే కాదు, మావోయిస్టులకు కూడ ప్రమాదకరమైన 'లైసెన్స్' ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు చేసిన కొన్ని పనులు ఇక్కడయితే జరిగేవా అన్న సందేహం కలుగుతుంది. మన దగ్గర కొన్ని మారుమూల ప్రాంతాలలో వాళ్ళు రోడ్లు వేయనివ్వలేదన్న నింద తరుచుగా వినబడిన రోజులుండేవి. అది తప్పు అన్న విమర్శ ప్రభుత్వం నుండి, పోలీసుల నుండే కాక మావోయిస్టులకు సన్నిహితులయిన వారి నుండి కూడ బలంగా వచ్చేసరికి ఇప్పుడు దాదాపు ఎక్కడా రోడ్లు వేయడాన్ని వాళ్ళు ఆపడం లేదు. ఛత్తీస్‌గఢ్‌లో అటువంటి విమర్శలు లేవు, మావోయిస్టులు తమ పద్ధతులు మార్చుకున్నదీ లేదు. వారి ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో కొత్త రోడ్లు వేయనీయక పోవడమే కాదు, పాత రోడ్లన్నింటినీ తవ్వేసారని జనం వాపోతున్నారు.

హింస మన దగ్గర కూడ మావోయిస్టులు చేస్తూనే ఉన్నారుగానీ వారు క్రూరంగా, లేక విచ్చలవిడిగా ప్రవర్తించినప్పుడల్లా వారి సిద్ధాంతం పట్ల, లేక లక్ష్యం పట్ల గౌరవం ఉన్నవారి నుండే విమర్శ బలంగా వినపడుతుంది. మొన్నటి ఫిబ్రవరి 28న దోర్నపాల్ అనే గ్రామంలో జరిగిన సల్వాజుడుం సభకు హాజరై టిప్పర్‌లో వెనక్కి వస్తున్న వారిపైన మావోయిస్టులు మందుపాతర ప్రయోగించి 26 మందిని చంపారు. మందుపాతరతోనే అందరూ చనిపోలేదనీ, బతికి బయటపడి పారిపోతున్న వారి గొంతులు కోసి చంపారనీ దాదాపు అందరూ అంటున్నారు. ఏప్రిల్ 29న సల్వాజుడుం క్యాంపునుండి తమ గ్రామానికి వెళ్ళిన మణికొంట గ్రామస్తులను మావోయిస్టులు మూకుమ్మడిగా కిడ్నాప్‌చేసి అందులో యువకులయిన 15 మంది గొంతులు కోసి చంపారు.




మన దగ్గర ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు చాలా చర్చ జరుగుతుంది. పోలీసులు, ప్రభుత్వము పెట్టే చర్చకు విలువ లేదు కానీ వామపక్షవాదులే ఎవరో ఒకరు చర్చ లేవదీస్తారు. ఇది మార్క్సిజం కానేకాదు అని ఒకరంటారు. విప్లవంలో హింసకు చోటు ఉండవచ్చుగానీ క్రూరత్వానికి లేదు అని మరొకరు అంటారు. దీనికి మావోయిస్టులు, వారికి సన్నిహితులయిన వారు ఏవో జవాబులు చెప్తుంటారు. ఎవరూ వినడం లేదని, ఈ హితోపదేశాలకు విలువ లేదని విమర్శపెట్టే వారు నిస్పృహ చెందుతుండవచ్చును గానీ దాని ప్రభావం ఉందని అటువంటి విమర్శ, విమర్శకులు లేని ప్రాంతాలను చూసినప్పుడు అర్థం అవుతుంది.

ఏ విధంగానయినా శాంతి ముందు నెలకొంటే మిగిలిన విషయాలు తరువాత చర్చించుకోవచ్చునని ఛత్తీస్‌గఢ్‌లో ప్రజల నోట వింటున్నాం. మావోయిస్టు-సల్వాజుడుం ఘర్షణలో రెండు వైపులా చనిపోతున్నది ప్రధానంగా ఆదివాసులే. గడిచిన 12 నెలల కాలంలో 400 మంది దాకా ఒక్క దంతెవాడ జిల్లాలోనే చనిపోయారు. అందువల్ల ఈ ఆదివాసీ హననం ఆగాలన్న కోరిక బలంగా ఉంది. మన దగ్గర 2004 సంవత్సరంలో కేవలం 6 నెలలు నిలిచిన కాల్పుల విరమణ కోసం పౌరస్పందన వేదిక 6 సంవత్సరాలకు పైగా కృషి చేయవలసి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ బుద్ధిజీవులలో అటువంటి ప్రయత్నం చేయగలవారు లేని లోటు ఇప్పుడు స్పష్టంగానే తెలుస్తున్నది.

ప్రజాతంత్ర వారపత్రిక
21 మే 2006








# దంతెవాడ దమనకాండ ఇంకెంత కాలం?

**మా**నవ సంచారం లేని రహదార్లు, తమ పాటికి తామే అడవులలో మేసి యజమాని లేని ఇంటికి చేరుకుంటున్న పశువులు, నిర్జనమైన గ్రామాలు, ఎక్కడికక్కడ కాలి బూడిదయిన అవశేషాలు, అడవుల మీద బరువుగా కూర్చున్న భయం – ఇదీ ఈ రోజు ఛత్తీస్‌గఢ్ లోని బస్తర్ ప్రాంతానికి చెందిన దంతెవాడ జిల్లా చిత్రం.

కుంట మన సరిహద్దు సమీపంలోని తాలూకా కేంద్రం. తెలుగువారికి సుపరిచితమైన ఊరు. ముఖ్యంగా గోదావరి జిల్లాల వాళ్లు వ్యాపారరీత్యా కుంటకు పోయి రావడం, కొందరు అక్కడే స్థిరపడి పోవడం దశాబ్దాలుగా జరుగుతున్నది.

ఈ రోజు కుంటలో గుంపులు గుంపులుగా తిరిగే సాయుధులయిన సల్వాజుడుం కార్యకర్తలు తప్ప మామూలు జనం వీధులలో కనిపించరు. ఆ ఊరిలోనే కాదు, దంతెవాడ జిల్లాలోని అన్ని రహదారి గ్రామాలలోనూ అదే పరిస్థితి. అటవీ శాఖ చెక్‌పోస్టులకు, మోటార్ రవాణా శాఖ చెక్‌పోస్టులకు పక్కనే సల్వాజుడుం చెక్‌పోస్టులు కనిపిస్తాయి. బాణాలు, పదునైన కత్తులు, కర్రలు, తుపాకులు పట్టుకున్న యువకులు వాటి పక్కన నిలబడి ఉంటారు. ప్రతీ వాహనమూ అక్కడ ఆగవలసిందే. తామెవరైనదీ ఎక్కడనుంచి వస్తున్నదీ ఎక్కడికి పోతున్నదీ చెప్పవలసిందే. ఆ పైన వారి దయ. వారిని ఊరికే పోనీయవచ్చు. డబ్బులు తీసుకొని పోనీయవచ్చు. అక్కడే ఆపేయవచ్చు. ఏది జరిగినా మౌనంగా సహించటమే ఉత్తమం. గొడవ పెట్టుకుంటే దెబ్బలు పడగలవు.

దంతెవాడ దట్టమయిన అడవులు నిండిన జిల్లా. అక్కడక్కడ ఉండే రహదార్ల దగ్గర చిత్రం ఇది కాగా రహదారి వదిలిపెట్టి అడవిలోకి పోతే ఏ అగ్ని గుండమో బద్దలయి ప్రజలను తరిమేసిందా అన్న అనుమానం వస్తుంది. కాలి బూడిదయి పోయిన గ్రామాలు కొన్నీ, ఎవరో తరిమితే ఇంటికి తాళం కూడా వేయకుండా ఇంటివాళ్ళు పారిపోయినట్టు తోచే నిర్జన ఆవాసాలు కొన్నీ




కనిపిస్తాయి. మనుషుల్ని చూడాలంటే రహదార్ల మీద సల్వాజుడుం కార్యకర్తల పహారాలో ఉన్న శరణార్థుల శిబిరాలకు పోవాలి. గ్రామాల నుండి ఎవరో తరిమివేయగా వారు ఈ శిబిరాలలోకి రాలేదు. శిబిరాలలోకి తరిమేయగా వారు గ్రామాలను ఖాళీ చేశారు. వాళ్లను గ్రామాల నుంచి శిబిరాలలోకి తరిమేసింది సల్వాజుడుం. అక్కడ వారికి కాపలా ఉంటున్నది సల్వాజుడుం. వారి తరఫున మాట్లాడేదీ సల్వాజుడుమే. సల్వాజుడుం కార్యకర్తలూ స్థానిక గ్రామాలకు చెందినవారే. వారిలో కొందరు ఆంధ్ర, బీహార్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి వచ్చి స్థిరపడిన గిరిజనేతరులు కాగా అధిక భాగం ఆదివాసులే. వాళ్లంతా సంప్రదాయక తెగపెద్దలు, ఆదివాసీ భూస్వాములు, అవినీతిపరులు అని మావోయిస్టులు ఇస్తోన్న వివరణలను గుడ్డిగా నమ్మనవసరం లేదు. ఏ కారణంగానయితేనేం వారు మావోయిస్టుల వల్ల నష్టానికి గురయిన వారు. అయితే వారి చేతిలో చట్టాన్ని పెట్టి, వారికి పారామిలటరీ బలగాల అండ కల్పించి మావోయిస్టుల మీదా, వారి సానుభూతిపరులమీదా హింసాత్మక దాడులు చేయిస్తున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నీతి చాలా అభ్యంతరకరమైనది. దానికి మావోయిస్టులు అంతే హింసాత్మకంగా స్పందిస్తుండటం దంతెవాడ జిల్లాను శ్మశానప్రాయంగా తయారు చేసింది.

## వ్యూహాత్మకమైన ఆలోచన

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానం వెనుక ఒక వ్యూహాత్మకమైన ఆలోచన ఉంది. అడవులలో ఉన్న గ్రామాలన్నిటినీ ఖాళీ చేయించేస్తే మావోయిస్టులను ప్రజలనుంచి దూరం చేయవచ్చు. అడవులలో కేవలం దళాలు మిగులుతాయి. అప్పుడు పారామిలటరీని దింపి వారిని అంతమొందించవచ్చు. లేదా రాష్ట్రం నుండి బయటకు తరిమేయవచ్చు. ప్రభుత్వమే పోలీసులను ప్రయోగించి గ్రామాలను ఖాళీ చేయిస్తే మానవ హక్కుల ఉల్లంఘన అంటూ గగ్గోలు పెడతారు కాబట్టి ఒక ప్రజా ఉద్యమమే గ్రామాలను కదిలించి, రహదార్ల పైకి తీసుకొచ్చినట్టు చూపించటం తగిన మార్గం అని ఛత్తీస్‌గఢ్ పాలకులు నిర్ణయించుకున్నారు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ ఆలోచన చేసింది పాలక పార్టీ కాదు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అయిన కాంగ్రెస్ నాయకుడు, దంతెవాడ ఎమ్మెల్యే మహేంద్ర కర్మ. మావోయిస్టుల వల్ల నష్టపోయిన వారితో సల్వాజుడుం అనే ఉద్యమాన్ని అతనే లేవదీశాడు. అయితే బిజెపి ప్రభుత్వం వెంటనే స్పందించి అతని ప్రయత్నానికి పూర్తి సహాయ సహకారాలు అందించింది.

అవిభక్త కమ్యూనిస్టు పార్టీకి దంతెవాడ జిల్లాలో కొంత పునాది ఉండింది. సిపిఐ ఇప్పటికీ అక్కడ కొంత బలం ఉన్న పార్టీయే.




మహేంద్రకర్మ ఒకప్పుడు సిపిఐ నాయకుడే. తరువాత కాంగ్రెస్‌లోకి వెళ్లి బాగా డబ్బు సంపాదించుకున్నాడు. మావోయిస్టులు నిష్కారణంగా ఇన్‌ఫార్మర్ల పేరిట చంపుతున్నారనీ, తమ ప్రశాసనాన్ని ప్రజలపైన బలవంతంగా రుద్దుతున్నారనీ అంటూ సిపిఐ 1991-92లో మహేంద్ర కర్మతో కలిసి జనజాగరణ్ (ప్రజా చైతన్య) ఉద్యమాన్ని నడిపింది. ఈ ఉద్యమం పైన మావోయిస్టులు తీవ్రంగా విరుచుకు పడ్డారు. దాదాపు 15 మంది సిపిఐ కార్యకర్తలను చంపారు. బహుశా ఈ కారణంగా సిపిఐ ఆ ఉద్యమాన్ని విరమించుకుందేమో. అయితే మహేంద్రకర్మ వంటి వాడితో చేతులు కలిపి జనజాగరణ్ ఉద్యమం నడపడం పొరపాటయిందని భావించి విరమించుకున్నామని వారంటున్నారు.

2005 మే నెలలో అదే పేరుతో మళ్లీ ఉద్యమం ప్రారంభం అయింది. ఈసారి దానిలో సిపిఐకి పాత్ర లేదు. పైగా అది ఆది నుంచి హింసాత్మకంగా సాగింది. మావోయిస్టులను నిందిస్తూ సభలూ, ఊరేగింపులూ నిర్వహించడం, వారి సానుభూతిపరుల ఇళ్లపైన దాడి చేసి వాళ్లను గుంజుకొచ్చి బహిరంగంగా 'తప్పు' ఒప్పించి పోలీసులకు అప్పగించడం ఈ జనజాగరణ్ కార్యక్రమాలు. దీనికి పోలీసుల సహకారం నూటికి నూరు పాళ్లు ఉండింది. మావోయిస్టులు జనజాగరణ్ ఉద్యమం పైన మళ్లీ పెద్దెత్తున విరుచుకు పడ్డారు. తమ జనాన్ని పోగుచేసి విల్లంబులతో దాడి చేశారు. జనజాగరణ్‌లో చురుకుగా పాల్గొన్నవారిని అపహరించి తీసుకుపోయి బాగా కొట్టారు. ఒకరిద్దరిని చంపారు.

అయితే సిపిఐ వారి జనజాగరణ్‌లాగ ఇది ఆగలేదు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నాగాలాండ్ నుంచి పారామిలటరీ బెటాలియన్‌ను తీసుకొచ్చి దంతెవాడలో దింపింది. మహేంద్రకర్మ రంగంలోకి దిగి జనజాగరణ్‌ను తన చేతిలోకి తీసుకొని సల్వాజుడుం అని పేరు పెట్టి దానికి మరింత తీవ్రరూపం ఇచ్చాడు. సల్వాజుడుం కార్యకర్తలు, నాగా బెటాలియన్ జవాన్లు కలిసి మావోయిస్టులకు బలం ఉన్న గ్రామాలపైనా మావోయిస్టు సానుభూతిపరుల ఇళ్లపైనా దాడులు చేయసాగారు. ఈ దాడులలో అందరూ పాల్గొనవలసిందే. పాల్గొనడానికి నిరాకరించిన వారిని శిక్షిస్తారు. మహేంద్రకర్మ స్వగ్రామమైన ఫరస్పాల్ పరిసర పల్లెల్లో సల్వాజుడుంలో భాగం కావడానికి నిరాకరిస్తే 700 రూపాయల జుర్మానా చెల్లించడంతో పాటు 7 కొరడా దెబ్బలు తినాలన్న నియమం పెట్టారు.

## లొంగకపోతే చావే

దాడికి గురయిన గ్రామస్తులు సరెండర్ అయి సల్వాజుడుంలో భాగం అయినట్టయితే బతికిపోతారు. వాళ్లప్పుడు ఊరు వదిలి



వచ్చేయాలి. వాళ్ల కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో రహదార్లపైన శిబిరాలు వెలిసాయి. వాళ్లు వాటిలో ఉండాలి. లొంగని వాళ్లను అక్కడికక్కడే చంపేస్తారు. వాళ్ల ఇళ్ళు కాల్చేస్తారు. మరణం తప్పించుకోవాలన్నా ఊరు విడిచి పారిపోవాల్సిందే. అయితే రహదారి దిశగా కాకుండ అడవిలో ఇంకా లోపలికి పారిపోయి 'అన్నల' సంరక్షణలో బతకాలి. ఇవి రెండూ ఇష్టం లేని వాళ్లు సరిహద్దు దాటి మన ఖమ్మం జిల్లాలోకి వచ్చేశారు. సరిహద్దుకు రెండు వైపులా ఉండేది కోయ, గొత్తికోయ గిరిజనులే కాబట్టి ఎక్కడో ఒక చోట ఆశ్రయం పొందుతున్నారు. నిజానికి చాలా మంది సల్వాజుడుం, మావోయిస్టు కార్యకర్తలు కూడ ప్రాణభయం కారణంగా ఇటు వచ్చేశారు. చింతూరు, దుమ్ముగూడెం, భద్రాచలం, చర్ల మండలాల గ్రామాలలో ఈ కాందిశీకులు చాలామందే ఉన్నారు. దంతెవాడ జిల్లాలోని రహదారి శిబిరాలలోని వారు చాలావరకు కృత్రిమ కాందిశీకులు కాగా, నిజమైన కాందిశీకులు ఖమ్మం జిల్లాలో ఉన్నారు!

2005 జూన్‌లో మొదలయిన ఈ సల్వాజుడుం ఉద్యమంలో వందల – బహుశా వేల – ఇళ్లు దహనం అయ్యాయి. కుంట తాలూకాలోనయితే రహదారికి 20 లేక 30 కిలోమీటర్లలో ఉన్న గ్రామాలన్నీ ఖాళీ అయ్యాయి. కుంట, బిజాపూర్, బైరంగఢ్, గీదం, ఉసూర్ బ్లాకులలో మొత్తం 17 రహదారి శిబిరాలు ఉన్నాయి. వాటిలో ఉన్న జనాభా 54,768 అనేది దంతెవాడ జిల్లా కలెక్టర్ చెప్తున్న లెక్క. అయితే 'క్యాంపుల లోకి వచ్చిన వారంతా ప్రభుత్వం పక్షాన ఉన్నారు, అడవిలో ఉన్నవారు మావోయిస్టుల పక్షాన ఉన్నారు' అన్న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ ప్రకటన దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఈ జన సంఖ్య లెక్కలలో అతిశయోక్తి ఉందేమో అనిపిస్తుంది. అయినప్పటికీ శిబిరాలలో వేల సంఖ్యలో జనం ఉన్న మాట వాస్తవం. ఆ శిబిరాల స్థితిని వివరంగా వర్ణించే బదులు కోళ్ల ఫారంలో కోళ్లలాగ ఉంటున్నారంటే సులభంగా అర్థం అవుతుంది. 10 మంది నివసించగల షెడ్‌లలో 40 నుంచి 80 మంది ఉంటున్నారు. షెడ్‌లకు ఎటువైపూ గోడలు లేవు. కొన్నిటికి పై కప్పు కూడ లేదు. గ్రామాల నుంచి బెదిరించి తీసుకొచ్చిన వాళ్లు వెనక్కి పోకుండ ఉండడానికి రెండు పూటలా అన్నం పెడుతున్నారు గానీ వెనక్కి పోయే ప్రమాదం లేని సరండర్డ్ మావోయిస్టులకు అన్నం కూడా పెట్టడం లేదు.

ఇది మొదలయినప్పటి నుండి – అంటే 2005 జూన్ నుంచి – రెండు వైపులా పెద్దఎత్తున హింస జరుగుతున్నది. సల్వాజుడుం నాగా బెటాలియన్‌ను వెంట బెట్టుకొని గ్రామాలపైన దాడి చేసి చాలామందిని చంపింది. అయితే ఈ హత్యల లెక్క ప్రభుత్వం దగ్గర కూడా లేదు. మన దగ్గర ఎంత దట్టమైన అడవిలో 'ఎన్‌కౌంటర్' జరిగినా పోలీసులు ఎంఆర్‌వోను శవాల దగ్గరికి



చేర్చి పంచనామా జరిపిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో అదేమీ లేదు. సల్వాజుడుం వాళ్ళూ పారామిలటరీ బలగాలూ కలిసి దాడులు చేస్తారు. కాల్పులు జరిపి చంపుతారు. కాని శవాలను తీసుకురారు. పంచనామా జరపరు. ఎక్కడా అధికారికంగా ఏ రికార్డూ ఉండదు. అసలు తమ కాల్పులలో గాయపడ్డవాళ్లు చచ్చారా బతికారా అని కూడ వాళ్లు తెలుసుకోరు. కాబట్టి అవతలి వైపు ఎంత మంది చనిపోయారో చెప్పడం కష్టం. మావోయిస్టుల ప్రచురణలలో వచ్చిన సమాచారాన్ని బట్టి ఊహ చేయవలసిందే.

మావోయిస్టులు చేసిన హత్యల వివరాలు మాత్రం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కచ్చితంగానే చెప్తుంది. సల్వాజుడుం ప్రారంభం అయిన నాటి నుంచి (అంటే 2005 జూన్ నుంచి) నేటిదాకా మావోయిస్టులు దంతెవాడ జిల్లాలో 228 మందిని చంపారనీ, అందులో 12 మంది స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు, 25 మంది పారామిలటరీ సిబ్బంది కాగా 191 మంది పౌరులనీ చెప్తుంది. ఆ 191 మందిలో ఒకరిద్దరిని మినహాయిస్తే అంతా ఆదివాసులే. గత ఏడాది జూన్‌కు పూర్వం మావోయిస్టులు చేసిన హత్యలే ఎక్కువ ఉండేవి. (బస్తర్ పోలీసులు మనవాళ్లలాగ 'ఎన్‌కౌంటర్' నిపుణులు కారు). కానీ సల్వాజుడుం ఏర్పడి దానికి పారామిలటరీ తోడయిన తరువాత ఆ తేడా పోయింది. వారి వైపు నుంచి జరిగిన హత్యలూ అదే మోతాదులో ఉన్నట్టయితే ఒక్క దంతెవాడ జిల్లాలోనే గడచిన 12 నెలల కాలంలో 200 పైగా ప్రాణాలు ఈ ఘర్షణలో పోయాయనీ, అందులో 90 శాతం పైగా ఆదివాసులేనని నిర్ధారించవలసి ఉంటుంది.


ఇది ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధంలాగ తోస్తున్నదా?

దానిని పెంచే పని ఇప్పుడు రెండు వైపులా జరుగుతున్నది. ప్రభుత్వం సల్వాజుడుంలోని చురుకయిన ఆదివాసీ యువకులలో 5000 మందిని ఇప్పటికే ఎంపిక చేసి స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా నియమించి తుపాకులిచ్చింది. అటు మావోయిస్టులు తమతో ఉన్న ఆదివాసీ యువకులకు తుపాకులిచ్చి భూంకాల్ మిలీషియా అని పేరు పెట్టారు.

## ఆదివాసుల్లో భూస్వాములు!

సల్వాజుడుంతో ఉన్నది ఆదివాసీ పెత్తందార్లనీ, మావోయిస్టులతో ఉన్నది ఆదివాసీ పేదలనీ, ఈ వర్గ విభేదం గమనించకుండ రెండు వైపులా ఆదివాసులే చనిపోతున్నారని అనవసరంగా రచ్చ చేస్తున్నామనీ నిందవేసే అవకాశం ఉంది. భూస్వాములయిన ఆదివాసులలో ఆదివాసీ తెగ పెద్దలూ పూజార్లూ మావోయిస్టుల ఉద్యమాల ఫలితంగా తమ ఆధిపత్యాన్ని కోల్పోయారనీ,






సల్వాజుడుంకు దన్నుగా నిలిచారనీ మావోయిస్టుల ప్రచురణలలో వ్యాఖ్యానించడం చూస్తున్నాం. దీని గురించి రెండు మాటలు చెప్పడం అవసరం.

ఆదివాసులలో భూమి ఎక్కువ ఉన్నవాళ్లు కొందరున్న మాట వాస్తవమేగానీ వాళ్లకు 'భూస్వాములు' అన్న బిరుదు ఇచ్చే ముందు వాళ్లు చేసే వ్యవసాయం – సాగునీరు గానీ, మేలయిన విత్తనాలుగానీ, ఏ రకమైన ఎరువులుగానీ ఎరుగనిదనీ, వారు వర్షాధారంగా పండించే వరిపంట ఎకరానికి రెండు లేక మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే ఇస్తుందనీ తెలుసుకోవడం అవసరం. కాగా దంతెవాడలో మావోయిస్టుల పోరాటం (వారి పరిభాషలో చెప్పాలంటే) పేద ప్రజల సామాజిక ఆర్థిక హక్కులు సాధించే దశలో లేదు. దానిని దాటి, గెరిల్లా దశ దాటి 'విముక్త ప్రాంత' స్థాపన దశ చేరుకుంది. అంటే భారత ప్రశాసనాన్ని బల ప్రయోగంతో పక్కకు నెట్టి తమ రాజ్యాధికారాన్ని నెలకొల్పే దశలో ఉంది. దీని మంచిచెడుల గురించి ఎవరికి ఏ అభిప్రాయమయినా ఉండవచ్చును గానీ దీనివల్ల కేవలం ఆదివాసీ పెత్తందారీ వర్గాలు మాత్రమే నష్టపోతాయనుకుంటే పొరపాటే.

ప్రభుత్వం నిర్వహించిన ఎన్నికలలో ఎన్నికయిన స్థానిక సంస్థల ప్రతినిధులు పరిపాలన చేయడానికి వీలు లేదు. మావోయిస్టులు నెలకొల్పిన సంఘమే పరిపాలన చేస్తుంది. ప్రభుత్వ శాఖలేవీ తమ విధులు నిర్వర్తించడానికి వీలు లేదు. మావోయిస్టుల పరిపాలనే అన్నీ చూసుకుంటుంది. (విద్య, వైద్య రంగాలను మాత్రమే దీనినుంచి మినహాయించారు). అడవి లోపలి ప్రాంతంలో రోడ్లు వేస్తే ప్రభుత్వ సాయుధ బలగాలు యథేచ్ఛగా ప్రవేశిస్తాయి కాబట్టి రోడ్లు వేయడానికి వీలు లేదు. వేసినవి తవ్వేశారు. గడచిన సంవత్సర కాలంలో పారామిలటరీ బలగాలు పాఠశాల భవనాలలో విశ్రాంతి తీసుకుంటున్నాయి కాబట్టి కొత్త పాఠశాల భవనాలు కట్టడానికి వీలు లేదు. కొన్ని పాఠశాల భవనాలను పేల్చేశారు. కుంట తాలూకాలో 31 స్కూళ్లను మావోయిస్టులు పేల్చేశారని ఆ తాలూకా తాసీల్దారు అంటాడు. తునికాకు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు తెంపడానికి వీలు లేదు. తాము నిర్ణయించిన రేటుకే తెంపాలి. తొలినాడు మావోయిస్టులు ఆదివాసీ ప్రజల సామాజిక ఆర్థిక హక్కుల సాధనకు పరిమితమైన దశలో తునికాకు కూలిరేటు, ఫారెస్టు పనుల కూలిరేట్లు గణనీయంగా పెంచారు. అటవీశాఖ, పోలీసు శాఖల దోపిడీ దౌర్జన్యాలను అరికట్టారు. సాంప్రదాయక పటేల్–పట్వారీ వ్యవస్థను అదుపు చేశారు. ఆ దశలో వారి చర్యల వల్ల కేవలం స్థానిక పెత్తందారీ వర్గాలే నష్టపోయాయి. కానీ దంతెవాడ అటవీ ప్రాంతాన్ని 'విముక్త' ప్రాంతంగా ప్రకటించిన తరువాత అదే పరిస్థితి




ఉండదు. పీడిత ప్రజల అంతిమ విముక్తికి ఇది అవసరమా కాదా అన్న చర్చలోకి నేను పోవడం లేదు. దీని పర్యవసానాలను నిజాయితీగా గుర్తించడం మాత్రం అవసరం.

2005 మే నెలలో జనజాగరణ్ అభియాన్ ప్రారంభమైన వైనాన్ని గురించి దాదాపు అందరూ అంగీకరించే వాస్తవం ఒక్కటి ఉంది. అంతకు ముందు సంవత్సరం పంటలు విఫలం కావడం వల్ల జరుగుబాటుకు కష్టంగా ఉండింది. ప్రభుత్వం కరువు పనుల కింద చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని మావోయిస్టులు సాగనివ్వలేదు. ప్రభుత్వం తునికాకు రేటు తగ్గించినందుకు నిరసనగా ఆకు తెంపడాన్ని మావోయిస్టులు బంద్ చేయించారు. ఈ స్థితిలో తమ బతుకు ఎట్లా గడవాలని బిజాపూర్ ప్రాంతంలోని రెండు మూడు గ్రామాల ప్రజలు తమంతట తామే సమావేశాలు పెట్టుకొని చర్చించుకోసాగారు. మావోయిస్టుల చర్యల పట్ల వారిలో ఉన్న నిరసనను గమనించిన మావోయిస్టు వ్యతిరేకులు రంగంలోకి దిగి దానిని తమ చేతిలోకి తీసుకున్నారు. ఆ తరువాత పరిణామాలను పైన చూశాము. కేవలం పెత్తందారీ వర్గాలలోనే కాక ప్రజాసామాన్యంలోనూ మావోయిస్టుల చర్యల పట్ల కొంత నిరసన ఉండబట్టే 'సల్వాజుడుం' సాధ్యం అయిందన్న వాస్తవాన్ని గుర్తించడం అవసరం. ఇరవై ఏళ్లకు పైగా ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఏకచ్ఛత్రాధిపతులుగా ఉన్న మావోయిస్టులు ఈ నిరసనను ఊహించినట్టు లేరు. వారిస్తున్న వివరణలలో స్పష్టంగా కనిపిస్తున్న తత్తరపాటు దీనికి నిదర్శనం.

ప్రస్తుతం ఇరుపక్షాలూ మొండిగా ఉన్నారు. మావోయిజం అంతమయ్యే వరకూ సల్వాజుడుం కొనసాగుతుంది అని సల్వాజుడుం నాయకులు బయటికి ప్రకటిస్తున్నారు గానీ అది కల్ల అని వారికి తెలుసు. అట్లాగని సల్వాజుడుంను ఇప్పుడు విరమించుకోనూ లేరు. విరమించుకుంటే వాళ్లెవరూ బతకరు. మావోయిస్టుల సద్గుణాలలో క్షమాగుణం లేదు. కానీ ఈ ఆదివాసీ హననం ఎంతకాలం సాగగలదు? పరిస్థితిని చేతిలోకి తీసుకొని ఇరుపక్షాలకూ బుద్ధి చెప్పగల వారెవరయినా ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నారా? అటువంటివారి కోసం వెతికే ప్రయత్నం సఫలం కాగలదా?

ఆంధ్రజ్యోతి దినపత్రిక
25 మే 2006






# బస్తర్ మారణకాండ ఇప్పట్లో ఆగేనా?

ఛత్తీస్‌గఢ్ వార్తలు మళ్లీ చాలా కలవరం పుట్టిస్తున్నాయి. కుంట తాలుకాలో మావోయిస్టులు మూడవ దఫా పెద్ద నరమేధానికి పాల్పడ్డారు. దర్భగూడలో గతంలో టిప్పర్‌ను పేల్చి, చనిపోని వారి గొంతులు కోసి 26 మందిని చంపారు. ఆ తరువాత మణికొంటలో 36 మందిని అపహరించి 15 మందిని చంపారు. ఇప్పుడు ఎర్రబోరులో పెద్దసంఖ్యలో జనాన్ని అపహరించి ఇళ్లు తగలబెట్టి 30 చిల్లర మందిని హతమార్చారు.

ఏ కారణంగానో మావోయిస్టులు చంపిన వార్తలు మన పత్రికలలో వచ్చిన దానిలో శతాంశం కూడ వాళ్లు, వాళ్ల సానుభూతిపరులు చనిపోయిన వార్తలు రావు. మన దగ్గర పత్రికా రంగం మరీ అంత పక్షపాత బుద్ధితో ఉందనలేము. అయినప్పటికీ వార్తల ప్రచురణలో ఈ వివక్ష ఉండడానికి రెండు కారణాలున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పత్రికారంగం చాలా అపరిపక్వంగా ఉంది. మన దగ్గరున్నట్టు గ్రామీణ విలేకర్ల వ్యవస్థ లేదు (కనీసం బస్తర్ ప్రాంతంలో లేదు). అందువల్ల అధికార యంత్రాంగం ఇచ్చిన వార్తలే వార్తలు. అక్కడి అధికార యంత్రాంగం సల్వాజుడుం, పారామిలటరీ బలగాలు విడివిడిగానూ, ఒకటి గానూ చేస్తున్న హత్యల గురించి మాట్లాడదు. పత్రికా ప్రకటనలు ఇవ్వకపోవడమే కాదు, కనీసం తన అవసరాల కోసం కూడ ఆ సమాచారం సేకరించదు. బస్తర్‌లో సాగుతున్న యుద్ధంలో అవతలివైపు ఎంతమంది చనిపోయారన్న సమాచారం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం దగ్గర సహితం లేదు.

ఉదాహరణకు దాదాపు నెల రోజుల క్రింద దేవరపల్లి అనే ఊరిలోనో ఊరిదగ్గరో సల్వాజుడుం గుంపు, పారామిలటరీ బలగాలు కలిసి 50 మందికి పైగా మావోయిస్టు సానుభూతిపరులను చంపినట్టు ఉత్తర భారతదేశంలోని పత్రికలు చిన్నవార్త ప్రచురించాయి. తెలుగు



పత్రికలలో గానీ మన దగ్గర ప్రచురితమయ్యే ఆంగ్ల పత్రికలలో గానీ ఈ వార్త రాలేదు. అయినప్పటికీ ఇది విశ్వసనీయమైన వార్తే – ఎందుకంటే ఈ విషయం బయటపెట్టింది సిపిఐకి చెందిన కుంట మాజీ ఎంఎల్‌ఏ మనీష్ కుంజం. అతను ఇటు మావోయిస్టులను, అటు సల్వాజుడుంను వ్యతిరేకిస్తున్న వ్యక్తి కాబట్టి ఒకరికి అనుకూలంగా అబద్ధాలు చెప్పవలసిన అగత్యం అతనికి లేదు.

ఈ హత్య, ప్రతిహత్యల కాండలో స్పష్టంగా కనిపిస్తున్న వికారమైన వాస్తవం ఏమిటంటే సల్వాజుడుం ఎంత నిర్విచక్షణగా చంపుతున్నదో మావోయిస్టులూ అంతే నిర్విచక్షణగా చంపుతుండడం. మన దగ్గర కూడ కాలక్రమంలో విచక్షణారాహిత్యం పెరిగింది. ఎవరి మీద సహేతుకమైన ఆగ్రహం ఉందో వారిని మాత్రమే శిక్షించాలన్న నియమాన్ని మావోయిస్టులు కొద్ది కొద్దిగా అతిక్రమిస్తూ వచ్చారు. పోలీసుల విషయంలో ఇది చాలా దూరం పోయింది. మందుపాతర పెట్టి పోలీసు వాహనాలు పేల్చేసేటప్పుడు అందులో ఎవరుంటే వారంతా చనిపోతారు. అంతేకాక, మారుమూల ప్రాంతాలలో నిరాయుధులుగా చేతికి చిక్కిన పోలీసు సిబ్బందినెవరినయినా చంపడం కొంత కాలంగా జరుగుతున్నది. ఇతర 'శత్రువర్గాలకు' కూడ ఈ విచక్షణా రాహిత్యాన్ని క్రమంగా వ్యాపింపజేసారు. ప్రభుత్వ నిర్బంధ విధానాల పట్ల నిరసన తెలిపే పేరుతో పాలక పార్టీ స్థానిక ప్రతినిధులెవరిపైనయినా దాడి చేయడం చాలా కాలంగా జరుగుతున్నది. ఒకరి పైన దాడి చేసేటప్పుడు పక్కన వేరే ఎవరయినా ఉన్నట్టయితే వారికి కూడ హాని జరుగుతుందని ఆగిన రోజులు ఉండే ఉంటాయి. కాని ఇప్పుడు ఆ నియమమూ అన్ని సందర్భాలలో మావోయిస్టులు పాటించడం లేదు. మక్తల్ ఎంఎల్‌ఏ నర్సిరెడ్డిని ఎందుకు చంపారో చెప్పలేదు సరికదా, అతనితోబాటు మరొక పదిమందిని ఎందుకు కాల్చి చంపారన్న దానికి వివరణ లేదు. సంజాయిషీ లేదు.

ఛత్తీస్‌గఢ్‌కు తిరిగి వస్తే, తెలుగు పత్రికలు ఏ కారణంగానో మావోయిస్టు – సల్వాజుడుంల ఘర్షణను గొత్తికోయ, కోయ తెగల మధ్య ఘర్షణగా వ్యాఖ్యానిస్తున్నాయి. భద్రాచలంలో పుట్టిన ఈ వ్యాఖ్యను బస్తర్‌లో ఎవరూ సమర్థించడం లేదు. అటువంటి వ్యాఖ్య చేస్తున్నారా అని ఆశ్చర్యపోతున్నారు కూడ. కీడెంచి మేలెంచమన్న సూక్తిలో విజ్ఞత ఉన్నమాట కాదనలేము గానీ అదే పనిగా కీడెంచడం వల్ల ఆ కీడును నిజం చేసే ప్రమాదం లేకపోలేదని కూడ గుర్తించడం అవసరం. అడవి లోతట్టు ప్రాంతాలలో గొత్తికోయల జనాభా సాపేక్షంగా ఎక్కువ ఉండడం వల్ల మావోయిస్టు అనుయాయులలో కూడ గొత్తికోయలు సాపేక్షంగా ఎక్కువ ఉన్నారు. రహదారి సమీప






గ్రామాల్లో కోయలు ఎక్కువ ఉండడం వల్ల సల్వాజుడుంలో సాపేక్షంగా వారి సంఖ్య ఎక్కువ ఉంది. అంతకు మించి ఇక్కడ గొత్తికోయ-కోయ అన్న వైరుధ్యం లేదని బస్తర్‌లో అంటున్నారు. నిజానికి సల్వాజుడుం అగ్రనేత మహేంద్ర కర్మ స్వయాన గొత్తికోయ తెగకు చెందినవాడు.

ఇది చెప్పడం అవసరం. ఎందుకంటే బస్తర్ సంగతి ఎట్లాగున్నా అక్కడి నుండి వలస వచ్చిన గొత్తికోయల భూమి 'దాహం' కారణంగా భద్రాచలం ప్రాంతం కోయలలో వారి పట్ల కొంత వ్యతిరేకత కొంతకాలం ఉండింది. వ్యతిరేకతకు తొలుత ఏ కారణం ఉన్నా అది కులంతో లేక తెగతో ముడిపడినట్టయితే ఆ తరువాత తొలినాటి కారణంతో నిమిత్తం లేకుండా పెరగగలదు. చాలా ప్రమాదకరంగానూ తయారుకాగలదు. అదృష్టవశాత్తు భద్రాచలం ప్రాంతంలో ఈ వ్యతిరేకత కాలక్రమంలో తగ్గింది. అందులో ఆదివాసీ సంఘాల పాత్ర గణనీయంగా ఉండడం చెప్పుకోదగ్గ విషయం. భద్రాచలం ప్రాంతంలోని ఆదివాసీ సంఘాల నాయకులంతా కోయలే అయినప్పటికీ తమ వారిలో గొత్తికోయల పట్ల ఉన్న అనుమానాలనూ వ్యతిరేకతనూ పోగొట్టడానికి వారు చేసిన కృషి హర్షణీయం. బహుశా ఈ జ్ఞాపకాల కారణంగానేనేమో మావోయిస్టు - సల్వాజుడుం వైరాన్ని గురించి బస్తర్‌లో చేయని వ్యాఖ్య భద్రాచలంలో చేస్తున్నారు.

ఒకటి మాత్రం నిజం. గొత్తికోయలయినా కోయలయినా ఆదివాసులలో మిలిటెన్సీ ఎక్కువ. దానిని ఇరుపక్షాల నాయకులూ నిర్మొగమాటంగా వాడుకుంటున్నారు. తమ ప్రత్యర్థులుగా భావించిన వారిపైన మూకుమ్మడిగా దాడి చేయడానికి, గొర్రెలను నరికినట్టు నరకడానికి ఆదివాసులు వెనకాడరు. ఈ గుణాన్ని అటు సల్వాజుడుం నాయకులు, ఇటు మావోయిస్టు నాయకులూ కూడ ప్రోత్సహిస్తున్నారు, వాడుకుంటున్నారు. 'వాళ్లు చేస్తున్నారు కాబట్టి మేము చేయకతప్పదు' అని ఇద్దరూ అనొచ్చు. ఏమయితేనేం ఇది జరుగుతున్న మాట సత్యం. దీని ఫలితం ఆదివాసీ హననం. ఒక సంవత్సర కాలంలోనే ఒక్క దంతెవాడ జిల్లాలోనే ఈ హత్యాకాండలో 500 ప్రాణాల దాకా పోయాయి. అందులో 95 శాతం మంది స్థానిక ఆదివాసులే. విప్లవ సానుభూతిపరులు కావచ్చు, విప్లవ వ్యతిరేకులు కావచ్చు, సాదా కమ్యూనిస్టులు కావచ్చు, కాంగ్రెస్ అనుయాయులు కావచ్చు, అత్యధికభాగం ఇవేవీ కాని అడవిబిడ్డలు కావచ్చు. మొత్తానికి అంతా ఆదివాసులే. వారి మిలిటెన్సీ వారి పేరు మీద సాగుతున్న ఘర్షణలో ఒక సాధనమై వారి ప్రాణం మీదికే తెచ్చింది.




భద్రాచలం ప్రాంత గ్రామాలలో ఈ ఆవేదన చాలా వినిపిస్తుంది. 'రెండువైపులా ఉన్నది మావాళ్లే. చనిపోతే పలకరింపుకు పోదామన్నా భయంగా ఉంది. ఎవరైనా ఈ మారణకాండను ఆపండి. ఎట్లాగయినా ఆపండి' అని చింతూరుకు చెందిన ఆదివాసులు అంటున్నారు. రాజకీయాలు, సామాజిక భద్రత, విప్లవం అనేవి తప్ప మనుషులు కనిపించని వారికి ఈ ఆవేదన అర్థంకాక పోవచ్చు. కానీ ఇది చాలా విస్తృతంగా వినిపిస్తున్న ఆవేదన.

ప్రభుత్వాలు దీనిని వినిపించుకునే స్థితిలో లేవు. అమర్యాద అనుకుంటే అనుకోండిగానీ, మావోయిస్టు ఉద్యమం దేశానికి ప్రధాన ఆంతరంగిక ప్రమాదం అన్న బుద్ధి లేని వ్యాఖ్య దేశ ప్రధానమంత్రి స్వయంగా చేయడం పాలనా వైఖరిని సూచిస్తుంది. దానిని భద్రతా ప్రమాదంగా చూసిన తరువాత సైనిక చర్యలు తప్ప వేరే ఏ ఆలోచనలు రాగలవు ప్రభుత్వానికి? ప్రభుత్వ పారామిలటరీకి తోడు సల్వాజుడుం పేరిట ప్రైవేట్ పారామిలటరీని కూడ తయారుచేసి మావోయిస్టులను 'ఎదుర్కొంటున్న' ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ వ్యూహాన్ని దేశ ఆంతరంగిక భద్రతా వ్యూహకర్తలు ఆసక్తిగా చూస్తున్నారని వింటున్నాం. 'మీరు చెప్పే నీతులు ప్రభుత్వం వినదు కాబట్టి మేము కూడ వినము' అనే జవాబు ఆపైన మావోయిస్టుల నుండి సులభంగానే వస్తుంది. ఈ పరిస్థితులలో సమీప భవిష్యత్తులో ఈ మారణకాండ ఆగుతుందని ఆశించగలమా?

ప్రజాతంత్ర వారపత్రిక
23 జూలై 2008

# ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం




ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం సృష్టి,
దాని పర్యవసానాలపై నివేదిక

మానవహక్కుల వేదిక ప్రచురణ




ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం సృష్టి,
దాని పర్యవసానాలపై నివేదిక

**కవర్ ఫోటోలు :** ఖమ్మం జిల్లాలోని సున్నంవారిమట్టకలో మన అటవీశాఖ కూల్చేసిన ఛత్తీస్‌గఢ్ గుత్తికోయల ఇళ్ళు, వాటి మధ్య తిరుగుతున్న వారి పిల్లలు. పక్క ఫోటోలో కనిపిస్తున్నది ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కడ చూసినా కనిపించే ఒక హిందీ బోర్డు. దాని అర్థం 'నక్సలిజం నుంచి విముక్తికి మూలమంత్రం సల్వాజుడుం. నక్సలైట్లను తరమండి...బస్తర్‌ను కాపాడండి. నక్సలైట్లను తరమండి...దేశాన్ని కాపాడండి'.

**వెనుక కవర్ ఫోటో :** ఖమ్మం జిల్లా సరివెల దగ్గర గుత్తికోయలు వేసుకున్న ఇళ్ళను మన అటవీశాఖ కూల్చేసిన రెండోరోజున బిడ్డను కన్న వెట్టి మాసమ్మ.

**ముద్రణ :** మే 2007




# ముందుమాట

'సల్వాజుడుం' పేరు వినని వాళ్ళు ఇప్పుడెవరూ లేరు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో సమాంతర ప్రభుత్వాన్ని నెలకొల్పి చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు బలప్రయోగంతో అడ్డం పడుతున్న మావోయిస్టులకు వ్యతిరేకంగా మహేంద్రకర్మ అనే కాంగ్రెస్ ఎంఎల్ఏ నాయకత్వంలో పెల్లుబికిన ఆదివాసీ నిరసనోద్యమంగా దానిని ఆ రాష్ట్ర ప్రభుత్వమే కాక కేంద్రప్రభుత్వం కూడా వర్ణిస్తున్నది, ప్రశంసిస్తున్నది. మావోయిస్టులను సాయుధ చర్యల ద్వారా ఎదుర్కొనేందుకు అనుసరించగల మార్గాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసు యంత్రాంగం తయారు చేసిన గ్రేహౌండ్స్ బలగాలు దేశానికి చూపించగా, ఆదివాసీ ప్రజా ఉద్యమం ద్వారా వారిని ఎదుర్కొనేందుకు ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం బాటవేసి చూపిందని దేశ పాలనా యంత్రాంగం దాపరికం లేకుండా అంటున్నది.

అయితే సల్వాజుడుం ప్రజా ఉద్యమం కానేకాదనీ, ప్రభుత్వం ఆయుధాలిచ్చి, నేరాలు చేసే లైసెన్స్ ఇచ్చి సమాజం మీదికి వదిలిన నేరగాళ్ళ గుంపు అనే అభిప్రాయం మావోయిస్టు పార్టీయే కాక వివిధ నిజనిర్ధారణ కమిటీల నివేదికలలోను, దినపత్రిక రిపోర్టులలోను కూడా వ్యక్తమైన సంగతి తెలిసిందే.


పత్రికలలో వస్తున్న వార్తలు మరొక వర్తమానాన్ని అందజేశాయి. సల్వాజుడుం మీద ప్రతీకారంతో మావోయిస్టులు సల్వాజుడుం ఆధ్వర్యంలో నడుస్తున్న రహదారి శిబిరాలపైన దాడిచేసి మూకుమ్మడి ఊచకోతకు పాల్పడుతున్నారని. బహుశా 100 మంది దాకా కేవలం అయిదు మూకుమ్మడి దాడులలోనే చనిపోయారు. దాడులకు గురవుతున్నది సల్వాజుడుం కార్యకర్తలు, వారి నుంచి ఎంపిక చేసిన ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్.పి.ఒలు), సిఆర్‌పిఎఫ్, పోలీసు రిజర్వ్ బెటాలియన్‌లు కాగా చనిపోతున్నది అత్యధికంగా సల్వాజుడుం కార్యకర్తలేనని కూడా వార్తలు తెలియజేస్తున్నాయి.



మావోయిస్టులు చేస్తున్న ఈ దాడులలో ఆ పార్టీకి చెందిన సాయుధ దళాలతో పాటు పెద్దెత్తున ఆయుధాలు ధరించిన ఆదివాసులు కూడా పాల్గొంటున్నారని ఆ వార్తలు తెలుపుతున్నాయి. వీరికి మావోయిస్టులు 'భూంకాల్ మిలీషియా' అనే పేరు పెట్టినట్టు చెప్పాయి. ఇంత పెద్దెత్తున ఒకవైపు నుంచి దాడులు జరుగుతున్నాయంటే అంతకు ముందో, ఆ తరువాతో అవతలి వైపు నుంచి కూడా దాడులు జరుగుతూనే ఉండాలని సాధారణ లోకజ్ఞానం తెలుపుతుంది. కానీ ఆ వార్తలేవీ మీడియాలో రావు. వార్తలను బట్టిపోతే ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఏకపక్షంగా నరుక్కుంటూ పోతున్నారనుకోవలసి ఉంటుంది. అది నిజమై ఉండే అవకాశం లేదని ఇంగితం ఉన్న వారెవరైనా గ్రహించగలుగుతారు. కానీ అంతకంటే వేరే వార్తలు రావు.

దంతెవాడ అడవుల నుంచి ఆదివాసుల వలసలు పెద్దఎత్తున జరుగుతున్నాయనే వార్తలు కూడా అప్పుడప్పుడొస్తున్నాయి. మావోయిస్టుల వల్ల అపాయం ఉన్న వారికి రక్షణ కల్పించడానికి రహదార్ల పైన శిబిరాలు నెలకొల్పినట్టు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ శిబిరాల సంఖ్య ఇప్పుడు 30 దాటింది. వాటిలోని నివాసుల సంఖ్య 50 వేల పైనే ఉంది. అయితే వీరు మావోయిస్టుల వల్ల అపాయానికి గురైన వారు కారనీ బలవంతంగా అడవి నుంచి రహదారి పైకి తీసుకురాబడ్డ వారనీ కథనాలు వచ్చాయి. మావోయిస్టుల ఏరివేతకు దారి సుగమం చేయడం కోసం అడవులు ఖాళీ చేయించాలన్న వ్యూహాన్ని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్నదనీ, దానిలో భాగంగా ఈ అరలక్ష జనాభాను రహదారి శిబిరాలలోకి తీసుకొచ్చిందనీ వాటివల్ల తెలుస్తున్నది. వీరేకాక చాలామంది మన ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చారని కూడా తెలుగు దినపత్రికలు అడపా దడపా రాస్తున్నాయి. మార్చి 14వ తేదీ రాత్రి రాణిబొదిలిలో మావోయిస్టులు పాల్పడిన ఊచకోత తరువాత రాగల ప్రతీకారానికి భయపడి చాలామంది ఆదివాసులు ఇంద్రావతి నది దాటి విదర్భలోకి పారిపోతున్నట్టు కూడా వార్తలొచ్చాయి.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ అటవీ ప్రాంతం అత్యంత విషాదకరమైన, ఆందోళనకరమైన సంఘర్షణకు వేదికగా ఉన్నదని అరకొరగా వింటున్న ఈ విషయాల నుంచి చాలామంది గ్రహించే ఉంటారు. దీని సారాంశాన్ని చెప్పాలంటే అక్కడ గడచిన రెండు సంవత్సరాల కాలంలో దాదాపు 700 మంది హతులయ్యారు. ఇందులో 95 శాతం పైగా స్థానిక అటవీ గ్రామాల నివాసులైన ఆదివాసీ తెగల వారే. కొన్ని వందల ఇళ్ళు బుగ్గి అయ్యాయి.



ఊర్లకు ఊర్లే తగలబడ్డాయి. దాదాపు 1 లక్ష మంది - అందరూ స్థానిక ఆదివాసీ తెగల వారే - బలవంతంగా నిర్వాసితులయ్యారు. అందులో సగం మంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన రహదారి శిబిరాలలోకి బలవంతంగా నెట్టబడగా, మిగిలిన వారు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోకి పారిపోయారు. కొందరు దంతెవాడ అడవుల లోతట్టు ప్రాంతాలలో తలదాచుకున్నారు. కొందరు ఛత్తీస్‌గఢ్‌లోని ఇతర జిల్లాలకు పారిపోయారు. కొందరు ఇంద్రావతి నది దాటి విదర్భకు పారిపోయారు.

ఇది మావోయిస్టుల పైన ఆదివాసీ ప్రజల తిరుగుబాటు అని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అంటుంది. ఆదివాసులలో ఎవరైతే తాము చేపట్టిన విప్లవాత్మక సంఘర్షణ వల్ల  అధికారం, హోదా, ఆస్తులు కోల్పోయారో ఆ ఆదివాసీ ఉన్నత వర్గాన్ని ప్రభుత్వం పావుగా వాడుకొని వారి చేత బీద, వెనుకబడిన ఆదివాసుల పైన చేయిస్తున్న దాడి అని మావోయిస్టులు అంటున్నారు. అన్ని విషయాలూ పరిశీలించిన తరువాత ఈ సంఘర్షణకు ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం అని పేరు పెట్టడం ఉచితంగా ఉంటుందని మానవహక్కుల వేదిక భావిస్తున్నది. మావోయిస్టులను అణచడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నుకున్న పద్ధతి, దానికి మావోయిస్టులు స్పందించిన తీరు, ఆదివాసీ సమాజంలో భీకరమైన అంతర్యుద్ధానికి దారితీశాయని మేము అవగాహన చేసుకున్నాము.

ఈ సంక్షోభం తీరుతెన్నులు తెలుసుకోవడానికీ, ఈ క్రమంలో లక్షమంది దాకా విస్థాపితులైన ఆదివాసులందరూ తిరిగి తమ గ్రామాలకు పోయి ఎప్పటిలాగ బతికే పరిస్థితి తీసుకువచ్చే దిశగా కృషి చేయగల పౌర స్పందనకు ఆ రాష్ట్రంలో అంకురార్పణ చేయడానికీ మానవ హక్కుల వేదిక బృందం 2006 మే 12-16 తేదీలలో, ఆగస్టు 12-18 తేదీలలో, నవంబర్ 18, 26 తేదీలలో, 2007 జనవరి 28, ఫిబ్రవరి 24-25, మార్చి 18, ఏప్రిల్ 14 తేదీలలో ఆ రాష్ట్రంలోనూ, దానిని ఆనుకుని ఉన్న ఖమ్మం జిల్లా గ్రామాలలోను పర్యటించింది. రహదారి శిబిరాల వాసులతో, సల్వాజుడుం కార్యకర్తలతో, వారి నాయకుడు మహేంద్రకర్మతో, దంతెవాడ జిల్లా కలెక్టరుతో, వివిధ రాజకీయ పక్షాల వారితో, సల్వాజుడుం, పారామిలటరీ దాడుల బాధితులతో, మేధావి వర్గంతో, వలస వచ్చి ఖమ్మం జిల్లాలో ఉన్నవారితో విస్తృతంగా మాట్లాడాము. రహదారి శిబిరాల స్థితిగతులతో పాటు ఇటు సల్వాజుడుం వారు, అటు మావోయిస్టులు అగ్గిపాలు చేసిన గూడేలను పరిశీలించాము.






ఏడాది పాటు సాగిన (ఇంకా సాగుతున్న) ఈ ప్రయత్నం నుంచి రూపొందించిన నివేదికను మీ ముందు ఉంచుతున్నాం. ఇందులో మేము సేకరించిన సమాచారమే కాక ఈ కృషిలో సగభాగం పైగా మాతో కలిసి పనిచేసిన ఢిల్లీకి చెందిన సామాజిక శాస్త్రవేత్త, మానవ హక్కుల కార్యకర్త అయిన డా. బేలా భాటియా విడిగా బాధిత ప్రాంతాలలో పర్యటించి సేకరించిన సమాచారాన్ని కూడా చేర్చాము. ఆ సమాచారం మాకు అందించినందుకు వారికి కృతజ్ఞులము. మా ప్రయత్నంలో మాకు అనేక రకాలుగా సహకరించిన, సహకరిస్తున్న చింతూరు వాసులు డా. హనీఫ్‌కు, ఆత్రం వెంకటేశ్ గారికి కూడా కృతజ్ఞులము.

మానవహక్కుల వేదిక

1 మే 2007




# రాజకీయ, ఆర్థిక నేపథ్యం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 2000 సంవత్సరం నవంబర్ 1న పుట్టింది. అంతకు ముందు అది మధ్యప్రదేశ్ రాష్ట్రంలో భాగంగా ఉండింది. మధ్యప్రదేశ్ అనేక రకాలుగా వెనుకబడిన రాష్ట్రం కాగా అందులో మరీ వెనుకబడినది, ప్రధానంగా అడవులు, ఆదివాసులకు నిలయమైనది ప్రస్తుత ఛత్తీస్‌గఢ్ ప్రాంతం. ఆ రాష్ట్రం ఏర్పడిన నాడు తొలి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన అజిత్‌జోగి, 'ఛత్తీస్‌గఢ్ దేశంలోని అత్యంత పేద ప్రజలు నివసించే అత్యంత ధనవంతమైన రాష్ట్రం' అన్నాడు. ఆ ధనం, ఆ సంపద ప్రకృతి సిద్ధమైనది. దట్టమైన అడవులు, లోతైన నదులు, సారవంతమైన భూములు, విస్తారమైన ఖనిజ సంపద - దానికి మూలం. ఈ ప్రకృతి సంపదను 'అభివృద్ధికి' ముడి సరుకుగా మార్చే ప్రక్రియను ఆచితూచి అమలుచేస్తే ఆ ప్రకృతి మధ్య బతికే ప్రజల బతుకులను బాగుచేస్తూ ఆ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి సాధించడం సాధ్యమేనేమో గానీ, దానిని ఇరవై ఏళ్ళలో దున్నేయాలని చూస్తే ఆ సంపదా మిగలదు, అక్కడ బతికే ప్రజలూ మిగలరు. సల్వాజుడుం సహాయంతో ఖాళీ చేయించిన అడవులు ఇక మీదట ఈ 'అభివృద్ధి'కి నెలవవుతాయన్న సందేహం చాలామంది వ్యక్తం చేస్తున్నారు. దాని గురించి దిగువ చర్చిద్దాం.

ఛత్తీస్‌గఢ్‌లోని 16 జిల్లాలలో అన్నిటి కంటే దక్షిణాన ఉన్నది దంతెవాడ. ఇది పాత బస్తర్ జిల్లాలో భాగం. పాతబస్తర్ జిల్లా దేశంలోనే అత్యధిక విస్తీర్ణం గల జిల్లా అనేవారు. దానిని ఆ తర్వాత, మూడు జిల్లాలుగా విభజించారు. బస్తర్, కాంకేర్, దంతెవాడ. అన్నిటి కన్నా దక్షిణాన ఉన్నది దంతెవాడ. దంతెవాడకు మన ఖమ్మం జిల్లాతో 180 కిలోమీటర్ల సరిహద్దు ఉంది.

దంతెవాడ జిల్లా జనాభాలో 78.5 శాతం ఆదివాసులు. జిల్లా భూభాగంలో దాదాపు 60 శాతం అటవీ ప్రాంతం. ఈ అడవి గోదావరి లోయ అడవేగానీ అదే గోదావరి లోయలో మన రాష్ట్రంలో ఉన్న అడవి కన్నా





## దంతెవాడ జిల్లా


దంతెవాడ జిల్లాలో నాలుగు తాలూకాలున్నాయి. దక్షిణాన కుంట, ఉత్తరాన దంతెవాడ, పడమట భూపాలపట్నం, బిజాపూర్‌లు. పంచాయతీ బ్లాకులు పదకొండున్నాయి. కుంట తాలూకాలో కుంట, సుక్మ; బిజాపూర్ తాలూకాలో బిజాపూర్, బైరంగఢ్; భూపాలపట్నం తాలూకాలో భూపాలపట్నం, ఉసూర్, దంతెవాడ తాలూకాలో దంతెవాడ, గీదం, కౌకొండ, కటే కల్యాణ్, చింద్‌గఢ్‌లు. ఉసూర్, కుంట బ్లాకులు పూర్తిగా, భూపాలపట్నం పాక్షికంగా మన ఖమ్మం జిల్లాను ఆనుకొని ఉంటాయి. సల్వాజుడుం ప్రభావం అధికంగా ఉన్నది బిజాపూర్, బైరంగఢ్, కుంట బ్లాకులలో. అయితే భూపాలపట్నం, ఉసూర్, సుక్మలలో బలం పొందే ప్రయత్నమూ జరుగుతున్నది. ఈ సంవత్సరం జనవరి మూడవ వారంలో సుక్మ మీద సల్వాజుడుం పెద్దెత్తున దాడి చేసింది.

దంతెవాడ జిల్లా జనాభా 7.19 లక్షలు. గ్రామాలు 1220. ఆదివాసీ జనాభా 78.5 శాతం. గ్రామీణవాసులు 93 శాతం. కేవలం 2 శాతం సాగుభూమికి నీటి పారుదల వసతి (నిత్యం ప్రవహించే ఇంద్రావతి, శబరి నదులు ఈ జిల్లాకు సరిహద్దులైనప్పటికీ) ఉంది.

జిల్లా భూవైశాల్యంలో 60 శాతం పైగా అడవి. 1220 గ్రామాలలో 455 పూర్తిగా ఆదివాసీ గ్రామాలు కాగా 458 గ్రామాలలో 90 శాతం పైగా జనాభా ఆదివాసులు.

దంతెవాడ జిల్లాలో పోలీసు జిల్లాలు రెండు. ఒకటి దంతెవాడ, రెండవది బిజాపూర్. సల్వాజుడుంకు పునాది ఏర్పడింది 2005 జూన్‌లో బిజాపూర్ తాలూకాలో. 2006 తొలి వారాలలో ఇది కుంటకు పాకింది.

బాగా దట్టమైనది. ఆ జిల్లాను చీలుస్తూ వెళ్ళే కొత్తగా రూపొందుతున్న రెండు జాతీయ రహదార్లు కాక చెప్పుకోదగ్గ రోడ్లేవీ దంతెవాడలో లేవు. ఒక రహదారి హైదరాబాద్ నుంచి జగ్దల్‌పూర్‌కు వెళ్ళే జాతీయ రహదారి నెం. 221. ఇది కుంట గ్రామం వద్ద ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించి, దంతెవాడ జిల్లా పడమటి సరిహద్దు వెంబడి ప్రయాణించి, హింసాత్మక ఘటనల కారణంగా పదే పదే వార్తలకెక్కిన ఇంజరం, ఎర్రబోరు, దోర్నపాల్ గ్రామాల మీదుగా జగ్దల్‌పూర్‌కు పోతుంది. ఈ రహదారికి రెండువైపులా దట్టమైన అడవి ఉంది. దానిపైన ఉన్న ఊర్లన్నీ – తాలూకా కేంద్రమైన కుంటతో సహా –



కుగ్రామాలే. రెండవది నిజామాబాద్ నుంచి జగ్దల్‌పూర్ వెళ్ళే జాతీయ రహదారి నెం. 16. ఇది ఇంద్రావతి నదిని దాటి పడమటి చివరన భూపాలపట్నం వద్ద ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించి బిజాపూర్, బైరంగఢ్, గీదంల మీదుగా జగ్దల్‌పూర్‌కు పోతుంది. ఈ రహదారి మీదనున్న ఊర్లు కొంచెం పెద్దవి. బిజాపూర్ దంతెవాడ రెవిన్యూ జిల్లాలో కొత్తగా ఏర్పాటుచేసిన పోలీసు జిల్లా కేంద్రం. భారీగా పారామిలటరీని మోహరించిన ఊరు. సల్వాజుడుం ఆవిర్భావం బిజాపూర్ పరిసర గ్రామాలలోనే జరిగింది.

ఈ రెండు జాతీయ రహదార్ల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. కాకపోవడానికి మావోయిస్టులే కారణమని ఒకవైపు, అసలు మావోయిస్టులు లేకపోతే ఈ రెండు జాతీయ రహదార్ల ప్రతిపాదనే జరిగేది కాదని మరొక వైపు ఆరోపణలున్నాయి. రెండూ నిజమే కావచ్చు.

ఈ రెండు అసంపూర్ణమైన జాతీయ రహదార్లను మినహాయిస్తే వేరే రహదార్లు దంతెవాడలో చాలా తక్కువ. గీదం సమితి (బ్లాక్) కేంద్రాన్ని బైరంగఢ్ సమితి కేంద్రంతో కలుపుతూ ఇంద్రావతి నదికి దగ్గరగా వెళ్ళే డాంబర్ రోడ్డొకటి ఉంది. తక్కినవన్నీ మట్టి రోడ్లే. వర్షాకాలంలో రాకపోకలు దాదాపు అసాధ్యమనే చెప్పవచ్చు.

అరకొరగా ఉన్న ఈ రహదార్లకు తోడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థే లేకపోవడం విశేషం. అన్ని రాష్ట్రాలలాగే మధ్యప్రదేశ్‌లో కూడా ఒక ఆర్టీసి ఉండేది. ఆ రాష్ట్రం నుంచి ఛత్తీస్‌గఢ్ వేరైన తరువాత కొత్తరాష్ట్రంలో ఆర్టీసిని కొనసాగించలేదు. అసలే అడవులు, కొండలతో నిండిఉన్న ఈ రాష్ట్రంలో ప్రజలు నూటికి నూరుశాతం ప్రైవేటు రవాణా సౌకర్యాలమీదనే ఆధారపడాలి. దేశంలో ఛత్తీస్‌గఢ్ కాక ఆర్టీసి అనేదే లేని వేరే ఏ రాష్ట్రమైనా ఉందేమో మాకు తెలీదుగానీ, ప్రాంతీయ వివక్ష పేరు మీద, నిరాదరణ పేరు మీద వేరుపడిన ఆ రాష్ట్రం తన ప్రజలకు ఏ పాటి ఆదరణ చూపిందనడానికి ఇదొక నిదర్శనంగా భావించవచ్చు.

దంతెవాడ జిల్లాలోని 1220 గ్రామాలకు గాను 918 ప్రాథమిక పాఠశాలలున్నాయని అధికార గణాంకాలు చెప్తాయి. ఇది చూడడానికి చెప్పుకోదగ్గ సంఖ్యగా కనిపిస్తుంది గానీ, అన్ని అడవి ప్రాంతాలలాగే ఇక్కడ కూడా 'గ్రామం' అనేది ఒక దగ్గర కూడి ఉండదు. విసిరేసినట్టుండే చిన్న చిన్న 'హామ్లెట్లు' ఒక్కొక్క గ్రామంలోనూ అనేకం ఉంటాయి. అందువల్ల ప్రాథమిక విద్య అందరికీ అందుబాట్లో ఉందనలేం. అయితే ఈ మాత్రం విద్యావ్యవస్థ సైతం






ప్రస్తుత సంఘర్షణలో దెబ్బతింటున్నది. మావోయిస్టుల వేటలో పోలీసు, పారామిలటరీ బలగాలు స్కూళ్ళను క్యాంపులుగా వాడుకోవడం మొదలుపెట్టారు. స్కూలులో విద్యాభ్యాసానికి అడ్డం రాకుండా రాత్రి వేళలలో, లేక సెలవులలో మాత్రమే పాఠశాల మొత్తం ఆక్రమించుకుంటున్నామనీ, స్కూలు సమయంలో ఖాళీ చేస్తున్నామనీ వారి వివరణ. అడవులలో వేరే పక్కా నివాసాలేవీ లేవు కాబట్టి ఇది తప్పనిసరైందని సంజాయిషీ. ఈ ఆవాసం ప్రభుత్వ బలగాలకు అందుబాట్లో లేకపోతే తమ మీద దాడులు చేయలేరు కాబట్టి మావోయిస్టులు ఈ పాఠశాల భవనాలను పేల్చి వేయసాగారు. ఒక్క కుంట తాలూకాలోనే 37 పాఠశాలలు, హాస్టల్ భవనాలను మావోయిస్టులు 2006 ఫిబ్రవరి, మార్చి నెలలలో పేల్చేశారు. దీనికి వారిచ్చే సంజాయిషీనీ, వివరణనూ తరువాత చూద్దాం.

విద్యా వ్యవస్థ ఈ మేరకైనా ఉండింది గానీ వైద్య వ్యవస్థ గురించి ఆ మాట అనలేం. దంతెవాడ జిల్లాలోని 7,19,500 జనాభాకు గాను 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో విధులు నిర్వహించే వైద్యులు నక్సలైట్ల పేరు చెప్పి డ్యూటీకే సరిగ్గా హాజరుకారని కుంట తాసీల్దారు అంటాడు. సల్వాజుడుం ప్రారంభమై ఘర్షణ తీవ్రతరం అయిన తరువాత ఈ ఉద్యోగుల పని మరీ సుఖమైపోయింది. 2006 మే నెల నాటికి కుంటతాలూకాలోని కిష్టారం, గొల్లపల్లి, మైలారం, గోగొండ, చింతగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు విధులకు హాజరు కావడం పూర్తిగా మానేశారని తాసీల్దారు చెప్పాడు.

పరిశ్రమలు, పరిశ్రమలలో ఉద్యోగాలు అనేవి ఆదివాసులకు దాదాపు శూన్యం. దంతెవాడ జిల్లాలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రం బైలడిల్లాలో ఉన్న ఇనుము గనులు. ఇక్కడి నుంచి ఇనుము ఖనిజాన్ని తీసి విశాఖపట్నం రేవు ద్వారా జపాన్‌కు ఎగుమతి చేస్తారు. ఇక్కడి ఉద్యోగులు దాదాపు అంతా గిరిజనేతరులే. నిజానికి 'బైలడిల్లా గనులు ఉండబట్టే ఈ జిల్లాలోని గిరిజనేతర జనాభా 20 శాతమైనా ఉంది' అని దంతెవాడ కలెక్టరు అంటాడు.


ఈ స్థితిలో ఆదివాసీ ప్రజలకు వ్యవసాయం, చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణే ప్రధాన జీవనాధారాలుగా ఉన్నాయి. అయితే ఆ వ్యవసాయమూ 1950ల స్థితిని దాటి ముందుకు పోలేదు. వరిపంటకు నారుపోయడం, నీరు పెట్టడం, ఎరువులు వేయడం ఎరగరు. విత్తనాలు జల్లి వర్షాన్ని నమ్ముకుంటారు. ఎకరానికి రెండు లేక మూడు క్వింటాళ్ళ దిగుబడి వస్తే సంతోషిస్తారు. జొన్నలూ అంతే. హైబ్రిడ్ విత్తనాలూ ఎరువులూ ఎరగరు. ఎదిగిన మనిషికి రెండు



రెట్లు ఎత్తు పెరిగే జొన్న మొక్కల్ని ఈ తరం తెలుగు వాళ్ళెవరూ చూసి ఉండరు. దంతెవాడలో అవే కనిపిస్తాయి. వీటి దిగుబడీ అంతే - ఎకరానికి రెండు లేక మూడు క్వింటాళ్ళు. దంతెవాడ సరిహద్దు దాటి ఖమ్మం జిల్లాలోకి వస్తే అదే అడవిలో వ్యవసాయం చేసే అవే ఆదివాసీ తెగల వారు మైదాన ప్రాంతాల వారి వ్యవసాయ పద్ధతులు అలవరచుకున్న విషయం కనిపిస్తుంది. అందరూ కాకున్నా కొంచెం బాగున్న వారైనా ఎకరానికి 20 బస్తాలకు పైనే వరి పంట తీయడం కనిపిస్తుంది. ఈ పరిణామం పొరుగున ఉన్న దంతెవాడకు పాకలేదు.

చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణలో ఒక ముఖ్యమైన జీవనాధారంగా ఉన్న తునికాకు గురించి విడిగా చెప్పుకుందాం. మిగిలినవన్నీ స్థానిక సంతలలో అమ్ముకుంటారు. అయితే మావోయిస్టులకూ ప్రభుత్వ బలగాలకూ పెరిగిన ఘర్షణ కారణంగా ఈ సంతలు ఒక్కొక్కటిగా మూతపడడం ఈ ఆదాయ మార్గాన్ని బాగా దెబ్బతీసింది.


ఇక గ్రామాలలో సగ భాగానికి రక్షిత మంచినీటి వసతి లేదనీ అయిదింట నాలుగు గ్రామాలకు కరెంటు సౌకర్యం లేదనీ చెప్పుకుంటే దంతెవాడ జిల్లా అభివృద్ధి ముఖచిత్రం పూర్తి అవుతుంది. ఇది 2005లో సల్వాజుడుం పుట్టే నాటి చిత్రం. 30 ఏళ్ళ కింద మావోయిస్టులు (అప్పటి పేరు ప్రకారం సిపిఐ (ఎం-ఎల్) పీపుల్స్‌వార్) అప్పటి బస్తర్ జిల్లాలోకి ప్రవేశించే నాటికి ఈ అభివృద్ధి ఇంత కంటేనూ తక్కువ ఉంది. అయితే ఈ రోజు బాగా తగ్గిపోయినది, ఆరోజు తీవ్రస్థాయిలో ఉన్నది ఆదివాసులపై జులుం, దోపిడీ - అటవీశాఖ, రెవిన్యూశాఖ, పోలీసుశాఖ అధికారుల జులుం; ఉత్తర భారతదేశం నుంచి, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన గిరిజనేతర వ్యాపారుల దోపిడీ. ఆ రోజులలో 'తెల్లబట్టలు వేసుకున్న ప్రతీ ఒక్కడూ ఆదివాసులను దోచుకునే వాడు' అని అనుభవజ్ఞులైన ఆదివాసీ పెద్దలు అంటారు. ఆదివాసులు నివసించేదే అడవిలో కాబట్టి వారి ఉనికి నిత్యం చట్టం అంచున సందిగ్ధ స్థితిలో ఉంటుంది. రిజర్వ్ అడవిలో ఫలసాయం సేకరించవచ్చు, కానీ వ్యవసాయం చేయకూడదు. ఎండుపుల్లలు ఏరుకోవచ్చు, కానీ కట్టె కొట్టకూడదు. పశువులను మేపుకోవచ్చు, కానీ అవి అటవీశాఖ నర్సరీలలోని మొక్కలు తినకూడదు. బ్రిటిష్ జమానాలో మొదలైన ఈ సందిగ్ధ స్థితి 1980లో పార్లమెంటు అటవీ సంరక్షణ చట్టాన్ని జారీచేసి, అడవులను కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా అటవీయేతర అవసరాలకు వినియోగించరాదని శాసించిన తరువాత మరీ దిగజారింది. ఆదివాసులు సంప్రదాయక హక్కులను కోల్పోవడమేకాక తాము చేస్తున్న వాటిలో ఏది చట్టబద్ధమో, ఏది



చట్టబద్ధం కాదో తెలియని స్థితిలో పూర్తిగా అటవీశాఖ, పోలీసుశాఖ, రెవిన్యూ శాఖల దయాదాక్షిణ్యాల మీద బతకసాగారు. ఆ అధికారులు చట్టం ఇచ్చిన పెత్తనాన్ని అడ్డం పెట్టుకొని వారి ఇళ్ళపైన దాడులు చేస్తారు. వారి కోళ్ళు మేకలు ఎత్తుకుపోతారు. వారి ఆడవాళ్ళను లైంగికంగా హింసిస్తారు.

ఈ దశలో దాదాపు 30 ఏళ్ళ కింద మావోయిస్టులు బస్తర్ జిల్లా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించారు. ప్రభుత్వ అధికారుల జులుం మీద, గిరిజనేతరుల దోపిడీ మీద దృష్టి పెట్టారు. ఆదివాసీ ప్రజలను దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన (తెలుగులో క్లుప్తంగా సంఘం అందాం) ద్వారా సంఘటితం చేసి తమ సాయుధ దళాల వత్తాసుతో జులుం చేసే అధికారులనూ, దోపిడీదారులైన గిరిజనేతరులనూ ప్రతిఘటించడం నేర్పారు. జులుంను, దోపిడీని వేగంగానే అరికట్టగలిగారు. ఇది మినహాయింపు లేకుండా ప్రజాహితం కోరేవారు అందరూ హర్షించే విజయం. ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు కూడా సంపాదించుకున్నది చాలులెమ్మని ఈ విజయాన్ని సహించి ఉండవచ్చును. నిజాయితీగల ప్రభుత్వ అధికారులైతే దీనికి మావోయిస్టులను మెచ్చుకుంటున్నారు కూడా. కానీ గిరిజనేతర వర్తక, వ్యాపార వర్గాల వారు మావోయిస్టులను క్షమించలేదు. ఆదివాసులతో 'స్వేచ్ఛ'గా వర్తకం చేసే తమ జన్మహక్కును అరికట్టినందుకు చాలా కోపంగా ఉన్నారు. వీరిలో మన రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కుంటకు పోయి స్థిరపడిన తెలుగువారున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్‌లనుంచి బిజాపూర్, బైరంగఢ్, భూపాలపట్నాలకు పోయి స్థిరపడిన హిందీ మాట్లాడేవారూ ఉన్నారు. వీరికి మావోయిస్టులంటే విపరీతమైన ద్వేషం. సల్వాజుడుంలో వీరి పాత్ర ప్రధానమైనది. చాలా కేంద్రాలలో వీరే సల్వాజుడుం నాయకులు.

1980లో పార్లమెంటు జారీ చేసిన అటవీ సంరక్షణ చట్టాన్ని పైన ప్రస్తావించాము. అంతకు ముందు ఒక్కొక్క రాష్ట్రంలోనూ ఒక్కొక్క అటవీ చట్టం ఉండింది. నిజానికి రాజ్యాంగం రాసినప్పుడు అడవులకు సంబంధించి చట్టాలు చేసే అధికారం రాష్ట్రాలకు మాత్రమే ఉండింది. ఎమర్జెన్సీ రోజులలో జరిగిన అనేక అప్రజాస్వామిక చర్యలలో ఒకటి రాజ్యాంగ అధికారాల కేంద్రీకరణ. అప్పటిదాకా రాష్ట్రాల అధికారాల జాబితాలో ఉన్న కొన్ని అంశాలను కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోకి బదలాయించడం జరిగింది. అది 42వ రాజ్యాంగ సవరణ ద్వారా జరిగింది. 'అడవులు' వాటిలో ఒకటి.




అప్పటివరకు రాష్ట్రాలలో అమలు అవుతున్న అటవీ చట్టాలలో కూడా రిజర్వ్ ఫారెస్టు, ప్రొటెక్టెడ్ ఫారెస్ట్ అన్న భావనలు ఉండేవి. రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించిన దానిలో చెట్లు కొట్టడం, వ్యవసాయం చేయడం, ఇళ్ళు వేసుకోవడం నేరమన్న ఆంక్ష ఉండింది. అయితే ఆదివాసుల ఆవాసమైన అడవిలో చట్టమే చొరబాటుదారు అన్న స్పృహ స్థానిక పాలనా యంత్రాంగానికి ఎక్కడో కొంచెం ఉండక తప్పదు కాబట్టి ఈ ఆంక్షను రాష్ట్ర పాలకులు మరీ సీరియస్‌గా తీసుకోలేదు. అప్పుడప్పుడు, చట్టం చొరబాటుగా ప్రకటించిన అదివాసుల ఉనికిని క్రమబద్ధీకరించడం ద్వారా – అంటే వారు తరతరాలుగా అనుభవిస్తున్న భూములకు పట్టాలు ఇవ్వడం ద్వారా – వారిని చట్టం పరిధిలోకి తీసుకొచ్చేవారు. చట్టం పుట్టక ముందు నుండీ అడవులలో ఉంటున్న వాళ్ళను చొరబాటుదార్లుగా ప్రకటించి ఆ తరువాత వారి 'చొరబాటు'ను క్రమబద్ధీకరించడం చారిత్రకంగా చూసినప్పుడు హాస్యాస్పదమే అయినా అప్పుడప్పుడు జరిగే ఈ క్రమబద్ధీకరణ చట్టం పరిధిలో వారికి రక్షణ కల్పించింది.

ఈ క్రమబద్ధీకరణ అడవుల నాశనానికి దారితీస్తున్నదన్న ఫిర్యాదు కారణంగానే 1977లో అడవులను రాజ్యాంగ ఉమ్మడి అధికారాల జాబితాలోకి తీసుకొచ్చి 1980లో పార్లమెంటు అటవీ సంరక్షణ చట్టాన్ని జారీ చేసింది. దాని ప్రకారం అడవులలో ఎటువంటి 'అటవీయేతర' కార్యకలాపాలూ ఏ రాష్ట్ర ప్రభుత్వమూ కేంద్రం ఒప్పుకోలు లేకుండా అనుమతించడానికి వీలులేదు. దీంతో క్రమబద్ధీకరణ అవకాశాలు దూరం కావడమే కాక, అటవీశాఖ సిబ్బంది ఎప్పుడూ లేనంత కఠినంగా వ్యవహరించసాగారు. ఇది విపరీతమై వేధింపులకు దారితీసింది.

వలస పాలన కాలం నుంచి అమలవుతున్న ఈ కేంద్రీకరణను, అది ఆదివాసులకు చేసిన అన్యాయాన్ని అప్పటి జాతీయ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషనర్ అయిన డాక్టర్ బి.డి. శర్మ 1990 మే నెల 28న రాష్ట్రపతికి సమర్పించిన తన వార్షిక నివేదికలో ఈ విధంగా వివరించారు.

> (వలస కాలంలో మొదలైన ఈ వనరుల కేంద్రీకరణ) తీసుకొచ్చిన మొట్టమొదటి పెనుమార్పు అడవులకు సంబంధించినది. ఈ కొత్త చట్టంలో అడవులకూ అటవీవాసులకూ ఉండే అవినాభావ సంబంధానికి గుర్తింపు నిరాకరించబడింది. అడవులు ప్రభుత్వం ఆస్తి అయ్యాయి. అవి ప్రభుత్వం ఆస్తి అయిపోయిన తరువాత






వాటి నిర్వహణకు ఒక యంత్రాంగం ఉనికిలోకి వచ్చింది. కాలక్రమంలో ఆ యంత్రాంగం అన్ని మూలలకూ వ్యాపించింది. చాలా బలవత్తరంగా తయారయింది. ఈ మార్పులోని విషాదకరమైన లక్షణం ఏమిటంటే అది ప్రవేశపెట్టిన చట్రంలో అడవితో జీవితాంతం అనుబంధం కలిగి ఉండి, అడవే తన నివాసం, తన సంస్కృతి, తన మతం, తన సర్వస్వం అయిన అడవివాసికి చోటులేకపోవడం. కేవలం పరిపాలనా సంబంధాలనూ, వ్యాపార సంబంధాలనూ మాత్రమే గుర్తించే ఈ చట్రంలో జీవితాంతం ఉండే ఈ తల్లీ బిడ్డల సంబంధాన్ని వ్యాపార సంబంధంగా మార్చే ప్రయత్నం జరిగింది. ఇది ఏ విధంగా సాధ్యం? ఈ మౌలికమైన అవగాహనా వైఫల్యం కారణంగానే అన్ని ఆదివాసీ ప్రాంతాలలో విధ్వంసక పాలన, సంఘర్షణ నెలకొన్నాయి. ఇది అంతిమంగా ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేసింది.

పరిస్థితిని ఈ విధంగా వివరించిన తరువాత ఆ నివేదిక ఏమని ముగిస్తుందంటే:

'ఈ రోజు ఈ ప్రజలకు కొంత ఉపశమనం అంటూ లభిస్తే అది తీవ్రవాదుల వల్లనే. ఆ ఉపశమనం స్వల్పమైనదే. ఆ పైన దాని పర్యవసానంగా వారు తమ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా (ప్రభుత్వానికీ తీవ్రవాదులకూ మధ్య నెలకొన్న) సంఘర్షణలో భాగమయ్యారు.

ఉపశమనం అని ఈ నివేదిక పేర్కొన్నది నిజానికి స్వల్పమేమీ కాదు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, విదర్భలలోని గోదావరి లోయ అడవులలో ఆధునిక కాలంలో ప్రజల అభిమానాన్ని పొందిన మొట్టమొదటి రాజకీయశక్తి నక్సలైట్ పార్టీలే (మావోయిస్టులతో సహా) అని చెప్పుకోవచ్చు. నక్సలిజం గురించి మాట్లాడేటప్పుడు 'ప్రజలకు ప్రభుత్వం ఎడల వైషమ్యం ఏర్పడడానికి కారణాలేమిటి?' అని మొదలుపెట్టడం పరిపాటి. గోదావరి లోయ అడవులకు సంబంధించినంత వరకు ఈ ప్రశ్నకు అర్థమే లేదు. ఎప్పుడైనా అసలు అనుబంధం ఉంటే కదా వైమనస్యం ఏర్పడడానికి!

ప్రజలకు పాలకునితో సహజాతమైన అనుబంధం ఉందన్న బ్రాహ్మణీయ భావజాలం నుంచి ఈ చర్చ పుట్టినట్టుంది తప్ప ఆదివాసులకు సంబంధించినంత వరకు దీనికి వాస్తవాలతో ఏ సంబంధం లేదు. దంతెవాడ అడవులపై రాజ్యాధికారం చెలాయించిన గతకాలపు రాజుల పట్ల అక్కడి




ఆదివాసులకు ఏదైనా సంప్రదాయక బంధం ఉండిందేమో గానీ ఆధునిక భారత రాజ్యాంగ యంత్రంతో వారికి ఎటువంటి రాజకీయ బంధమూ లేదు. వారికి ఏర్పడిన మొట్టమొదటి రాజకీయ బంధం నక్సలైట్ల తోటిదే. వైమనస్యం గురించి మాట్లాడదలచుకుంటే ఈ మధ్య కాలంలో మావోయిస్టుల పట్ల ఏర్పడిన వైమనస్యం గురించి చర్చించుకోవాలే తప్ప ప్రభుత్వం పట్ల లేని బంధాన్ని ఊహించుకొని వైమనస్యానికి కారణం ఏమిటంటూ చర్చించడంలో అర్థం లేదు.

పరిపాలనా బాధ్యత ఏమిటన్నది చూస్తే తప్ప రాజ్యాంగ యంత్రం వైఫల్యం పూర్తిగా అర్థం కాదు. ఎక్కడైనా ప్రజల క్షేమమే రాజ్యాంగం పరిపాలనకు ఉద్దేశించిన లక్ష్యం. అయితే ఆదివాసీ ప్రాంతాలలో ఆ బాధ్యత స్వభావం ప్రత్యేకమైనది. గోదావరి లోయలోని ఆదివాసీ ప్రాంతమంతా రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు కిందికి వస్తుంది. అయిదవ షెడ్యూలు ప్రాంతాల మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టి ప్రత్యేక శాసనాల ద్వారా 'శాంతిని, సత్పరిపాలనను' నెలకొల్పాలని రాజ్యాంగం ఆదేశిస్తుంది. మొత్తం సమాజానికి వర్తించే ఏ చట్టాన్నయినా ఇందు నిమిత్తం ఏ మేరకైనా సవరించి వర్తింపజేయవచ్చు. పూర్తిగా మినహాయించనూ వచ్చు. అప్పటికి చట్టాల పరిధిలోకి రాని విషయాల గురించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయవచ్చు. ఈ ప్రత్యేక అధికారాల లక్ష్యం అయిన 'శాంతి, సత్పరిపాలన' అనే వాటి అర్థం ఆదివాసుల సామాజిక ఆర్థిక పురోగతే తప్ప వేరే ఏదీ కాదని సుప్రీంకోర్టు సమతా వర్సస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే కేసులో వివరించింది.

ఆదివాసీ ప్రాంతాల వాస్తవ పరిస్థితులు ఈ రాజ్యాంగ ఆదేశాలను వెక్కిరిస్తాయి. అటవీ హక్కుల మీద విపరీతమైన ఆంక్షలు, ప్రతీ చిల్లర ప్రభుత్వ ఉద్యోగీ చేసే జులుం, తెల్లబట్టలు వేసుకున్న ప్రతీ బయటి వ్యక్తీ చేసే దోపిడీ, చదువు, ఆరోగ్యం, రవాణా సదుపాయాలు లేని హీనస్థితి – ఈ చిత్రం ఏ ఆదివాసీ ప్రాంతంలో చూడలేదు!

ఈ స్థితిలో 30 ఏళ్ళ కింద మావోయిస్టులు అప్పటి బస్తర్ జిల్లాలోకి ప్రవేశించారని చెప్పాం కదా. మావోయిస్టుల తుపాకీ, అది ప్రజలకిచ్చిన ధైర్యమూ అటవీ, పోలీసు, రెవిన్యూ శాఖల సిబ్బంది జులుంను చాలావరకు అరికట్టాయి. ఈ మాట అనని వారు లేరు, మెచ్చుకోనివారు లేరు. గిరిజనేతర వ్యాపారస్తుల దోపిడీని కూడా మావోయిస్టుల ఉద్యమం అరికట్టింది గానీ ఈ మధ్య వ్యాపారస్తుల దగ్గర మావోయిస్టులు పార్టీ ఫండ్ తీసుకోవడం పెరిగి,






గతంలో ఉన్నంత కఠినంగా లేరన్న మాట వారి సానుభూతిపరులైన విలేకరుల నుంచి సహితం విన్నాం. మన దగ్గరున్నట్టు గిరిజనేతరులు ఆదివాసుల భూముల్ని ఆక్రమించుకోవడం దంతెవాడలో ఎక్కువగా లేదు. వ్యవసాయ అభివృద్ధి మందకొడిగా ఉండడం దీనికి కారణం కావచ్చు. పాతబస్తర్ జిల్లా భూభాగంలో ఆనాటికీ ఈనాటికీ కేవలం 2 శాతం వ్యవసాయ భూములకు మాత్రమే సాగునీటి వసతి ఉంది. కారణమేదైనా గిరిజనేతరుల జులుం ప్రధానంగా వ్యాపారం, వర్తకం, వడ్డీ వ్యాపారాల రూపంలో ఉంది.

ఇది మావోయిజం వల్ల దంతెవాడ అటవీవాసుల కొచ్చిన మొదటి ప్రయోజనం. మరొక రెండు ముఖ్యమైనవి ఉన్నాయి. 1980లో పార్లమెంటు అటవీ సంరక్షణ చట్టాన్ని జారీచేసిన తరువాత అడవులలోని సంప్రదాయక ఆదివాసీ ఆవాసాల భూముల క్రమబద్ధీకరణ ఆగిపోయిందని చెప్పాము. పైగా ఏ సంవత్సరానికా సంవత్సరం బలవంతంగా తొలగిస్తామన్న అటవీశాఖ బెదిరింపు పెరిగింది. మరి పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త భూములెక్కడి నుంచి రావాలి?

మావోయిస్టుల ఆయుధ బలం ఈ విషయంలో ఆదివాసులకు వరం అయింది. దాని వల్ల విస్తారంగా అడవులు నరికి సాగుచేశారు. ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇది ఛత్తీస్‌గఢ్‌లోనే కాదు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలోనూ జరిగింది. దేశం మొత్తం మీద అడవులు (ప్రభుత్వ పరిభాషలో) అత్యధికంగా అన్యాక్రాంతమైనది అస్సాం తరువాత ఈ మూడు రాష్ట్రాలలోనే కావడం కాకతాళీయం కాదు. (13.43 లక్షల హెక్టార్ల అటవీ భూమి దేశమంతటా కలిపి అన్యాక్రాంతం కాగా, ఈ మూడు రాష్ట్రాలలోనే 5.25 లక్షలు– అంటే అందులో 39 శాతం – అన్యాక్రాంతం అయ్యాయని ప్రభుత్వం లెక్కలు తెలుపుతాయి).

ఈ ఆక్రమణ అంతా పోడు వ్యవసాయమేనని ప్రభుత్వం అంటుంది గానీ అది నిజం కాదు. ఏటవాలు భూములలో, ఎగుడు దిగుడు భూములలో మాత్రమే తప్పనిసరిగా పోడు వ్యవసాయం చేస్తారు. పల్లపు భూములలో చెట్లు కొట్టినప్పుడు, ఏ రోజైనా ఆ భూమి నుంచి విస్థాపితులు కాక తప్పదన్న భయం ఉండబట్టి తొలిదశలో పోడు వ్యవసాయం చేస్తారు. ఆ తరువాత క్రమంగా స్థిర వ్యవసాయం చేపడతారు. అంతా పోడు వ్యవసాయమేనని దబాయించడం వల్ల రెండు ప్రయోజనాలు ప్రభుత్వాలు సాధించాలని చూస్తాయి. వాళ్ళు చేసే కొద్దిపాటి వ్యవసాయానికి ఎక్కువ భూమిలో చెట్లు కొట్టేస్తారని వాదించే




అవకాశం ఉండడం ఒకటి కాగా, పోడు వ్యవసాయం చేయడం వల్ల ఉత్పాదకత తక్కువై వనరులు వృథా అవుతున్నాయని వాదించే అవకాశం ఉండడం రెండవ ప్రయోజనం.

ఆదివాసులు వ్యవసాయ భూములు పొందడానికి అడవులు నరకడం నష్టకరమా కాదా అన్న చర్చ ఇప్పుడు పెట్టుకోనక్కరలేదు. ఎందుకంటే మావోయిస్టులే దాదాపు ఒక దశాబ్దం కింద ఆ అభిప్రాయానికి వచ్చి అడవులు నరకడాన్ని నిషేధించారు. ఏమైతేనేం, ఒక ముఖ్య చారిత్రక దశలో భూములు పొందడానికి మావోయిస్టుల ఉనికి ఆదివాసులకు ఉపయోగపడింది.

వ్యవసాయం వెనుకబడి ఉండి అసలు భూమి పొందే హక్కే చట్టం పెట్టిన నిషేధంలో బందీ అయినప్పుడు అడవి సంపద సేకరించి సంతలలో అమ్ముకోవడం ఒక ముఖ్య జీవనాధారం అవుతుంది. వాటన్నిటిలోకీ కీలకమైనది తునికాకు సేకరణ. బీడీ పరిశ్రమకు అత్యవసరమైన తునికాకు గోదావరి లోయ అడవులలో విస్తారంగా దొరుకుతుంది. దానిని సేకరించే హక్కును ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి పొందిన కాంట్రాక్టర్లు ఆదివాసులకు అతి తక్కువ కూలి ఇచ్చి ఆకు తెంపించి కట్టలు కట్టించి తీసుకుపోతారు. చాలా తక్కువ పైసలు ఇచ్చిన రోజులలో సైతం గోదావరి లోయ అంతటా ఆదివాసులు ఆకు తెంపడానికి ఉత్సాహం చూపించేవారు. ఎందుకంటే ఈ పని వ్యవసాయ పనులు ఉండని ఏప్రిల్–మే నెలలలో దొరుకుతుంది. రెండవది, అత్యవసరమైన నగదు ఆదాయాన్ని ఇస్తుంది. ఎంత మారుమూల గూడేలలో నివసించే ఆదివాసులకైనా రొక్కం అవసరం. మందులకు, బస్సు కిరాయిలకు, దైనందిన అవసరాల కొనుగోలుకు, హైందవ సమాజం నుంచి అలవరచుకుంటున్న పెళ్ళి ఖర్చులకు, కోర్టు కేసులకు, చాలా వాటికి నగదు రూపంలో ఆదాయం అవసరం. తునికాకు సేకరణ దానికొక ముఖ్య మార్గంగా ఉంది.

వాళ్ళ అవసరాన్ని గ్రహించిన కాంట్రాక్టర్లు వారి శ్రమను కారుచవగ్గా కొల్లగొట్టి లక్షల రూపాయల లాభాలు సంపాదించుకునే వారు. నక్సలైట్ పార్టీలు రంగప్రవేశం చేసిన తరువాత తునికాకు కూలి రేటును ఒక పద్ధతి ప్రకారం పెంచుకుంటూ వచ్చారు. ఇది తెలంగాణలో, విదర్భలో, ఛత్తీస్‌గఢ్‌లో జరిగింది. గోదావరి లోయ ఆదివాసులలో నక్సలైట్ రాజకీయాల వ్యాప్తికి ఇదొక ముఖ్యకారణం. ఛత్తీస్‌గఢ్‌లో ఈ కూలిరేటు 50 రెట్ల దాకా పెరిగింది. ఇది ఆదివాసులకు చాలా మేలు చేసింది. రాజకీయాల ఉచితానుచితాలు





ఎట్లాగున్నా, తునికాకు కాంట్రాక్టర్ల శ్రమ దోపిడీని మొదటి నుంచీ ప్రభుత్వాలు అరికట్టి ఉంటే గోదావరి లోయ అడవులలో నక్సలైట్ పార్టీల ప్రభావం – అందులో భాగంగా మావోయిస్టుల ప్రభావం – ఇప్పుడున్నదానిలో సగం కూడా ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ శ్రమ దోపిడీని అరికట్టకపోవడం పొరపాటున గానీ, ఏమరుపాటున గానీ జరిగింది కాదు. తెలిసే జరిగింది. తునికాకు కాంట్రాక్టర్లు కాంగ్రెస్ మొదలుకొని ఆయా పాలక పార్టీల ప్రముఖులు, పార్టీలకు నిధులు సమకూర్చేవారు.


నక్సలైట్ల హింస గురించి ప్రభుత్వాలు మాట్లాడే మాటలను ఈ కోణం నుంచి చూడాల్సి ఉంది. ప్రజల పట్ల తమకుండే బాధ్యతలను ఉద్దేశపూర్వకంగా విస్మరించే వారికి, ప్రజల హక్కుల కోసం, సాధన కోసం ప్రయోగించే హింసను విమర్శించే నైతిక హక్కు ఏమాత్రం లేదు.

# సాయుధ పోరాట రాజకీయాలు

అయితే మావోయిజం కేవలం ప్రజల సామాజిక ఆర్థిక ప్రయోజనాల కోసం సమర్థంగా పోరాటం చేసే శక్తి మాత్రమే కాదు. వారు ఆయుధాలు ఉపయోగించేది మరింత సమర్థంగా ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి మాత్రమే కాదు. అటువంటి పోరాట పంథాను 'ఆర్థిక వాదం' అని మావోయిస్టులే తిరస్కరిస్తారు. మావోయిజం ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి. వారిది ప్రస్తుత రాజ్యాన్ని బలప్రయోగంతో కూలదోసి ప్రత్యామ్నాయ రాజ్యాన్ని నెలకొల్పడం లక్ష్యంగా గల రాజకీయ పోరాటం. గ్రామీణ ప్రాంతాలలో – అందులోనూ మరీ వెనకబడిన ప్రాంతాలతో మొదలుపెట్టి – ప్రస్తుతం అధికారం చెలాయిస్తున్న రాజ్యాధికారాన్ని సాయుధ ప్రజా పోరాటం ద్వారా మెట్టుమెట్టుగా తొలగించి, ప్రత్యామ్నాయ రాజ్యాధికారాన్ని నెలకొల్పుకుంటూ రావడం ద్వారా మొత్తం దేశాన్ని తమ సిద్ధాంతం నమూనాలో విముక్తం చేసి నూతన ప్రజాతంత్ర రాజ్యాన్ని నెలకొల్పడం వారి సమీప లక్ష్యం.

ఇది మంచిదా చెడ్డదా అన్న దానితో మాకు నిమిత్తం లేదు. దీని స్వరూప స్వభావాలనూ, పర్యవసానాలనూ అర్థం చేసుకోవడం అవసరం. ఈ రాజకీయ ప్రక్రియ ఫలితంగా మావోయిస్టులకు ఆదివాసీ సమాజం వెలుపలేకాక ఆదివాసీ సమాజంలోనూ ఏర్పడిన శత్రువర్గాన్ని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వాడుకుని విద్వేష పూరితమైన 'సల్వాజుడుం' అనే ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటుచేసిన – లేక ఏర్పాటు కానిచ్చిన – వైనాన్ని అర్థం చేసుకోవడం అవసరం.


సల్వాజుడుం అనేది మావోయిజానికి వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజాపోరాటం కాదనీ, పనిగట్టుకొని తయారుచేసిన ప్రైవేటు సైన్యమనీ దాదాపు మినహాయింపు లేకుండా పరిశీలకులందరూ గుర్తించారు. హక్కుల సంఘాల నిజనిర్ధారణలే కాక సాధారణ దిన, వార పత్రికలు సైతం ఈ విషయాన్ని గుర్తించాయి. అయితే దాని అర్థం సల్వాజుడుంను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం శూన్యం



నుంచి పుట్టించిందని కాదు. మావోయిస్టు రాజకీయాల స్వభావం, పోరాట పద్ధతుల పర్యవసానంగా వారికి వ్యతిరేకంగా తయారైన వ్యక్తులను చేరదీయడం ద్వారానే అది సాధ్యం అయింది. వారిని చేరదీసి, యథేచ్ఛగా హింస చేసే లైసెన్స్ ఇచ్చి, కొందరికైతే ఆయుధాలిచ్చి 'స్పెషల్ పోలీసు ఆఫీసర్' అని నామకరణం చేసి సమాజం పైన వదిలింది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం.

వారంతా తమ సామాజిక ఆర్థిక పోరాటాల వల్ల ఆస్తులు, అధికారం, పెత్తనం కోల్పోయిన స్వార్థపరులేనని మావోయిస్టులు అంటారు. ఇది పూర్తిగా నిజం కాదు. దంతెవాడ అడవులను మావోయిస్టులు 'విముక్త ప్రాంతం'గా ప్రకటించారు. ఈ విషయంలో దంతెవాడ ఆంధ్రప్రదేశ్‌ను దాటిపోయింది. ఇక్కడ గెరిల్లా ప్రాంతాలే తప్ప విముక్తి ప్రాంతాలు ప్రకటించలేదు. 'విముక్త ప్రాంతం'లో మావోయిస్టులు నెలకొల్పిన సంఘం, దానికి వత్తాసుగా ఉన్న వారి పార్టీ గ్రామ కమిటీ పరిపాలన చూసుకుంటాయి. ప్రభుత్వ అధికారానికే కాదు, సంప్రదాయక ఆదివాసీ తెగ పెద్దల పెత్తనానికి కూడా తావు ఉండదు. అయితే దీనివల్ల కేవలం తెగ పెద్దలు మాత్రమే వ్యతిరేకం అవుతారనుకుంటే పొరపాటే. వారి పెద్దరికం సంప్రదాయంలో భాగం. సంప్రదాయక తెగ నిర్మాణంలో భాగం. సంప్రదాయం అనేది ఆదివాసులు తమ ఉనికి గురించి ఏర్పరచుకునే స్వీయ భావనకు పునాది. అది దెబ్బతింటే కేవలం తెగ పెద్దలు బాధపడతారనుకోవడం తప్పవుతుంది. మావోయిస్టు సానుభూతిపరులపైన సల్వాజుడుం చేసిన దాడులలో వ్యక్తమైన విపరీతమైన క్రౌర్యం వెనుక ఏదో తీవ్రమైన ద్వేషం ఉందని ఆ కథనాలు చదివిన వారికెవరికైనా అనిపిస్తుంది. సల్వాజుడుం క్రూరత్వాన్ని గురించి సవివరంగా చెప్తున్న మావోయిస్టులు, ఆదివాసులైన సల్వాజుడుం కార్యకర్తలు తమ తోటి ఆదివాసులపై అంత క్రూరంగా ఎందుకు హింసకు పాల్పడుతున్నారన్న ప్రశ్న వేసుకోకపోవడం ఆశ్చర్యమే. సల్వాజుడుం వారు కోయలు, వారిచేతిలో దాడికి గురైన వారు గొత్తికోయలు అయిన చోట పరాయి తెగవారిపైన ద్వేషంగా దానిని అర్థం చేసుకోవచ్చునేమో గానీ అది అన్ని సందర్భాలలోనూ నిజం కాదు. రెండు వైపులా రెండు తెగల వారూ ఉన్నారు.

'విముక్త ప్రాంతం'లో పాలనా యంత్రాంగానికే కాదు, ఎన్నికైన పంచాయతీరాజ్ వ్యవస్థ కార్యకలాపాలకు కూడా మావోయిస్టుల నుంచి అవరోధం ఉంటుంది. అక్కడ గ్రామాన్ని వారు నెలకొల్పిన 'సంఘమే' పరిపాలిస్తుంది. ఈ సంఘాలు ప్రజలు తమ కోసం తాము ఏర్పరచుకున్న సంస్థలని మావోయిస్టు సాహిత్యం చెప్తుంది కానీ అవి మావోయిస్టుల రాజకీయ




అజెండాలో భాగంగా ఏర్పడినవే. వాటి ఏర్పాటు ప్రజాస్వామికంగా జరగవచ్చు, వాటి అంతర్గత నిర్వహణ ప్రజాస్వామికంగానూ ఉండవచ్చు. అయినప్పటికీ అవి మావోయిస్టుల ఆధ్వర్యంలో ఏర్పడినవే తప్ప 'ప్రజలు ఏర్పాటు చేసుకున్నవి' కావు. వాటికి ఆయా గ్రామాలలో, ఆయా సందర్భాలలో ప్రజల మద్దతు విస్తృతంగానే ఉండవచ్చును గానీ వాటి మాట, నిర్ణయాలు అనివార్యంగా చెల్లుబాటు కావడానికి అంతిమ కారణం వాటి వెనక ఉన్న మావోయిస్టుల తుపాకీ. ఈ 'సంఘాల' నిర్వహణ అంతర్గతంగా ఎంత ప్రజాస్వామికంగా ఉన్నా, వాటి నిర్ణయాలను కాదని ప్రత్యామ్నాయ రాజకీయాలు ఆచరించే స్వేచ్ఛ ఉండదు. అటువంటి ప్రయత్నం చేసిన వారిని ప్రభుత్వ ఏజెంట్లుగా భావించి తదనుగుణంగా వారిపైన చర్య తీసుకోబడుతుంది.

పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొననీయక పోవడం, సాగనీయక పోవడం నిరసనకు దారితీయగలదు. 'పెసా చట్టం' అని పిలవబడే రాజ్యాంగ శాసనం షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామ పంచాయతీలకూ, గ్రామ సభలకూ విశేషమైన అధికారాలు ఇస్తుంది, స్వయం ప్రతిపత్తి ఇస్తుంది. అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా ఒకనాటి మధ్యప్రదేశ్ 'పెసా' చట్టం అమలుకు నిజాయితీగా చర్యలు తీసుకుందని ఆ చట్టానికి పునాది అయిన భూరియా కమిటీ సిఫారసుల కర్త దిలీప్‌సింగ్ భూరియా స్వయాన అభిప్రాయపడ్డారు. ఆదివాసీ మిత్రుడైన మాజీ ఐఎఎస్ అధికారి డాక్టర్ బి.డి. శర్మ అభిప్రాయమూ అదే. కాబట్టి పంచాయతీరాజ్ ఎన్నికలు జరగడానికి వీలులేదన్నా, ఎన్నికలు జరిగి ఎన్నికైన సర్పంచ్ తదితరులు తమ అధికారాన్ని వదులుకొని గ్రామ పాలనను 'సంఘానికి' అప్పగించాలని శాసించినా అది న్యాయమైన నిరసనకు దారితీయగలదు.

సల్వాజుడుం 2005 జూన్ నెలలో మొదలైంది. ఇంకా ఆ పేరు బయటకు రాక ముందే కొన్ని వార్తలు తెలుగు పత్రికలలో ప్రముఖంగా వచ్చాయి. మావోయిస్టులు దంతెవాడ అడవులలో రోడ్డు వేయనీయడం లేదని, అభివృద్ధి పనులకు అడ్డం పడుతున్నారని, సంతలను ఆపుజేశారని, అందువల్ల సాధారణ ఆదివాసీ ప్రజలకు వారిపైన ఆగ్రహం ఏర్పడిందనీ ఆ వార్తల సారాంశం. ఈ ఆరోపణలకు మావోయిస్టులు అడపా దడపా సమాధానం చెప్తున్నారు. సంతలను ఆపడంలో తమ పాత్ర లేదని అంటూ రోడ్ల విషయంలో మాత్రం అవి 'ప్రకృతి సంపదను దోచుకోవడానికి పెట్టుబడిదార్లకు ఉపయోగపడేటట్టయితే' వ్యతిరేకిస్తామనీ, 'పోలీసు, పారామిలటరీ బలగాల కదలికలకు ఉపయోగపడేటట్టయితే' వ్యతిరేకిస్తామనీ వారి వివరణ ఇస్తున్నారు.






రహదార్లు ఉన్నట్టయితే పెట్టుబడి వ్యాప్తికీ పోలీసు బలగాల రవాణాకూ ఉపయోగపడతాయనేది వాస్తవమే. అయితే ప్రజలకూ ఉపయోగపడతాయి. దూరప్రాంతాలలోని మార్కెట్‌లకు పోవడానికీ, పని స్థలాలకు పోవడానికీ, ఆస్పత్రులకు పోవడానికీ, ప్రభుత్వ కార్యాలయాలకు పోవడానికీ ఉపయోగపడతాయి. అటువంటప్పుడు దానిని కారణంగా చూపించి దీనిని కాదనడం ఎంతవరకు సబబు అనేది ఒక ప్రశ్న కాగా, సాధారణ ప్రజలు ఈ తేడా చూడలేక కానివ్వండి, పట్టించుకోదలచుకోక కానివ్వండి, 'అన్ని చోట్లా ఇదే జరుగుతుండగా మాకు మాత్రం రోడ్లు లేకుండా చేస్తారా?' అన్న తర్కంతో కానివ్వండి దానిని నిరసించవచ్చు.

అయితే మావోయిస్టులు పెట్టుబడిదార్ల దోపిడీకి రహదార్లు ఉపయోగపడతాయనేదానిని తాము కల్పిస్తున్న ఆటంకానికి ప్రధాన కారణంగా ప్రచారం చేసుకున్నప్పటికీ పోలీసుల రాకపోకలను నిరోధించే లక్ష్యంతో ఎప్పటి నుండో ఉన్న రోడ్లను సహితం తవ్వేస్తున్న విషయం కాదనలేని వాస్తవం. దీనికి ప్రముఖ నిదర్శనం కుంట తాలూకాలోని కుంట – గొల్లపల్లి రోడ్డు. ఇది ఈ మధ్య పుట్టిన రోడ్డు కాదు. ఎప్పటి నుండో ఉంది. కుంట తాలూకా దక్షిణ భాగాన ఉన్న అడవి గ్రామాలను తాలూకా కేంద్రంతో కలిపే ఏకైక రహదారి ఇది. నిజానికి కుంట తాలూకాలో కుంట నుంచి సుక్మా మీదుగా జగ్దల్‌పూర్‌కు పోయే జాతీయ రహదారి నెం. 221 కాక వేరే రెండే రెండు పెద్ద రోడ్లు ఉన్నాయి. ఒకటి కుంటను గొల్లపల్లికి కలిపే రోడ్డు. రెండవది దోర్నపాల్‌ను జగర్‌గొండకు కలిపే రోడ్డు. గొల్లపల్లి, జగర్‌గొండ పోలీసుస్టేషన్లు ఉన్న ఊర్లు.

గొల్లపల్లి రోడ్డును మావోయిస్టులు వాడకానికి పనికి రాకుండా తవ్వేశారనేది చాలామంది అభియోగం. సంవత్సరాలుగా ఆ రోడ్డును వాడుకుంటున్న అడవివాసులిప్పుడు అడవికి అడ్డంపడి కుంటకు నడిచైనా పోవాలి, లేదా మల్లంపేట వద్దనో, మారాయగూడెం వద్దనో సరిహద్దు దాటి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించి బస్సెక్కి చింతూరుకు లేక ఛట్టికి పోయి మళ్ళీ సరిహద్దు దాటి కుంటకు పోవాలి. మారాయగూడెం గొల్లపల్లికి దక్షిణాన ఉంది. కుంట నుంచి చూస్తే ఇది దట్టమైన అడవిలో, మావోయిస్టుల 'ఇలాఖా'లో ఉన్న గ్రామంగా కనిపిస్తుందిగానీ మన ఖమ్మం జిల్లా చింతూరు నుంచి ఈ ఊరికి డాంబర్ రోడ్డు మీద పోవచ్చు. ఈ ఊరు సగభాగం దంతెవాడలో, సగభాగం ఖమ్మంలో ఉంది. ఆ సగాన్ని ఎం.పి మారాయగూడెం అనీ, ఈ సగాన్ని ఎ.పి మారాయగూడెం అనీ పిలుస్తారు.





ఎ.పి. మారాయగూడెంలో గస్తీ తిరుగుతున్న సిఆర్‌పి జవానులు

అడ్కరాము ఎం.పి మారాయగూడెం నివాసి అయిన కోయదొర. అతనికి పలు రకాల నేర్పరితనం ఉంది. సుతారిపని, వడ్రంగం, ఇళ్ళకు రంగులు వేయడం వచ్చు. గ్రామీణ జీవితానికి అవసరమైన ఈ పనులలో నిపుణుడైన రాము అవకాశం దొరికితే బాగానే సంపాదించుకొని బతకగలడు. మేము మే నెల 16వ తేదీన అతనిని తన ఇంటి వద్ద కలిశాము. సల్వాజుడుం అప్పటికింకా వాళ్ళ గ్రామానికి రాలేదుగానీ మరుసటి రోజు రాబోతున్నదని విన్నాడు. వస్తే ఏం చేస్తాడు? వాళ్ళతో పోతాడా? 'ఏమో ఆలోచిస్తున్నాను' అంటాడు. వాళ్ళతో పోవాలన్న ఆలోచన ఎందుకొచ్చింది? అని అడిగితే 'ఏం చేయమంటారు? కుంటకు పోయే రోడ్డును ఎన్నిసార్లు రిపేర్ చేసినా మావోయిస్టులు తవ్వేస్తారు. నేనెట్లా బతికేది?' అంటాడు. అతనిని బహుశా ఆదివాసీ ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తిగా మావోయిస్టులు భావిస్తారేమో! అందుకే అతని నైపుణ్యాలను వివరించాము. మాటలను ఎవరు ఏ అర్థంలో వాడుతున్నారో తెలుసుకుంటే సంవాదం సులభతరం అవుతుంది. సల్వాజుడుం మే 17న ఎం.పి మారాయగూడెంకు వచ్చింది, పోయింది. ఏం చేసిందో తరువాత చూద్దాం. మేము మే 16న పోయేటప్పటికే ఎం.పి మారాయగూడెం సమీపంలో సిఆర్‌పిఎఫ్ క్యాంపు ఉండింది. ఆ క్యాంపు జవాన్లలో ఒకరితో వివరంగానే మాట్లాడగలిగాము. తెలుగువాడైన ఆ జవాను తెలుగువాళ్ళం దొరికామని మాతో గడగడ మాట్లాడుతూ చాలా విషయాలు చెప్పేశాడు – ఉత్తర భారతీయుడైన




అతని సహచరుడు మా వైపు అనుమానపు చూపులు విసురుతూ అతన్ని బలవంతంగా గుంజుకుపోయేదాకా.

ఈ సిఆర్‌పిఎఫ్ క్యాంపు కారణంగా గొల్లపల్లి అడవులలోని ఆదివాసులు మారాయగూడెం వద్ద సరిహద్దు దాటి ఇవతలికి వచ్చి పనులు చూసుకోవడం అప్పటికే కష్టంగా ఉండింది. 2007 ఏప్రిల్ నెలలో ఆ పోలీసు అవుట్ పోస్టు మీద మావోయిస్టులు రెండుసార్లు దాడి చేయడంతో అక్కడ పహారా పెరిగి ఆ సరిహద్దు మార్గం పూర్తిగా బంద్ అయిపోయింది. ఈ విషయాలు తరువాత చూద్దాం. మావోయిస్టులు రాజ్యాధికారానికి ఎంచుకున్న పోరాట పద్ధతుల ఫలితంగా కేవలం జులుం చేసే ప్రభుత్వ సిబ్బంది, ఆదివాసీ తెగపెద్దలు, గిరిజనేతర దోపిడీదార్లు, పెట్టుబడిదారీ కంపెనీలే కాక సాధారణ ఆదివాసీ ప్రజలు సైతం నష్టపోగలరనీ, నిరసన పెంచుకోగలరనీ, వారందరినీ దోపిడీ వర్గాలుగా ముద్ర వేయడం తగదనీ వివరించడం ప్రస్తుత ఉద్దేశం. ప్రత్యేకించి ప్రజాతంత్ర సంస్థలు, హక్కుల సంఘాలు, మావోయిస్టుల రాజకీయ పోరాట చర్యలన్నిటినీ 'ప్రజా పోరాటాలు'గా వర్ణించే అలవాటు మానుకొని ఏ పోరాటం ప్రత్యక్షంగా ప్రజల హక్కుల కోసం, ఏది దీర్ఘకాల గెరిల్లా తంత్రంలో భాగం అని చూడడం అవసరం. ఈ రెండవ కోవకు చెందిన అన్ని చర్యలకూ ప్రజామోదం ఉండకపోవచ్చు. ప్రజామోదం తీసుకొని తీరాలన్న నియమం మావోయిస్టులు పాటించరు. ఆ చర్యలవల్ల సాధారణ ప్రజల ప్రయోజనాలూ అవసరాలూ దెబ్బతిన్నప్పుడు ప్రజలు వ్యతిరేకించగలరు, శత్రుభావమూ ఏర్పడగలదు. తమ పంథాయే దీర్ఘకాల ప్రజా ప్రయోజనాలకు రక్ష అనీ, తాత్కాలికంగా వచ్చే కష్టనష్టాలను భరించాలనీ మావోయిస్టులు అంటుండవచ్చు. కానీ అది ఒక రాజకీయ విశ్వాసమే తప్ప అందరూ ఒప్పుకొని తీరవలసిన ప్రత్యక్ష సత్యం కాదు.

తమ దళాలపైన, సానుభూతిపరులపైన దాడిచేసే పోలీసు, పారామిలటరీ బలగాలు అడవులలో బస చేసేందుకు ఉపయోగించే పక్కా నిర్మాణాలేవీ ఉండకూడదనేది మావోయిస్టుల ఆలోచన. అందువల్ల గ్రామ పంచాయతీ నిర్మాణాలను సైతం కొన్ని చోట్ల ఆపేయడమేకాక అనేక పాఠశాల భవనాలను పేల్చేశారు. 2006 ఫిబ్రవరి, మార్చి నెలలలో కుంట తాలూకాలో 37 పాఠశాల భవనాలను, అంగన్‌వాడీ, హాస్టల్ భవనాలను పేల్చేశారు. మార్చి 4-8 తేదీల మధ్య వరుసపెట్టి 28 భవనాలను పేల్చేశారు.

పోలీసు, పారామిలటరీ బలగాలు ఈ స్కూళ్ళను ఖాళీ చేయించి క్యాంపులుగా వాడుకుంటున్నారన్న అభిప్రాయం మావోయిస్టు సాహిత్యం





మైతలో మావోయిస్టులు పేల్చేసిన స్కూలు

కలిగిస్తుంది కాని అది పూర్తిగా వాస్తవం కాదు. పోలీసు, పారామిలటరీలు పాఠశాల భవనాలను, హాస్టళ్ళను, వాటి ఆవరణలను పాక్షికంగా మాత్రమే ఆక్రమించుకుంటున్నారు. రెండో పక్క పాఠశాల నడుస్తుంటుంది, లేదా సెలవు రోజులలోనో, రాత్రి వేళల్లోనో ఆ భవనాలను విడిదిగా వాడుకుంటారు. పిల్లలు చదువుకునే స్కూళ్ళలోనికీ, నివసించే హాస్టళ్ళలోనికీ తుపాకులు వేసుకున్న పోలీసు బలగాలు వచ్చి ఉండడం ఎప్పుడైనా అభ్యంతరకరమేగానీ దానికి విరుగుడుగా ఆ పాఠశాలలను పేల్చేయడం తగునా? తగుననుకునే వాళ్ళు కొందరుంటారేమో గానీ కాదనుకునే వాళ్ళూ ఉంటారు. 'ఈ చర్యలు తప్పని పార్టీగానీ ప్రజలుగానీ భావించడం లేదు' అన్న మావోయిస్టుల వివరణ ప్రజలకు సంబంధించినంత వరకు వాస్తవం కాదు.


2006 నవంబర్ 26వ తేదీన మేము మల్లంపేట నుండి దంతెవాడలోకి ప్రవేశించి కుంట తాలూకాలోని పూసుగూడెం, మైత గ్రామాలకు వెళ్ళాము. మైత వద్ద మావోయిస్టులు పేల్చివేసిన అంగన్‌వాడి భవనాన్ని, పాఠశాల భవనాన్ని చూశాము. వాళ్ళు వాటిని పోలీసులు, పారామిలటరీ విడిదిగా వాడుకున్నందుకు పేల్చి వేయలేదు. అప్పటికింకా అంత లోపలి ప్రాంతాలకు ప్రభుత్వ బలగాలు రాలేదు. వాటిని వాడుకోకుండా ఉండగలందుకు పేల్చేశారు. ఆ పాఠశాలల్లో మైత గ్రామానికేకాక పూసుగూడెం, బండారుచెల్క వంటి గ్రామాలకు చెందిన పిల్లలు కూడా చదువుకుంటుండేవారు. ఆ పిల్లలిప్పుడు ఎక్కడ చదువుకుంటున్నారు? కొందరిని సరిహద్దుకు ఇవతల ఉన్న



బంధుమిత్రుల సహాయంతో ఖమ్మం జిల్లా వాసులుగా చూపించి మన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ నడుపుతున్న ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. అది సాధ్యం కాని వాళ్ళు చదువు మానుకున్నారు. ముఖ్యంగా కోయలకే తప్ప గొత్తికోయలకు ఖమ్మం జిల్లాలో బంధువులుండే అవకాశం లేదు కాబట్టి గొత్తికోయల పిల్లలెవరైనా ఒకవేళ కుంట తాలూకాలో బడికి పోతూ ఉండినా బడి భవనాన్ని పేల్చివేసిన తరువాత చదువు మానుకోవలసిందే కదా! మరి 'ప్రజలు దీనిని తప్పని భావించడం లేదు' అంటే నమ్మగలమా? ఒకవేళ పిల్లలు చదువుకోవడం వల్ల ఉండగల ప్రయోజనం వారికి అర్థంకాక అట్లా అనుకున్నా, ప్రజాతంత్రవాదులు అంగీకరించగలరా?

2005 మధ్య భాగం నుంచి సంతలు క్రమంగా బంద్ కావడం ప్రజలకు చాలా అసంతృప్తి కలిగించిన విషయాలలో ఒకటి. వ్యవసాయంలో ఫలసాయం చాలా తక్కువ ఉన్న దంతెవాడ అడవులలో చిన్నతరహా అటవీ సంపదను సేకరించి సంతలలో అమ్ముకోవడం ఆదివాసీ ప్రజల జీవనానికి అత్యవసరం. అంతేకాక సబ్బులు, ఉప్పు, బట్టలు తదితర పారిశ్రామిక ఉత్పత్తులు కొనుక్కోవాలంటే కూడా రవాణా సౌకర్యాలు దాదాపు మృగ్యం అయిన దంతెవాడలో సంతలే గతి.

సంతలు ఎవరి వల్ల బంద్ అయ్యాయనేది వివాదంగా ఉంది. పారామిలటరీ బలగాలకు కావలసిన తిండిగింజలు, కూరగాయలు వగైరా సంతలలో కొనుక్కుపోతున్నారని చెప్పి మావోయిస్టులు మూసేయించారని ప్రభుత్వం అంటుండగా, తమ దళాలకు ఆహార అవసరాలు తీరుస్తున్నాయని పోలీసులు మూసేయించారని మావోయిస్టులు అంటున్నారు. ఇద్దరూ కూడా ఎదుటి వారికి సరఫరా అవుతున్న తిండిగింజలను అటకాయించిన సంఘటనలు అనేకం జరిగి ఉన్నాయి కాబట్టి రెండు ఆరోపణలూ నిజమే కావచ్చునని ప్రాథమికంగా అనిపిస్తుంది. కాగా, సంతలు సమాచార సేకరణకు, ఇన్‌ఫార్మర్లను కలుసుకోవడానికి కూడా అనుకూలమైన ప్రదేశాలు. ఈ కారణంగా కూడా సంతలు జరగకుండా ఉంటే ఇరుపక్షాలూ సంతోషిస్తాయి. అయితే సంతల మూసివేతలో తమకు ఏ పాత్రా లేదని మావోయిస్టులు పదే పదే అంటుండడం వల్ల ఇద్దరినీ బాధ్యుల్ని చేయడం సరైనదేనా అన్న సందేహం కలుగుతుంది. రోడ్లను ఆటంకపరిచిన విషయం, స్కూలు భవనాలను పేల్చేసిన విషయం మావోయిస్టులు ఒప్పుకొని సమర్థించుకున్నారే తప్ప మేం



## రాణిబొందిలి దాడి

మావోయిస్టులు దంతెవాడ జిల్లాలోని బిజాపూర్ తాలూకాలో పెద్దెత్తున మూకుమ్మడి హత్యాకాండకు పాల్పడిన ఏకైక ఘటన ఇది. ఇందులో 55 మంది చనిపోయారు. చనిపోయిన వారిలో 15 మంది పోలీసులు కాగా, 40 మంది స్పెషల్ పోలీసు ఆఫీసర్లు – అంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆయుధాలిచ్చి సరైన తర్ఫీదు ఇవ్వకుండా జనం మీదికి వదిలిన సల్వాజుడుం కార్యకర్తలు.


కాల్పులు జరిగింది గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో. పోలీసు బలగాలు ఆశ్రమ పాఠశాలలో ఒక పక్క ఉండగా రెండవ పక్కన బాలికల హాస్టల్, పాఠశాల నడుస్తూనే ఉన్నాయి. అసలు స్కూలులో తుపాకులేసుకున్న పోలీసులొచ్చి తిష్ఠవేయడం ఏ రకంగా సబబు అని కొందరు ప్రశ్నిస్తుండగా, అమ్మాయిల చదువు, వసతి దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నందుకు వారిని అభినందించిన వారూ ఉన్నారు.

2007 మార్చి 14వ తేదీ రాత్రి మావోయిస్టులు ఆ ఆశ్రమ పాఠశాల భవనం పైన పెద్ద సంఖ్యలో దాడిచేశారు. అందులో బసచేసిన 40 మంది స్పెషల్ పోలీసు అధికారులందరికీ కలిపి 25 తుపాకులు మాత్రమే ఉన్నాయంట. పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు గానీ సెంట్రీ బాధ్యత ఎస్‌పివోలకే అప్పగించబడింది. తెల్లవారుజామున 2 గంటలకు మొదలైన మావోయిస్టుల ముట్టడి 4 గంటల దాకా సాగింది. అప్పటికి క్యాంపులోని పోలీసులు, ఎస్‌పివోల దగ్గరున్న మందుగుండు మొత్తం అయిపోయింది. అప్పటికే వారు కుట్రు గ్రామంలో ఉన్న సిఆర్‌పిఎఫ్ క్యాంపుకు వర్తమానం పంపారు గానీ ఎటువంటి సహాయం రాలేదు.

వాళ్ళ దగ్గరున్న మందుగుండు అంతా అయిపోయిన తరువాత మావోయిస్టులు భవనంలోకి ప్రవేశించి ఒక్కొక్కరినీ నరికి, కాల్చి చంపారు.

ఇంతసేపూ భవనం రెండవ సగంలో ఉన్న గిరిజన బాలికలు తమ గదులలో బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. వాళ్ళున్న సగభాగానికి ఒక్క తూటా కూడా తగలకుండా అత్యంత చాకచక్యంగా పోలీసులను, ఎస్‌పివోలను మాత్రమే ఊచకోత కోసినందుకు మావోయిస్టులను కొందరు జగ్దల్‌పూర్ వాసులు అభినందించగా విన్నాం. కానీ ఆ రాత్రి ఆ ఆశ్రమ పాఠశాలలో గడిపిన అమ్మాయిలు జీవితంలో ఆ అనుభవం నుంచి కోలుకోగలరా?

చేయలేదనలేదు. సంతలు తమ పోరాట ప్రయోజనాలకు ఆటంకం కలిగిస్తున్నాయని భావించి వాటిని మూసేయించి ఉంటే ఏదో ఒక వాదన చేసి సమర్థించుకుందురే తప్ప చేయలేదని దబాయించి ఉందరు.




ఏమైతేనేం సంతల మూసివేత తీవ్ర ఇబ్బందులకు కారణం అయింది. దంతెవాడ అడవివాసులలో చాలామందికి ప్రత్యామ్నాయమేదీ లేదు. కానీ కుంట తాలూకా వాసులలో ఖమ్మం సరిహద్దుకు సమీపంలో ఉండేవారు సరిహద్దు దాటి ఏడుగురాళ్ళపల్లి, చింతూరు వంటి ఊర్లలో జరిగే సంతలకు వచ్చి పోతున్నారు. చింతూరుకు రావడం రవాణా సదుపాయాల రీత్యా కష్టంకాదు గానీ, ఆ ఊరికి నేరుగా రావాలంటే కుంట తాలూకా కేంద్రాన్ని దాటి రావాలి. అంటే కుంటలోని సల్వాజుడుం శిబిరాన్ని దాటి రావాలి. అడవివాసులకు అది సాధ్యంకాదు. అడవులను ఖాళీచేసి అందరూ వచ్చి రహదారి శిబిరాలలో ఉండాలనేది సల్వాజుడుం డిమాండు కాబట్టి వాళ్ళ కళ్ళ ఎదుట చింతూరు సంతకు వచ్చిపోవడం ఆచరణ సాధ్యం కాదు. ఇక మిగిలింది ఏడుగురాళ్ళపల్లి వంటి ఊర్ల సంతలు. అక్కడికి వస్తూ పోతూ ఉన్నారు గానీ కుంట నుంచి సల్వాజుడుం కార్యకర్తలు వ్యాన్లలో ఏడుగురాళ్లపల్లికి వచ్చి అక్కడ కనిపించిన ఛత్తీస్‌గఢ్ వాసులను కొట్టి బలవంతంగా తీసుకుపోయిన ఘటనలు జరిగిన కారణంగా భయంభయంగా వస్తూ పోతున్నారు.

ఆదివాసులలో భూస్వాములు ఉన్నారనీ వారి భూములు పేదలకు పంచడం వల్ల ఆ భూస్వామ్య వర్గం తమకు వ్యతిరేకమయిందనీ కూడా మావోయిస్టులు అంటున్నారు. ఆదివాసులలో సైతం 50 నుంచి 100 ఎకరాల దాకా భూములున్న వారు కొందరున్న మాట వాస్తవమే. అయితే పైన చెప్పినట్టు దంతెవాడలో వ్యవసాయ అభివృద్ధి అతి స్వల్పం. వడ్లయినా, జొన్నలైనా ఎకరానికి 2 లేక 3 క్వింటాళ్ళే పండిస్తారు. మైదాన ప్రాంతాలలో ఎక్కడైనా ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ళ దాకా పండిస్తారు. దీనిని బట్టి దంతెవాడ అడవులలో 100 ఎకరాలు ఉంటే మైదాన ప్రాంతాలలో 10 ఎకరాలతో సమానం అని చెప్పుకోవచ్చు.

అయినప్పటికీ అందులో సగం భూమి అసలు ఏ భూమీ లేని వాళ్ళకు ఇమ్మనడంలో తప్పేముంది అంటారేమో. మేము తప్పొప్పుల చర్చ చేయడం లేదు. 100 ఎకరాల భూస్వామిగా కనిపించే వ్యక్తి 10 ఎకరాల ఆసామి మాత్రమేనని దృష్టిలో ఉంచుకుంటే మావోయిస్టులు చేపట్టిన భూమి పంపిణీ పట్ల వ్యక్తమయ్యే వ్యతిరేకతను వట్టి స్వార్థంగా కొట్టి పారేయలేము.


'వాళ్ళు ఏది అడిగితే అది ఇవ్వాలి. ఇవ్వకపోతే కొడతారు. కొంచెం నదురుగా ఉన్న యువకుడు కనబడితే ఉద్యమానికి ఇచ్చెయ్యమంటారు. ఇంటికొకరు ఉద్యమంలోకి రావాలంటారు' ఇట్లాంటి ఫిర్యాదులు చాలామంది నుంచి విన్నాము. బలవంతంగా ఎవరినైనా దళాలలోకి తీసుకొని ఏం



చేసుకుంటారన్న సందేహం సహజంగానే వస్తుంది. బహుశా మావోయిస్టులతో చేరడానికి ఇష్టపడే యువకులు లేక యువతుల పెద్దలు అభ్యంతరం పెడితే మావోయిస్టులు జోక్యం చేసుకొని ఆ పిల్లలను తమతో తీసుకుపోతుండవచ్చు. 'నదురుగా ఉన్న యువకులు కనబడితే తీసుకుపోతారు' అన్న ఫిర్యాదు భావం ఇదే కావచ్చు. అయితే ఏ వయసు పిల్లల ఇష్టాన్ని లేక సమ్మతిని మావోయిస్టులు విజ్ఞతతో తీసుకున్న నిర్ణయంగా భావిస్తున్నారన్నది ఇక్కడ కీలకం. చిన్న పిల్లలు ఒక వేళ దళంలో చేరడానికి ఇష్టపడినా దానిని వారి అమాయకత్వంగా తల్లిదండ్రులు భావించగలరు. ఆ అమాయకత్వాన్ని వాడుకుంటున్నారని కోపగించుకోనూ గలరు. 18 సంవత్సరాల లోపు వయసున్న వారిని దళాలలోకి తీసుకోవడం సబబా అన్న ప్రశ్నకు జవాబుగా, 'ఈ ప్రాంతాలలో యువకులు చిన్న వయసులోనే రాజకీయంగా ఎదుగుతారు కాబట్టి మేము 16 సంవత్సరాలు నిండిన వారిని కూడా తీసుకుంటున్నాం' అని మావోయిస్టులు జవాబు చెప్పారు. ఈ జవాబు ఆమోదనీయం కాదు. 18 అనే సంఖ్యకు పవిత్రత ఏమీ లేదని ఒప్పుకోవడానికి అభ్యంతరమేమీ లేదు. కొన్ని విషయాలలో అంతకంటే తక్కువ వయసున్నవారి సమ్మతిని కూడా అవగాహనతో కూడినదిగా తీసుకోవచ్చు. అయితే కొన్నిటికి 18 సంవత్సరాలు సైతం మరీ తక్కువ కావచ్చు. సాయుధ పోరాట రాజకీయాలలో భాగస్వామి కావడం ఆ కోవకు చెందుతుంది. తుపాకి పట్టుకోవడం అంటే చంపడానికీ చావడానికీ సిద్ధపడడం. ఆ సంసిద్ధతను మనస్ఫూర్తిగా 16 ఏళ్ళకే అందుకుంటారని నమ్మడం కష్టం. 18 ఏళ్ళు సైతం దానికి తగిన వయసు కాకపోవచ్చు – ఓటు వేయడానికి అది తగిన వయసైతే కానీగాక. కనీసం, ఈ విధంగా భావించే తల్లిదండ్రులూ అన్నలూ అక్కలూ ఉంటారు. వారి వ్యతిరేకతను కొట్టి పారేయలేము.

దోపిడీ వర్గాలనూ, ప్రజలను వేధించే అధికార్లనూ ప్రతిఘటించడమే మావోయిస్టు ఉద్యమ ప్రధాన కర్తవ్యంగా ఉన్న దశలో వారు చంపినా, చావగొట్టినా అది ప్రజల దృష్టిలో దుర్మార్గులైన వారినే. వారినందరినీ చంపే పని కూడా ఏ ఉద్యమమూ పెట్టుకోదు. ఒకటి రెండు ఘటనలతో మిగిలిన వాళ్ళు వెనక్కి తగ్గుతారు. అందువల్ల తొలి సంవత్సరాలలో మావోయిస్టులు చేసిన హత్యల విషయంలో ప్రజాసామాన్యంలో పెద్దగా వ్యతిరేకత గానీ, నిరసన గానీ లేకపోగా మెచ్చుకోలు ఉంది. అయితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు కదా. కేవలం చట్టబద్ధంగా మర్డర్ కేసులు పెట్టి కూడా ఊరుకోదు కదా, వివిధ రూపాలలో నిర్బంధాన్ని ప్రయోగిస్తుంది. ఆ నిర్బంధాన్ని





## పొడియం దూల


ఒత్తిడివల్ల మావోయిస్టులలో చేరి నచ్చక బయటికొచ్చి శత్రువుగా మారిన మైనారిటీ తీరీ తీరని ఆదివాసీ యువకుడి కథ ఇది.

పొడియం దూల లేక దూలయ్య కుంట తాలూకా మురళీగూడ గ్రామానికి చెందిన వాడు. అతని తండ్రి ఆ ఊరి పటేల్. చాలామంది పటేళ్ళలాగే అతని తండ్రి కూడా మావోయిస్టుల చేతిలో దెబ్బలు తిన్నాడు. ఇంటిల్లిపాదీ ప్రభుత్వ ఏజెంట్లేనని మావోయిస్టులు నిందవేయడం వల్ల ఆ అపప్రథ పోగొట్టుకోవడానికి తాను మావోయిస్టు పార్టీలో చేరానని దూల అంటాడు. తనను కూడా కొడతారని భయపడి చేరాడంటే ఇంకొంత నిజాయితీగా ఉంటుందేమో. అయితే అక్కడ నిలవలేక త్వరలోనే బయటి కొచ్చాడు. బయటికొచ్చినందుకు ఏం చేస్తారోనని భయపడి సల్వాజుడుంలో చేరానంటాడు. బహుశా తన తండ్రిని కొట్టినందుకు, తన కుటుంబాన్ని ప్రభుత్వ ఏజెంట్లని ముద్ర వేసినందుకు చేరి ఉండవచ్చు. ప్రస్తుతం కుంటలోని శిబిరంలో ఉన్నాడు. సల్వాజుడుంలో చురుకైన కార్యకర్త.

ఇంతా చేసి ఈ తలపండిన అనుభవజ్ఞుడి వయస్సు మేము 2006 మే నెలలో కలిసే నాటికి 18 సంవత్సరాలు.

ఎదుర్కొనడానికి ప్రతిహింసను ఎన్నుకున్నట్లయితే అది తీసుకునే అన్ని రూపాలకూ, చేసే అన్ని చర్యలకూ ప్రజామోదం ఉండకపోవచ్చు. అన్నీ అందరికీ న్యాయంగా తోచకపోవచ్చు.

మావోయిస్టుల రాజకీయ లక్ష్యం అంతటితో కూడా ఆగనివ్వదు. రాజ్యాన్ని పక్కకు నెట్టి ఆ ప్రాంతాన్ని 'విముక్తం' చేసే గెరిల్లా పోరాటం రూపం తీసుకుంటుంది. ఇది ప్రధానంగా రాజకీయ పోరాటం. రాజకీయ ఏకచ్ఛత్రాధికారం ఏర్పరచే దిశగా సాగే సాయుధ పోరాటం. సర్వాధికారాలూ 'సంఘం' చేతిలోనూ, దానికి వత్తాసుగా ఉన్న పార్టీ గ్రామ కమిటీ చేతిలోనూ కేంద్రీకృతం కావాలి. ఈ పోరాటాన్ని రాజ్యం గట్టిగా ప్రతిఘటిస్తుంది. ఎందుకంటే వీళ్ళనూ, వాళ్ళనూ చంపడం వేరు, రాజ్యసార్వభౌమత్వాన్నే ప్రశ్నించడం వేరు. రెండవ దశ చేరుకునేసరికి రాజ్యం తన బలాన్నంతా దించుతుంది. దానికి వెరవక మావోయిస్టులు ప్రతిఘటించినట్టయితే ఆ ప్రాంతం రణరంగం అవుతుంది. అప్పుడు చాలామంది ప్రజలు ప్రాణాన్నీ, స్వేచ్ఛనూ, భౌతిక



అవసరాలు తీర్చుకునే అవకాశాన్నీ కోల్పోతారు. ఇవి దోపిడీ సమాజాన్ని అంతం చేయడానికి అనివార్యం అయిన కష్టాలు అని మావోయిస్టులు నిజాయితీగానే నమ్మవచ్చు. కానీ అందరూ అంత దూరం ఆలోచించాలని లేదు. ఆలోచించినా అంతే నిజాయితీగా విభేదించకూడదని లేదు. విభేదించడానికి వారు స్వార్థపరులూ, దుర్మార్గులూ కానక్కరలేదు.

దంతెవాడకు పొరుగున ఇంద్రావతికి ఆవల బస్తర్ జిల్లాలో మావోయిస్టులు నెలకొల్పిన 'విముక్త ప్రాంతాన్ని' గురించి తెలుగు వారంతా వివిధ ప్రచురణలలో చదివి ఉంటారు. అక్కడ పాలనా యంత్రాంగం అనేదే లేకపోవడం వల్ల ఇది సులభం అయింది. పెద్దగా సంఘర్షణ లేకుండానే సాధ్యం అయింది. అబుజ్‌మఢ్ అని పేరున్న ఈ ప్రాంతంలో దేశమంతటా జరిగినట్టు కనీసం భూముల సర్వే కూడా జరగలేదనీ, పాలనా యంత్రాంగం దానిని అసలే పట్టించుకోలేదనీ, ఏ రకమైన అభివృద్ధి పనులూ చేపట్టలేదనీ విని ఉంటారు. ఇది నిజమేగానీ దీనికి కారణం నిర్లక్ష్యం, నిరాదరణ కావు. ఆదివాసీ ప్రాంతాల పట్ల ప్రభుత్వాల వైఖరిలో నిర్లక్ష్యం, నిరాదరణ కావలసినంత ఉన్నాయి గానీ 12 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల అబుజ్‌మఢ్ రాజ్యాంగ శూన్యమైన ప్రాంతంగా ఉండిపోవడానికి అది కారణం కాదు. దానిని ఉద్దేశ పూర్వకంగానే రాజ్యం జోక్యం లేని ఆదివాసీ ప్రాంతంగా (ఎక్స్‌క్లూడెడ్ ఏరియాగా) బ్రిటిష్ కాలం నుంచి ఉండిపోనిచ్చారు. ఆదివాసుల జీవితంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సమస్యలకు దారితీస్తున్నదనీ, వారి పాటికి వారిని బతకనివ్వడం మేలనీ ఒక ఆలోచనా రీతి పురామానవ శాస్త్రవేత్తల ప్రభావంవల్ల ఉండింది. దానిని ప్రయోగాత్మకంగా అమలుచేసిన ప్రాంతం అబుజ్‌మఢ్. 1930లలో గ్రిగ్‌సన్ అనే బ్రిటిష్ అధికారి ప్రోద్బలంతో తీసుకున్న ఈ నిర్ణయం అదే స్ఫూర్తితో స్వాతంత్ర్యానంతరం కూడా అమలయింది.


దంతెవాడ అటువంటిది కాదు. అందువల్ల అక్కడ 'విముక్త ప్రాంతం' ఏర్పాటు చేయాలన్న మావోయిస్టుల ప్రయత్నం ప్రభుత్వం వైపు నుంచి ప్రతిఘటన లేకుండా సాగలేదు. బస్తర్ పాత మధ్యప్రదేశ్‌లో ఒక మారుమూల జిల్లా. అక్కడ అన్ని ప్రభుత్వ శాఖలలాగ పోలీసు శాఖ కూడా చురుకుగా పనిచేసి ఎరుగదు. చాలాకాలం పాటు అప్పటి పీపుల్స్‌వార్ పెత్తనం అప్రతిహతంగానే సాగింది. 1998లో బస్తర్ జిల్లాను మూడుగా విభజించడం (బస్తర్, కాంకేర్, దంతెవాడ జిల్లాలుగా), 2001లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడడం పరిస్థితిని



క్రమంగా మార్చాయి. 2003 నుంచి కేంద్ర పారామిలటరీ బలగాలు దంతెవాడలో చెప్పుకోదగ్గ పరిమాణంలో మోహరించబడ్డాయి.

అంతకు ముందు పెద్దగా ప్రాణాలు తీయవలసిన అవసరం మావోయిస్టులకు రాలేదు. (1991లో, 1998లో జనజాగరణ్ అభియాన్‌ను ఎదుర్కొనడానికి ప్రయోగించిన హింసను మినహాయిస్తే – ఈ వివరాలు తరువాత చూద్దాం). కుంట తాలూకాలో మావోయిస్టులకు చాలా బలం ఉన్న జగర్‌గొండ ప్రాంతంలో చాలాకాలంగా పని చేస్తున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి, 'సల్వాజుడుం గొడవ ప్రారంభం కాకముందు 12 సంవత్సరాలలో వాళ్ళు ఒక 15 మందిని చంపి ఉంటారు మా ఏరియాలో' అంటాడు. కుంట మాజీ ఎంఎల్ఏ, సిపిఐ నాయకుడు మనీష్ కుంజం '2004 దాకా ఎప్పుడైనా ఒకరిని చంపేవారు. రెండేళ్ళుగా చంపడం పెరిగింది. నిరుడు 13 లేక 14 మందిని చంపారు' అంటాడు. అతను సుక్మలో ఉంటాడు. ఒక్క దంతెవాడనే కాక మొత్తం ఛత్తీస్‌గఢ్‌ను తీసుకుంటే 2000 – 2003 కాలంలో మావోయిస్టులు 97 మందిని చంపారని కాంగ్రెస్ పార్టీ ప్రచురించిన నివేదిక అనింది.

ప్రభుత్వ బలగాల నుంచి, వాటి వత్తాసు ఉన్న సామాజిక వర్గాల నుంచి మావోయిస్టుల గెరిల్లా వ్యూహానికి ప్రతిఘటన పెరిగేసరికి మావోయిస్టుల హింస కూడా పెరిగింది. దోపిడీకి, జులుంకు పాల్పడే వాళ్ళ మీద చేసే హింసలాగ ఈ హింస అందరికీ న్యాయమైనదిగా కనిపించదు. ప్రత్యేకించి, 'ఇన్‌ఫార్మర్ల' హత్యలు ఎప్పుడూ అసంతృప్తిని లేవదీస్తాయి. ఒక ఉద్యమాన్ని గురించి సమాచారం ఆ ఉద్యమ సామాజిక పునాది నుంచే ప్రభుత్వం పొందగలదు. అంటే ఇన్‌ఫార్మర్లు ఆ సామాజిక పునాది నుండే ఎక్కువగా ఉండగలరు. అందుకు శిక్షగా వారిని చంపినప్పుడు వారిలో కోపం, నిరసన పెల్లుబుకగలవు. పెత్తందారీ వర్గానికి చెందిన వ్యక్తిని చంపినప్పుడు అతను నిజంగా దుర్మార్గుడని మీ దగ్గర ఆధారాలున్నాయా అన్న ప్రశ్న సాధారణ ప్రజల నుంచి రాదుగానీ ఒక ఆదివాసుడిని చంపినప్పుడు వస్తుంది. దంతెవాడలో మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల పేరిట చంపిన వారందరూ ఆదివాసులేనన్న సిపిఐ వారి అభియోగానికి జవాబు లేకపోవడం గమనార్హం. పైగా పోలీసు బలగాల మీద మావోయిస్టులు దాడికి పాల్పడినప్పుడల్లా పోలీసులు మావోయిస్టుల సానుభూతిపరుల గ్రామాలపైన దాడులు చేయడం వల్ల ఆ సానుభూతిపరులలో ఆ కారణంగా నిరసన పెరిగింది. 'మీ వల్ల మేము దెబ్బలు తినవలసి వస్తున్నది' అనే అభియోగం వినపడసాగిందని మావోయిస్టు ప్రచురణలే తెలుపుతాయి.



'విముక్త ప్రాంతం' అనే దానిలో ప్రభుత్వ పాలన మంచికైనా, చెడుకైనా సాగడానికి వీలు లేదు. ప్రభుత్వం పెన్షన్లు ఇస్తే తీసుకోవద్దన్నారనీ, భూములకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు చింపేసి తామే ఇస్తామన్నారనీ, ప్రభుత్వం వేసిన బోర్లు పీకేసి మేము వేసిన బోర్ల నీళ్ళే తాగాలన్నారనీ కూడా రహదారి క్యాంపులలో ఉన్న వారు చెప్పగా విన్నాము. అది ఎంత నిజమో తెలీదు. రెండు విషయాలు మాత్రం దంతెవాడ జిల్లా కలెక్టర్ స్వయంగా మాతో అన్నాడు. ప్రభుత్వం చేసిన పనులకు మావోయిస్టులు అడ్డుపడిన మాట వాస్తవమే గానీ ప్రభుత్వం నిజానికి చేసింది చాలా తక్కువ. చాలా చేసేస్తుంటే అడ్డు పడ్డారనుకుంటే అది అవాస్తవం. (ప్రభుత్వం చేసింది కొంచెమే కాబట్టి ఆ కొంచాన్ని అడ్డుకుంటే తప్పేం లేదని సమర్థించడం మా ఉద్దేశం కాదు. జిల్లా కలెక్టర్ చెప్పిన ఒక వాస్తవాన్ని తెలియజేస్తున్నామంతే). రెండవది, విద్యా వైద్య శాఖల కార్యకలాపాలకు మావోయిస్టులెప్పుడూ అడ్డుపడలేదు. ఈ మాట ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా అన్నారు. అయితే విద్యా వైద్య శాఖలు బాగా పనిచేయాలనీ, డాక్టర్లూ టీచర్లూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని కూడా వాళ్ళెప్పుడూ ఒత్తిడి పెట్టలేదనీ, ఒత్తిడి పెట్టి ఉంటే భయానికో భక్తికో అది జరిగేదనీ కుంటకు చెందిన ఒక విలేకరి అంటాడు.

ప్రభుత్వ అభివృద్ధి పనులకు అడ్డుపడినప్పటికీ మావోయిస్టులు స్వంతంగా ప్రజలను సమీకరించి అభివృద్ధి పనులు చేయించారని మావోయిస్టు సాహిత్యంలోనేకాక పత్రికల రిపోర్టులలో కూడా చదివే ఉంటారు. ఇది అబుజ్‌మఢ్‌లో ఎక్కువగా జరిగినా దంతెవాడలోనూ కొంత జరిగింది. మావోయిస్టులు రోడ్లు ఎక్కడా వేయించి ఉండే అవకాశం లేదు. ఎందుకంటే రోడ్లు ఎవరు వేసినా వాటిని పోలీసులు వాడుకోగలరు. కానీ చెరువులు తవ్వించారు. ధాన్యం నిలువ చేయించారు. అయితే చెరువుల తవ్వకానికి సంబంధించి ఒక వ్యాఖ్య కుంట శిబిరంలోనూ, సుక్మలో సిపిఐ నాయకుని ఇంట్లోనూ విన్నాం. "అదే చెరువు ప్రభుత్వం తవ్వించి ఉంటే మాకు తవ్వినందుకు కూలి దొరికేది. మావోయిస్టులు చేయించడం వల్ల శ్రమదానం చేయవలసి వచ్చింది. అప్పుడైనా, ఇప్పుడైనా అవే నీళ్లు వాడుకునే వాళ్ళం" అన్నది ఈ అభిప్రాయం. ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం వల్ల ఆగిపోయిన చెరువుల తవ్వకాన్ని శ్రమదానంతో చేయిస్తే ఈ మాటలు అనే అవకాశం ఉండేది కాదు గానీ ప్రభుత్వ పనులేవీ జరగడానికి వీలు లేదని ఆపేసి అవే పనులు శ్రమదానం రూపంలో చేయిస్తే ఈ మాట అనే అవకాశం ఉంటుంది.




'మేమే చేయించే వాళ్ళం, వాళ్ళు అడ్డుపడకుంటే' అని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇప్పుడు అంటున్నది గానీ మావోయిస్టులే లేకుంటే ఏ చెరువుల నిర్మాణమూ జరిగేది కాదని వాదించవచ్చు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ వ్యవహార శైలి అదే అభిప్రాయం కలిగిస్తుంది. అయితే అందరూ ఈ అభిప్రాయంతో ఏకీభవించి తీరాలని లేదు. కొద్దిగా భూములున్న రైతుల నుంచి కూడా ధాన్యాన్ని నిర్బంధంగా సేకరించి గోదాములో దాచడం సామాజికంగా ఉపయోగకరమైన చర్యేగానీ, 'పనులు చేసుకొని బతకలేని మావోయిస్టుల అనుయాయులు, వారి దళ సభ్యులు తినడానికి మా నుంచి బలవంతంగా వసూలు చేసేవారు' అన్నది మేము విన్న వ్యాఖ్య. ఈ వ్యాఖ్య చేసే వారు పెద్ద భూస్వాములైతే పట్టించుకోనక్కరలేదు. కానీ సాధారణ రైతుల నుంచి వచ్చినప్పుడు పట్టించుకోకుండా ఉండలేము.

వ్యవసాయంలో ఫలసాయం తక్కువ ఉన్న ప్రాంతంలో పనులు కల్పించే ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఆకర్షణీయంగా ఉంటాయి. ఆ పథకాలకు ఏ కారణంగా అడ్డం పడినా – పక్కా నిర్మాణాలు, రోడ్లు, పోలీసు పారామిలటరీలకు ఉపయోగపడతాయని, పెట్టుబడిదార్లకు అడవి సంపదను దోచుకోవడానికి ఉపయోగపడతాయని అడ్డం పడినా – ప్రజలలో నిరసన తలెత్తుతుంది. ఈ నిరసన చాలామంది దగ్గర విన్నాం. 'ఏ అభివృద్ధి? ఎవరి అభివృద్ధి?' అనే ప్రశ్నలతో దీనిని కొట్టేయడం తగదు.

సామాజికంగా నష్టకరమైన ఆచారాలనూ, నమ్మకాలనూ బలప్రయోగంతో అరికట్టే ప్రయత్నం వెంటనే ఫలితాన్ని ఇయ్యవచ్చును గానీ, అది ద్వేషపూరితమైన శత్రుగణాన్ని తయారుచేస్తుంది. అటువంటి వారు సల్వాజుడుం వంటి రౌడీగుంపుకు తగిన సభ్యులవుతారు.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం దంతెవాడ జిల్లాలో రహదార్ల పైన నెలకొల్పిన శిబిరాలు మావోయిస్టు బాధితులు ఆపత్కాలంలో తలదాచుకుంటున్న శిబిరాలన్నది నూటికి తొంభై పాళ్ళు అబద్ధమే అయినా అక్కడక్కడ నిజం.

అటువంటి ఒక శిబిరం బైరంగఢ్ బ్లాక్‌లోని నేలస్నార్‌లోనిది. ఇది ఇంద్రావతి నదికి ఈవల నుంది. ఆవల అబుజ్‌మఢ్‌లోని బెల్నార్ నుంచి పారిపోయి వచ్చిన కలార్ కులానికి చెందిన గిరిజనేతరులు ఇక్కడ ఉన్నారు. ఈ కులం తన కుల వృత్తిగానే సారాయి తయారు చేసి అమ్ముతుంది. సారాయి దుష్ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని కాబోలు అబుజ్‌మఢ్‌లో దాని తయారీనీ, అమ్మకాన్నీ మావోయిస్టులు నిషేధించినట్టున్నారు. వేరే జీవనాధారం లేని కలార్




కులస్తులు ఈ నిషేధాన్ని నిరసించినప్పటికీ ఏం చేయలేక పోయారు. 2005 జూన్ నెలలో సల్వాజుడుం ఏర్పడిన తరువాత బైరంగఢ్ నుంచి సల్వాజుడుం గుంపు ఇంద్రావతి నదిని దాటి అబుజ్‌మఢ్ ప్రాంతంలోని నదీ తీర గ్రామాలపైన దాడిచేసింది. వాటిలో బెల్నార్ ఒకటి. అక్కడి ప్రజలందరినీ బలవంతంగా నదికి ఈ పక్కకు తీసుకొచ్చి రహదార్లపైన ఉన్న శిబిరాలలో ఉంచాలని సల్వాజుడుం లక్ష్యం. అయితే అబుజ్‌మఢ్ విశాల ప్రాంతం కాబట్టి రాదలచుకోని వారు కొండలలోకి పారిపోయారు. కలార్ కులస్తులంతా సల్వాజుడుం మద్దతుదార్లుగా మారి ఇటు వచ్చేశారు. వారిప్పుడు నేలస్నార్ శిబిరంలో ఉన్నారు. వాళ్ళకు వెనక్కిపోయే ఉద్దేశం లేదు కాబట్టి ప్రభుత్వం ఊ అనగానే శిబిరం స్థానంలో చకచకా పక్కా ఇళ్ళు కట్టేసుకుంటున్నారు. 'ఇప్పుడైతే శిబిరం వాసులుగా ప్రభుత్వం మీకు ఇంత తిండి పెడుతున్నది. ఆ తరువాత ఏం చేసుకొని బతుకుతారు?' అని వాళ్ళను అడిగితే 'మాకు తెలిసింది ఈ పని ఒక్కటే. ప్రభుత్వం మాకిక్కడ ఇళ్ళు కట్టిస్తున్నది. ఇక్కడే ఇంద్రావతి మీద వంతెన కూడా కట్టాలి. మేము ఇక్కడ సారాయి వండి పగలు అవతలికి పోయి అమ్ముకొని రాత్రి వచ్చి ఇక్కడ పడుకుంటాము' అని చామ్రి అనే స్త్రీ అనింది. మామూలుగానైతే కేవలం సారాయి అమ్ముకోవడం కోసం ఇంద్రావతి వంటి లోతైన నది మీద ఏ ప్రభుత్వమూ వంతెన వేయదు. సారాయి అమ్ముకోండి లేకపోతే ఇంకేమైనా చేసుకొని బతకండి అని చెప్పి వారి అభ్యర్థనను ప్రభుత్వం కొట్టేస్తుంది. కానీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి మావోయిస్టుల మీద ఉన్న కచ్చ ఎట్లాంటిదంటే కేవలం అబుజ్‌మఢ్‌లో సారాయి అమ్మించడం కోసం ఇంద్రావతి మీద వంతెన నిర్మించినా నిర్మించగలదు! బహుశా చామ్రి కోరిక తీరుతుందేమో చూడాలి.

## గాయత్రీ పరివార్

ఉత్తర భారతదేశమంతటా సంఘ్‌పరివార్ ఆదివాసీ ప్రాంతాలలో తన ప్రాబల్యాన్ని బాగా పెంచుకుంది. దీని దుష్ప్రభావం 2002లో జరిగిన గుజరాత్ మారణకాండలో స్పష్టంగా కనిపించింది. ఆదివాసులు ఎక్కువగా నివసించే జిల్లాలలో ముస్లింలపైన జరిగిన దాడులలో వారు పెద్దసంఖ్యలో భాగస్వాములయ్యారు. సంఘ్‌పరివార్ నినాదాలనే ఇస్తూ పాల్గొన్నారు. ఇది ప్రజాతంత్ర వాదులందరినీ చాలా కలవరపెట్టిన పరిణామం.

ఈ పరిణామాన్ని ఛత్తీస్‌గఢ్‌లో – కనీసం దంతెవాడ జిల్లాలో – మావోయిస్టులు సమర్థంగా నిలువరించారని సిపిఐ వారు సైతం అభినందిస్తున్నారు. దానికి మావోయిస్టులు అనుసరించిన పద్ధతిని,






అబుజ్‌మఢ్ నుంచి పారిపోయి వచ్చిన వైనాన్ని వివరిస్తున్న చామ్రి. ప్రస్తుతం ఈమె నేలస్నార్ శిబిరంలో ఉంది.

దాని పర్యవసానాన్ని మేము సల్వాజుడుం శిబిరాలలో చూడగలిగాము. ఆదివాసులలో పునాది ఏర్పరచుకొనడానికి ఆర్.ఎస్.ఎస్ అన్ని చోట్లా ఒకే పద్ధతిని అనుసరిస్తోంది. అదేమిటంటే హిందూ దేవతలనూ, వారి పూజలనూ ఆదివాసుల ఆచారాలలో ప్రవేశపెట్టి అదే నిజమైన మతం అని బోధించడం. వారి సంస్కృతి నుంచి వారిని దూరం చేసిన తరువాత భజన మండలులలో ఈ ఉపఖండపు చరిత్రను గోల్వాల్కర్ ఆలోచనల నమూనాలో బోధించడం, తద్వారా తమ దృక్పథాన్ని ఆదివాసులలో చొప్పించడం.

దంతెవాడలో దీనికి గాయత్రీ పరివార్ అనే మత సంస్థను వాహనంగా ఎంచుకున్నారు. గాయత్రీ పరివార్‌లో చేరిన ఆదివాసుల చేత తాగుడు, మాంసాహారం మాన్పించి హిందూ దేవతల పూజలు వారికి అలవాటు చేశారు. అయితే మావోయిస్టులు గాయత్రీ పరివార్‌లో చేరిన వారిని బెదిరించి మాన్పించారు. బలవంతంగా మాంసం తినిపించారని కూడా విన్నాం. మా బృందం గీదం బ్లాక్‌లోని కసోలి శిబిరానికి వెళ్ళేటప్పటికి అక్కడ సల్వాజుడుం శిక్షణ కార్యక్రమం నడుస్తున్నది. అందులో ప్రభుత్వం స్పెషల్ పోలీసు అధికారులుగా (ఎస్.పి.ఓ) నియమించి ఆయుధాలు ఇచ్చిన సల్వాజుడుం కార్యకర్తలు తర్ఫీదు పొందుతున్నారు. వారిలో చాలామంది గాయత్రీ పరివార్ సభ్యులు. మావోయిస్టులు తనును 'నువ్వు గొండోడివి మాసం తినరా' అని బలవంతంగా తినిపించారని బంగపాల్‌కు చెందిన సోనురాం కోస్రా అన్నాడు. ఇతర గాయత్రీ పరివారీలు కూడా తమకు అటువంటి అనుభవమే కలిగిందని అన్నారు. వాళ్ళంతా ఇప్పుడు సల్వాజుడుంలో ఉన్నారు. స్పెషల్ పోలీసు ఆఫీసర్లుగా నియమించబడి తుపాకులు పట్టుకున్నారు.

గాయత్రీ పరివార్ మీద మావోయిస్టులు ప్రయోగించిన హింసే సల్వాజుడుం ఆరంభానికి కారణం అన్న అభిప్రాయం కుంట గ్రామ నివాసి అయిన సల్వాజుడుం నాయకుడు పరిమి విజయ్ నాయుడు నుంచి విన్నాం. "గాయత్రీ పరివార్‌లో చేరిన వారిని హింసించడమే కాదు కుట్రు దగ్గర






కసోలిలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్లకు శిక్షణ శిబిరం

ఒకరిని చంపారు. ఒకరిని కొట్టారు. విఘ్నేశ్వర పూజలను, దుర్గ పూజను ఆపారు. ఈ ఘర్షణ 10 సంవత్సరాలుగా సాగుతున్నది. దీని ఫలితంగా కుట్రు ప్రాంతంలో సల్వాజుడుం మొదలైంద"ని విజయ్ నాయుడు అంటాడు.

సల్వాజుడుం ఆవిర్భావానికి సంబంధించిన వివరణగా ఇది సత్యం కాకపోవచ్చు. దానికి మరింత భౌతికమైన కారణాలు ఉన్నాయనేది ఆ తరువాత చూద్దాం. అయితే గాయత్రీ పరివార్‌ను అరికట్టడానికి మావోయిస్టులు ఎంచుకున్న మార్గం వారికి చాలామంది బద్ధశత్రువులను తయారుచేసిన మాట మాత్రం వాస్తవం. వాళ్ళంతా సల్వాజుడుంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న మాట కూడా వాస్తవం.

ఆదివాసీ ప్రాంతాలలో సంఘ్‌పరివార్ వ్యాప్తి ప్రమాదకరం అని ఒక వైపు అంటూ, దానిని మావోయిస్టులు అరికట్టిన విషయం వారి రాజకీయ శత్రువులు కూడా ఒప్పుకుంటున్నారని అంటూ, ఆ కృషి నుంచి సల్వాజుడుంకు కార్యకర్తలు పుట్టుకొచ్చారని మావోయిస్టులనే మేము తప్పు పడుతున్నాం అని మమ్మల్ని విమర్శిస్తారేమో, మేము తప్పులూ ఒప్పులూ ఎంచడం లేదు. తమ రాజకీయ ప్రణాళికను ముందుకు తీసుకుపోయే క్రమంలో మావోయిస్టులు అనుసరించిన పోరాట పద్ధతులు, 'విముక్త ప్రాంత' స్థాపనకు అనుసరించిన పద్ధతులు స్థానిక సమాజంలో ఎన్ని రకాల నిరసనను, వ్యతిరేకతను, అసంతృప్తిని,






కోపాన్ని కలిగించాయో వివరించడం ఈ అధ్యాయంలో మేము చేపట్టిన వివరణ ఉద్దేశం. అదంతా న్యాయమైనదా, కాదా అనేది వేరే విషయం. కొంత న్యాయమే కావచ్చు, కొంత కాకపోవచ్చు. అయితే ఆ నిరసననూ, అసంతృప్తినీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమూ, స్వార్థపరశక్తులూ చాకచక్యంగా వాడుకొని దుర్మార్గమైన అజెండా గల ఒక ప్రైవేటు సైన్యాన్ని తయారుచేశారు. సల్వాజుడుం అజెండా దుర్మార్గమైనది, దానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇస్తున్న రాజ్యాంగేతర స్వేచ్ఛ దుర్మార్గమైనది అని గుర్తించడం ఎంత న్యాయమో, అందులోని వారంతా స్వార్థపరులైన గిరిజనేతరులు, ఫ్యూడల్ పెత్తనం చేస్తున్న తెగ పెద్దలు, పటేల్ పట్వారీలు, అవినీతిపరులైన రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు కాదని గుర్తించడం కూడా అంతే అవసరం. చర్య, ప్రతిచర్య కలిసి దంతెవాడలో అంతర్యుద్ధ పరిస్థితిని కల్పించాయని గుర్తించడం అవసరం. ప్రజలకు స్వేచ్ఛ ఇస్తే ప్రభుత్వ పక్షం కంటే మావోయిస్టుల పక్షానే ఎక్కువ మంది ఉంటారనేది వాస్తవమే కావచ్చు. ఇంతటి దమనకాండ మధ్యన కూడా, మావోయిస్టులు సల్వాజుడుం క్యాంపులపైన చేస్తున్న దాడులలో ఆదివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న విషయం చూస్తున్నాం. అయితే వీరి పక్షమూ వారి పక్షమూ కాక ఎటూ ఉండని వారూ చాలామందే ఉన్నారు. వాళ్ళు కూడా చాలా నష్టపోతున్నారు. మావోయిస్టుల పక్షాన లేనివారు, ప్రభుత్వ పక్షానికి సహకరించడానికి సిద్ధంగా ఉన్న వారు మొత్తంగా స్వార్థపర సామాజిక శక్తులనే వివరణేదైతే మావోయిస్టు ప్రచురణలిస్తున్నాయో అది ఏకపక్షమైన వివరణ అని గుర్తించడం అవసరం.

# జనజాగరణ్ అభియాన్, సల్వాజుడుం

నక్సలైట్లను ఎదుర్కోవడానికి పోలీసుల చట్టబాహ్యమైన బలప్రయోగం తగిన మార్గమన్న వ్యూహానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కాగా, జనాన్ని పోగుచేసి ఎదురుదాడి చేయించడం తగిన పద్ధతి అన్న ఆలోచనకు ఛత్తీస్‌గఢ్ వేదిక. ఇక్కడ గ్రేహౌండ్స్ రూపంలో, అక్కడ సల్వాజుడుం రూపంలో ఈ రెండు వ్యూహాలూ తమ యోగ్యతను రుజువు చేసుకున్నాయని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలూ, కేంద్ర ప్రభుత్వమూ కూడా భావిస్తున్నాయి.

మావోయిస్టు రాజకీయాల మంచి చెడులు తర్కించే పని మేము పెట్టుకోవడం లేదు. ఏ రాజకీయం సరైనది, ఏ ఆర్థిక వ్యవస్థ మంచిది అని నిర్ణయించుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. వాళ్ళు నిర్భయంగా ఆ నిర్ణయం తీసుకోగలగాలి. ప్రజలందరూ ఒకే నిర్ణయానికి రారు కాబట్టి ఏ నిర్ణయానిది పైచేయి అవుతుందనేది ప్రజాస్వామికంగా నిర్ణయం కావాలి. మావోయిస్టులను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యూహాలూ, వాటికి మావోయిస్టులు ఎంచుకుంటున్న ప్రతివ్యూహాలూ ప్రజలకు ఉండవలసిన ఈ స్వేచ్ఛను గౌరవిస్తున్నాయా? ఈ ఘర్షణలో ప్రజల జీవనము, ఆస్తిపాస్తులు, రాజకీయ స్వేచ్ఛ, సామాజిక జీవితంలో ప్రజాస్వామ్య సంస్కృతి, చట్టబద్ధ పాలన మొదలైన విలువలు ఏ మేరకు దెబ్బతింటున్నాయి? మరీ ముఖ్యంగా, అట్టడుగు వర్గాల ప్రజానీకం స్థితిగతులు ఏమిటి? ఇవీ మేము వేసుకుంటున్న ప్రశ్నలు. దేశ రక్షణ కోసం, రాజ్యాంగ భద్రత కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం కష్టాలను ఓర్చుకోవాలి, అది అనివార్యం అని వీరైనా వారైనా అంటే సులభంగా అంగీకరించడానికి వీలులేదని మా అభిప్రాయం. ఇది ఇద్దరినీ ఒకే గాటన కట్టడం అనుకోనక్కరలేదు. మానవ హక్కుల కోణం నుంచి ఎవరికి ఏ విలువ ఇవ్వాలో అది ఇస్తాం. ఎవరి మీద ఏ విమర్శ పెట్టాలో అది పెడతాం. కానీ అంతిమ ప్రమాణం ప్రజలు, అందులో అట్టడుగు వర్గాల ప్రజలు, వారి






బతుకులు, ఆకాంక్షలు. ఏదో కారణం చూపి వీటిని విధ్వంసానికి గురిచేసే ఆచరణను, ఆలోచనలను లోతుగా పరీక్షించకుండా ఆమోదించడానికి వీలు లేదు.

జనజాగరణ్ అభియాన్ పేరిట బస్తర్ అడవులలో నక్సలైట్ వ్యతిరేక వీరంగం ఇప్పటికి మూడుసార్లు జరిగింది. మొదటిసారి 1989-91లో, రెండవసారి 1998లో, మూడవసారి 2005లో మొదలై ఇప్పటికీ కొనసాగుతున్నది. దీనికి 'సల్వాజుడుం' అన్న గోండుభాష పేరు పెట్టారు గానీ గతంలో జరిగిన అభియాన్‌లకూ, దీనికీ పరిమాణంలో తప్ప గుణంలో తేడా లేదు. నక్సలైట్ వ్యతిరేకులు గుంపు కావడం, గ్రామాల మీద దాడిచేసి అందరినీ బలవంతంగా గుంపులో కలుపుకోవడం, కలవని వాళ్ళను క్రూరంగా దండించడం, ఈ విధంగా పెరిగిన గుంపును తీసుకొని మావోయిస్టు సానుభూతిపరుల గ్రామాలపైన దాడులు చేయడం, వాళ్ళను కొట్టడం, గుంజుకొచ్చి పోలీసు స్టేషన్‌లో అప్పగించడం, బహిరంగ వేదికలలో తమ 'తప్పు' ఒప్పించడం, ఈ తంతు కోసం అదే పనిగా వేదికలు ఏర్పాటుచేసి ద్వేషపూరితమైన ఉపన్యాసాలు ఇవ్వడం, మీటింగ్ నుంచి పోతూ పోతూ ఇళ్ళు తగలబెట్టుకుంటూ పోవడం, పోలీసులు దీనినంతా మురిపెంగా చూస్తూ ఉండడం - ఇదీ ప్రజాచైతన్య ఉద్యమం (జనజాగరణ్ అభియాన్) అంటే.

మూడు దఫాలూ ఈ దమనకాండలో ముఖ్యపాత్ర వహించిన వ్యక్తి మహేంద్ర కర్మ. అతనిది దంతెవాడ సమీపంలోని ఫరస్పాల్ గ్రామం. గొత్తికోయ. అతని అసలు పేరు మడకం మాసడు అని చింతూరులోని కోయ తెగ పెద్దలు చెప్పగా విన్నాం. అతను మహేంద్రకర్మ ఎప్పుడయ్యాడో తెలీదు. తొలుత అతను సిపిఐ కార్యకర్త. 1978లో కుంట ఎంఎల్ఏగా ఎన్నికయ్యాడు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలోకి పోయాడు. అవినీతిపరుడు, అహంభావి. తన అవసరాలు తీర్చుకోవడానికి ఎంతటి క్రూరత్వానికైనా పాల్పడగలడు. 1981లో సిపిఐ అతనికి అసెంబ్లీ టికెట్ ఇవ్వనందుకు అతనే ఆ పార్టీ నుంచి బయటికి పోయాడని కొందరు అంటారు. అయితే తామే అతనిని తొలగించామని సిపిఐ నాయకులు అంటారు. సిపిఐ నుంచి అతనిని తొలగించడానికి కారణం, 'బస్తర్‌ను మరొక అస్సాం చేస్తాను' అన్న నినాదం ఇవ్వడమని ఆ పార్టీవారు అంటారు. అంటే ఒక ప్రత్యేక ఆదివాసీ రాష్ట్రం (లేక రాజ్యం?) డిమాండ్ చేశాడని అర్థం అవుతున్నది. ఆనాడు ఆ డిమాండ్ నిజాయితీగా పెట్టాడో లేక తన రాజకీయ ఎదుగుదలకు పనికొస్తుందని ముందుకు తెచ్చాడో తెలీదుగానీ ఇప్పుడతని ఆలోచనలలో ఆ ఛాయలేవీ లేవు. మావోయిస్టుల పట్ల గుడ్డి ద్వేషం




అతని రాజకీయాల ప్రధాన లక్షణం. అభివృద్ధి పేరిట బస్తర్ అడవులలోకి బడా కంపెనీలు రావడాన్ని అతను సమర్థిస్తాడు. అతను సల్వాజుడుం అగ్ర నాయకుడే గానీ అదులోని రెండవ శ్రేణి నాయకులు, ఎప్పుడూ అతని చుట్టూ ఉండేవారు... అంతా గిరిజనేతరులే.

అడవుల రక్షణ కోసం అలనాటి మధ్యప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఒక చట్టం ప్రకారం స్వంత భూమిలో చెట్లు కొట్టాలన్నా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. మహేంద్రకర్మ, మరికొందరు పెద్ద మనుషులు కలిసి పేద ఆదివాసుల భూములు తమవైనట్టు బూటకపు పత్రాలు పుట్టించి చెట్లు కొట్టడానికి అనుమతి పొంది తమది కాని భూమిలోని చెట్లను పెద్దఎత్తున కొట్టి అమ్ముకొని దండిగా లాభం పొందారు. 56 గ్రామాలలో 1992 నుంచి 1996 దాకా సాగిన ఈ పట్టపగటి దోపిడీలో కర్మ ఎన్ని లక్షలు వెనకేసుకున్నాడో తెలీదు. దీనిని 'మాలిక్ మక్బుజా కుంభకోణం' అంటారు.

1989–91 నాటి జనజాగరణ్ అభియాన్ ఆరంభం గురించి భిన్న కథనాలు విన్నాం. దానిని అప్పటి బిజెపి ప్రభుత్వం ప్రారంభించి అన్ని ప్రతిపక్ష పార్టీలనూ ఆహ్వానించగా, సిపిఐతో సహా అన్ని పార్టీలూ పాల్గొన్నాయని దంతెవాడకు చెందిన ఒక సీనియర్ విలేకరి అన్నారు. 'ముఖ్యమంత్రి సుందర్‌లాల్ పట్వా దానిని ప్రారంభించి అందరినీ కలిసి రమ్మన్నాడు' అంటాడు. అయితే దానిని తామే ప్రారంభించామని సిపిఐ వారంటారు. పాత బస్తర్ జిల్లాలో సిపిఐకి కొంత బలం ఉండేది. సిపిఐ నాయకుడిగా ఉండగా మహేంద్రకర్మ 1978లోనూ, ఆ తరువాత మనీష్ కుంజం 1981లోనూ కుంట ఎంఎల్‌ఏలుగా ఎన్నికయ్యారు. మొదట్లో సిపిఐని దెబ్బతీసే ఉద్దేశంతో మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు నక్సలైట్లను ప్రోత్సహించాయి అనేది మావోయిస్టుల పట్ల చాలా అభిమానం ఉన్న పరిశీలకుల వ్యాఖ్య. ఆ ప్రోత్సాహాన్ని నక్సలైట్లు తెలిసి స్వీకరించారో లేదో గానీ కాంగ్రెస్ పార్టీ ఆ విధంగా ఆలోచించడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు.

నక్సలైట్లను ఎదుర్కొనడానికి ప్రజా సమీకరణే మార్గమని సిపిఐ భావించినట్టుంది. వాళ్ళు దానిని హింసాత్మకమైన ఎదురుదాడిగా అర్థం చేసుకోలేదు. ప్రజలను సమీకరించి రాజకీయంగా ప్రతిఘటించే ప్రక్రియగా అర్థం చేసుకున్నారు. ఇన్‌ఫార్మర్ల పేరిట మావోయిస్టులు చంపుతున్న వారంతా ఆదివాసులేనన్న ప్రశ్న ప్రధానంగా లేవదీశామని మనీష్ కుంజం అంటారు. కానీ త్వరలోనే ఆ జనజాగరణ్ అభియాన్‌లో అన్ని పార్టీలూ






చేరాయి. మహేంద్రకర్మ ప్రముఖపాత్ర నిర్వహించాడు. అది పైన వివరించిన పద్ధతిలో హింసాత్మకమైన ఎదురుదాడి రూపం తీసుకుంది. అది జరుగుతున్నప్పుడు సిపిఐ వారు ఏం చేశారో తెలీదుగానీ, తదుపరి మాత్రం మహేంద్రకర్మ వంటి వారితో చేతులు కలపడం తప్పయింది అని తీర్మానించారు. త్వరలోనే ఈ జనజాగరణ్ అభియాన్ పైన మావోయిస్టులు ఎదురుదాడి మొదలుపెట్టారు. సిపిఐకి చెందిన వారిని '14 లేక 15 మందిని హతమార్చారు' అని మనీష్ కుంజం చెప్పారు.

ఈ ఎదురుదాడి ఫలితంగా మొదటి జనజాగరణ్ అభియాన్ సమసిపోయింది. రెండవది 1998లో మొదలైంది. ఇది పూర్తిగా మహేంద్రకర్మ 'కృషే'. అతని స్వగ్రామమైన ఫరస్పాల్ ప్రాంతంలో మొదలై మావోయిస్టుల ఎదురుదాడికి తట్టుకోలేక త్వరలోనే అణగారిపోయిందని అంటారుగానీ కేవలం ఆ ప్రాంతానికే పరిమితం అయినట్టు లేదు. బిజాపూర్ సమీపంలోని గంగలూర్‌లో 180 మంది 'సంఘం' సభ్యులను బలవంతంగా 'సరెండర్' చేయించారని ఒక మావోయిస్టు ప్రచురణ తెలుపుతుంది. మొత్తానికి ఈ 'అభియాన్' కూడా మావోయిస్టుల ఎదురుదాడి వల్ల ఆగిపోయింది.

మూడవ అభియాన్ 2005 వేసవిలో మొదలై ఇప్పటికీ కొనసాగుతున్నది. గత 'అభియాన్'లకు ఆ రాష్ట్ర ప్రభుత్వం (అప్పటికి ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్‌లో ఉంది) మద్దతు, పాలక పార్టీల భాగస్వామ్యం మాత్రమే ఉంది. కాని ఛత్తీస్‌గఢ్ ఏర్పడిన తరువాత ప్రారంభమైన ఈ అభియాన్‌కు కేవలం ప్రభుత్వం మద్దతు ఉండడమే కాదు అది అధికారిక పాలసీలో భాగం అయింది. ప్రభుత్వ కార్యక్రమం అయింది. రాష్ట్రం పెద్దదిగా ఉన్నప్పుడు బస్తర్ ఒక మారుమూల ప్రాంతం, మావోయిజం ఒక మారుమూల 'సమస్య', చిన్న రాష్ట్రంలో అదే పెద్ద ప్రాంతం, పెద్ద సమస్య. పైగా అంతకు కొద్దినెలల ముందే (2004 సెప్టెంబర్‌లో) పీపుల్స్‌వార్ పార్టీ ఎంసిసితో కలిసి ఒకే పెద్ద పార్టీ రూపం తీసుకోవడంతో, అప్పటిదాకా నక్సలిజం అయా రాష్ట్రాల తలనొప్పి అని వ్యాఖ్యానించిన భారత సర్కార్ తన అభిప్రాయం మార్చుకొని దానిని దేశ 'సమస్య'గా గుర్తించింది. దేశ ఆంతరంగిక భద్రతకు మావోయిజమే ప్రధాన శత్రువు అన్న అర్థరహితమైన అభిప్రాయాన్ని సైతం ప్రధాన మంత్రే స్వయంగా ప్రకటించాడు.

2005 వేసవిలో మూడవ జనజాగరణ్ అభియాన్ ఏ విధంగా ప్రారంభమైందన్న విషయంలో భిన్న కథనాలున్నాయి. ఒక కథనాన్ని




పైన ఉదహరించాము. కుంటకు చెందిన సల్వాజుడుం నాయకుడు పరిమి విజయ్ నాయుడు ప్రకారం గాయత్రీ పరివార్ కార్యకలాపాలను మావోయిస్టులు అడ్డుకోవడం కుట్రు ప్రాంతంలో తిరుగుబాటుకు దారితీసింది. అదే సల్వాజుడుంకు నాంది. ఇది వాస్తవం కాదు గానీ విజయ నాయుడు చేసిన ఈ ఊహ ఒక వాస్తవాన్ని ప్రతిఫలిస్తుంది. అది సల్వాజుడుంను ఆవరించిన సంఘ్‌పరివార్ దృక్కోణం. మహేంద్ర కర్మతో సహా సల్వాజుడుం నాయకులెవ్వరూ ఆర్.ఎస్.ఎస్‌కార్యకర్తలు కాకపోవచ్చు. కానీ మహేంద్రకర్మతో సహా అందరి ఆలోచనారీతి పైనా సంఘ్‌పరివార్ ముద్ర కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. విజయ్ నాయుడు పెదనాయన అయిన పరిమి గోపాలరావు పాతతరం సిపిఐ నాయకుడు. అతనిని మావోయిస్టులు చంపారు. 'కేవలం రాజకీయ విభేదాలు తప్ప అతనిని చంపడానికి వేరే కారణం ఏదీ లేదు' అని విజయ్ నాయుడు నిరసనగా అంటాడు. అయితే అతని మాటలలో వ్యక్తమయ్యే ఆలోచనా రీతిలో సిపిఐ భావాలు అసలు లేవు. సంఘ్‌పరివార్ భావాల ఛాయలు మాత్రం దండిగా ఉన్నాయి. ఇది అతనొక్కడికే కాదు, సల్వాజుడుంలోని పెద్ద నాయకులందరికీ వర్తిస్తుంది.

సాధారణ సల్వాజుడుం కార్యకర్తల సంగతి వేరే. వారంతా ఆదివాసులే. వారికి రాజకీయ మేల్కొలుపు (నిజమైన అర్థంలో జనజాగరణ్) కలిగించింది మావోయిస్టులే. వారు మావోయిస్టులకు వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు కూడా న్యాయం అన్యాయం దోపిడీ దమనకాండ వంటి పరిభాష తరచుగా వాడతారు. మావోయిస్టుల గురించి మాట్లాడేటప్పుడు వారి గొంతులో వారి నాయకుల గొంతులో ధ్వనించే ద్వేషం ఉండదు. కుంట శిబిరవాసులను పక్కన కూర్చోబెట్టుకొని సల్వాజుడుం నాయకులు ద్వేషం కక్కుతుండగా వంజం రంగ అనే సున్నంగుడ నివాసి అయిన ఆదివాసీ "ఆళ్ళు తునికాకు రేటు పెంచారు. వ్యాపారస్తుల దౌర్జన్యాలు అరికట్టారు" అని మెచ్చుకోలుగా అన్నాడు. అదే సమయంలో "ఊరికే ఊళ్ళోకి వచ్చి ఇదితే, అదితే అంటారు. అడిగింది ఇయ్యకపోతే కొడతారు. కొంచెం గట్టిగా ఉన్న కుర్రవాళ్ళు బయట తిరిగితే పోలీసులతో చేరావు అంటారు" అని నిరసన వ్యక్తం చేశాడు. అతను సల్వాజుడుంలో చేరి దాడులలో పాల్గొంటున్నాడు. అయినప్పటికీ భావజాలపరంగా అతను మావోయిజాన్ని ద్వేషించడం లేదు. ఒక రకంగా ఇప్పటికీ వాళ్ళు నేర్పిన రాజకీయ పరిభాషే మాట్లాడుతున్నాడు.

మూడవ జనజాగరణ్ అభియాన్ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితుల గురించి చాలామంది ఒకే చిత్రం ఇస్తారు. ఆ సంవత్సరం






దంతెవాడలో వర్షాభావ పరిస్థితి ఉండడంవల్ల వేసవిలో మామూలుగా ఉండే దానికంటే కూడా తీవ్రమైన పనుల లేమి, ఆదాయం కొరత, తిండిలేమి ఉండింది. తునికాకు విషయంలో ప్రభుత్వ విధానానికి నిరసనగా మావోయిస్టులు సమ్మె పిలుపు ఇవ్వడంవల్ల వేసవిలో తప్పనిసరిగా వచ్చే ఆ ఆదాయం లేకుండా పోయింది. కరువు పనులుగా ప్రభుత్వం చేపట్టే పనులను మావోయిస్టులు అటకాయిస్తారు కాబట్టి ప్రభుత్వం వాటిని కూడా చేపట్టలేదు. ఈ పరిస్థితికి నిరసనగా బిజాపూర్ ప్రాంతంలో కుట్రు గ్రామంతో మొదలుపెట్టి తాడిమెండ్రి, మట్వాడ, కార్కేలి, ఉసికపట్నం మొదలైన గ్రామాలలో ప్రజలు తమంతట తాము కూర్చుని మాట్లాడుకోసాగారన్నది ఈ కథనం. అయితే ఈ సమావేశాలకు మరొక కారణం ఉందన్న అభిప్రాయమూ ఉంది. 2005 మే నెల 24 వ తేదీన మావోయిస్టులు కర్రెమర్క గ్రామం వద్ద మందుపాతర పేల్చి అయిదుగురు సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని హతమార్చారు. వెంటనే పోలీసులు కార్కేలి గ్రామస్తులందరినీ అరెస్టు చేసి రిమాండు చేయించారు. అంబేలి, ఉసికపట్నం, తాడిమెండ్రి తదితర గ్రామాల వారిని కూడా పోలీసులు అనుమానించి సతాయించారు. దీనితో కోపగించిన గ్రామస్తులు సమావేశాలు జరుపుకొని తమ సమస్యల గురించి మాట్లాడుకున్నారు.

ఈ విధంగా సమావేశమైన ప్రజలు మావోయిస్టు బాధ్యులను ఆయుధాలు లేకుండా రమ్మని పిలిచారనీ, ఆ విధంగా వచ్చిన మావోయిస్టులను పోలీసులకు అప్పగించారనీ, అలా మొదలైన ప్రజాప్రతిఘటన గ్రామ గ్రామానికి పాకి సల్వాజుడుం ఆవిర్భవించిందనేది అధికారికంగా ప్రచారమైన కథనం. ఇది ఇంత స్వచ్ఛందంగా జరగలేదనీ, ప్రజలలో పైకారణాల వల్ల ఉన్న అసంతృప్తిని, వారు సమావేశాలు జరుపుకుంటున్న విషయాన్నీ గమనించి మహేంద్రకర్మ రంగంలోకి దిగి, తన మనుషులనూ దించి మావోయిస్టు పార్టీ ప్రతినిధులను పిలిపించడం, పోలీసులకు అప్పగించడం, ఆ తరువాత గతంలో నిర్వహించిన పద్ధతిలోనే జనజాగరణ్ అభియాన్‌ను ప్రారంభించడం జరిగిందని ఈ పరిణామాలను నిష్పాక్షికంగా చూస్తున్నవారు అంటారు.

త్వరలోనే పెద్దఎత్తున ఘర్షణ ప్రజ్వరిల్లింది. ఇదంతా స్వచ్ఛందంగా జరగలేదనడానికి ఒకానొక నిదర్శనం ఏమిటంటే వెనువెంటనే దేశ వ్యాపితంగా పూర్తిగా ఏకపక్షమైన వార్తలు ప్రచురితం కావడం. మావోయిస్టుల చర్యల పట్ల ఆదివాసులలో తీవ్ర నిరసన నెలకొన్నదనీ, ఆదివాసులు



వారిని ప్రతిఘటిస్తున్నారనీ, మావోయిస్టులు అసహనంతో వారిపై హింస ప్రయోగిస్తున్నారనీ వార్తలు రాసాగాయి. దంతెవాడ సంగతి పక్కన పెట్టండి, జగ్దల్‌పూర్‌లో గానీ, రాయపూర్‌లో గానీ బ్యూరోలు లేని తెలుగు దినపత్రికలు సైతం అదే ధ్వనితో పెద్ద పెద్ద వార్తా కథనాలు ప్రచురించాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, ప్రత్యేకించి దంతెవాడ జిల్లా పోలీసు యంత్రాంగం దీని వెనక ఉన్నాయనడంలో సందేహం లేదు. నిజాలు రాయించేటట్టయితే వార్తలు రాయించిన వారెవరైనా ఒకటే గానీ ఈ వార్తలు చాలా ఏకపక్షమైనవి.

ఒక వార్త చాలామందిని కలవరపెట్టింది. దంతెవాడ జిల్లాలోని బిజాపూర్ పోలీసు జిల్లాలో ఉన్న కొత్రాపాల్ అనే గ్రామంలో 2005 జూన్ 18 నాడు తమకు వ్యతిరేకంగా సభ జరుపుకుంటున్న ఆదివాసులపైన మావోయిస్టులు దాడి జరిపి 13 మందిని అపహరించి తీసుకుపోయి హతమార్చారన్నది ఆ వార్త. చాలా ఆందోళనకరమైన ఈ వార్త చదివి మానవహక్కుల వేదిక దేశంలోని అన్ని చురుకైన హక్కుల సంఘాలకు ఒక లేఖ రాయడం జరిగింది. (దాని అనువాదాన్ని అనుబంధం-I లో చూడండి). ఒక ఉమ్మడి నిజనిర్ధారణ కమిటీగా పోయి వద్దామని ప్రతిపాదించాము కూడా. మన రాష్ట్రానికి చెందిన ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒ.పి.డి.ఆర్) మాత్రమే స్పందించగా మా రెండు సంస్థలూ కలిసి 2005 జూలై నెల మూడవ వారంలో దంతెవాడకు వెళ్ళాము. మన రాష్ట్రంనుంచి దంతెవాడలోని బిజాపూర్ ప్రాంతానికి పోవడానికి దాటవలసిన రెండు నదుల మీదా (ప్రాణహిత, ఇంద్రావతి) వంతెనల నిర్మాణం అనాదిగా హామీగానే ఉండిపోవడం వల్ల ప్రయాణం చాలా కష్టమై, రెండు రోజులు మాత్రమే అక్కడ గడపగలిగాము. జూలై 16-17 తేదీలలో బిజాపూర్, భూపాలపట్నం, కుట్రు, జాంగ్లా గ్రామాలకు వెళ్ళాము.

కొత్రాపాల్‌కు వెళ్లడానికి బిజాపూర్‌లోని టాక్సీలేవీ ఒప్పుకోకపోవడం వల్ల మావోయిస్టులకు ఒక ప్రధాన కేంద్రంగా ఉండి, సల్వాజుడుంను అత్యధికంగా ప్రతిఘటించి, అత్యధికంగా నష్టపోయిన ఆ గ్రామానికి పోలేక పోయాము. టాక్సీలు రావడానికి నిరాకరించడానికి కారణం, ఆ ఊరిలో ఎప్పుడైనా పోలీసులు లేక పారామిలటరీకీ నక్సలైట్లకూ మధ్య ఎదురుకాల్పులు జరగవచ్చును కాబట్టి అక్కడికి పోవడం శ్రేయస్కరం కాదని. పోలీసు స్టేషన్, లేక క్యాంపు ఉన్న ఊరైతే అక్కడికి మావోయిస్టులు రారు, కాల్పులు జరగవు కాబట్టి అటువంటి ఊర్లకే టాక్సీలు వస్తాయి. ఆ కారణంగా కొత్రాపాల్‌కు పోలేకపోయాము






గానీ సల్వాజుడుం ఆవిర్భావానికి కేంద్రమైన కుట్రుకు పోగలిగాము. కుట్రులో పోలీసు స్టేషన్ ఉంది కాబట్టి అది 'సేఫ్' ప్రాంతం. ఎవరైనా పోగల ప్రాంతం.

నిజనిర్ధారణ చేసేవాళ్ళకు దంతెవాడలో ఈ సమస్య ఉందని స్పష్టం చేయడం అవసరం. మావోయిస్టులకు బలం ఉన్న, లేక ఉండిన గ్రామానికి బయటి నుంచి వెళ్ళే బృందం తన పాటికి తాను పోవడం, స్వేచ్ఛగా మాట్లాడడం కష్టం. మావోయిస్టులు తీసుకుపోతే పోవచ్చును గానీ, అప్పుడు వాళ్ళు ఎవరితో మాట్లాడించారు, మాట్లాడినవారు ఎంత స్వేచ్ఛగా మాట్లాడారు అన్న సందేహం మిగిలిపోతుంది. సొంతంగా పోవడం చాలా కష్టం, పోగలిగినా ప్రజలచేత స్వేచ్ఛగా మాట్లాడించడం ఇంకా కష్టం. మేము 2006 నవంబర్ 26వ తేదీన అటువంటి ఒక గ్రామమైన మైతకు పోయాము గానీ ప్రజలు తమ ప్రస్తుత స్థితి గురించి తప్ప వేరే దేని గురించి మాట్లాడడానికీ సిద్ధంగా లేని కారణంగా అప్పటికి దాదాపు ఒకటిన్నర సంవత్సరంగా సాగుతున్న ఆ సంఘర్షణ గురించి వారి అభిప్రాయం తెలుసుకోలేకపోయాం.

కాగా, మేము జూలై 16, 17 తేదీల పర్యటనలో సేకరించిన పరిమితమైన సమాచారం ఆధారంగానే స్థూలంగా ఒక నిర్ధారణకు రాగలిగాము. తునికాకు సేకరణను బంద్ పెట్టించిన విషయంలోనూ, రోడ్లు వేయనివ్వని విషయంలోనూ ఆదివాసీ ప్రజలలో మావోయిస్టుల పట్ల అసంతృప్తి ఉన్నమాట వాస్తవం. మావోయిస్టులు ఆ అసంతృప్తి పట్ల శత్రు వైఖరి అవలంబించిన మాట కూడా వాస్తవం. అయితే అటువైపు జనజాగరణ్ అభియాన్ పెద్దెత్తున హింసకు పాల్పడుతున్న సంగతి, ఆ హింసకు పోలీసులు వత్తాసు పలుకుతున్న సంగతీ పత్రికలు రాయలేదని గమనించాం. కాగా, మావోయిస్టుల హింసాకాండ గురించి వస్తున్న వార్తలలో అతిశయోక్తి చాలా ఉంది. ప్రత్యేకించి ఏ 'కొత్రాపాల్' మారణకాండ మా పర్యటనకు ప్రేరణ అయిందో అది జరగనే లేదు. జరిగిందేమిటంటే జూన్ నెల 18న కొత్రాపాల్‌లో జనజాగరణ్ అభియాన్ మీటింగ్ జరిగింది. మావోయిస్టులు జనాన్ని పోగుచేసి దానిపైన దాడిచేశారు. ఈ దాడిలో ఇద్దరు ఆదివాసులు చనిపోయారు. వారిని మావోయిస్టులు చంపారని వారి ప్రత్యర్థులంటుండగా, ఘర్షణలో చనిపోయారని మావోయిస్టులు అంటున్నారు. ఏది నిజమో నిర్ధారించలేకపోయాము. ఆ తరువాత మావోయిస్టులు పదిమందిని అపహరించి తీసుకుపోయి భువనేశ్వర్ సింగ్ ఠాకూర్ అనే గిరిజనేతరుడిని మాత్రం చంపి తక్కిన 9 మంది ఆదివాసులను కొట్టి విడిచిపెట్టారు.



అతని సోదరుడైన ప్రతాప్‌సింగ్‌ను జాంగ్లా గ్రామంలో వారి ఇంటివద్ద మేము కలిసి మాట్లాడాము. తన సోదరుడిని తప్ప వేరే ఎవ్వరినీ మావోయిస్టులు చంపలేదని అతనే చెప్పాడు. జూన్ నెలలో జనజాగరణ్ అభియాన్ మొదలైనప్పటి నుంచి మావోయిస్టులు ఎంతమందిని చంపారో చెప్పమని అతనిని మేము అడుగగా, అతను ఒక్కొక్క ఘటనను వేలిమీద లెక్కించి, తన సోదరుడి హత్యనూ, అంతకు ముందు రోజు రాత్రి కుట్రులో చంపిన ఇద్దరు ఆదివాసులనూ కలుపుకొని 'ఏడు' అన్నాడు. పత్రికల వార్తల ప్రకారం మాత్రం మావోయిస్టులు ఇంకా చాలామందినే హతమార్చారని.

హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తరువాత మేమొక వివరమైన ప్రకటన పత్రికలకు విడుదల చేశాము. మావోయిస్టుల నిర్ణయాల పట్ల ఆదివాసులలో కొంత అసంతృప్తి ఉన్న మాట వాస్తవమేననీ, దానిపట్ల మావోయిస్టులు అసహనంతో వ్యవహరిస్తున్న మాట కూడా వాస్తవమేననీ, అయితే అవతలి వైపు జనజాగరణ్ అభియాన్ చేస్తున్న హింస గురించి, దానికి పోలీసులు ఇస్తున్న వత్తాసు గురించి పత్రికలు మౌనంగా ఉన్నాయనీ, మావోయిస్టుల హింస గురించి అతిశయోక్తులు ప్రచారం చేస్తున్నాయనీ అన్నాము. (అనుబంధం-II చూడండి.)

చాలా విచిత్రంగా, అంతకు ముందు దంతెవాడ ఘటనల గురించి పెద్ద పెద్ద వార్తాకథనాలను ప్రచురించిన తెలుగు దినపత్రికలు, స్వయంగా అక్కడికిపోయి వచ్చిన మా ప్రకటనలో ఒక్క వాక్యం కూడా ప్రచురించలేదు. 'ది హిందూ' అయితే మా ప్రకటనను పక్కన పడేసి, నక్సలైట్ల పట్ల వ్యతిరేకత గల ఒక సీనియర్ రిపోర్టర్‌ను దంతెవాడ పంపింది. అతను మహేంద్రకర్మను ఇంటర్వ్యూ చేసి అతనితో మీడియా తొలి ఇంటర్వ్యూ - చాలా అభినందన పూర్వకమైనది - ప్రచురించాడు.

ఆదివాసుల అసంతృప్తికి గల కారణాలలో తునికాకు బంద్ విషయం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అడవివాసుల జీవితంలో తునికాకు సేకరణకు ఉండే ప్రాముఖ్యాన్ని ఇదివరకే చెప్పాము. అది రెండు నెలల పనే అయినా వేరే పనులు దొరకని వేసవి కాలంలో దొరికే పని. అంతకంటే ముఖ్యంగా, అది నగదు ఆదాయాన్ని ఇస్తుంది. సంవత్సరం పొడవునా అవసరమయ్యే నగదు ప్రధానంగా ఈ రెండు నెలలలో సంపాదించుకుంటారు. అందుకే తునికాకు కూలిరేటు అతి తక్కువగా ఉన్నప్పుడు కూడా ఆ పనికి పోయేవారు. నక్సలైట్లు వచ్చిన తరువాత ప్రతీ సంవత్సరం ఆ కూలిరేటు క్రమం తప్పకుండా పెరిగింది.






## ఒక సల్వాజుడుం నాయకుడి పరిచయం

మేము ప్రతాప్‌సింగ్‌తో మాట్లాడుతుండగా ఆ గ్రామానికొక టాటా సుమో వచ్చింది. బైరంగఢ్‌కు చెందిన అజయ్‌సింగ్ అందులో వచ్చాడు. ఆ తరువాతి కాలంలో అతను చాలా దురుసైన నడవడిక గల సల్వాజుడుం నాయకుడిగా పేరు పొందబోతాడని మాకు అర్థమైంది. ఆ ముందు రోజు రాత్రి కుట్రులో మావోయిస్టులు ఇద్దరిని చంపిన ఘటనకు నిరసనగా తన వాళ్ళను సమీకరించడానికి జాంగ్లా వచ్చాడు. మేము ప్రతాప్‌సింగ్‌తో మాట్లాడడం చూసి ఎవరని దబాయించి మా దగ్గరున్న గుర్తింపు కార్డులడిగాడు. మా బృందంలో ఇద్దరు వరంగల్‌కు చెందిన వారన్న విషయాన్ని గమనించి, 'మీదీ వరంగలేనా? వాళ్ళదీ (అంటే నక్సలైట్లది) వరంగలే కదా?' అన్నాడు. దేశ మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుదీ వరంగలే, అతన్నీ నక్సలైటని అనుమానిస్తారా అని దబాయించవలసి వచ్చింది అతని దూకుడును ఆపడానికి. 'పివి'ది కరీంనగరైనా, వారి కుటుంబానికి వరంగల్‌తో చాలా సాన్నిహిత్యం ఉంది కాబట్టి మా దబాయింపు పూర్తిగా అవాస్తవం కాదు! ఆ తరువాతి కాలంలో అజయ్‌సింగ్ నేతృత్వంలో బైరంగఢ్ గూండాల కేంద్రంగా మారింది. ఆ ఊరికి వెళ్ళిన ప్రతి పరిశీలక బృందం మీదా వాళ్ళు చేయి చేసుకున్నారు. మేము మాత్రం అతనిని ముందే చూశాము కాబట్టి బైరంగఢ్‌కు పోకుండా జాగ్రత్త పడ్డాము!

బహుశా తొలినాటి నికృష్టమైన రేటు మీద 50 రెట్లు పెరిగి ఉంటుంది. ఇందుకు ఆదివాసులు నక్సలైట్లను చాలా అభిమానిస్తారు. అదే కారణంగా చాలా సదుద్దేశంతో తునికాకు సమ్మెకు పిలుపునిచ్చినా నిరసిస్తారు. మన రాష్ట్రంలోని గోదావరి లోయ ప్రాంతంలో ఈ సత్యాన్ని మావోయిస్టులతో సహా అన్ని ఎం-ఎల్ పార్టీలూ అనుభవపూర్వకంగా తెలుసుకున్నాయి.

దంతెవాడలో తునికాకు సేకరణ ఒక్కొక్కసారి కాంట్రాక్టర్ల ద్వారా, ఒక్కొక్కసారి సొసైటీ ద్వారా జరుగుతూ వచ్చింది. 2005లో దానిని సొసైటీద్వారా జరిపించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సొసైటీ అంటే తునికాకు సేకరించే ఆదివాసుల సహకార సంఘం. వారే దాని సభ్యులు కాబట్టి లాభాల వాటా వారికే వస్తుంది. దీనిని కారణంగా చూపించి కూలిరేటును ప్రభుత్వం కట్టకు 90 పైసల నుంచి 45 పైసలకు తగ్గించింది. కూలి తగ్గితే లాభాలు పెరుగుతాయి కాబట్టి ఇక్కడ తగ్గింది అక్కడ దక్కుతుంది కదా



అనేది ప్రభుత్వ వాదన! కానీ అసలు ఉద్దేశం కాంట్రాక్టర్ల నుంచి మావోయిస్టులు సేకరిస్తున్న పార్టీ ఫండ్‌ను దెబ్బ తీయడం. అంతేకాక సొసైటీయే ఆకుసేకరణ చేపడితే రేటు ప్రతీ సంవత్సరం పెంచుకోవడం కష్టం అవుతుంది.


ఈ కారణంగా మావోయిస్టులు బంద్ పిలుపు ఇచ్చారు. ఇవ్వలేదని వాళ్ళు అంటున్నప్పటికీ అది నిజం కాదు. తాము బంద్ పిలుపు ఇవ్వలేదనీ, ఇచ్చినట్టు కొంతమంది దుర్మార్గులు గంగలూరు ప్రాంతంలో ప్రచారం చేశారనీ, అది అవాస్తవమని వారు స్పష్టం చేసే లోపల సీజన్ అయిపోయిందనీ దంతెవాడకు చెందిన ఒక సానుభూతిపరుడైన విలేకరి వివరించే ప్రయత్నం చేశాడు. కాని ఇవి కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు తప్ప వేరు కాదు.

నిజానికి అప్పటికే 3 సంవత్సరాలుగా తునికాకు సేకరణ సరిగ్గా జరగడం లేదు. కూలిరేటు పెంచమన్న డిమాండుకూ, పార్టీ ఫండ్ డిమాండ్‌కూ వెరచి కాంట్రాక్టర్లు కొన్నిచోట్ల ముందుకు రాలేదు. 2005లో పూర్తిగా బంద్ అయింది. ఇతర కారణాలుగా ఉన్న అసంతృప్తికి ఇది తోడయింది. ఎప్పుడు అవకాశం దొరుకుతుందా అని కాచుకొని ఉన్న మహేంద్ర కర్మ, అతని మనుషులు రంగంలోకి దిగి మూడవ జనజాగరణ్ అభియాన్‌ను మొదలుపెట్టారు. 2005 జూన్ మొదటి వారంలో ఇది ప్రారంభం అయినట్టు చెప్పుకోవచ్చు. ఐదు వారాల తర్వాత మా బృందం జూలై 16–17 తేదీలలో పోయే నాటికి ఇంకా సల్వాజుడుం అన్న నామకరణం ప్రచారంలోకి రాలేదు. ఆ నెలాఖరుకు వచ్చింది.

జనజాగరణ్ అభియాన్‌లు చేసే ప్రజా సమీకరణ గురించి పైన చెప్పాము. మహేంద్ర కర్మ స్వగ్రామమైన ఫరస్పాల్ ప్రాంతంలో అది అమలవుతున్న తీరు స్థానికుల నోటినుంచి విని తెలుసుకున్నాము.

ఫరస్పాల్‌కు సమీపంలో ఉన్న కవల్నార్ గ్రామంలో హిమాంశుకుమార్ అనే గాంధేయవాది నడుపుతున్న వనవాసి చేతన ఆశ్రమ్ అనే స్వచ్ఛంద సంస్థ ఉంది. యువకులకు అనేక రకాల శిక్షణ ఇచ్చే ఈ సంస్థ తన శక్తి మేరకు సల్వాజుడుంకు వ్యతిరేకంగా నిలబడింది. సల్వాజుడుం నడిచే తీరు గురించి ఆ ఆశ్రమంలో చాలా తెలుసుకోగలిగాము. మహేంద్రకర్మ ఎంఎల్ఏగా, సల్వాజుడుం నేతగా బయట రాజ్యమేలుతుండగా అతని స్వగ్రామాన్ని అతని బావమరిది చన్ను కర్మ ఏలుతాడు. అతను ఆ ఊరికి సర్పంచేకాక ఎదురులేని పెత్తందారు కూడా. ఆ పరిసరాలలో మావోయిస్టులకు బలం ఉన్న గ్రామాల మీద జరిగే దాడులకు అతనే నేతృత్వం వహిస్తాడు. ఆ దాడులలో ప్రతీ ఒక్కరూ పాల్గొనవలసిందే.






పాల్గొనని వారు 700 రూపాయల జుర్మానా చెల్లించి 7 కొరడా దెబ్బలు తినాలి. (ఈ '7' సంఖ్యకు ఉండే ప్రాముఖ్యమేమిటో మేము తెలుసుకోలేక పోయాము). ఈ విధంగా ఫరస్పాల్ పరిసరాలలోని గ్రామాల జనాన్ని బలవంతంగా పోగుచేసి 'మావోయిస్టు' గ్రామాలపైన దాడి చేయిస్తాడు. ఎదురు తిరిగిన వారిని హతమారుస్తాడు. మావోయిస్టుల మీదగానీ, వారి అనుచర గ్రామాల పైనగానీ ఏ ద్వేషం లేనివారు సైతం ఈ మూకుమ్మడి హత్యాకాండలో భాగం అయ్యారు. వెట్టిపారాకు చెందిన గాగ్రీ అనే స్త్రీ తన ముగ్గురు చిన్న పిల్లలను ఇంటిలో విడిచిపెట్టి ఈ 'ఉద్యమం'లో పాల్గొనలేనని అడుక్కున్నా కూడా బలవంతంగా తీసుకుపోయారు. కేశాపూర్‌లో ఒక వితంతువు ఈ గుంపు వెంట గుట్టల వెంబడి పరిగెత్తలేక ఇంటికి వచ్చేయగా, ఆమె భూమిని వేలం వేయించి 700 రూపాయల జుర్మానా కట్టించుకున్నాడు.

ఈ ఆశ్రమం ఉండే కవల్నార్ గ్రామం ఫరస్పాల్ పరిసర గ్రామాలలో ఒకటి కాబట్టి 'సల్వాజుడుంలో పాల్గొను, లేకపోతే జుర్మానా చెల్లించు' అనే వారి ఆదేశం హిమాంశు కుమార్‌కు కూడా వర్తిస్తుంది. అయితే ఆ దాడులలో పాల్గొనడానికీ, జుర్మానా కట్టడానికీ కూడా నిరాకరించానని ఆయన అంటాడు. తన తెగువ చూసి కవల్నార్, తుర్పరాజ్, కుపేర్, పురంతరి, మంగ్‌నార్ గ్రామస్తులు కూడా అటువంటి తీర్మానమే చేశారని అంటాడు. ఆ తీర్మానాలు ఎంతమేరకు అమలయ్యాయో తెలీదు గానీ ఈ మధ్యనే హిమాంశు కుమార్‌కూ, అతని ఆశ్రమానికీ ప్రభుత్వం వైపునుంచి వేధింపు మొదలయింది. అతని ఆశ్రమం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన భూమిలో ఉంది. ఆశ్రమానికి ఆ భూమి కావాలని కొన్ని సంవత్సరాల క్రితం అతను అర్జీ పెట్టుకున్నప్పుడు 'అదేం మహాభాగ్యం! ముందు ఆశ్రమం కట్టుకోండి. అనుమతి సంగతి తరువాత చూద్దాం' అని అధికారులు అన్నారు. హిమాంశు కుమార్ అట్లాగే చేశాడు. ఇప్పటిదాకా అన్నీ సజావుగానే సాగాయి. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు (ఎంఎల్ఏ అయిన మహేంద్ర కర్మతో సహా) కూడా అతని ఆశ్రమం కార్యకలాపాలలో పాల్గొన్నవారే.

అయితే అతను సల్వాజుడుంను వ్యతిరేకించడమేకాక, తన సంస్థ పనిచేసే గ్రామాల నుంచి జనాన్ని సమీకరించి దంతెవాడలో శాంతి ప్రదర్శన కూడా జరిపాడు. ఆ ప్రాంతానికి వచ్చిపోయే ప్రతీ నిజనిర్ధారణ కమిటీకి సహకరించసాగాడు. దాంతో ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో దంతెవాడ తాసీల్దారు, 'నువ్వు ఎవరి అనుమతితో అడవిలో ఆశ్రమం వేసుకున్నావు?' అని నోటీసు ఇచ్చాడు. ఎస్.ఐ కూడా, 'మీ ఆశ్రమంలో



అవాంఛనీయమైన కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది కాబట్టి అన్ని రికార్డులూ తీసుకొని పోలీసు స్టేషన్‌కు రావలసింది' అని తాఖీదు పంపాడు. గ్రామాలలో అతని కార్యకర్తలు చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు సల్వాజుడుం వారు అడ్డం పడసాగారు. మావోయిస్టులని ముద్రవేసి దాడి కూడా చేయసాగారు.


సల్వాజుడుం స్వభావరీత్యా గతంలో రెండుసార్లు ఏర్పడ్డ జనజాగరణ్ అభియాన్‌లకు కొనసాగింపేనని అన్నాము. అదే సమయంలో, గతంలో లాగ దీనికి కేవలం ప్రభుత్వం మద్దతు ఉండడమే కాక ఈసారి అధికార పాలసీలో భాగం అయిందని కూడా అన్నాం. దీని స్వరూపం ఏమిటో చూద్దాం.

మావోయిస్టుల వ్యతిరేకులకు గుంపుకట్టి హింసచేసే స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ మావోయిస్టు ఉద్యమాన్ని మట్టుబెట్టడం సాధ్యం కావడం లేదని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గ్రహించింది. మావోయిస్టులకు ప్రజాబలం దండిగా ఉండడం దీనికి కారణం కావచ్చు, జనజాగరణ్ అభియాన్ పేరిట పోగైన సామాజిక, రాజకీయ శక్తుల కంటే మావోయిస్టుల వద్ద ఆయుధ బలం ఎక్కువ ఉండడం కారణం కావచ్చు, ఆ ఆయుధాలు ఉపయోగించే విషయంలో వారిలో తెగింపు ఎక్కువ ఉండడం కూడా కారణం కావచ్చు. ఈ మూడు కారణాలూ వివిధ పాళ్ళలో ఉండవచ్చు.

కాబట్టి అడవుల్లో ప్రజల్నే లేకుండా చేసేస్తే? అడవి గ్రామాలన్నిటినీ బలవంతంగా ఖాళీ చేయించి ప్రజలందరినీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే శిబిరాలలోకి తరలించినట్టయితే మావోయిస్టులకూ వారి మద్దతుదార్లయిన ప్రజలకూ మధ్య ఉన్న సంబంధం తెగిపోతుంది. అటు మావోయిస్టులపైన పోలీసు, పారామిలటరీ దాడులూ సులభతరమవుతాయి. ఇటు ప్రజలను కంట్రోల్ చేయడమూ సులభతరం అవుతుంది.

సల్వాజుడుం 'ఉద్యమం' వెనక ఈ ఆలోచన స్పష్టంగా ఉంది. ఇది ఎవరి ఆలోచనో, కుట్రు ప్రాంతంలో మొదలైన బలసమీకరణ ఏ దశలో ఈ రూపం తీసుకుందో చెప్పలేము. మేము 2005 జూలై 16-17 తేదీలలో బిజాపూర్ వెళ్ళే నాటికి ఈ ఆలోచన లేదు. రహదార్లపైన శిబిరాలూ లేవు. ఆ తరువాత చాలా వేగంగా అడవి గ్రామాలను ఖాళీ చేయించడం, రహదార్ల మీద శిబిరాలు నెలకొల్పడం మొదలయింది. మేము 2006 మే నెలలో వెళ్ళే నాటికి 17 శిబిరాలలో 54,768 మంది ఉన్నారు. దీనికి వివరణగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒక చిత్రాన్ని ఇస్తున్నది. నక్సలైట్ బాధిత గ్రామాల ప్రజలు







కుంట – దోర్నపాల్ రహదారి పక్కన ఖాళీ అయిన గ్రామం

వారి బారినుంచి తప్పించుకోవడానికి తమకు రక్షణ కల్పించమని కోరారని ఈ చిత్రం చెప్తుంది. ఇది వట్టి అబద్ధం. బిజాపూర్ ప్రాంతంలో ఒకటి రెండు గ్రామాలలో ఇది మొదట్లో జరిగి ఉండవచ్చు. 2005 జూన్ నెలలో మూడవ జనజాగరణ్ అభియాన్ మొదలైనప్పుడు కుట్రువంటి కొన్ని గ్రామాల జనం పెద్దసంఖ్యలో మావోయిస్టుల పైన దాడులలో పాల్గొన్నారు. అటువంటి వాళ్ళు తామింక అడవులలో ఉండలేమనీ, ప్రభుత్వం ఎక్కడైనా శిబిరం నెలకొల్పి పోలీసు పహారా కల్పిస్తే వచ్చేస్తామనీ అడిగినట్టున్నారు. దానినొక నమూనాగా తీసుకొని తరువాత జరిగిన బలవంతపు తరలింపుకు అదే కారణాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నది ఆ రాష్ట్ర ప్రభుత్వం.

సిఆర్‌పిఎఫ్ ఛత్తీస్‌గఢ్ అడవి ప్రాంతాలలో చాలాకాలంగా ఉంది. 2003 తరువాత సిఆర్‌పిఎఫ్ బలగాల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ 2005 జూలై నుంచి నాగాలాండ్‌కు చెందిన ఇండియా రిజర్వ్ బెటాలియన్‌ను (దీనిని క్లుప్తంగా 'నాగా బెటాలియన్' అని పిలవడం జరుగుతున్నది) దించిన తరువాతే ప్రభుత్వం వైపు నుంచి హింస చాలా పెరిగింది. వాళ్ళు లేకపోతే సల్వాజుడుం కార్యకర్తలు తమంతట తాము లోతట్టు అడవి గ్రామాలపైన దాడిచేసి జనాన్ని బలవంతంగా బయటకు లాక్కొచ్చే ప్రయత్నం చేయకపోయి ఉందురు. నాగా బెటాలియన్‌ను వెంటబెట్టుకొని ఆ పని విస్తృతంగానే చేయగలిగారు.

ఒక్క గ్రామంపైన అటువంటి దాడి జరిగితే దాని ప్రభావం చుట్టుపక్కల అనేక గ్రామాల పైన పడి ఆ ఊర్ల జనం అడగగానే వచ్చేసే స్థితి – లేదా ఊరు వదిలి దూరం పోయే స్థితి – వచ్చిందని సుక్మ నివాసి అయిన సిపిఐ నాయకుడు అంటాడు.



సల్వాజుడుంవాళ్ళు తగలబెట్టిన గగన్‌పల్లి గ్రామం




మేం వెళ్లినప్పుడు అక్కడ కనిపించిన ఒకే ఒక ఆదివాసీ కుటుంబం

2006 ఫిబ్రవరి 4వ తేదీన నాగా బెటాలియన్, సల్వాజుడుం కలిసి నీలమడుగు గ్రామంపైన దాడిచేసి తగలబెట్టారనీ, ఆ దాడికి ప్రతీకారంగా మావోయిస్టులు 6వ తేదీన మందుపాతర పేల్చి 11 మంది పారామిలటరీ వాళ్ళను చంపారనీ, ఇక అక్కడి నుంచి జనం భయపడి సల్వాజుడుం వాళ్ళు రమ్మనగానే గ్రామాలు విడిచిపెట్టి శిబిరాలకు వెళ్ళిపోసాగారనీ కుంటకు చెందిన సీనియర్ విలేకరి అంటాడు. దోర్నపాల్‌లోని శిబిరం కుంట తాలూకాలోని మొట్టమొదటి శిబిరాలలో ఒకటి. అన్నిటి కంటే అదే పెద్ద శిబిరం. సల్వాజుడుం' ఉద్యమానికి సంబంధించిన అనేక మీటింగ్‌లు ఆ ఊరిలోనే జరిగాయి. మహేంద్రకర్మ దోర్నపాల్‌లో జరిపిన ఒక మీటింగ్‌లో తీవ్ర పదజాలంతో ఉపన్యాసం ఇస్తుండగా ఆ మీటింగ్‌కు హాజరైన సల్వాజుడుం కార్యకర్తలు గుంపులు గుంపులుగా బయలుదేరి అర్లంపల్లి, పాలమడుగు, గగన్‌పల్లి, గోగొండ, ఆర్గట్ట గ్రామాలను తగలబెట్టారని చెప్పారు. 165 ఇళ్ళు తగలబడ్డ అర్లంపల్లి దహనకాండ కుంట తాలూకాలో అతి పెద్ద ఘటన.

మేము గగన్‌పల్లి గ్రామానికి పోయి, తగలబెట్టిన ఇళ్ళ ఫోటోలు తీశాము. గ్రామం మొదట్లో కొందరు మనుషులు కనిపించారు. వాళ్ళు శిబిరానికి వలసపోకపోయినా వారిని సల్వాజుడుం పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. కారణం, వాళ్ళూ పేదలే అయినా, అడవివాసులే అయినా, గిరిజనేతరులు. పశువులు పోషించుకొని బతికే యాదవులు. వాళ్ళ ఇళ్ళు తప్ప తక్కిన






గ్రామమంతా తగలబడిపోయింది. (ఈ మధ్యనే - అంటే దాదాపు ఒక సంవత్సరం తరువాత - ఈ యాదవులు కూడా కుంటలో శిబిరానికి వెళ్ళిపోయారని తరువాత విన్నాం). మేము పోయేసరికి తగలబడిన ఒక్క ఇంటి దగ్గర మాత్రం మనుషులు కనిపించారు. తప్పిపోయిన తమ మేకల కోసం వచ్చామని ఆ ఇంటి యజమాని మడకం దూలయ్య, అతని భార్య ముత్తి అన్నారు. అప్పటికి నెలరోజులు ముందు ఒకనాడు సల్వాజుడుం వాళ్ళు, పోలీసులు కలిసి గగన్‌పల్లికి వచ్చి 100 ఇళ్ళకు పైగా ఒకేసారి తగలబెట్టారని దూలయ్య అన్నాడు. ఇంట్లోని వస్తువులు తీసుకోవడానికి సమయం కూడా ఇవ్వలేదట. గ్రామస్తులందరూ ఎర్రబోరులో గానీ, కుంటలో గానీ ఉన్న శిబిరానికి వచ్చేయాలన్నది సల్వాజుడుం డిమాండు.


గగన్‌పల్లి మీద సల్వాజుడుంకు ప్రత్యేకమైన కోపం ఉండడానికి కారణం లేకపోలేదు. అది మావోయిస్టులకు బలం ఉన్న ఊరు. కుంట మాజీ ఎంఎల్ఏ సోయం జోగయ్యదీ ఈ ఊరే. అతని కొడుకు వెంకటేశ్‌ను మావోయిస్టులు ఆరేడు ఏళ్ళ కింద చంపారు. ఆ తరువాత ఆ కుటుంబం కుంటకు తరలింది. జోగయ్య తమ్ములలో ఒకడైన సోయం మూక సల్వాజుడుం ప్రధాన నాయకులలో ఒకడు.

అంత భీకరంగా దాడిచేసి 100 ఇళ్ళు తగలబెట్టినా ఆ ఊరి నుంచి కొద్దిమంది మాత్రమే సల్వాజుడుం వారి వెంట పోయారనీ మెజారిటీ ప్రజలు తగలబడుతున్న ఆ ఊరిని విడిచిపెట్టి నక్సలైట్ దళాలకు దగ్గరగా అడవి ప్రాంతంలోకి పోయారనీ ఆ ఊరి యాదవులు మాతో అన్నారు.

అయితే గగన్‌పల్లి వాళ్ళందరూ దళాల దగ్గరకు పోలేదు. దాదాపు ఒక సంవత్సర కాలం అడవిలో తలదాచుకునే ప్రయత్నం చేసి ఈ మధ్యనే సరిహద్దు దాటి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించారు. వారిని మేము ఈ సంవత్సరం ఏప్రిల్ 14 నాడు చింతూరు మండలం అల్లిగూడెం సమీపంలో చూశాము. ఒక సంవత్సర కాలం ఎట్లా గడిపారంటే నిస్సహాయంగా చేయి తిప్పుతారు తప్ప వర్ణించడానికి వారి దగ్గరా మాటలు లేవు. ఇళ్ళు తగలబెట్టినప్పుడు గాదెలలోని బియ్యం పైభాగం మాత్రమే కాలిపోయిందనీ దానిని తొలగించి కింద ఉన్నది తెచ్చుకొని కొంచెం కొంచెం తింటూ బతికామనీ అన్నారు. ఇద్దరు స్త్రీలు ఆ సంవత్సర కాలంలో వైద్య సహాయం లేక చనిపోయారని కట్టం లక్ష్మి చెప్పింది. వారిలో సోమయ్య భార్య కూరలక్ష్మి ప్రసవమప్పుడు బిడ్డతో సహా చనిపోయిందట. ఇరమయ్య భార్య సామల భీమమ్మ పాపను కన్న తరువాత వచ్చిన రోగానికి



(ఇన్‌ఫెక్షన్ కాబోలు) తట్టుకోలేక చనిపోయిందట. చివరికిప్పుడు గగన్‌పల్లి వాసులు సరిహద్దు దాటి తమ బంధువుల గ్రామంలో బతుకుతున్నారు. ఎట్లా బతుకుతున్నారన్న వివరాలు తరువాత చూద్దాం.



డోర్నపాల్ శిబిరంలో ఈ కుటుంబం ఎంత ఇరుకులో బతుకుతోందో చూడండి

బలవంతంగా అడవులు ఖాళీ చేయించే వ్యూహంలో భాగంగా సల్వాజుడుంను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వాడుకుందన్నాము కదా. ఆ రాష్ట్ర పాలకులు దీనిని రహస్యంగా ఉంచే ప్రయత్నం కూడా చేయడం లేదు. 'శిబిరాలలో ఉన్నవారంతా ప్రభుత్వంతో ఉన్నారు. అడవులలో ఉన్నవారు మావోయిస్టులతో ఉన్నట్లే'నని ముఖ్యమంత్రి డాక్టర్ రమణ్‌సింగ్ పలుమార్లు ప్రకటించాడు. ఇది కేవలం ఉపన్యాస ధోరణిలో చేసిన ప్రకటన కాదు. పాలనా యంత్రాంగం నుంచి ప్రజలకు లభించగల అన్ని సదుపాయాలనూ శిబిరాలలో ఉన్న వారికే పరిమితం చేశారు. అడవిలో ఉన్న వారు వారి దృష్టిలో అసలు పౌరులే కారు.

దుర్మార్గమైన ఈ 'వ్యూహం' 1970లలో ఈశాన్య భారతంలోని మిజోరంలో అమలయింది. మిజో గెరిల్లాలను వేరుచేసి ఏరివేయడానికి అడవులలో, కొండలలో ఉన్న గ్రామాలన్నిటినీ బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ తరువాత సైన్యాన్ని అడవులలో దించి మిజో నేషనల్ ఫ్రంట్ సాయుధ దళాలను తుదముట్టించారు. అప్పుడు నెలకొల్పిన శాంతి ఇప్పటికీ నిలిచి ఉండడం వల్ల దీనిని విజయవంతమైన వ్యూహంగా పాలకులు భావిస్తున్నారు. అదే వ్యూహాన్ని ఛత్తీస్‌గఢ్‌లో అమలు చేస్తున్నారు. మిజోరంలో మూడు దశాబ్దాల కింద అది ఎంత హింసాత్మకంగా అమలయిందో చూచాయగా వినడమే తప్ప వివరాలు సేకరించిన సంస్థలేవీ లేవు. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌ను చూసి ఊహించుకోగలుగుతున్నాం. పోలీసు, పారామిలటరీ బలగాలు, సల్వాజుడుం వాళ్ళు పెద్ద గుంపుగా మొదట గ్రామంపైన దాడి చేస్తారు. శిబిరానికి వస్తారా అని అడగడం,






వస్తామన్న వారిని తీసుకుపోవడం, రామన్న వారితో ఘర్షణకు దిగడం – వారి వ్యవహార శైలి ఇలా ఉండొచ్చని కామన్‌సెన్స్‌తో ఊహ చేసినట్టయితే అనుకుంటాం. అదేం లేదు. రావడం రావడమే కాల్పులు జరుపుకుంటూ, ఇళ్ళు తగలబెట్టుకుంటూ వస్తారు. పారిపోతున్న వాళ్ళను నరుకుతారు. కొందరిని ఎత్తి తగలబడుతున్న ఇళ్ళలో పడేస్తారు. ఇంట్లో మనిషిని పెట్టి తాళం వేసి తగులబెట్టిన సందర్భాలూ ఉన్నాయి. పశువులూ, మేకలు కూడా ఇళ్ళలోని వస్తువులతో బాటు అగ్నికి ఆహుతి అవుతాయి. లేదా వాటిని దాడిచేసిన వాళ్ళు తోలుకుపోతారు. నాగా బెటాలియన్ వారి చేతికి చిక్కిన పశువులను వారు అక్కడికక్కడే నరికి మాంసం తీసుకుపోయి తింటారనేది పలువురి ఫిర్యాదు.

మావోయిస్టుల పట్ల వ్యతిరేకత కారణంగా సల్వాజుడుం వారు తమ గ్రామానికి వస్తే వారిలో చేరుదాం అనుకున్న వారు సైతం ఈ ప్రవర్తనకు వారిని అసహ్యించుకొని ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చారు. సల్వాజుడుం రేపు వస్తుంది మా ఊరికి అని మాతో చెప్పిన ఎం.పి మారాయగూడెంకు చెందిన అడ్మా రాము గురించి పైన చెప్పాము. ఆ మార్నాడు నిజంగానే సల్వాజుడుం ఆ ఊరికి వచ్చింది. అందరినీ కొట్టిపోయింది. రాము ఏమయ్యాడో తెలీదు గానీ, ఆ దెబ్బకు ఆ పూరినే కాదు ఛత్తీస్‌గఢ్‌నే వదిలి పారిపోయి వచ్చిన కట్టం సంకురమ్మనూ, ఆమె భర్త దూలయ్యనూ మేము 2006 నవంబర్ 18న ఖమ్మం జిల్లా కూనవరం మండలంలోని రేగులపాడులో కలిశాము. 'వాళ్ళు జనాన్ని కొట్టడం మాకు నచ్చలేదు. మర్యాదగా అడిగితే మేము వాళ్ళతోనే పోయేవాళ్ళం. వాళ్ళ దౌర్జన్యం చూసి ఇటు పారిపోయి వచ్చాం' అని చెప్పింది సంకురమ్మ. వాళ్ళు కోయలు, 10 ఎకరాల భూమి ఉన్న రైతులు. రేగులపాడులో బంధువులున్నారు కాబట్టి సల్వాజుడుం దాడి నుంచి తప్పించుకొని పారిపోయి ఇక్కడికీ వచ్చి ఉంటున్నారు.

బలవంతంగా అడవుల నుంచి తరలించబడ్డ జనాన్ని రహదార్ల మీద ఏర్పాటు చేసిన శిబిరాలలో ఉంచారని చెప్పాం కదా. 2006 జూలై నెలలో మేము వెళ్ళేసరికి 17 శిబిరాలున్నాయనీ, ప్రభుత్వం లెక్కల ప్రకారం 54,768 మంది వాటిలో ఉంటున్నారనీ కూడా పైన చెప్పాము. వాళ్ళంతా పశువుల కొట్టాల వంటి నివాసాలలో ఉంటున్నారు. ఆనాటికి అతి పెద్ద శిబిరాలలో ఒకటైన దోర్నపాల్ శిబిరవాసులతో మేము వివరంగానే మాట్లాడాము. ఇతర నిజనిర్ధారణ కమిటీలను దోర్నపాల్‌లో సల్వాజుడుం నాయకులు అటకాయించడం, వేధించడం జరిగింది. అయితే మేము వెళ్ళేసరికి మధ్యాహ్న భోజన సమయం




అయింది. సల్వాజుడుం నాయకులు కునుకు తీస్తున్నారో ఏమో గానీ దాదాపు రెండు గంటల సేపు మేము యథేచ్ఛగా శిబిరవాసులతో గడపగలిగాము. 46 గ్రామాల నుంచి వచ్చిన జనం ఈ శిబిరంలో ఉన్నారు. 20 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు ఉన్న కొట్టాలలో 40 కుటుంబాల దాకా పిల్లా పాపలతో ఉంటున్నారు. కొట్టాలకు పక్కా గోడలు లేవు. రోజుకు రెండు పూటలా ప్రభుత్వం ఇంత అన్నం, పప్పు మాత్రం పడేస్తుంది తినడానికి. అక్కడే శాశ్వత గృహాలు నిర్మించుకోవడానికి వారికి అనుమతి కూడా ఇచ్చింది. దోర్నపాల్ సమీపంలో ప్రజలు పెద్ద సంఖ్యలో అడవిలోకి పోయి చెట్లు కొట్టి తెచ్చుకుంటున్న దృశ్యం కనిపించింది. అడవులలో ఉన్న రోజులలో ఏ అవసరానికైనా చెట్టు కొట్టాలంటే ఎన్ని ఇబ్బందులో! ఇప్పుడు ప్రభుత్వ వ్యూహంలో భాగంగా ఇక్కడికి గుంజుకు రాబడ్డారు కాబట్టి, వాళ్ళు ఇక్కడే ఇల్లు వేసుకొని స్థిరపడి పోవడం ప్రభుత్వ ప్రయోజనాలకు అవసరం కాబట్టి, ఇప్పుడు వారు దర్జాగా అడవి కొట్టి కట్టె తెచ్చుకునే సదుపాయం లభించింది.

మేము కొలాయిగూడ, మోరుపల్లి, నీలవాయి, బోధగూడ, అర్లపల్లి గ్రామాల నుంచి వచ్చిన వారితో మాట్లాడగలిగాము. ఎందుకు వచ్చారు ఈ శిబిరంలోకి అన్న ప్రశ్నకు కొందరి నుంచి మౌనమే జవాబు. జవాబు చెప్పిన వారిలో ఒక్క నీలవాయి గ్రామస్తులు మాత్రమే మావోయిస్టుల వేధింపులకు తట్టుకోలేక 2 కిలోమీటర్లు అడవిలో పడి ఇక్కడికి వచ్చామన్నారు. తక్కిన వాళ్ళంతా సల్వాజుడుం వాళ్ళు తీసుకొస్తే వచ్చామన్నారు. ఆ మాట అనగానే పక్కనున్న మరో వ్యక్తి 'ఏయ్, అట్లాగంటావా' అనో, 'ష్, ఊరుకో' అనో వారించడం, 'కాకపోతే ఏమిటి' అనీ, 'ఏం ఫరవాలేదులే' అనీ మొదట మాట్లాడిన వ్యక్తి అనడం జరిగింది. రావడానికి నిరాకరించిన వారి ఇళ్ళు సల్వాజుడుం వాళ్ళు తగలబెట్టారని అర్లపల్లివాసులు స్పష్టంగా చెప్పారు. తిరిగిపోదామంటే పోనివ్వడం లేదని కొలాయిగూడ వాసులు అన్నారు.

ఇది జూలై 2006 నాటి సంగతి. అప్పటికే లేఅవుట్ వేసి స్థిరనివాస కాలనీ నిర్మాణం చేపట్టారు. ఒక్కొక్క ఇంటికి మంజూరైన ధర 12 వేల రూపాయలని దంతెవాడ కలెక్టరు మాతో అన్నాడు. శ్రమ వారే చేసుకుని, కట్టె అడవి నుంచి తెచ్చుకోవచ్చు. ఆ తరువాత గడచిన సంవత్సర కాలంలో చాలాచోట్ల శిబిరం స్థానంలో కాలనీలు వచ్చేశాయి. ఎర్రబోరు వంటి ఊర్లలో కాలనీ చుట్టూ కంచె కూడా వచ్చింది. శిబిరం పక్కనే పారామిలటరీ క్యాంపు ఉండింది. అది శాశ్వతం అయింది. వారు పెద్ద పెద్ద సెర్చిలైట్లతో రాత్రంతా పర్యవేక్షణ








కుంటలో సల్వాజుడుం కార్యకర్తలు ఎంత చిన్నపిల్లలో గమనించండి

చేస్తుంటారు. మావోయిస్టుల దాడి భయం వల్ల ఈ పహారా పెట్టామనేది పైకి చెప్పే కారణమైనా, శిబిరవాసులెవరూ చీకటి మాటున జారుకోకుండా కాపలా కాయడం కూడా దీనివల్ల కలిగే ప్రయోజనమే. కొలాయిగూడకు చెందిన మడావి సంతోష్ అనే బాలుడు తాను 10వ తరగతి పరీక్ష రాయడానికి దోర్నపాల్ వచ్చాననీ, తనను సల్వాజుడుం వాళ్ళు పట్టుకొని శిబిరంలో పడేసి వెనక్కి పోనివ్వడం లేదనీ మాతో అన్నాడు.

జాతీయ రహదారి 16 గురించి, 221 గురించి పైన చెప్పాము. ఈ శిబిరాలు అత్యధికం ఆ రెండు రహదార్లపైనే ఉన్నాయి. జూలై 2006లో 17 శిబిరాలు ఉండగా ఇప్పుడు 32 ఉన్నాయి. అయితే శిబిరవాసుల సంఖ్య అప్పుడూ, ఇప్పుడూ 50 వేలకు అటూ ఇటూగా ఉంది. వీటిని సల్వాజుడుమే నిర్వహిస్తుంది. కాపలా కాస్తుంది. ఆ మిషమీద జాతీయ రహదార్ల కాపలాయే సల్వాజుడుం చేతిలో పెట్టబడింది. కాపలా మాత్రమే కాదు, పాలన యావత్తు వారి చేతిలో పెట్టబడింది. జాతీయ రహదార్లపైన ప్రతీ ఊరి దగ్గరా ఇతర చెక్‌పోస్టులతో పాటు సల్వాజుడుం చెక్‌పోస్టు ఉంటోంది. దానికి సల్వాజుడుం కార్యకర్తలు విల్లంబులు, ఇతర ఆయుధాలు పట్టుకొని కాపలా కాస్తారు. ప్రతీ వాహనం ఆగవలసిందే. సోదా చేయించుకోవలసిందే. ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనమైతే మరీ అనుమానంగా సోదా చేస్తారు. స్థానిక ఆదివాసీలెవరైనా వాహనంలో



ఉంటే ఎక్కడి వారైనదీ, ఎక్కడికి పోతున్నదీ చెప్పాలి. సంతృప్తికరంగా చెప్పకపోతే దెబ్బలు పడతాయి, లేదా దింపి నాగా బెటాలియన్‌కు అప్పగిస్తారు. అర్ధరాత్రి ఎర్రబోరు, ఇంజరం శిబిరాల వద్ద బస్సును ఆపి ప్రయాణీకులను దింపి తీసుకుపోయిన ఉదంతాల గురించి హైదరాబాద్ నుంచి జగ్దల్‌పూర్ పోయే ఎపిఎస్ఆర్‌టిసి బస్సు సిబ్బంది చాలా కథలే చెప్తారు. ఆ విధంగా దింపి తీసుకుపోయిన వారికి ఆ తరువాత ఏం జరిగేదీ ఎవరికీ తెలీదు. మధ్యలో మామూళ్ళ వసూలు ఉండనే ఉంటుంది. చెక్‌పోస్టు ఉన్న తరువాత మామూళ్ళు వసూలు చేసుకోకుండా ఉండరు కదా!

అడవిలో ఉండిపోయిన వారు పౌరులే కాదని పైన చెప్పాం. వారికి ప్రభుత్వం ఏ రకమైన పాలనా అందివ్వదు. అక్కడ స్కూళ్ళు పనిచేయవు. శిబిరంలో వచ్చి ఉన్న పిల్లలకే బడి. ఏ ప్రభుత్వ శాఖా వారి దగ్గరకు పోదు. శిబిరంలో వచ్చి ఉంటేనే ప్రభుత్వ అధికార్ల పలకరింపు. శిబిరాలు సల్వాజుడుం ఆధ్వర్యంలో నడుస్తాయి కాబట్టి ఇక్కడ ప్రభుత్వ పాలన కూడా సల్వాజుడుం ద్వారానే జరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు సల్వాజుడుం ప్రతినిధులు కూడా అధికార వాహనాలెక్కి తిరుగుతుంటారు. నిర్ణయాలు చేస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాల కొచ్చి ఆదేశాలు జారీ చేస్తుంటారు. చేతిలో ఆయుధాలు పట్టుకొని తిరుగుతుంటారు.

అధికార ముద్ర వేయించుకున్న ప్రతి ప్రైవేట్ సైన్యంలాగానే సల్వాజుడుం వారు కూడా ప్రభుత్వం ఆమోదించిన జులుంకే పరిమితం కారు. తమ స్వంత లాభం చూసుకుంటారు. బలవంతంగా వ్యాపారస్తుల దగ్గర డబ్బులు వసూలు చేస్తారు. హోటల్‌లో తిని బిల్లు కట్టరనేదైతే దంతెవాడ జిల్లాలో సర్వత్రా వినిపించే అభియోగం. మేము కుంట గ్రామంలో సల్వాజుడుం వాళ్ళతో మాట్లాడిన తరువాత టీ తాగడానికి ఒక హోటల్‌కు పోగా సల్వాజుడుం వాళ్ళు మాతో మర్యాదగా మాట్లాడడం చూసి కాబోలు ఆ హోటల్ యజమాని 'టీ తాగితే బిల్లు కట్టి పొమ్మని చెప్పండి సార్ వాళ్ళకు కొంచెం' అని మమ్మల్ని అభ్యర్థించాడు. 'సల్వాజుడుం వాళ్ళు వస్తున్నారు' అంటే బస్సులు ఆగవలసిందే. కుంటవద్ద శబరి నది దాటి ఒరిస్సాకు పోయే పడవలూ ఆగవలసిందే.

ఈ ప్రహసనం నెలకొల్పడానికి సల్వాజుడుం వాళ్ళు పోలీసులతోనూ పారామిలటరీతోనూ కలిసి పాల్పడిన హింస, దానిని ప్రతిఘటించడానికి మావోయిస్టులు చేపట్టిన హింస దంతెవాడ జిల్లాను








ఖమ్మం జిల్లా సున్నంవారిమట్టికలో అటవీశాఖ కూల్చేసిన ఛత్తీస్‌గఢ్ గొత్తికోయల ఇళ్ళు

నిలువునా చీల్చి అంతర్యుద్ధ స్థితిని తీసుకొచ్చిన వైనాన్ని తరువాతి అధ్యాయంలో చూద్దాం. క్లుప్తంగా చెప్పాలంటే రెండేళ్ళ కాలంలో దాదాపు 700 ప్రాణాలు పోయాయి. రహదారి శిబిరాలలో ఉన్న 50 వేల మందిని కలుపుకుని 1 లక్ష మంది దాకా ఆదివాసీ ప్రజలు నిర్వాసితులయ్యారు. గ్రామాలు కాలి బుగ్గి అయ్యాయి. వేల ఎకరాల భూమి పడావు పడింది.

నిర్వాసితులైన ఈ ప్రజానీకం జీవన పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో కూడా తరువాతి అధ్యాయంలో చూద్దాం. శిబిరాలలో ఉన్న వారు అడవులనూ భూములనూ విడిచిపెట్టి ప్రభుత్వం పెడుతున్న రెండు ముద్దలు తిని బందీలుగా బతుకుతుండగా, అడవి లోతట్టు ప్రాంతానికి పారిపోయిన వారు, ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చిన వారు నిలువ నీడలేక, చేసుకోవడానికి పనిలేక, తినడానికి తిండిలేక దుర్భర పరిస్థితులలో బతుకు వెళ్ళదీస్తున్నారు. ఎక్కడ తలదాచుకున్నా సల్వాజుడుం వాళ్ళు వచ్చి బలవంతంగా అపహరించి తీసుకుపోతారని భయపడుతూ బతుకుతున్నారు. ఖమ్మం జిల్లాకు పారిపోయి వచ్చిన వారు అడవులలో ఇంత చోటు చూసుకొని గుడిసెలు వేసుకుంటే అటవీశాఖ ఆ గుడిసెలను తగలబెడుతున్నది. ఛత్తీస్‌గఢ్ అడవులలోనే ఉండిపోయిన వారు గుడిసెలు వేసుకునే సాహసం సైతం చేస్తున్నట్టు లేరు. వాళ్ళ భయం అటవీశాఖ గురించి కాదు. నివాసాలు ఉన్నట్టు



తెలిస్తే సల్వాజుడుం వాళ్ళు వస్తారని. కాబట్టి చెట్లూ చేమలూ పట్టుకొని బతుకుతున్నారు.

ఈ నిర్వాసితులందరూ – ప్రభుత్వం నెలకొల్పిన రహదారి శిబిరాలలో ఉన్న వారితో సహా – తిరిగి తమ గ్రామాలకు పోయి తమ భూములలో వ్యవసాయం చేసుకొని బ్రతకాలనేది ప్రజాతంత్ర ఉద్యమ తక్షణ కర్తవ్యంగా మేము భావిస్తున్నాం. ఒంట్లో ప్రాణాన్ని నిలబెట్టుకోవడానికి వారికి వేరే మార్గం ఏదీ లేదు. అంతేకాక, దశాబ్దాలుగా తమ అడవులలో తామే చొరబాటుదార్లుగా ప్రకటించబడి నిత్యం వేధింపులకు గురి అవుతున్న ఆదివాసులకు మొట్టమొదటిసారిగా తమ చారిత్రక హక్కులను నిలబెట్టుకునే అవకాశం ఒక చట్టం ద్వారా దొరికింది. అది పార్లమెంటు ఈ సంవత్సరం జారీచేసిన షెడ్యూల్డు తెగలు, ఇతర సంప్రదాయ అటవీ వాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం, 2007 (క్లుప్తంగా చెప్పాలంటే 2/2007 చట్టం). ఈ చట్టం ఇచ్చే గుర్తింపు పొందాలంటే వారు తిరిగి తమ భూములను స్వాధీనం చేసుకోవాలి. లేకపోతే ఈ హక్కు దక్కదు. చివరిగా, ఊర్లు తగలబెట్టి ఖాళీ చేసిన అడవులను ఖనిజాల కంపెనీలకు లీజుకిచ్చే ప్రమాదం ఉంది. భారతదేశ ఖనిజ సంపదలో పెద్దభాగం 'దండకారణ్యం' అని పిలవబడే జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ అడవులలో ఉంది. ఆ మూడు రాష్ట్రాల ప్రభుత్వాలూ ఇప్పటికే పెద్ద మొత్తంలో తమ అడవి భూములను టాటా, జిందాల్, ఎస్సార్, తదితర పెట్టుబడిదారీ కంపెనీలకు లీజుకు ఇచ్చి ఉన్నాయి. దంతెవాడలో సైతం ఈ ప్రక్రియ ప్రారంభం అయింది. బలవంతంగా ఖాళీ చేయించిన భూములను ఆ రకమైన లీజుల కింద ఇచ్చేసినట్టయితే విస్థాపితులైన ఆదివాసులు ఆ భూమిపై తమ హక్కులను శాశ్వతంగా కోల్పోతారు. అది జరగకూడదంటే వీరంతా తక్షణమే వెనక్కి పోవాలి.








# హింసోత్పాతం

సల్వాజుడుం బీభత్సాన్ని గురించి ప్రత్యక్ష సాక్ష్యం దొరకడం చాలా కష్టం. సల్వాజుడుం ఆధ్వర్యంలో నడిచే రహదారి శిబిరాలలోని జనం మాట్లాడలేరు. తమను సల్వాజుడుం వారు బలవంతంగా శిబిరంలోకి లాక్కొచ్చారనీ తమ ఇళ్ళు తగలబెట్టారనీ చెప్పడమే ఎక్కువ. ఇంక మిగిలింది సల్వాజుడుం బారిన పడకుండా అడవి లోపలికి పారిపోయిన వారు, సల్వాజుడుం దెబ్బ ఇంకా పడని లోతట్టు గ్రామాల వారు, సల్వాజుడుం దాడికి ఊరు విడిచిపెట్టి మన ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చిన వారు.

అడవి లోపలికి పారిపోయిన వారిని కలుసుకోవడం కష్టం. వాళ్ళు ఒక చోట ఉండడం లేదు. చెట్టుకింద, పుట్టకింద తలదాచుకుని సాయంత్రం వేళ కాలిపోయిన తమ ఊర్ల దగ్గరికొచ్చి చేనులో పంట ఏమైనా ఉంటే దాని బాగోగులు చూసుకొని పోతున్నారు. మిగిలిన రెండు కోవలకు చెందిన వారిని కలవడానికి మేము చాలా ప్రయత్నం చేసి, కలిశాము. కానీ వారినుంచి లభించిన సమాచారం చాలా తక్కువ. సల్వాజుడుం పేరు చెప్పగానే వారు బిగుసుకుపోతారు. నోట్లోంచి ఒక్క మాట కూడా రాదు. దాడులకు గురైన వారిలో భయం సహజంగా ఉంటుంది గానీ ఇంత భయం మా అనుభవంలో మేము ఎక్కడా చూడలేదు. బహుశా సల్వాజుడుం క్రూరత్వానికి ఇంతకంటే వేరే రుజువు అక్కరలేదేమో.

దంతెవాడ అడవులను వదిలిపెట్టి ఖమ్మంలోకి పారిపోయి వచ్చిన వారిని మేము గొల్లగుప్ప, అల్లిగూడెం, మల్లంపేట, రేగులపాడు, సరివెల, ఆముదాలపేట, సున్నంవారి మట్టక, పావుర్లంకలలో కలిశాము. వారి వద్ద అన్ని సందేహాలూ నివృత్తి చేయగల సమాచారం దొరుకుతుందని ఉత్సాహపడ్డాము గానీ మాకు నిరాశే ఎదురైంది. సల్వాజుడుం పేరు తీయగానే నోరు



## చింతూరుపైన సల్వాజుడుం దాడి


చింతూరు సరిహద్దు గ్రామం. సరిహద్దు దాటితే కుంట. అవతలి నుంచి సల్వాజుడుంను తప్పించుకొని ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చిన వారు చింతూరు సంతకు ఏదో ఒకటి కొనడం కోసమో, అమ్మడం కోసమో పోక తప్పదు. సంత రోజే కాదు, వేరే రోజులలో కూడా పోతుంటారు. ఆ సంగతి తెలిసిన సల్వాజుడుం వాళ్ళు కత్తులతో, తుపాకులతో చింతూరు పైన దాడి చేసేవారు. ఛత్తీస్‌గఢ్ వాళ్ళు కనబడితే మీదపడి కొట్టి కాళ్లూ చేతులూ కట్టి ఆటోలో పడేసి కుంటకు తీసుకుపోయేవారు. ఆటోవాళ్ళు ఉద్దరకు ఈ మానవ సరుకును మోయాలి. లేకపోతే వాళ్ళకు దెబ్బలు పడేవి.

చింతూరు ఆటో డ్రైవర్లు ఈ దౌర్జన్యమేమిటని చింతూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టించుకోలేదు. ఎస్‌పికీ, కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశారు. చివరికి 2006 ఫిబ్రవరి 12 నాడు సల్వాజుడుం దౌర్జన్యానికి నిరసనగా చింతూరులోని ఆటోవాళ్ళంతా భద్రాచలం నుంచి రాజమండ్రి, విశాఖపట్నం వెళ్ళే రహదారిని ఆపేసి రాస్తారోకో చేశారు. ఇతర ప్రజలు కూడా వారితో కలిశారు. అప్పుడు పోలీసులు దిగొచ్చి కుంట నుంచి సల్వాజుడుం నాయకులను తీసుకొచ్చి ఆటో డ్రైవర్లకు క్షమాపణ చెప్పించారు.

పడిపోయినట్టు ఊరకుండి పోతారు. హావభావాలు, చేష్టలూ కూడా బంద్ అయిపోతాయి. మావోయిస్టుల గురించి అడిగితే మరీ అంత భయపడరు గానీ ఏమీ చెప్పరు. తమ ప్రస్తుత స్థితిగతుల గురించి మాత్రమే మాట్లాడతారు.

ఖమ్మం జిల్లాలో ఉన్న వాళ్ళకు సల్వాజుడుం అంటే అంత భయపడవలసిన అవసరం ఏమిటని అడుగుతారేమో. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి శిబిరాలలోకి రాకుండా ఆంధ్రప్రదేశ్‌లోకి పారిపోయిన వారిని సల్వాజుడుం ద్రోహులుగా భావిస్తుంది కాబట్టి వారి కోసం ఖమ్మం జిల్లాలోకి కూడా ప్రవేశించి వేటాడుతుంది. కుంట నుంచి సల్వాజుడుం వాళ్ళు ఏడుగురాళ్ళపల్లి సంతకు వ్యానులో వచ్చి ఛత్తీస్‌గఢ్ వాసులెవరైనా కనిపిస్తే బలవంతంగా ఎత్తుకుపోయిన సంఘటనలు గతంలో జరిగాయి.

చింతూరు మండల కేంద్రం మీద కూడా ఒకసారి సల్వాజుడుం వాళ్ళు దాడిచేసి చాలా బీభత్సం చేశారు. ఆ రోజు ప్రతిఘటన ఎదురు కాకపోతే బహుశా ఖమ్మం జిల్లా కూడా సల్వాజుడుం కార్యక్షేత్రంగా




మారేదేమోగాని చింతూరు వాసులు గట్టిగా ప్రతిఘటించేసరికి వాళ్ళు వెనక్కి తగ్గారు. అయినప్పటికీ సంతల మీద దాడిచేయడం అప్పుడప్పుడు జరుగుతూనే ఉంది. మొన్నటి ఏప్రిల్ 20న ఖమ్మంజిల్లా దుమ్ముగూడెం మండలంలోని చిన్ననల్లబెల్లి సంతమీద సల్వాజుడుం వాళ్ళు తుపాకులతో దాడిచేసి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 20 మందిని అపహరించి తీసుకుపోయారని పత్రికలు రాశాయి.

ఈ భయం కారణంగా ఛత్తీస్‌గఢ్ నుంచి పారిపోయి వచ్చి మన ఖమ్మం జిల్లాలో ఉంటున్న వాళ్ళు సల్వాజుడుం పేరు చెప్తేనే వణుకుతారు.

వారి భయానికి వేరొక కారణం కూడా ఉంది. ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడికి పారిపోయి వచ్చిన వారు ఎక్కువగా గొత్తికోయలు. గొత్తికోయ తెగ ఆంధ్రప్రదేశ్‌లో సహజాతంగా లేదు. ఇక్కడ కోయలు మాత్రమే ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కోయలు గొత్తికోయలు కూడా ఉన్నారు. అక్కడి కోయలకు ఇక్కడి (ఖమ్మం జిల్లా) కోయలతో సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి కాబట్టి పారిపోయి వచ్చిన వారిలోని కోయలు స్థానిక సమాజంలో నెమ్మదిగా కలిసిపోగలరు. ఇప్పటికే కొందరు తమ పిల్లలను గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేర్పించేశారు కూడా. గొత్తికోయలకు ఈ అవకాశం లేదు. పైగా వాళ్ళంటే మన రాష్ట్ర అటవీ శాఖకు బాగా కోపం కూడా. ఈ రోజు సల్వాజుడుం భయం కారణంగా వలసలు జరుగుతున్నాయి గానీ ఇంతకు ముందు కూడా భూమిలేని, తిండిలేని గొత్తికోయలు ఛత్తీస్‌గఢ్ నుంచి ఖమ్మం జిల్లాకు పారిపోయి రావడం దఫాలు దఫాలుగా జరుగుతూ ఉండింది. వాళ్ళు భద్రాచలం అటవీ డివిజన్‌లో రిజర్వ్ ఫారెస్టు నరికి వ్యవసాయం చేసుకొనేవారు. ఈ వలస ఇప్పటికీ సాగుతూనే ఉంది. మా బృందం 2006 నవంబర్ 26న ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన మల్లంపేట నుంచి దంతెవాడ అడవి గ్రామాలకు పోతుండగా, ఎదురుగా భుజం మీద పెద్ద కర్రకు సామాన్లు తగలించుకొని చకచకా నడిచి వస్తున్న వారు కనిపించారు. ఎక్కడి నుంచి వస్తున్నారు, ఎవరు మీరంటే తమది సుక్మ సమీపంలోని నంగరాస్ గ్రామమనీ, తాము గొత్తికోయలమనీ, 'ఎం-ఎల్ పార్టీ సహాయంతో' (అంటే మావోయిస్టుల సహాయంతో) భద్రాచలానికి 13 కిలోమీటర్లు ఈవల భూములు కొట్టుకొని వ్యవసాయం చేసుకుంటున్నామనీ అన్నారు. బహుశా నంగరాస్‌తో సంబంధాలు ఇంకా తెంపుకున్నట్టు లేరు. ఇక్కడికీ అక్కడికీ పోతూ వస్తున్నారు.


రిజర్వ్ ఫారెస్టులో ఇటువంటి గొత్తికోయ ఆవాసాలు భద్రాచలం అటవీ డివిజన్‌లో మూడు డజన్లదాకా ఉంటాయి. వాటిని అటవీ శాఖ అధికారులు తరచుగా తగలబెడుతుంటారు. గుడిసెలు తగలబెట్టి,



పంటలు ధ్వంసం చేస్తే ఛత్తీస్‌గఢ్‌కు తిరిగి వెళ్ళిపోతారని వారి భావన. కానీ అక్కడ ఏమీ లేక ఇక్కడకు వచ్చారు కాబట్టి ఇళ్ళు తగలబడ్డా సరే గొత్తికోయలు వెనక్కిపోలేదు. మళ్ళీ గుడిసెలు వేసుకోవడం, అటవీశాఖ వారు మళ్ళీ తగులబెట్టడం జరుగుతూనే ఉంది. 1980ల చివరి కాలంలో పూంగట్టు అనే గూడేన్ని తగలబెట్టినప్పుడు మొదలైన ఈ గృహ దహనాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మొన్నటి మార్చి 28న సరివెల దగ్గరున్న అడవిలోని గొత్తికోయ ఆవాసాలనూ, సున్నంవారి మట్టకలోని ఆవాసాలనూ అటవీశాఖ తగలబెట్టి బుగ్గి చేసింది. ఏప్రిల్ 19న వరంగల్ జిల్లా ఏటూరు నాగారం మండలంలోని గుర్రాలబావి దగ్గరున్న ఆవాసాలను తగలబెట్టింది. సల్వాజుడుం దెబ్బకు పారిపోయి వస్తున్న వారిలో గొత్తికోయలే ఎక్కువ కాబట్టి ఈ వలసలు అటవీ శాఖ దృష్టిని ఆకర్షించాయి. 'వాళ్ళు వస్తే అడవులు పోతాయి' అని రేంజర్లూ ఇతర సిబ్బందీ మొత్తుకుంటారు. ఈ సంగతి వలస వచ్చిన గొత్తికోయలకు కూడా తెలుసును కాబట్టి తాము వలస వచ్చామని చెప్పుకోవడానికి సైతం ఇష్టపడరు. అంతకు ముందు నుంచే ఇక్కడ ఉంటున్నట్టు నటిస్తారు. ఈ కారణంగా కూడా వారిచేత మాట్లాడించడం కష్టం.

పోలీసుల భయం కూడా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పునాది ప్రధానంగా గొత్తికోయలలో ఉందన్న అభిప్రాయం అధికారులలో ఉంది. అందువల్ల అక్కడి నుంచి ఇక్కడికి పారిపోయి వచ్చే గొత్తికోయలను పోలీసులు అనుమానంగా చూస్తారు. ఆ కారణంగా, తమ దగ్గరకు వచ్చే తెల్లబట్టల వాళ్ళందరినీ గొత్తికోయలు అనుమానంగా చూస్తారు. ఈ అన్ని కారణాలవల్ల మన ఖమ్మం జిల్లాలోకి వలస వచ్చిన దంతెవాడ నిర్వాసితుల నుంచి ఈ వలసకు దారితీసిన పరిస్థితుల గురించి ఎక్కువ తెలుసుకోవడం సాధ్యపడలేదు. అయితే ఈ నిర్వాసితులలో కోయలు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. వారిలో కూడా మగవాళ్ళ నుంచి మౌనమే జవాబైనా స్త్రీలు మాత్రం కొంచెం మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నారు. అల్లిగూడెం శివారులో మేము కలిసిన గగన్‌పల్లికి చెందిన కట్టంలక్ష్మి, రేగులపాడులో కలిసిన ఎం.పి. మారాయగూడెంకు చెందిన కట్టం సంకురమ్మ సల్వాజుడుం దాడుల గురించి ఒకే చిత్రం ఇచ్చారు. వారు పోలీసులు లేక పారామిలటరీతో కలిసి వస్తారు. రావడం రావడమే కాల్పులు జరుపుకుంటూ, ఇళ్ళకు అగ్గి పెట్టుకుంటూ పారిపోతున్న వాళ్ళను నరుకుతూ బీభత్సం సృష్టిస్తారు. కోళ్ళు, మేకలు, పందులు ఎత్తుకుపోతారు. ఒక్కొక్కసారి దాడి అయిపోయిన తరువాత ఆ కోళ్ళనో, మేకలనో అక్కడే వండుకొని








గగన్‌పల్లి నుంచి ఖమ్మంజిల్లా అల్లిగూడెంకు వలస వచ్చి ఉంటున్న కట్టా లక్ష్మి

తింటారు. వీళ్ళిద్దరూ చెప్పలేదుగానీ, గ్రామంలో మావోయిస్టు సానుభూతిపరులుగా గుర్తింపు ఉన్న వారిని మండుతున్న గుడిసెలలో పడేసి సజీవంగా దహనం చేసిన ఘటనలూ ఉన్నాయి. అర్లపల్లిలో, పోలంపల్లిలో ఈ రకమైన సజీవ దహనాలకు పాల్పడ్డారని పావుర్లంక గ్రామంలో మేము కలిసిన మడావి ఇరమయ్య చెప్పాడు.

సల్వాజుడుం కేంద్రాలన్నీ రహదార్ల మీదే ఉన్నాయి. బలవంతంగా అడవినుంచి రహదారిపైకి తరలించిన ప్రజల శిబిరాలే సల్వాజుడుం కేంద్రాలుగానూ పనిచేస్తున్నాయి. వాటికి కాపలాగా పోలీసుస్టేషన్లూ, ఔట్‌పోస్టులూ, పారామిలటరీ క్యాంపులూ ఉంటాయి. రాత్రిపూట సర్చ్‌లైట్లు వేసి పరిసరాల పైన నిఘా వేస్తారు. ఈ శిబిరాలను కేంద్రాలుగా చేసుకొని సల్వాజుడుం, పోలీసు, పారామిలటరీ బలగాలు అడవులపైన దాడి చేస్తుంటారు. ఈ దాడుల పరిధి మేరకు అడవులు ఖాళీ అయిపోయాయి. ఈ పరిధి ఒక చోట రహదారికి 10 కిలోమీటర్లు ఉండవచ్చు, ఒక చోట 20 కిలోమీటర్లు ఉండవచ్చు. దానికి ఆవల మావోయిస్టు దళాల ప్రభావం, నియంత్రణ ఎప్పటిలాగే కొనసాగుతున్నాయి.




కుంట నుంచి పడమటికి గొల్లపల్లి మార్గంలో సల్వాజుడుం ప్రభావం గత నవంబర్ నాటికి చింతగుప్ప, గొరక, బండ గ్రామాల దాకా ఉండింది. వాటికి తూర్పున సల్వాజుడుం రాజ్యం, పశ్చిమాన మావోయిస్టుల రాజ్యం నడిచేవి. ఈ మూడు ఊర్లను సల్వాజుడుం వాళ్ళు తగలబెట్టారని మొదట విన్నాము గానీ తరువాత తెలిసింది గొరక, బండ గ్రామాలను తగలబెట్టగా ఆ భయానికి చింతగుప్ప కూడా ఖాళీ అయిందని. అయితే సల్వాజుడుంకు సహకరించనందుకు చింతగుప్ప సర్పంచ్ పోడియం పండా ఇల్లు మాత్రం తగలబెట్టారు. బండలో ఒక పారామిలటరీ క్యాంపు వెలిసింది. దానితో ఈ 'సరిహద్దు'కు పశ్చిమాన ఉన్నవారు అడవి బాటలను పట్టుకొని సైతం కుంటకు పోలేకపోయారు. గొరక నుంచి పారిపోయి వచ్చిన ఉయిక కన్నయ్య, ఉయిక లక్ష్మిలను, చింతగుప్ప నుంచి పారిపోయి వచ్చిన కొమురం చిన్నయ్యను, వాటి పరిసర గ్రామమైన గుంపెల్లికి చెందిన మడావి రామును మేము ఖమ్మం జిల్లా మల్లంపేటలో 2006 నవంబర్ 18న కలిశాము.

గొరకలో 2006 సెప్టెంబర్‌లో సల్వాజుడుం వారు కోయలకు చెందిన 20 ఇళ్ళు, గొత్తికోయలకు చెందిన 35 ఇళ్ళు తగలబెట్టారు. లక్ష్మిని, కన్నయ్యను కొట్టి ఇంజరంలోని శిబిరానికి తీసుకుపోయారు. వీరికి 15 ఎకరాల భూమి ఉండేది. వారి కొడుకు భీమయ్య పారిపోయి వచ్చి సరిహద్దు గ్రామమైన మల్లంపేటలో గుడిసె వేసుకుని తల్లిదండ్రులను విడిపించి తన దగ్గరకు రప్పించుకునే ప్రయత్నం చేశాడు. భద్రాచలం ఎంఎల్ఏని పట్టుకొని చింతూరు ఎస్.ఐతో మాట్లాడించగా, ఆ ఎస్.ఐ ఇంజరం పోయి ఆ ముసలి వాళ్ళిద్దరినీ ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకువస్తానన్న వ్యక్తిగత హామీ ఇచ్చి తీసుకొచ్చి కొడుకుకు అప్పగించాడు. గొరకకు చెందిన వారు ఒకరిద్దరు మావోయిస్టు పార్టీలో ఉన్నారు కానీ సల్వాజుడుం వైపు మనస్ఫూర్తిగా పోయిన వాళ్ళు ఒక్కరు కూడా లేరు. తమ ఇళ్ళ మీదికి ఒక దజను, లేక పదిహేను మంది తుపాకులు వేసుకొని వచ్చారని అక్ష్మి అనింది. అందులో పోలీసులూ సల్వాజుడుం వాళ్ళూ కూడా ఉన్నారు. రావడం రావడమే ఇళ్ళు తగలబెట్టారు. పారిపోయిన జనంలో ఎవరు చేతికి చిక్కితే వారిని కొట్టి ఇంజరం గుంజుకుపోయారు. చిక్కని వారిలో కొందరు ఈ కుటుంబం లాగ మన ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చారు.

పారిపోకుండా అక్కడే ఉండిపోయిన వారు కాలిన గుడిసెల పక్కనే మళ్ళీ గుడిసెలు వేసుకొని నివసించే సాహసం చేయడం లేదు.






గుడిసెలు వేసుకుంటే మళ్ళీ సల్వాజుడుం వాళ్ళు వస్తారని భయం. అందుకని దగ్గర్లోని అడవులలో, గుట్టలలో చెట్లనీడన ఉంటున్నారని భీమయ్య అంటాడు. ఉంటూ సాయంకాలం సమయంలో తమ భూముల వైపు పోయి ఏదైనా పంటవేసి వుంటే దాని బాగోగులు చూసుకుంటున్నారంటాడు. గుంపెల్లికి చెందిన మడావి రాము కూడా ఇదే మాట అన్నాడు. వీళ్ళ కుటుంబానికి 5 ఎకరాల భూమి ఉండేది. అందులో నువ్వులు, వరి పండించే వారు. 5 ఎకరాలలో 15 బస్తాల వడ్లు పండించేవాడు. నువ్వులైతే ఇంకొంచెం ఎక్కువ పండేవి. గుంపెల్లిని సల్వాజుడుం తగలబెట్టలేదు గానీ సమీప గ్రామాలైన గొరక, బండలను తగలబెట్టినన విషయం విని గుంపెల్లి వాళ్ళు కొందరు పారిపోయి వచ్చారు. రాము వారిలో ఒకడు. అతని తమ్ముడు, తల్లి అక్కడే ఉండిపోయారు. అయితే వాళ్ళు గుట్టల మీద తాత్కాలికంగా గూడు ఏర్పాటు చేసుకొని పరిస్థితులు కొంచెం బాగున్నప్పుడు గుట్ట దిగి వచ్చి వ్యవసాయం పనులు చూసుకొని తిరిగి పోతున్నారు. అందరూ వచ్చేస్తే భూమి పోతుందని అతని భయం. సల్వాజుడుం వాళ్ళను గురించి రాక్షసుల గురించి మాట్లాడినట్టు మాట్లాడతారు దంతెవాడ జిల్లాలో.

బండ నుంచి పారిపోయి వచ్చిన మూడు కుటుంబాలు కూనవరం మండలం లింగాపురంలో ఉన్నారు గానీ వాళ్ళకు స్థానికంగా ఆశ్రయం కల్పించిన వాళ్ళు మాట్లాడవలసిందే తప్ప వాళ్ళు మాట్లాడరు. ఆ భయానికి కారణం కూడా స్థానికులు చెప్పారు. ఇక్కడ తల దాచుకుంటున్న వారు సంతలకు పోక తప్పదని ఎరిగిన సల్వాజుడుం వారు చింతూరు, తుమ్మల, ఏడుగురాళ్ళపల్లి గ్రామాలపైన వ్యాన్‌లలో లారీలలో వచ్చి దాడి చేసి వారిని చితకగొట్టి బలవంతంగా ఎత్తుకుపోయిన ఘటనలు జరిగాయి.

చింతగుప్ప, బండ, గొరక గ్రామాలు గత నవంబర్ నాటికి సల్వాజుడుం ఇలాఖాకూ, మావోయిస్టుల ఇలాఖాకూ మధ్య సరిహద్దు ప్రాంతమని చెప్పాము. వీటికి ఆవల మావోయిస్టుల ఇలాఖాలో ఉన్న పూసుగూడెం, మైత గ్రామాలకు మేము 2006 నవంబర్ 26న వెళ్ళాము. ఈ గ్రామాలు తాలూకా కేంద్రమైన కుంట నుంచి చూసినప్పుడు దట్టమైన అడవిలో, అందుబాట్లో లేనంత దూరంలో ఉన్నట్టు కనిపిస్తాయి గానీ మన రాష్ట్ర సరిహద్దు వెంబడి చింతూరు నుండి మల్లంపేట పోయినట్టయితే అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించి అడవిబాట పట్టుకొని ఈ ఊళ్ళకు నడిచిపోవచ్చు.



పూసుగూడెంలోనూ, మైతలోనూ కూడా అప్పటికి జనం ఉన్నారు. 'ఈ అడవిలోకి వీళ్ళెట్లా వచ్చారా?' అని మమ్మల్ని అనుమానంగా చూసినా మాట్లాడారు. కానీ సల్వాజుడుం ప్రస్తావన చేసినా, మావోయిస్టుల ప్రస్తావన చేసినా పట్టుదలగా మౌనం పాటించారు. మరీ ఒత్తిడి పెడితే అబద్ధాలు చెప్పడానికి కూడా సిద్ధపడ్డారు. ఉదాహరణకు మైతకు వెలుపల ఒక అంగన్‌వాడి కేంద్రం, ఆశ్రమ పాఠశాల ఉన్నాయి. వాటిని మావోయిస్టులు పేల్చేశారు. అయితే వాటి గురించి అడిగితే, సల్వాజుడుం వాళ్ళు వాడుకోగలరు కాబట్టి వాటిని కూల్చేయమని మావోయిస్టులు అంటే తామే కూల్చేశామని మైతవాసులు అన్నారు. నిజానికి ఆ కట్టడాలు కూల్చేయ లేదు. వాటిని శక్తివంతమైన బాంబులు పెట్టి పేల్చారు. అది గ్రామస్తుల వల్ల అయ్యే పని కాదు. ఈ పాఠశాలలో మైతకే కాక పూసుగూడెం, బండారు చెల్క గ్రామాలకు చెందిన వాళ్ళు కూడా చదువుకుంటుండే వారు.

నవంబర్ నెల తరువాత సల్వాజుడుం, పారామిలటరీ బలగాలు మైత పైన కూడా దాడి చేశారనీ మైతవాసులు కూడా ఆ ఊరు వదిలి పారిపోయారనీ చింతూరుకు చెందిన వాళ్ళు అనగా విన్నాము. దీని గురించి మల్లంపేటలో వాకబు చేయగా అది నిజం కాదని అన్నారు.

సల్వాజుడుం వాళ్ళు ఊర్లు ఖాళీ చేయించడానికి ఇళ్ళు తగలబెట్టడం గురించి ఇప్పటికే పలుమార్లు చెప్పాము. నిలువ నీడలేకుండా చేస్తే ఇష్టమున్నా, లేకున్నా రహదారి శిబిరాలలోకి వస్తారని వారి ఆలోచన. అయితే కొందరు అటు పోగా కొందరు అడవులోకి పోయి చెట్టునీడనా, పుట్టనీడనా బతుకుతున్నారనీ, కొందరు సరిహద్దు దాటి మన ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చారనీ చెప్పాము. శిబిరాలలో ఉన్నవారి సంఖ్య దాదాపు 50,000 ఉండగా ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చిన వారి సంఖ్య తెలీదు. వేలల్లో ఉంటుందనేది దాదాపు అందరి అభిప్రాయం. ఖమ్మం జిల్లా అడవి ప్రాంతంలో ఒక చోట స్థిరపడి గుడిసెలు వేసుకున్న కుటుంబాల సంఖ్యే 1380 ఉన్నాయి. కుటుంబానికి అయిదుగురు సభ్యులను వేసుకున్నా ఈ జనాభా 6,900 మంది ఉంటారు. ఖమ్మం జిల్లా అడవులలో స్థిరపడకుండా పాల్వంచ పారిశ్రామిక కేంద్రానికీ, మణుగూరుకూ పోయిన వారు, ఖమ్మం జిల్లా ఎల్లలు దాటి ఇతర జిల్లాలకు పోయి ఎవరికీ ఆచూకీ తెలపకుండా కూలి చేసుకుంటున్న వారుకూడా చాలామంది ఉన్నారు. మొత్తం 10,000 – 15,000 మంది దాకా ఉంటారు. 20,000 అని






‘డౌన్ టు అర్త్’ అనే పత్రిక 31 అక్టోబర్ 2006 నాటి సంచికలో ప్రచురించిన ఒక రిపోర్టులో అంచనా వేసింది గానీ ఆ అంచనాకు ఆధారమేమిటో తెలీదు. ఇక శిబిరాలలోకి గానీ మన రాష్ట్రంలోకి గానీ రాకుండా దంతెవాడ అడవులలోనే తలదాచుకున్న వారు ఎంత మందో ఎవరికీ తెలీదు.

## ఎన్ని హత్యలో ఇప్పటికీ తెలియదు

సల్వాజుడుం వారు ఎన్ని గ్రామాలు తగలబెట్టారు? అంటే సరిగ్గా చెప్పగల వారెవరూ లేరు. మావోయిస్టులు గత వేసవిలో విడుదల చేసిన ఒక జాబితా ప్రకారం సల్వాజుడుం వారు 91 గ్రామాలలో 1857 ఇళ్ళు తగలబెట్టారు. అయితే ఈ జాబితాలో గగన్‌పల్లి లేదు కాబట్టి ఇది సమగ్రమైన సమాచారం కావడానికి లేదు. ఈ ఒక్క జాబితాయే కాదు. సల్వాజుడుం హింస గురించి మావోయిస్టులు విడుదల చేసిన అన్ని జాబితాలలోనూ బిజాపూర్, బైరంగఢ్ బ్లాక్‌ల సమాచారమే తప్ప కుంట తాలూకా సమాచారం సమగ్రంగా లేదు. బిజాపూర్, బైరంగఢ్‌ల సమాచారమైనా సమగ్రమైనదో కాదో తెలీదు. అందువల్ల సల్వాజుడుం వాళ్ళు చాలా హింస చేసినట్టు చూపించే మావోయిస్టు ప్రచురణలు నిజానికి ఆ హింసను తక్కువగా చూపించాయని గుర్తించక తప్పదు. సల్వాజుడుం ఆవిర్భావం నుంచి (అంటే జూన్ 2005 నుంచి) మార్చి 2006 దాకా సల్వాజుడుం, పోలీసులు, పారామిలటరీ దళాలు కలిసి 116 మందిని చంపినట్టు మావోయిస్టులు మార్చి 2006లో విడుదల చేసిన ఒక ప్రకటన అంటుంది. అయితే ఈ 116లో ఒక్కటి కూడా కుంట తాలూకాలో జరిగిన ఘటన కాదు. వాస్తవానికి వాళ్ళ చేతులలో ఎంత మంది చనిపోయారో మావోయిస్టులే సరిగ్గా చెప్పలేకపోతున్నారు. పేర్లతో సహా ఇచ్చిన ఆ జాబితాలో 116 మంది ఉంటే జూన్ 2006లో సల్వాజుడుం బాధితుల సంఘీభావ కమిటీ హిందీలో ప్రచురించిన ఒక బుక్‌లెట్‌లో సల్వాజుడుం, పోలీసు బలగాల చేతిలో 250 మందికి పైగా చనిపోయారని అన్నారు. అదే నెలలో దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన పేరిట తెలుగులో వచ్చిన కరపత్రంలో 200 మంది చనిపోయారన్నారు. ఈ రెండు ప్రచురణలలోనూ ఇంతకంటే వివరాలు లేవు. ఇప్పటికైనా వారి దగ్గర సమగ్రమైన సమాచారం ఉందో లేదో తెలీదు.




మావోయిస్టుల దగ్గర తమ వైరి వర్గాల హింస గురించి సమగ్రమైన సమాచారం లేకపోవడాన్ని వారు ఎదుర్కొంటున్న తీవ్ర నిర్బంధం

పర్యవసానంగా అర్థం చేసుకోవచ్చు కానీ విచిత్రమైన విషయం ఏమిటంటే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం దగ్గర కూడా సల్వాజుడుం, పోలీసు బలగాలు కలిసి చేసిన హత్యలను గురించి సమగ్ర సమాచారం కాదు కదా, ఏ సమాచారమూ లేదు.

మేము 2006 మే నెలలో దంతెవాడ కలెక్టర్‌తో మాట్లాడినప్పుడు సల్వాజుడుం ఆవిర్భావం నుంచి మావోయిస్టులు 228 మంది పౌరులను, 25 మంది పోలీసు, పారామిలటరీ సిబ్బందిని చంపారని చెప్పాడు. (ఆ 228 మంది పౌరులలో స్పెషల్ పోలీసు ఆఫీసర్లుగా నామకరణం చేయబడిన సాయుధ సల్వాజుడుం కార్యకర్తలు 12 మంది ఉన్నారు.) మరి మావోయిస్టులను గానీ, సాధారణ పౌరులను గానీ ఎంతమందిని సల్వాజుడుం వారూ, పోలీసు పారామిలటరీ బలగాలూ చంపాయని అడిగితే మా దగ్గర ఆ సమాచారం లేదని అంటాడు. ఎందుకు లేదు? ఒక హత్య జరిగితే శవానికి పంచనామా జరిపించి, శవపరీక్ష జరిపించి, ఎవరు హత్య చేశారో పరిశోధించే బాధ్యత మీదే కదా అని అడిగితే శవ పంచనామాలూ, శవ పరీక్షలూ జరపడానికి శవాన్ని అసలు తీసుకొస్తే కదా అంటాడు. జరిగేది ఏమిటంటే సల్వాజుడుం వారు, పోలీసులు, పారామిలటరీ బలగాలు కలిసి మావోయిస్టులకు బలం ఉన్న గ్రామాల మీద, అడవిలో ఉన్న మావోయిస్టు దళాల మీద దాడి చేస్తాయి. నరుకుతారు, కర్రలతో తలలు పగలగొట్టి చంపుతారు, తుపాకులతో కాలుస్తారు. అవతలి వారు గాయపడి కింద పడిపోగానే వీళ్ళు వెళ్ళిపోతారు. బతికారా చచ్చారా అని చూడరు. బతికి ఉంటే వైద్య సహాయం అవసరమేమో చూడరు. చనిపోయి ఉంటే పంచనామా, శవపరీక్ష జరపరు. అందువల్ల ఈ దాడులలో ఎన్ని ప్రాణాలు పోయిందీ ఎవరికీ తెలీదు.


ఇది క్షమించరాని వైఖరి అనడంలో సందేహమేమీ లేదు. చంపేసి ఆత్మరక్షణలో చంపామని అంటే అవునో కాదో విచారణ జరపవచ్చు. లేదా మావోయిస్టులకూ తమకూ కాల్పులు జరుగుతుండగా మధ్యలో ఇరుక్కొని మామూలు జనం చనిపోయారని అంటే దాని మీద కూడా విచారణ జరపొచ్చు. కానీ ఆ చావును గుర్తించకనే పోతే? ఏ అసహజ మరణం సంభవించినా శవ పంచనామా జరపాలి, శవపరీక్ష జరపాలి, కేసు నమోదు చేయాలి, ఏం జరిగిందో విచారించి తేల్చాలి. మనుషుల్ని చంపేసి అదొక ఘటనే కానట్టు, ఏమీ జరగనట్టు, శవాలను కుక్కలకూ కాకులకూ వదిలేసి వెళ్ళిపోవడం ఏ చట్టం గుర్తించే పద్ధతి? తీవ్రంగా గాయపడి బతికి ఉన్న మనిషిని అడవిలో వదిలేసి పోవడం ఏ రకమైన మానవత్వం?





**దంతెవాడ నుంచి పారిపోయి వచ్చిన ఆదివాసులు**
**ఖమ్మం జిల్లాలో గుడిసెలు వేసుకున్న గ్రామాలు (ఏప్రిల్ 2007 నాటికి)**

| సం. | మండలం | గ్రామం | గ్రామపంచాయతీ | కుటుంబాల సంఖ్య |
|---|---|---|---|---|
| 1. | చింతూరు | గోపాలపురం | గూడూరు | 15 |
| 2. | ” | తేరపాడు | చింతూరు | 13 |
| 3. | ” | కొత్తూరు | తుమ్మల | 25 |
| 4. | ” | ఆముదాలపాడు | పేగ | 15 |
| 5. | ” | నారాయణపురం | పేగ | 25 |
| 6. | ” | దెయ్యాలవాయి | పేగ | 15 |
| 7. | ” | అల్లిగూడెం | పేగ | 30 |
| 8. | ” | ఎదురుగూడెం | పేగ | 10 |
| 9. | ” | బండిగుంపు | పేగ | 9 |
| 10. | ” | లంకపల్లి | పేగ | 16 |
| 11. | ” | జగ్గవరం | పేగ | 11 |
| 12. | ” | తాటిలంక | ఏడుగురాళ్ళపల్లి | 20 |
| 13. | ” | వెంకటాపురం | వెంకటాపురం | 22 |
| 14. | ” | అల్లివాగు | అల్లివాగు | 25 |
| 15. | భద్రాచలం | ఎ.పి.మారాయగూడెం | లక్ష్మీపురం | 35 |
| 16. | ” | చోడవరం | నెల్లిపాక | 35 |
| 17. | ” | గుండాల | గుండాల | 16 |
| 18. | ” | రాయన్నపేట | రాయన్నపేట | 30 |
| 19. | ” | సీతాపురం | సీతాపురం | 40 |
| 20. | ” | గన్నవరం | గన్నవరం | 55 |
| 21. | ” | నందిగాం | నందిగాం | 50 |
| 22. | ” | మురుమూరు | మురుమూరు | 30 |
| 23. | ” | కాచవరం | కాచవరం | 35 |
| 24. | ” | టేకుబాక | టేకుబాక | 25 |
| 25. | ” | పొల్లూరు | మర్రిగూడెం | 65 |



| | | | | |
|---|---|---|---|---|
| 26. | చర్ల | పులిగొండ | దేవరపల్లి | 25 |
| 27. | దుమ్ముగూడెం | మంగతోగు | చిన్ననల్లబెల్లి | 30 |
| 28. | ” | సీతారామపురం | నడికుడి | 32 |
| 29. | వి.ఆర్.పురం | సున్నంవారి మట్టక | పెద్దమట్టపల్లి | 14 |
| 30. | కుకునూరు | కొండపల్లి | కొండపల్లి | 65 |
| 31. | అశ్వరావుపేట | దుబ్బతోగు | వినాయకపురం | 75 |
| 32. | మణుగూరు | వీరభద్రాపురం | రామాంజం | 40 |
| 33. | ములకలపల్లి | మూకమామిడి | మూకమామిడి | 40 |
| 34. | పినపాక | నీలాద్రిగండి | పద్మాపురం | 195 |
| 35. | ” | కొత్తూరు | జగ్గంపేట | 165 |
| | | | మొత్తం | 1148 |

సల్వాజుడుం, పోలీసు, పారామిలటరీ బలగాలు చేసిన దాడులు ఎంత క్రూరంగా జరిగాయో కొన్ని ఉదాహరణలు పైన ఇచ్చాము. మరికొన్ని ఉదాహరణలు ఇతర నిజనిర్ధారణ కమిటీల నివేదికల నుంచి చూద్దాం. పై అధ్యాయాలలో చెప్పినట్టు, మూడవ జనజాగరణ్ అభియాన్ మొదలైన తరువాత మొట్టమొదట ఆ ప్రాంతంలో పర్యటించింది మా సంస్థ, ఒపిడిఆర్‌ల సంయుక్త నిజనిర్ధారణ కమిటీ. 2005 జూలై నెలలో జరిపిన ఆ పర్యటన వివరాలను పై అధ్యాయంలో చెప్పాము. ఆ సందర్భంగా మేము విడుదల చేసిన ప్రకటన పూర్తి పాఠం అనుబంధం–II లో ఇచ్చాం. ఆ తరువాత ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సిపిఐ వారు 2005 నవంబర్ నెలలో బిజాపూర్ ప్రాంతంలో పర్యటించి వివరమైన నివేదిక ప్రకటించారు. ప్రధాన మంత్రికి లేఖ రూపంలో సమర్పించిన హిందీ నివేదిక పూర్తి అనువాదాన్ని అనుబంధం–III లో ఇచ్చాం. అందులో కొన్ని దాడుల గురించి వారిచ్చిన చిత్రాన్ని ఇక్కడ చూద్దాం.

> లోహుగాం గ్రామంలో నవంబర్ 10, 2005 నాడు ఇద్దరిని చంపారు. బైలడిల్లా గనులకు పశ్చిమం వైపు ఉన్న గ్రామాల ప్రజలు తమ గ్రామాలలో జరిగిన నష్టాన్ని గురించి వివరంగా చెప్పారు. ఒక నెల రోజుల క్రితం సిఆర్‌పిఎఫ్ జవాన్లు 50 మంది సల్వాజుడుం వాళ్ళతో కలిసి తమ గ్రామం పైన దాడి చేశారని మంద్‌బేడి గ్రామ ప్రజలు అన్నారు. నాను ఇంటి నుంచి 40 కిలోల బియ్యం దొంగిలించారు. దొరికిన పందులను, కోళ్ళను,






మేకలను ఎత్తుకుపోయారు. కమాద్ గ్రామంలో 36 ఇళ్ళున్నాయి. సల్వాజుడుం వారు పోలీసులతో సహా ఆ ఊరికి వచ్చి నాలుగు ఇళ్ళు తగలబెట్టారు. ఆ ఊరిలోని ఇళ్ళ నుంచి 20 కోళ్ళు, 20 కిలోల బియ్యం, ఒక పందిని తీసుకొని అక్కడే వండుకొని తిన్నారు. భయం కొద్దీ గ్రామస్తులు అడవిలోకి పారిపోయారు. పోతూ పోతూ సల్వాజుడుం వాళ్ళు 2.25 క్వింటాళ్ళ కోస్రా ధాన్యానికీ, 40 కిలోల బియ్యానికీ నిప్పు పెట్టారు. కమాద్ దగ్గరున్న హిరిల్ గ్రామంలో సల్వాజుడుం వాళ్ళు అత్యధికంగా అత్యాచారాలకు పాల్పడ్డారు. ప్రతి ఇంటినీ తగలబెట్టారు. హత్యలకు పాల్పడ్డారు. కమాద్ గ్రామానికి చెందిన లక్ష్మా మాకు ఈ సంగతి చెప్పాడు. 2005 సెప్టెంబర్ 30 నాడు సల్వాజుడుం వాళ్ళు బంబలూర్ గ్రామం వైపు నుంచి వచ్చి 6 పందులను, 6 కోళ్ళను చంపి అక్కడే తిన్నారనీ, 30 గిన్నెలు ఎత్తుకుపోయారనీ ఒక నిమ్మచెట్టునూ, మరొక చెట్టునూ కోశారనీ, ఒక సైకిల్‌ను విరగగొట్టారనీ గుర్చి గ్రామస్తులు చెప్పారు. 60-70 మంది గ్రామస్తులు పారిపోగా ఒక్కొక్క ఇంటి నుంచి ధాన్యం, విప్పపూవులు తీసుకుపోయారని చెప్పారు. 10,000 రూపాయల నగదు కూడా తీసుకుపోయారని చెప్పారు. అక్టోబర్ నెలలో 1,000 మంది సల్వాజుడుం వాళ్ళు సిఆర్‌పిఎఫ్‌తో సహా గ్రామంలోకి వచ్చి 17 మందిని పట్టుకొని విపరీతంగా కొట్టి తీసుకుపోయి సల్వాజుడుంలో చేర్పించారని ముల్లూరు గ్రామస్తులు చెప్పారు. ఐతు కొడుకు ఉత్సా సొన్నును సిఆర్‌పిఎఫ్ వాళ్ళు పట్టుకొని అతని గొంతు కోసి రోడ్లో పడేశారు. ఈ ఊరిలో 50 ఇళ్ళు ఉన్నాయి. ఈ దాడిలో కోళ్ళు ఇతర పశువులను కూడా తీసుకుపోయారు.

పియుసిఎల్, పియుడిఆర్, ఎపిడిఆర్, ఐఎపిఎల్ (మూడు హక్కుల సంఘాలు, ఒక న్యాయవాదుల సంఘం) ప్రచురించిన నివేదికలో నుంచి ఒక ఘటనను ఇక్కడ అనువదించి ఇస్తున్నాం. ఇది బిజాపూర్ - గంగలూర్‌ల మధ్యనున్న మంకేలి గ్రామం కథ.

15 సెప్టెంబర్ (2005) నాడు సల్వాజుడుం మొట్టమొదటిసారి ఈ గ్రామానికి వచ్చినప్పుడు (వారితో పాటు వచ్చిన) సిఆర్‌పిఎఫ్




> వాళ్ళు ప్రజల ఇళ్ళకు, పందుల కొట్టాలకు నిప్పు పెట్టారు. సల్వాజుడుం వాళ్ళేమో ప్రజల ఇళ్ళ నుంచి మేకలు, పందులు, కోళ్ళు, వాళ్ళు దాచుకున్న విప్పపువ్వు, ధాన్యం తీసుకుపోయారు. గ్రామ అంగన్‌వాడి కేంద్రంలో దాచిన విప్పపువ్వును, చింతపండును లూటీచేసి ఆ కేంద్రాన్ని తగలబెట్టారు. 20 సంవత్సరాల మొడియం భద్రు అనే 'సంఘం' సభ్యుడిని చంపారు. అతని శవాన్ని గ్రామస్తులు పూడ్చి పెట్టారు. ఈ ఘటన తరువాత, సహజంగానే, ఎవరూ సల్వాజుడుంలో చేరడానికి ఇష్టపడలేదు. వాళ్ళు ఊహించినట్టే ఆ ఊరిపైన మళ్ళీ దాడి జరిగింది. ఈసారి నాగా బెటాలియన్ సైనికులు మాత్రమే వచ్చారు. 'సంఘం' సభ్యులైన కోర్సా సక్లును, పూనెం కందును చంపారు. అయిదారుగురు అబ్బాయిలను, ఒక అమ్మాయిని తీసుకుపోయి ఇన్‌ఫార్మర్లుగా మలచుకున్నారు. గ్రామ ముఖియాను కూడా తీసుకుపోయారు. మూడవసారి, అక్టోబర్ 3వ తేదీన, నాగా సైనికులు మళ్ళీ వచ్చారు. తమతో గతంలో తీసుకుపోయిన వారిలో ఇద్దరిని తిరిగి తీసుకొచ్చారు. వారు పొలంలో పని చేసుకుంటున్న కోసా ఐతు, ఇమ్లా కోవాలను 'సంఘం' సభ్యులుగా గుర్తించగా వారిద్దరినీ పొలంలో పని చేసుకుంటుండగానే చంపారు.

ఈ దాడులలో భాగంగా స్త్రీలపైన జరిగిన అత్యాచారాలు, హింస గురించి కూడా మావోయిస్టులు కొంత సమాచారాన్ని విడుదల చేశారు. 21 మంది స్త్రీలను చంపారనీ, 34 మంది స్త్రీల పైన లైంగిక అత్యాచారాలు, హింస జరిగిందనీ, 29 మంది స్త్రీలపైన శిబిరాలలోనూ పోలీసు స్టేషన్లలోనూ లైంగిక అత్యాచారం జరిగిందనీ మరో ముగ్గురు అదృశ్యమయ్యారనీ ఈ సమాచారం. అయితే మామూలు సందర్భాలలో సైతం స్త్రీలపైన జరిగే హింస గురించి వాస్తవాలు తెలుసుకోవడం కష్టం కాబట్టి ఈ సమాచారం సమగ్రమూ కాకపోవచ్చు, దానిని నిర్ధారించుకోవడం సులభమూ కాకపోవచ్చు.

అయితే స్త్రీలపైన లైంగిక హింస లేక ఒత్తిడికి సంబంధించి రహదారి శిబిరాల విషయంలో మరికొంత నిర్దిష్ట సమాచారం ఉంది. రహదార్ల పైన 32 దాకా శిబిరాలు ఉన్నాయని చెప్పాము. ప్రతీ శిబిరం దగ్గరా దానికి కాపలాగా నాగా బెటాలియన్ బలగాలు, సిఆర్‌పిఎఫ్ వారు ఉన్నారు. ఈ జవాన్లు






శిబిరంలోని ఆదివాసీ స్త్రీలతో సంబంధాలు పెట్టుకోవడం, వారి ఇళ్ళలో రోజుల తరబడి ఉండిపోవడం పరిశీలకులు గమనించిన విషయం. అటువంటి ఇళ్ళలో కొన్నాళ్ళకు ఆదివాసులు అంతకు ముందు చూసి ఎరుగని టివి సెట్లు, ఇతర ఖరీదైన వస్తువులు కనిపిస్తాయి. ఇందులో బలవంతం ఎంత, స్వేచ్ఛాయుతమైన నిర్ణయం ఎంత, డబ్బు ఆశ తెచ్చిన ప్రలోభం ఎంత, తెలియనితనాన్ని ఆసరా చేసుకొని లోబరచుకోవడం ఎంత, తుపాకులు పట్టుకున్న సైనికుల కోరికను ఎట్లాగూ కాదనడం సాధ్యం కాదు కాబట్టి గొడవ పెట్టుకోకుండా అంగీకరించి కొంచెం మెరుగైన బతుకైనా పొందుదామన్న ఆలోచన ఎంత అంటే విడమరచి చెప్పడం కష్టమేమో. ఎస్‌పివోలుగా నియమించబడ్డ ఆదివాసీ అమ్మాయిల పరిస్థితి ఈ విషయంలో మరీ అధ్వాన్నంగా ఉన్నట్టు సమాచారం. జగ్దల్‌పూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా ఎస్.పి.వోలు అసాధారణమైన సంఖ్యలో గర్భస్రావం చేయించుకోవడం వాస్తవమేనని ఆ ఆస్పత్రి మేట్రన్ చెప్తున్న విషయం.

ఎస్‌పివో లేక స్పెషల్ పోలీసు ఆఫీసర్ గురించి ఇప్పటికే చాలాసార్లు ప్రస్తావించాము. యువకులైన సల్వాజుడుం సభ్యులకు ప్రభుత్వం తుపాకులిచ్చి, అరకొరగా తర్ఫీదు ఇచ్చి, చంపే లైసెన్స్ ఇచ్చి సమాజం మీదికి వదులుతున్న వైనానికి చట్టపరమైన ఆచ్ఛాదన ఈ ఎస్‌పివో అనేది. పోలీసు చట్టంలోని సెక్షన్ 17 కింద ఈ నియామకం జరుగుతుంది. ఒక దొమ్మీ జరుగుతున్నప్పుడు, లేదా ఏ క్షణమైనా జరగగలదన్న పరిస్థితి ఉన్నప్పుడు, దానిని అక్కడ అందుబాట్లో ఉన్న పోలీసు బలగాలు అదుపు చేయలేరని భావించినట్టయితే తాత్కాలికంగా అవసరమైనంత మంది పౌరులను ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించవచ్చునని చట్టం అంటుంది. ఇది ఆచితూచి చేయవలసిన నియామకమే తప్ప ఒక రాజకీయ వర్గానికి భారీగా తుపాకులిచ్చి వారి ప్రత్యర్థులను చంపుకొమ్మని లైసెన్స్ ఇవ్వడం ఈ చట్టం లక్ష్యం కాదు.

మేము 2006 మే నెలలో దంతెవాడ పోయేసరికే 5,000 మంది ఎస్‌పివోల నియామకం జరిగిందని ఆ జిల్లా కలెక్టర్ అన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే తుపాకి పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న ప్రతీ సల్వాజుడుం కార్యకర్తకు ఎస్‌పివో అని నామకరణం చేసి తుపాకి ఇచ్చారు. గీదం బ్లాక్‌లోని కసోలి శిబిరానికి మేము పోతుండగా దారిలో చెట్టుకింద ఎస్‌పివోల ట్రైనింగ్ క్యాంపు ఒకటి కనిపించింది. వాళ్ళందరూ మావోయిస్టుల విముక్త ప్రాంతమైన అబుజ్‌మఢ్‌కు చెందిన వారు. మొత్తం 15 గ్రామాలకు చెందిన 300 మంది ఎస్‌పివోలు గీదం బ్లాక్‌లో ఉన్నారని చెప్పారు. దాని నాయకులంతా గాయత్రీ పరివార్‌కు చెందిన



వారు. వాళ్ళ దగ్గరున్నవి మస్కట్‌లు, .12 బోర్‌గన్‌లు, ఒకటి రెండు 303 రైఫిళ్ళు. మనుషులు (ఒకరిద్దరిని మినహాయిస్తే) సగటు ఆదివాసీ యువకుల లాగ పోషకాహారం సరిగ్గా లేక బక్కచిక్కి ఉన్నారు. ఆటోమేటిక్ తుపాకులున్న మావోయిస్టు దళ సభ్యులను వాళ్ళు ఎదుర్కొనడం కల్ల. మావోయిస్టులు శిబిరాల మీద చేసిన ప్రతి దాడిలోనూ ఎస్‌పివోలు పెద్ద సంఖ్యలో చనిపోయారు. కానీ గ్రామాలలోని మావోయిస్టు సానుభూతిపరులకూ, నిరాయుధులైన 'సంఘం' సభ్యులకూ వీరు యమకింకరులయ్యారు.

క్రూరత్వం మాటకొస్తే మావోయిస్టులు తక్కువ క్రూరంగా ప్రవర్తించలేదు. వారు కూడా ఇళ్ళు తగలబెట్టారు. ఒక ఉదాహరణ జాతీయ రహదారి నెంబర్ 221 పక్కన కుంట - సుక్మ సెక్షన్‌లో ఉన్న దుబ్బతోట గ్రామం. ఇంకా కూడా ఉన్నాయి గానీ గృహ దహనాల విషయంలో సల్వాజుడుందే రికార్డు.

చంపడంలోనూ మావోయిస్టులు చాలా క్రూరత్వాన్నే ప్రదర్శించారు. దోర్నపాల్‌లో సల్వాజుడుం సభకు హాజరై వెనక్కి పోతున్న వారిని ఫిబ్రవరి 28, 2006 నాడు వారు ప్రయాణిస్తున్న టిప్పర్‌ను మందు పాతర పెట్టి పేల్చివేసి చంపారు. మందు పాతరలో కొద్ది మంది మాత్రమే చనిపోయారనీ, మిగిలిన వాళ్ళను గొంతుకోసి చంపారనీ స్థానికులు అన్నారు. మణికొంట గ్రామానికి చెందిన వాళ్ళు దోర్నపాల్ శిబిరంలో ఉన్నారు. వారిలో కొంత మంది తమ సామాన్లు తెచ్చుకోవడానికి 2006 ఏప్రిల్ నెలలో తమ స్వగ్రామానికి పోగా, ఆ ఊరిలో కాపుకాసిన మావోయిస్టులు వారిలో 36 మందిని కిడ్నాప్ చేశారు. వారిపై 'ప్రజాకోర్టు' నిర్వహించి అందులో 15 మందిని ఏప్రిల్ 29న చంపారు. ఆ తర్వాత జూలై 16, 17 తేదీల మధ్య రాత్రి ఎర్రబోరు శిబిరంపైన దాడి చేసి 33 మందిని హతమార్చారు. ఇవన్నీ కుంట తాలూకాలో జరిగిన ఘటనలు కాగా ఈ సంవత్సరం మార్చి 14-15 తేదీల మధ్య రాత్రి బిజాపూర్ సమీపంలోని రాణిబొదిలిలో 55 మందిని కాల్చి చంపారు. ఈ దాడికి సంబంధించిన వివరాలు పైన చూశాం.

ఈ దాడులలో మావోయిస్టు దళాలతో పాటు, ప్రధానంగా గొత్తికోయలతో తయారైన భూంకాల్ మిలీషియా కూడా పెద్దెత్తున పాల్గొంటున్నది. సల్వాజుడుం వైపు ఎస్‌పివోలు ఎట్లాగో, వీళ్ళ వైపు భూంకాల్ మిలీషియా అట్లాగ. రెండూ కూడా సాధారణ ఆయుధాలు పట్టుకున్న ఆదివాసీ యువకుల బృందాలు. ఎస్‌పివోలు ఎక్కువగా కోయలు కాగా భూంకాల్ సభ్యులు





## ఇది కోయ గొత్తికోయ యుద్ధమా?


సల్వాజుడుం – మావోయిస్టుల ఘర్షణ కోయ – గొత్తికోయ ఘర్షణ అనే అభిప్రాయం చాలామంది వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలోని కోయతెగ పెద్దలు, కుంట తాసీల్దారు, కుంటలోని సల్వాజుడుం నాయకులు కూడా మాతో ఈ అభిప్రాయమే వ్యక్తం చేశారు. ఉత్తర భారతదేశానికి చెందిన ఆదివాసీ ఉద్యమకారులు కూడా చాలామంది ఇదే అభిప్రాయంతో ఉన్నారు. అయితే కుంట మాజీ ఎంఎల్ఏ అయిన సిపిఐ నాయకుడు మనీష్ కుంజం దీన్ని కొట్టి పారేశాడు. ఆయనొక్కడే కాదు, దంతెవాడ పరిస్థితితో సన్నిహిత పరిచయం ఉన్న సిపిఐ నాయకులందరూ ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మావోయిస్టుల అభిప్రాయమూ ఇదే.

వాస్తవాలన్నీ తెలుసుకున్నాక అర్థమయ్యేదేమిటంటే బస్తర్ ప్రాంతంలో మొదట మావోయిస్టులు పునాది సంపాదించింది కోయ తెగలోనే. ఇప్పటికీ అది కొనసాగుతున్నది. అయితే కాలక్రమంలో గొత్తికోయలు ఎక్కువగా వారివైపు ఆకర్షితులయ్యారు. గొత్తికోయలు కోయల కంటే వెనుకబడిన తెగ. వారికి భూములెక్కువ లేవు. కోయల కంటే వీరు లోతట్టు అడవి ప్రాంతాలలో నివసిస్తారు. అందువల్ల మావోయిస్టు దళాలతో వీరికి సంబంధాలు ఎక్కువ ఉండే అవకాశం ఉంది. అడవి కొట్టి వ్యవసాయం చేసుకొమ్మని 1990ల మధ్య భాగం దాకా మావోయిస్టులు ఇచ్చిన ప్రోత్సాహం వారిని ఎక్కువ ఆకర్షించింది. 'గొత్తికోయలొచ్చి మావోయిస్టుల మద్దతుతో అడవులు కొట్టడంతోనే సమస్యలన్నీ మొదలయ్యాయి' అని మైతకు చెందిన ఒక కోయ రైతు మాతో అన్నాడు.

కోయల కంటే గొత్తికోయలు 'గట్టివాళ్ళు' అనీ, ఎన్ని కష్టాలనైనా ఓర్చుకుంటారనీ, అందువల్ల కాలక్రమంలో మావోయిస్టులు వారివైపు మొగ్గు చూపించారనీ అన్నవాళ్ళున్నారు. ఇది జాతిగుణం కాకపోవచ్చు. స్థిరాస్తులు లేకుండా దట్టమైన అడవిలో బతకడం వల్ల అనివార్యంగా వచ్చిన గట్టితనం కావచ్చు. ఖమ్మం జిల్లాలో అటవీశాఖ గొత్తికోయల ఆవాసాలను కాలబెట్టిన సందర్భాలలో వారిని పలకరించడానికి పోయిన వారందరినీ వారి మొండితనం ఆకర్షించింది. మండుటెండలో కాలిపోయిన గుడిసెల పక్కనే పిల్లా, పాపలతో

ఎక్కువగా గొత్తికోయలు. దంతెవాడ జిల్లాలో ఏర్పడిన అంతర్యుద్ధ వాతావరణానికి ఈ రెండు బృందాలనూ సూచికలుగా భావించవచ్చు.

2005 జూన్ నుంచి ఇప్పటిదాకా ఈ ఘర్షణలో ఎన్ని ప్రాణాలు పోయి ఉంటాయి? 2006 మే నాటికే మావోయిస్టులు 228 మంది పౌరులను (12 మంది ఎస్‌పిఓలతో సహా), 25 మంది పారామిలటరీ సిబ్బందినీ – అంటే మొత్తం 253 మందిని చంపారన్న అధికార లెక్కలు పైన



ఉంటూ ఎక్కడికీ పోము, ఇక్కడే మళ్ళీ గుడిసెలు వేసుకొని ఉంటాం, ఎన్నిసార్లు కాలుస్తారో కాల్చుమనండి అని దృఢంగా అన్నారు.

మావోయిస్టులు ఆదివాసీ సమాజంలో వర్గాలను గుర్తించి, ఉన్నత వర్గాలపైన పోరాటం మొదలుపెట్టడం కూడా  కొంతలో కొంత ఆస్తులు ఎక్కువ ఉన్న కోయలలో వారికి ఎక్కువ శత్రువులను, తక్కువ ఉన్న గొత్తికోయలలో ఎక్కువ మిత్రులను తయారు చేసి ఉండవచ్చు. 25 ఎకరాలున్న రైతుల నుంచి లేనివాళ్ళకు 5 ఎకరాల దాకా బలవంతంగా ఇప్పించిన సంఘటనలు ఉన్నాయి. ఉత్పాదకతను దృష్టిలో పెట్టుకున్నప్పుడు దంతెవాడ ఏజెన్సీలో 25 ఎకరాలంటే, మైదానంలో 5 ఎకరాలతో సమానం అని ఇదివరకే చెప్పాము. దీనివల్ల మధ్యతరగతి కోయలలో కూడా వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఉంది. లబ్ధిదారు గొత్తికోయ అయినట్టయితే వారిపైన ద్వేషంగా మారే అవకాశమూ ఉంది.

మావోయిస్టులకు వ్యతిరేకంగా జనాన్ని పోగుచేసే రాజకీయ ప్రక్రియ రహదార్ల నుంచే మొదలైంది కాబట్టి, రహదార్ల సమీప గ్రామాలలో కోయలే ఎక్కువ కాబట్టి, ఇష్టపూర్వకంగా నైనా బలవంతంగానైనా సల్వాజుడుంలో చేరిన వాళ్ళలో కోయలే ఎక్కువ ఉండడం, మావోయిస్టుల ప్రతిఘటన దట్టమైన అడవుల నుంచి సాగుతున్నది కాబట్టి వారి భూంకాల్ మిలీషియాలో గొత్తికోయలే ఎక్కువ ఉండడం సహజం. అయితే మనీష్ కుంజం అన్నట్టు ఇవన్నీ సాపేక్షమైనవే. కోయలలోనూ భూమిలేని పేదలున్నారు. మావోయిస్టులకు పట్టున్న కోయ గ్రామాలూ చాలానే ఉన్నాయి. గొత్తికోయలలోనూ మావోయిస్టులు దోపిడీ వర్గాలుగా గుర్తించే వారున్నారు. సల్వాజుడుం అగ్ర నాయకుడు మహేంద్రకర్మ స్వయానా గొత్తి కోయ. (మనీష్ కుంజం కూడా గొత్తికోయే.)

అయినప్పటికీ పరిస్థితులు భిన్నంగా ఉంటే ఈ ఘర్షణ కోయ, గొత్తికోయ ఘర్షణగా మారి ఉండేదేమో. అదే జరిగి ఉంటే దీర్ఘకాలికంగా చాలా నష్టం జరిగి ఉండేది. కానీ దంతెవాడలో రాజకీయంగా బాగా బలం ఉన్న మావోయిస్టులు, సిపిఐ వారు తాత్వికంగా అటువంటి సామాజిక వైరుధ్యాన్ని ప్రోత్సహించడానికి ఇష్టపడక పోవడం వల్ల, మహేంద్రకర్మ కూడా ఏ కారణంగా నైతేనేం ఆ ఎత్తుగడ అనుసరించక పోవడం వల్ల అటువంటి పరిణామానికి అవకాశం తక్కువనే భావించవచ్చు.

చెప్పాం. ఆ సంవత్సర కాలంలో సల్వాజుడుం 250 కంటే ఎక్కువ మందిని చంపిందనీ లేదా 200 మందిని చంపిందనీ మావోయిస్టులు వివిధ సందర్భాలలో అన్న విషయాన్ని ఉటంకించాము. 2006 మే తరువాత హింస పరిమాణం కొంత తగ్గింది. అడవులు సగభాగం ఖాళీ అయి రహదార్లు వీరి స్థావరంగా, లోతట్టు అడవులు వారి స్థావరంగా స్థిరపడ్డాయి. అయినా అడవులలో మావోయిస్టుల కోసం గాలింపు, అడవిలో ఇంకా మిగిలి ఉన్న గ్రామాల




పైన దాడికి ప్రయత్నాలు, రహదారి శిబిరాల పైన మావోయిస్టుల దాడులు కొనసాగాయి. మావోయిస్టులు రహదారి శిబిరాలపై జరిపిన రెండు పెద్ద ఊచకోతలలో (ఎర్రబోరులో 33 మందిని, రాణిబొదిలిలో 55 మందిని) మొత్తం 88 మందిని చంపారు. అంటే వాళ్ళ చేతుల్లో పోయిన ప్రాణాల సంఖ్య 341కి చేరుకుంది. అయితే ఈ పెద్ద ఊచకోతలు కాక విడివిడిగా జరిగిన ఘటనలూ ఉన్నాయి. ఎన్ని ఘటనలు జరిగాయో ఎంతమంది చనిపోయారో తెలీదు కాబట్టి మావోయిస్టులు చంపిన వారు మొత్తం 350–400 మధ్య ఉంటారని భావించవచ్చు. మొదటి సంవత్సర కాలంలో వీరెంత మందిని చంపారో దాదాపు అంతే మందిని వారూ చంపారని మావోయిస్టులు వేసిన అభియోగాలను బట్టి తెలుస్తుంది. కాబట్టి అదే దామాషాలో ఆ తరువాత కూడా కొనసాగిందనుకుంటే దంతెవాడ అంతర్యుద్ధంలో ఈ రెండేళ్ళ కాలంలో 700–800 ప్రాణాలు పోయి ఉంటాయని స్థూలంగా అంచనా వేయవచ్చు.

ఇందులో నూటికి 90 లేక 95 శాతం స్థానిక ఆదివాసీ ప్రజలే. దీనిని ఆదివాసీ హననం అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. ఇందులో మావోయిస్టుల బాధ్యత కూడా ఉందని పైన చెప్పాము గానీ ఉద్దేశ్య పూర్వకంగా అంతర్యుద్ధ పరిస్థితిని కల్పించిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ప్రధానంగా తప్పుపట్టవలసి ఉంటుంది. ఒక ఉద్యమాన్ని – అది ఎటువంటిదైనా కానీయండి – అణచడానికి దాని ప్రత్యర్థులకు ఆయుధాలిచ్చి స్థానిక సమాజాన్ని రెండుగా చీల్చి అంతర్యుద్ధ పరిస్థితిని కల్పించడం అత్యంత ఘోరమైన విషయం. ఒక పాలనా వ్యూహంగా అసలే క్షమించరానిది.

సల్వాజుడుంకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇచ్చిన పెత్తనం అనేక రకాలుగా ప్రజాస్వామ్య విధ్వంసానికి దారితీసింది కూడా. ముఖ్యంగా, వారి పెత్తనాన్ని కించిత్తు కూడా వ్యతిరేకించే స్వేచ్ఛ ఎవరికీ లేదు. వ్యతిరేకించే విషయం దేవుడెరుగు, కనీసం వాస్తవాలు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేదు. బయటి నుంచి దంతెవాడకు నిజనిర్ధారణ కోసం వెళ్ళిన అన్ని బృందాలూ దోర్నపాల్‌లో, బైరంగఢ్‌లో సల్వాజుడుం కార్యకర్తల దౌర్జన్యాన్ని చవిచూశారు. మానవ హక్కుల గురించి మాట్లాడే వాళ్ళందరూ మావోయిస్టులను సమర్థిస్తారని నిందిస్తూ వారిని అటకాయించారు. ఒకటి రెండు సందర్భాలలో చేయి చేసుకున్నారు కూడా.


అంతకంటే తీవ్రమైన దాడిని ఎదుర్కొన్నది స్థానిక జర్నలిస్టులు. కుంటకు చెందిన విలేకరులు సంజయ్‌రెడ్డి, అన్వర్‌ఖాన్‌లను సల్వాజుడుం శిబిరంలోకి పిలిచి మావోయిస్టులకు అనుకూలంగా వార్తలు



రాస్తున్నారని నిందమోపి కొట్టారు. సంజయ్‌రెడ్డి నవభారత్ విలేకరి. అన్వర్‌ఖాన్ దండకారణ్య అనే పత్రిక విలేకరి. ఆ దెబ్బకు ఇద్దరూ వృత్తి మానుకొని కుంటను విడిచిపెట్టి వెళ్ళిపోయారు. సంజయ్‌రెడ్డి ప్రస్తుతం జగ్దల్‌పూర్‌లో ఉంటున్నాడు. అన్వర్‌ఖాన్ ఎక్కడున్నదీ తెలీదు.


బిజాపూర్ కేంద్రంగా హింద్ సత్తాకు విలేకరిగా పనిచేస్తున్న కమలేశ్ పైక్రా సల్వాజుడుం నుంచి చాలా తీవ్రమైన దాడిని ఎదుర్కొన్నాడు. అతను గోండు గిరిజనుడు. సల్వాజుడుం మొదలైనప్పుడు 'అది నక్సలైట్ –





వ్యతిరేక ప్రజా ఉద్యమం అనుకొన్నాను' అంటాడు. అయితే విలేకరిగా సమాచారం సేకరించడం మొదలుపెట్టేసరికి అనుమానాలు వచ్చాయి. సోడీదేవా అనే పేరుతో సల్వాజుడుం ప్రకటనలు వచ్చేవట. ఆరా తీయగా అటువంటి వ్యక్తి ఎవరూ లేరని తెలిసింది కమలేశ్‌కు. ఇంకొంచెం ఆరా తీయగా, సల్వాజుడుం కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న పోస్టర్లు వగైరా పోలీసులే అచ్చువేస్తున్నారని గ్రహించాడు. సల్వాజుడుం సభలకు వచ్చి పోతున్న వారు దారిలో ఇళ్ళు తగలబెడుతున్నారని కూడా చూశాడు. ఈ వార్తలన్నీ రాశాడు.

సిపిఐ వాళ్ళ నిజనిర్ధారణ కమిటీ బిజాపూర్‌కు రాగా కమలేశ్ వాళ్ళను మంకేలి గ్రామానికి తీసుకుపోయాడు. ఆ తరువాత పియుసిఎల్ బృందం రాగా వాళ్ళతో కూడా తిరిగాడు. ఆ పర్యటనలో పోలీసులు కమలేశ్‌ను ఆపారు. అతను బిజాపూర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేటును (ఆర్‌డివో) కలిసి పోలీసులు తనను ఎట్లా ఆపుతారని గొడవ పెట్టుకున్నాడు. ఆ అధికారితో అతను మాట్లాడుతుండగానే సల్వాజుడుం వాళ్ళు తుపాకులేసుకొని అక్కడి కొచ్చి ఎన్‌డిఎం సమక్షంలోనే కమలేశ్‌తో గొడవ పెట్టుకున్నారు. అతని అన్న తారకేశ్వర్‌ను పోలీసులు అరెస్టు చేసి, అతని ఇంటిని సల్వాజుడుం వాళ్ళతో కలిసి లూటీచేసి, అతను మావోయిస్టులకు సహకరిస్తున్నాడని కేసు పెట్టారు.



# నిర్వాసితుల దుస్థితి

**దం**తెవాడ అంతర్యుద్ధం ఫలితంగా 70 వేల నుండి లక్ష మంది దాకా బలవంతంగా నిర్వాసితులయ్యారు. దాదాపు 50 వేల మంది ఆ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన రహదారి శిబిరాలలోకి తీసుకు రాబడ్డారు. 10 వేల నుంచి 20 వేల మంది దాకా మన రాష్ట్రంలోకి పారిపోయి వచ్చారు. చాలామంది (వీరి లెక్క తెలియదు) అడవులలోనే ఏ చెట్ల కిందో తలదాచుకొని బతుకుతున్నారు. చాలామంది (వీరి లెక్కా తెలీదు) పశ్చిమాన ఇంద్రావతి నదిని దాటి మహారాష్ట్రకు వెళ్ళిపోయారు.

మినహాయింపు లేకుండా ఈ ప్రజలంతా తీవ్రమైన దుస్థితిలో ఉన్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న వారి బతుకులు మరీ దిగజారాయి. తరతరాలుగా వారి జీవనాధారంగా ఉన్న భూమి నుంచి శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదం ఉంది. ఎన్ని కష్టాలలో ఉన్నా, ఎంత లేమి ఉన్నా తమ సొంత గడ్డ మీద ఆత్మ గౌరవంతో బతికిన వారు ఈ రోజు పరాయి ప్రాంతాలలో, పరాయి మనుషులుగా బ్రతుకు వెళ్ళదీస్తున్నారు.

రహదారి శిబిరాలలో ఉన్న వారికి ప్రస్తుతానికి తిండికి ఢోకా లేదు. మొదట్లో పశువుల కొట్టాల లాంటి నిర్మాణాలలో వారిని పెద్ద సంఖ్యలో కుక్కి రోజుకు రెండు పూటలా దాల్-రోటి ఇచ్చింది ప్రభుత్వం. అయితే ఈ శిబిరాలే శాశ్వత ఆవాసాలుగా మారాలన్నది ఆ రాష్ట్ర ప్రభుత్వం యోచన కాబట్టి వారినే అడవి నుంచి కట్టె తెచ్చుకొని ఇళ్ళు వేసుకొమ్మని అనుమతిచ్చింది. క్రమంగా కుంట, ఎర్రబోరు, ఇంజరం, దోర్నపాల్, కసోలి, బంగపాల్, నేలస్నార్, భైరంగఢ్, గంగలూర్ వగైరా గ్రామాలలో శాశ్వతమైన కాలనీలు ఏర్పడుతున్నాయి. ఇంజరం కాలనీ చుట్టూ కంచె కూడా వేసేశారు - తిరిగి ఎవ్వరూ అడవిలోని పాత గ్రామాలకు పోకుండా. ఇతర కాలనీల చుట్టూ కూడా కంచెలు






వచ్చేస్తాయి బహుశా. మావోయిస్టుల దాడి భయం పేరు మీద శిబిరాల పరిసరాలపైన సర్చిలైట్ రాత్రంతా వేసి ఉంటుంది.

అయితే అన్నం అందరికీ పెట్టడం లేదు. బైరంగఢ్ బ్లాక్‌లోని బంగపాల్ శిబిరానికి మేము పోయేటప్పటికి అక్కడి వారంతా చకచకా ఇళ్ళు కట్టుకుంటున్నారు. తమకు ఇళ్ళు కట్టుకోవడానికి ప్రభుత్వం దినకూలి ఇస్తున్నది గానీ ఇతర రహదారి శిబిరాలలో లాగ తిండి పెట్టడం లేదన్నారు. ఇదేదో కింది స్థాయి ఉద్యోగుల అక్రమ నిర్వాకం అనుకొని మేము తరువాతి రోజు దంతెవాడ జిల్లా కలెక్టర్‌ను కలిసినప్పుడు ఆయనతో చెప్పాము. ఆయన బంగపాల్ అసలు శిబిరమే కాదనీ, అక్కడున్న వారంతా అబుజ్‌మఢ్‌కు చెందిన సరండరైన మావోయిస్టులనీ అన్నాడు. అంటే సరండరైన మావోయిస్టులు వెనక్కిపోరు కాబట్టి వాళ్ళకు అన్నం పెట్టనక్కరలేదన్న మాట. బలవంతంగా అడవి గ్రామాల నుంచి తరలించిన జనానికి అన్నం పెట్టకపోతే వెనక్కి వెళ్ళిపోతారు కాబట్టి వాళ్ళకు మాత్రం పెట్టాలి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆలోచనలోని సంకుచితత్వం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.

అన్నం పెడుతున్న శిబిరాల స్థానంలో కాలనీలు కట్టడమే కాక పాలనా సదుపాయాలన్నీ శిబిర వాసులకే పరిమితం చేస్తున్నది ఆ రాష్ట్ర ప్రభుత్వం. పిల్లలను స్కూలులో చేర్పించాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా, వేరే ఏది కావాలన్నా శిబిరంలో ఉండవలసిందే. శిబిరానికి రాక అడవిలో ఉండిపోయిన వారు పౌరులు కారు, వారి పట్ల ప్రభుత్వానికి ఏ బాధ్యతా లేదు. 'అభివృద్ధి' పేరు మీద మంజూరయ్యే పైసలన్నీ శిబిర వాసులకే.

అయినప్పటికీ అడవిని వదిలి, భూములను వదిలి కృత్రిమమైన కాలనీలలో స్థిరపడడం వారికి సంతృప్తిని ఇవ్వగల విషయం కాదు. ఇంక ఎక్కువ రోజులు ప్రభుత్వం వారికి తిండి కూడా పెట్టదు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మంజూరయ్యే పైసలన్నీ వారి మీదనే ఖర్చుచేసి పనులు కల్పిస్తారంట. అంటే అడవిలో రైతులుగా బతుకుతూ ఉండిన వారు ఇకపై చిన్న సైజు పట్టణాలలో కూలీలుగా మారతారు. అనేక రకాల ఫలసాయం ఇచ్చే అటవీ ఉత్పత్తులకు దూరం అవుతారు. తమ సంస్కృతీ సంప్రదాయాలకు నెలవైన భూభాగం నుంచి శాశ్వతంగా వెలివేయబడతారు. తమ అడవిలో తమ పాటికి తాము బతుకుతూ గిరిజనేతరులను దూరం నుంచి చూసినవారు, ఇకపై గిరిజనేతరుల పెత్తనం కింద ఉండే రహదారి గ్రామాలు లేక పట్టణాలలో కాలనీ



వాసులుగా బతుకుతారు. వారి భూములను ఏదో ఒక రోజు ఏ అంబానీకో, టాటాకో లీజుకిచ్చేస్తే ఈ ప్రవాసం శాశ్వతం అయిపోతుంది.

అడవిలో ఉండిపోయిన వారు గ్రామాలలో స్థిరంగా ఉండకుండా చెట్లూ, పుట్టలూ పట్టుకొని బతుకుతున్నారని చెప్పాము కదా. వారి స్థితి గురించి మైత గ్రామస్తుల దగ్గర వివరంగానే తెలుసుకోగలిగాము. చాటుమాటుగా చేసే వ్యవసాయం తప్ప వారికి వేరే జీవనాధారం లేదు. అడవి సంపద సేకరిస్తే అమ్ముకోవడానికి సంతలు లేవు. 2005 జూన్ నెల తరువాత దంతెవాడ అడవులలో సంతలన్నీ బంద్ అయిపోయాయని గత అధ్యాయాలలో చెప్పాము. మారాయిగూడెం దగ్గరో మల్లంపేట దగ్గరో సరిహద్దు దాటి ఏడుగురాళ్ళపల్లి సంతకు పోయి అమ్ముకుందామంటే సల్వాజుడుం వాళ్ళు దాడిచేసి ఎత్తుకుపోతారేమోనని భయం. స్కూళ్ళు లేవు, ఆస్పత్రులు లేవు. ఏ పని మీదైనా కుంటకో, మరొక ఊరికో పోదామంటే రోడ్లు లేవు, రవాణా సౌకర్యాలు లేవు. ఎట్లాగో ఒక లాగ పోతే అక్కడ సల్వాజుడుం వాళ్ళు పట్టుకుంటారని భయం. వాళ్ళ జీవితాలు ఒక్కసారిగా 50 ఏళ్ళు వెనక్కి పోయాయి.

ఇక మిగిలింది ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయి వచ్చిన వారు. సరిహద్దుకు రెండు వైపులా కోయ తెగ ఉంది కాబట్టి కోయలకు సాధారణంగా ఇక్కడ ఏదో ఒక గ్రామంలో బంధువులుంటారు. అక్కడికొచ్చి గుడిసెలు వేసుకొని అధికారులొస్తే స్థానికులుగానే చెప్పుకొని బతుకు వెళ్ళదీసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే భూములు మాత్రం లేవు. కూలి తప్ప గత్యంతరం లేదు. రేషన్‌కార్డు దొరకదు. స్థానికులమని బొంకితే తప్ప పిల్లలకు స్కూల్లో సీటు దొరకదు. ఒకే ఊరిలో ఎక్కువ మంది స్థిరపడితే స్థానికులు నిరసిస్తారన్న భయానికి నలుగురైదుగురు చొప్పున ఒక్కొక్క ఊరిలో గుడిసెలు వేసుకొని – అది కూడా ఒక మూలన – ఉంటున్నారు.

ఇంకా అధ్వాన్నమైన పరిస్థితి గొత్తికోయలది. గొత్తికోయలు ఖమ్మం జిల్లాకు స్థానికులు కాదని పైన చెప్పాము. అయితే ఇరవై సంవత్సరాలకు పైగా ఖమ్మం జిల్లాలో భూమి వెతుక్కుంటూ వారు వలస వస్తూనే ఉన్నారు. మావోయిస్టుల అండతో అడవి కొట్టి ఒకటి రెండెకరాల మేరకు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. చాలాకాలం పాటు ఇక్కడి అటవీశాఖవారు వారిని వేధించేవారు. కేసులు పెట్టేవారు. బలవంతంగా తొలగించడానికి ఆవాసాలు తగలబెట్టేవారు. ఈ మధ్య కొంతకాలంగా





ఈ వేధింపు కాస్త తగ్గింది. సల్వాజుడుం దెబ్బకు పారిపోయి వచ్చిన గొత్తికోయలు అంతకు ముందు తమ ప్రాంతం నుంచి భూమికోసం వలస వచ్చినవారు ఖమ్మం అడవుల్లో ఎక్కడ గుడిసెలు వేసుకొన్నారో వెతుక్కొని అక్కడికే పోతున్నారు. వారి పక్కనే గుడిసెలు వేసుకుంటున్నారు.

ఈ కాందిశీకులలో మేము మొట్టమొదట కలిసింది గొల్లగుప్ప గ్రామంలో ఉంటున్న ముచ్చిక లక్ష్మిని. ఆమెది కుంట తాలూకాలోని ఏటిగట్టు. అది 60 ఇళ్ళున్న గొత్తికోయ గ్రామం. ఆమె తనకు ఎంత భూమి ఉందో చెప్పలేదు గానీ '100 బస్తాలు వడ్లు ఉండేవి' అని సంతృప్తిగా చెప్తుంది. 100 బస్తాలు పండడానికి బయట 5 ఎకరాల కంటే ఎక్కువ అక్కరలేదు గానీ దంతెవాడ అడవులలో 30 నుంచి 50 ఎకరాలు అవసరం కావచ్చు. ఆ మేరకు ముచ్చిక లక్ష్మి 'భూస్వామే'. అందువల్లనే కాబోలు గొత్తికోయ అయినా కూడా ఆమెకు మావోయిస్టులంటే ప్రేమ లేదు. అలాగని సల్వాజుడుం ఏటిగట్టుకు వచ్చినప్పుడు వారితో కుంటకు పోనూ లేదు. సల్వాజుడుం వాళ్ళు ఏటిగట్టులో అన్ని ఇళ్ళతో బాటు వీళ్ళ ఇల్లూ తగలబెట్టి ఆమె భర్త దేవను కట్టేసి కొట్టుకుంటూ తీసుకుపోయారు. అప్పుడు ఈమె తన తొమ్మిది మంది పిల్లల్లో అయిదుగురిని ఇరుగుపొరుగు గ్రామాలలో వదిలిపెట్టి చిన్నవాళ్ళు నలుగురినీ తీసుకొని తన ప్రాంతం వాళ్ళు వలస వచ్చి ఉంటున్న గొల్లగుప్పకు అడవికి అడ్డంపడి నడుచుకుంటూ వచ్చింది. గొల్లగుప్పలో గొత్తికోయల ఆవాసాలకే భరోసా లేదు. వారిని మన అటవీశాఖ ఏ రోజు తరిమేస్తుందో, ఇళ్ళనెపుడు తగలబెడుతుందో తెలీదు. అయినా వారి దగ్గరే లక్ష్మి తలదాచుకొని కూలి చేసుకొని నలుగురు పిల్లలనూ పోషించుకుంటూ ఉంది.

ముచ్చిక లక్ష్మి ఒక్కతే వచ్చి ఉంటున్నది కాబట్టి మన రాష్ట్ర అటవీశాఖ కన్ను ఆమె గుడిసె మీద పడలేదు గానీ గొత్తికోయలు గుంపుగా వచ్చి గుడిసెలు వేసుకున్న ఊళ్ళ పరిస్థితి వేరుగా ఉంది. పైన చెప్పినట్టు తమ ప్రాంతం వారు గతంలో వచ్చి ఆవాసాలు ఏర్పరచుకున్న చోటికే వారు పోతున్నారు. అక్కడి వారు కూడా వారికి సహకరిస్తున్నారు. పాత వాళ్ళు కొంతమంది కొత్తవాళ్ళతో చేరి పాత ఊరిపక్కన గుడిసెలు వేసుకుని తమ ఊరికి అది కొనసాగింపేనన్న అభిప్రాయం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరొచ్చి అడిగినా ఎప్పటి నుంచో ఇక్కడ ఉన్న వాళ్ళే అంతా అని అంటున్నారు.

అయినప్పటికీ అటవీశాఖ సత్యాన్ని కనిపెట్టకపోలేదు. ఈ సంవత్సరం మార్చి 28న రెండు ఊళ్ళను, ఏప్రిల్ 19న మరొక ఊరినీ



ఛత్తీస్‌గఢ్‌లోని ఏటిగట్టు నుంచి మన రాష్ట్రంలోని గొల్లగుప్పకు పిల్లలతో వలస వచ్చిన ముచ్చిక లక్ష్మి

అటవీ సిబ్బంది బుగ్గిచేశారు. ఖమ్మం జిల్లా చింతూరు మండలం సరివెల గ్రామం సమీపంలో భద్రాచలం రోడ్డు పక్కన ఉన్న 30 గొత్తికోయల ఇళ్లనూ, వరరామచంద్రాపురం మండలం మట్టపల్లి సమీపంలో సున్నంవారి మట్టక అనే 8 ఇళ్ళ గూడేన్ని మార్చి 28న అటవీశాఖ వాళ్ళు దౌర్జన్యంగా తగలబెట్టారు. ఏప్రిల్ 19న వరంగల్ జిల్లా ఏటూరు నాగారం మండలం అల్లంవారి ఘనపురం సమీపంలోని గుర్రాలబావి వద్ద ఉన్న 20 గుడిసెల ఆవాసం మీద అటవీశాఖ వారు దాడి చేశారు. మూడు గుడిసెలు తగలబెట్టి, మిగిలిన వాటిని పీకేశారు. వీరు కుంట తాలూకా జగర్‌గొండ సమీపంలోని పాలగూడెం నుంచి సల్వాజుడుం దాడుల కారణంగా పారిపోయి వచ్చినవారు.


ఎక్కువ మంది దంతెవాడ సరిహద్దు సమీపంలో స్థిరపడే ప్రయత్నం చేయకుండా రాష్ట్రం లోపలి ప్రాంతాలకు పోయి బతుకుతెరువు కోసం తమ శ్రమను కారుచవగ్గా అమ్ముకుంటున్నారు. పశ్చిమ గోదావరి నుంచి కడప జిల్లా దాకా అన్ని చోట్లా 'ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన గొత్తికోయల' గురించి వార్తలు వింటున్నాం. చవక శ్రమ కోసం చూస్తున్న కాంట్రాక్టర్లకు దంతెవాడ సంక్షోభం ఒక వరం అయింది.





70,000 నుంచి లక్షమంది దాకా ఉన్న ఈ నిర్వాసితులంతా వెనక్కిపోయి తమ గ్రామాలలో ఉంటూ అడవిలో ఎప్పటిలాగా జీవనం పొందాలి. ఇది తక్షణ అవసరం అని మేము భావిస్తున్నాం. ఇది ఎప్పుడైనా అవసరమే గానీ ఇప్పుడు ప్రత్యేకించి ఈ అవసరాన్ని నొక్కి చెప్పడానికి రెండు కారణాలున్నాయి. అడవిలో ఆదివాసుల హక్కులను చాలాకాలం గుర్తించ నిరాకరించిన చట్టం మొట్టమొదటిసారిగా తన వైఖరి మార్చుకుంది. ఈ సంవత్సరమే పార్లమెంటు 'షెడ్యూల్డు తెగలు, ఇతర సంప్రదాయ అటవీవాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టాన్ని' చేసింది. దానికింద స్థానిక ఆదివాసులకు రిజర్వ్ ఫారెస్టులో సైతం భూమిని స్వేచ్ఛగా అనుభవించే హక్కు వస్తుంది. అయితే ఆ హక్కు పొందాలంటే వారు ఆ భూమిని అనుభవిస్తూ ఉండాలి. దంతెవాడ అడవుల నుండి నిర్వాసితులైన ఆదివాసులు వెంటనే వెనక్కి పోలేకపోతే ఈ చట్టంవల్ల పొందగల ప్రయోజనాన్ని వారు శాశ్వతంగా కోల్పోతారు. రెండవది, ఖాళీ అయిన ఈ అడవి భూములను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏదో ఒక పెట్టుబడిదారీ కంపెనీకి దత్తంచేసే ప్రమాదం ఉంది. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల అటవీ ప్రాంతంలో విస్తారమైన ఖనిజ సంపద ఉన్న విషయం తెలిసిందే. ఈ మూడు ప్రభుత్వాలూ విచ్చలవిడిగా పెట్టుబడిదారీ కంపెనీలకు భూములను లీజుకు ఇస్తున్నాయి. ఖాళీగా ఉన్న ఈ నిర్వాసితుల భూములను ఇదే అదనని కంపెనీలకు లీజుకు ఇచ్చేసినట్టయితే వాటిని శాశ్వతంగా కోల్పోతారు. నిజానికి సల్వాజుడుం వెనుక ఉన్నది ఈ కుట్రేనని చాలామంది భావిస్తున్నారు. అది నిజం కాకపోవచ్చు. సల్వాజుడుం ప్రధానంగా మావోయిస్టులను ఓడించడానికి ఎంచుకున్న వక్రమైన వ్యూహమేననిపిస్తుంది. అయితే ఈ వ్యూహంలో భాగంగా ఒకసారి అడవులను ఖాళీచేసిన తరువాత కంపెనీలకు కట్టబెట్టే ప్రమాదం ఉంది.

ఈ రెండు కారణాలవల్లా లక్ష మంది దాకా ఉండగల నిర్వాసితులంతా తిరిగి తమ గ్రామాలకు పోయి ఇటు సల్వాజుడుం నుంచి గానీ, అటు మావోయిస్టుల నుంచి గానీ ప్రతీకార చర్యల భయం లేకుండా ఎప్పటిలాగా అటవీ సంపదను అనుభవిస్తూ బతికే పరిస్థితి త్వరగా కల్పించడం అవసరం. ఈ కర్తవ్యాన్ని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పౌర సమాజం తనమీద వేసుకోవాలని మేము భావిస్తున్నాం. దానికోసం వారితో కలిసి కృషి చేస్తున్నాం. ఈ కృషికి తెలుగునాట పౌర సమాజం మద్దతు మాకు ఉంటుందని ఆశిస్తాం.



# అనుబంధం I

(మానవహక్కుల వేదిక దేశంలోని అన్ని పౌర, ప్రజాస్వామ్య హక్కుల సంఘాలకూ పంపిన లేఖ)


**మిత్రులారా!**

19 జూన్ నాడు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు షెడ్యూల్డు తెగలకు చెందిన చాలామందిని చంపిన ఉదంతం మీరందరూ ఎరిగినదే. వేరే ఎవరైనా ఆదివాసులను ఇంత పెద్దఎత్తున చంపి ఉంటే దేశంలో తీవ్ర నిరసన చెలరేగి ఉండేది. అందువల్ల, ఈ సంఘటన పట్ల అందరూ మౌనం వహించడం ఆందోళన కలిగించే విషయం.

మనం ఆ ప్రాంతానికి నిజనిర్ధారణ కమిటీగా వెళ్ళాలని మేము ప్రతిపాదిస్తున్నాం. విప్లవ పార్టీలు చేపట్టే హింసాత్మక చర్యల విషయంలో వారిని విమర్శించడం తగునా లేదా అన్నది వివాదాస్పదంగా ఉన్న సంగతి మేము ఎరుగుదుము. ప్రజాదరణ గల ఉద్యమాలుగాను, ప్రజాతంత్ర ఉద్యమాలుగాను భావించబడేవి సైతం విచ్చలవిడి చర్యలకు, అన్యాయమైన చర్యలకు పాల్పడినప్పుడు మనబోటి సంస్థలు బహిరంగంగా విమర్శించడం అవసరం అని మానవహక్కుల వేదిక భావిస్తుంది. ఈ విషయంలో ఇతర సంస్థల ఆలోచనలు ఇందుకు భిన్నంగా ఉండవచ్చు. ఏమైతేనేం వాస్తవాలు తెలుసుకోవడానికి అభ్యంతరం ఉండనక్కర లేదు. ఆ తరువాత ఏం చేస్తామనేది కాలక్రమంలో నిర్ణయించుకోవచ్చు. వాస్తవాలు ఏమిటి అనే విషయంలో గానీ, వాటి గురించి ఏం చేయాలి అనే విషయంలో గానీ అందరమూ ఒకే అవగాహనకు రాకపోయినా ఫరవాలేదు. ఈ హత్యలను ఉపేక్షించి ఊరుకోవడం తగదని మాత్రం మేము భావిస్తున్నాం.

ఇప్పటికే కొంత ఆలస్యం అయింది కాబట్టి జూలై నెల 16, 17 తేదీలలో నిజనిర్ధారణ కమిటీ పర్యటన జరపాలని మేము





ప్రతిపాదిస్తున్నాం. హత్యలు జరిగింది బిజాపూర్ జిల్లాలోని మట్టాడలో. చనిపోయింది 22 మంది అనీ, 15 మంది అనీ, 13 మంది అనీ పత్రికలు రకరకాలుగా రాశాయి. బిజాపూర్ చంద్రపూర్ (మహారాష్ట్ర) నుంచి బల్హార్‌పూర్ (బల్హార్‌షా), సిరోంచ, భూపాలపట్నంల మీదుగా జగ్దల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)కు పోయే రోడ్డు మీద ఉంది. ఆ రోడ్డు బాగానే ఉండేది. చంద్రపూర్, బల్హార్‌షాలు ఢిల్లీ నుంచి చెన్నైకి వెళ్ళే రైలుమార్గం మీద ఉన్నాయి. అవతలి వైపు జగ్దల్‌పూర్ నుంచి రాయపూర్‌కు మంచి రోడ్డు ఉంది. రాయపూర్ హౌరా – ముంబాయి రైల్వే మార్గం మీద ఉంది.

29 జూన్ 2005
హైదరాబాద్


# అనుబంధం II

# ఉమ్మడి పత్రికా ప్రకటన

**మా**నవహక్కుల వేదిక (హెచ్.ఆర్.ఎఫ్), ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒ.పి.డి.ఆర్) లకు చెందిన 8 మంది సభ్యులు గల నిజనిర్ధారణ కమిటీ జూలై 16-17 తేదీలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ  జిల్లా బిజాపూర్ పోలీసు జిల్లాలో పర్యటించింది. స్థానిక ఆదివాసులు జనజాగరణ్ అభియాన్ పేరిట సంఘటితమై మావోయిస్టులను వ్యతిరేకిస్తున్నందుకు ప్రతీకారంగా సిపిఐ (మావోయిస్టు) పార్టీవారు ఆదివాసులను పెద్దసంఖ్యలో చంపుతున్నారని పత్రికలలో వచ్చిన వార్తలకు స్పందించి మేము ఈ పర్యటన చేపట్టడం జరిగింది. ప్రత్యేకించి 2005 జూన్ 19 నాడు కొత్రాపాల్ గ్రామంలో 13 మంది ఆదివాసులను ఊచకోత కోసినట్టు వచ్చిన వార్త ఈ ప్రయత్నానికి ప్రేరణ.

ఈ ప్రాంతం నైసర్గికంగా ఆంధ్రప్రదేశ్‌కు దగ్గరే గానీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పశ్చిమ, దక్షిణ దిశలలో రవాణా మార్గాలు సరిగ్గా లేనందున అది ఆంధ్రప్రదేశ్‌కు అందుబాట్లో ఉందని అనలేము. ఆంధ్రప్రదేశ్ నుంచి పోయేటప్పుడు ప్రాణహిత, ఇంద్రావతి నదులు దాటాలి. రెండిటి మీదా వంతెనల నిర్మాణం జరగలేదు. ఆ కారణంగా నిజనిర్ధారణ కమిటీ ఆ ప్రాంతంలో ఎక్కువ సమయం గడపలేక పోయింది. అయినప్పటికీ కమిటీ భూపాలపట్నం, బిజాపూర్‌లకు, సంబంధిత గ్రామాలైన కుట్రు, జాంగ్లా గ్రామాలకు పోగలిగింది. గిరిజన, గిరిజనేతర ప్రజలతోను, ప్రత్యేకించి కుట్రు గ్రామ ఉపసర్పంచ్ తోను, కుట్రులోని పోలీసుస్టేషన్ అధికారితోను, మేము జాంగ్లా గ్రామానికి వెళ్ళినప్పుడు అక్కడికి వచ్చిన జనజాగరణ్ అభియాన్ నాయకులతోను మాట్లాడగలిగింది. సిపిఐ (మావోయిస్టు) పార్టీ నాయకులతో గానీ వారి 'సంఘం' నాయకులతో గానీ మాట్లాడలేక పోయినప్పటికీ వారు 'సాధన' అనే పేరుతో విడుదల చేసిన పత్రం ద్వారా వారి అభిప్రాయాలు, వారిచ్చే జవాబులు





తెలుసుకోవడం సాధ్యం అయింది. బిజాపూర్ పోలీసు జిల్లా సూపరింటెండెంట్‌తో వివరంగా ఫోన్‌మీద నిజనిర్ధారణ కమిటీ బాధ్యులు మాట్లాడారు.

మా కమిటీ నివేదికను క్లుప్తంగా దిగువ ఇస్తున్నాం.

## నేపథ్యం


సిపిఐ (మావోయిస్టు) పార్టీ ఒకప్పటి బస్తర్ జిల్లాలో కనీసం 25 సంవత్సరాలుగా చురుగ్గా పని చేస్తున్నది. (ఆ జిల్లాను ఇప్పుడు కంకేర్, బస్తర్, దంతెవాడ అని మూడుగా విభజించారు.) ఇది ప్రధానంగా గోండు గిరిజనులు నివసించే దట్టమైన అడవి ప్రాంతం. ఈ ప్రాంతంలో మావోయిస్టులకు ఆదివాసీ ప్రజానీకంలో విస్తృతమైన పునాది ఉన్న విషయం, ఆ ఆదివాసీ ప్రజానీకం మావోయిస్టుల వల్ల అనేక రకాలుగా ప్రయోజనం పొందిన విషయం అందరికీ తెలిసిందే.

అయితే 2005 జూన్ నెల మధ్య భాగం నుంచి ఇక్కడి గ్రామాలలో, ముఖ్యంగా దంతెవాడ జిల్లాలోని బిజాపూర్ పోలీసు జిల్లాలో జనజాగరణ్ అభియాన్ పేరుతో మావోయిస్టు వ్యతిరేక ఆందోళన మొదలయింది. జనజాగరణ్ అభియాన్ అనేది ఒక సంస్థ కాదు, ఉద్యమం. అది ప్రధానంగా రహదార్ల సమీపంలోని గ్రామాలలో కేంద్రీకృతమై ఉంది. రాజకీయ పార్టీలు, ప్రత్యేకించి ఈ మూడు జిల్లాలలోను అత్యధిక సంఖ్యలో ఎంఎల్‌ఏలను కలిగి ఉన్న కాంగ్రెస్ పార్టీ, దానికి మద్దతు ఇస్తున్నాయి. అందులో ఆదివాసులే కాక రహదారి గ్రామాలకు చెందిన గిరిజనేతరులు కూడా భాగస్వాములు. పత్రికలలో వచ్చిన వార్తల ప్రకారం జనజాగరణ్ అభియాన్ సభలలో మావోయిస్టులు అనుసరిస్తున్న పంథాలోని వివిధ అంశాలపట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. అవి: 1) ఈ సంవత్సరం వేసవి నెలలో తునికాకు సేకరణ పైన నిషేధం 2) ఆదివాసీ ప్రాంతాలలో సంతలపైన నిషేధం 3) రోడ్లు వేయడాన్ని ఆటంకపరచడం, వగైరా.

మావోయిస్టులు జనజాగరణ్ సభల పట్ల అసహనం ప్రదర్శిస్తున్నారనీ, కేవలం ఆ సభలలో పాల్గొన్నందుకు చాలామందిని, ప్రధానంగా ఆదివాసులను చంపుతున్నారని పత్రికలు రాశాయి.

## హత్యలు

వారు హత్యలు చేస్తున్నారన్న వార్త నిజమేగానీ అందులో అతిశయోక్తి ఉందనీ, కొన్ని సందర్భాలలో విపరీతమైన అతిశయోక్తి ఉందనీ చెప్పాలి. ప్రత్యేకించి, 19 జూన్ నాడు కొత్రాపాల్ గ్రామంలో



13 మంది ఆదివాసులను మావోయిస్టులు చంపారన్న వార్త నిజం కాదు. అనేక హత్యల గురించి పత్రికలు అడపా దడపా రాస్తున్నాయి గానీ, మేము 16 జూలై నాడు జాంగ్లాలో కలిసిన జనజాగరణ్ నాయకులు 2005 జూన్ మొదటి నుంచి ఆనాటి దాకా మావోయిస్టులు ఏడుగురినే చంపారని చెప్పారు.

క్లుప్తంగా చెప్పాలంటే అక్కడ జరుగుతున్నదేమిటంటే మావోయిస్టులు జనజాగరణ్ అభియాన్‌లో చురుగ్గా పాల్గొంటున్నట్టు తాము భావిస్తున్న వారిని అపహరించి తీసుకుపోతున్నారు. అటువంటి ప్రతీ అపహరణనూ హత్యగానే వర్ణించడం జరుగుతున్నది. మావోయిస్టులు అపహరించిన వ్యక్తిని ఒక్కొక్కసారి హతమారుస్తున్నారు గానీ చాలా సందర్భాలలో కొట్టి వదిలిపెడుతున్నారు. కొత్రాపాల్‌నే ఉదాహరణగా తీసుకుంటే, జూన్ 19 నాడు (నిజానికి ఆ దాడి జరిగింది జూన్ 18న) ఆ గ్రామంలో జరిగిన జనజాగరణ్ సభపైన సాయుధులైన మావోయిస్టులు తుపాకులతోను, వారి ఆదివాసీ అనుయాయులు విల్లంబులతోనూ దాడిచేసిన సంగతి సత్యమే. జనజాగరణ్ వారు విల్లంబులతో ఎదురుదాడి చేసి తప్పించుకున్నారు. వారు పారిపోవడంతో తొక్కిసలాట జరిగింది. ఈ దాడిలో ఇద్దరు ఆదివాసులు చనిపోయారు. ఆ తదుపరి మావోయిస్టులు కొత్రాపాల్, బర్దేవా, మట్వాడ గ్రామాల నుంచి 10 మందిని అపహరించి తీసుకుపోయారు. దీనిని ఊచకోతగా ప్రచారం చేయడం జరిగింది గానీ అందులో 9 మందిని వారు బాగా కొట్టి విడిచిపెట్టారు. గిరిజనేతరుడైన జాంగ్లాకు చెందిన భువనేశ్వర్‌సింగ్ ఠాకూర్‌ను మాత్రమే చంపారు. 'కొత్రాపాల్ ఊచకోత'లో జరిగింది ఇదేనని పోలీసులు సైతం ఒప్పుకుంటున్నారు. అయితే అబద్ధపు కథనాన్ని ప్రచారం చేసినవారు దానిని సంవరించడానికి మాత్రం ఏ ప్రయత్నమూ చేయలేదు.

ఆ తరువాత జరిగిన ప్రతీకారాన్ని గురించి కూడా పత్రికలు రాయలేదు. మరుసటి దినం పోలీసులు, జనజాగరణ్ కార్యకర్తలు కొత్రాపాల్ పైన దాడిచేశారు. నలుగురు మావోయిస్టు సానుభూతిపరుల ఇళ్ళకు అగ్గిపెట్టారు. చాలా ధాన్యాన్ని కూడా అగ్గిపాలు చేశారు. జనజాగరణ్ అభియాన్ కార్యకర్తలు, పోలీసులు కలిసి ఆ రకమైన ఎదురుదాడులు చేయడం చాలాసార్లు జరిగింది. ఉదాహరణకు జూలై 1వ తేదీన కొత్రాపాల్‌లో జరిగిన జనజాగరణ్ సభపైన మావోయిస్టులు దాడిచేసి దానిని భగ్నం చేశారు. ఆ సభకు కాపలాగా ఉన్న పోలీసులు జనజాగరణ్ అభియాన్ కార్యకర్తలతో కలిసి చాలా ఇళ్ళను తగులబెట్టి ఇద్దరు ఆదివాసులను కాల్చి చంపారు. మేము ఎస్.పితో మాట్లాడినప్పుడు దీనిని ఆయన అబద్ధం అన్నాడు గానీ, జాంగ్లాలో మాతో మాట్లాడిన జనజాగరణ్ కార్యకర్తలు అది నిజమేనని ఒప్పుకున్నారు. సారాంశంలో,





మావోయిస్టులకూ జనజాగరణ్‌కూ జరుగుతున్న ఘర్షణలో పోలీసులు తటస్థంగా లేరు. వారు జనజాగరణ్ అభియాన్‌తో చేతులు కలిపి పనిచేస్తున్నారు. రెండు వైపులా హింస జరుగుతున్నది, హత్యలు జరుగుతున్నాయి. అయితే ఎక్కువ భాగం హత్యలు చేస్తున్నది మావోయిస్టులే అనడంలో సందేహం లేదని మేము భావిస్తున్నాం.


## వివాదాస్పద విషయాలు

మావోయిస్టులు 'సాధన' పేరుతో విడుదల చేసిన పత్రాన్ని బట్టి జనజాగరణ్ అభియాన్‌ను వారు కాంగ్రెస్ నాయకుల, గిరిజనేతరుల కుట్రగా చూస్తున్నారనీ, గిరిజన శిష్ట వర్గం ఈ కుట్రలో భాగం అయినట్టు భావిస్తున్నారనీ అర్థం అవుతోంది. ఇది సరైన చిత్రం కాదు. మేము సేకరించిన సమాచారం మేరకు చాలామంది సాధారణ ఆదివాసులు జనజాగరణ్ సభలలో పాల్గొంటున్నారు. మావోయిస్టులు ఈ విషయంలో ప్రదర్శిస్తున్న అసహనం ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అసహనం కంటే ఏ రకంగానూ భిన్నమైనది కాదు. తమ విధానాలలోనూ, పని పద్ధతులలోనూ కొన్నిటి పట్ల సాధారణ ఆదివాసులకు ఉన్న వ్యతిరేకతను ఆదివాసీ, ఆదివాసీయేతర స్వార్థపర శక్తుల స్వప్రయోజనాల నుంచి వేరు చేసి చూడడం వారు నేర్చుకోనట్టయితే, వారి సామాజిక పునాది అయిన ఆదివాసులకు వారు చాలా నష్టం చేయగలరు.

పైన పేర్కొన్న మూడు అంశాలకు సంబంధించి మావోయిస్టులు ఇస్తున్న వివరణ ఏమంత సంతృప్తికరంగా లేదు.

1. రోడ్లు వేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్న అభియోగానికి వారి జవాబు ఏమిటంటే, గుత్త పెట్టుబడికీ సామ్రాజ్యవాద పెట్టుబడికీ ఉపయోగపడేటట్టయితే తాము రోడ్లు వేయడాన్ని వ్యతిరేకిస్తామని. అసలే రవాణా సదుపాయాలు మృగ్యంగా ఉన్న ప్రాంతంలో రోడ్లు వేయడాన్ని బలవంతంగా వ్యతిరేకించడం కేవలం పెట్టుబడిదార్ల ప్రయోజనాలనే కాదు సామాన్య ప్రజల ప్రయోజనాలను కూడా దెబ్బతీయగలదు.

2. మావోయిస్టులు తునికాకు సేకరణను బంద్ పెట్టించారన్న అభియోగానికి సంబంధించిన వాస్తవాలు క్లుప్తంగా ఈ విధంగా ఉన్నాయి. అడవి ప్రాంతాలలో కాంట్రాక్టర్ల కోసం తునికాకు సేకరించడం అనేది ఆదివాసులకైనా, ఇతర పేదలకైనా నగదు రూపంలో ఆదాయం సంపాదించడానికి ప్రధాన మార్గం. మావోయిస్టుల సహాయంతో తునికాకు సేకరణకు దక్కే కూలిరేటును పెంచుకోవడం ఆదివాసులకు మావోయిస్టు ఉద్యమం వల్ల కలిగిన ప్రధాన ప్రయోజనాలలో ఒకటి.



గత సంవత్సరం ఆ కూలిరేటు ఛత్తీస్‌గఢ్‌లో కట్టకు 85 రూపాయలకు చేరుకుంది. అయితే ఈ సంవత్సరం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం తునికాకు సేకరణను కాంట్రాక్టర్ల చేతుల్లోనుంచి తీసేసి సహకార సంఘం చేతిలో పెట్టి కూలిరేటును 85 రూపాయల నుంచి 45 రూపాయలకు తగ్గించింది. మావోయిస్టులను దెబ్బతీయడానికి ఉద్దేశించబడ్డ ఈ వ్యూహం ఆదివాసుల ఆదాయాన్ని సగానికి తగ్గిస్తుంది కాబట్టి ఇది చాలా అభ్యంతరకరమైనది. దీనిపట్ల ఆదివాసులు నిరసన వ్యక్తం చేయాలని మావోయిస్టులు కోరుకోవడం సహజం. అయితే తమ అభీష్టానికి వ్యతిరేకంగా మొత్తంగానే తునికాకు సేకరణను బంద్ పెట్టించారన్నది వారి అభియోగం. ఆదివాసులలోని అసంతృప్తికి ఇదే ప్రధాన కారణం అనిపిస్తుంది. బంద్ పెట్టించిన విషయం వాస్తవం కాదనీ, తక్కువ రేటుకు సేకరించడానికి ఆదివాసులు ముందుకొచ్చినా ప్రభుత్వమే ఆకు తీసుకోవడం లేదని మావోయిస్టులు అంటున్నారు. అది నమ్మశక్యం కాదు. మేము మాట్లాడిన వారందరూ కూడా తునికాకు సేకరణ బంద్ చేయించిన మావోయిస్టుల ఆదేశమే ఈ వేసవిలో జనజాగరణ్‌కు మద్దతు సంపాదించడానికి గల ప్రధాన కారణం అని అన్నారు.

3. సంతలను మూసేయించిన విషయానికి వస్తే, పోలీసు బలగాలు సమాచార సేకరణకూ, తమ అవసరాల కొనుగోలుకూ సంతలను వాడుకుంటున్నందువల్లనే మావోయిస్టులు వాటిని బంద్ పెట్టించారని మేము విన్నాము. మావోయిస్టులు విడుదల చేసిన పత్రంలో ఆదివాసులు తమ సంప్రదాయక ఆయుధాలైన విల్లంబులతో సంతలకు వెళ్ళకూడదని ఆదేశించడం ద్వారా పోలీసులే సంతలకు అడ్డం పడుతున్నారని అన్నారు. ఈ విషయంలో నిజమేమిటన్నది చాలా అస్పష్టంగా ఉంది. బహుశా రెండు అభియోగాలలోనూ వాస్తవం ఉండవచ్చు. కారణమేదైనా ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే అనేక రహదారి గ్రామాలలో సంతలు ఆగిపోయాయి. ఇది ప్రజలకు చాలా అసౌకర్యం కలిగిస్తున్నది.

## మా అభిప్రాయాలు, సూచనలు, డిమాండులు

1. మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిజాపూర్ అడవులలో అడపాదడపా హత్యలకు పాల్పడుతున్నారు. హతులలో అధికభాగం ఆదివాసులే. అయితే హత్యల సంఖ్యను చాలా ఎక్కువచేసి ప్రచారం చేయడం జరుగుతున్నది. ప్రతీ అపహరణనూ, ప్రతీ దాడినీ హత్యగా చిత్రీకరించి అతిశయోక్తులతో నిండిన భయంకరమైన చిత్రం ఇవ్వడం జరుగుతున్నది. ప్రత్యేకించి, విపరీతంగా ప్రచారం అయిన




కొత్రాపాల్ ఊచకోత జరగనే లేదు. ఈ స్థితికి స్థానిక పోలీసులు ప్రధానంగా బాధ్యులు. వాళ్ళు బాధ్యతాయుతంగా నడుచుకోవడం అవసరం. పోలీసులు, జనజాగరణ్ చేస్తున్న హత్యలు అసలు బయటికే రావడం లేదు.

2. తమ విధానాల పట్ల, చర్యల పట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకత విషయంలో మావోయిస్టులు అసహనంతో వ్యవహరిస్తున్నారు. సాధారణ ఆదివాసీ ప్రజానీకంలో ఉన్న అసంతృప్తికి, స్వార్థపర శక్తుల వ్యతిరేకతకు – వారు గిరిజనేతరులు కానీ గిరిజన ఉన్నత వర్గం కానీ – తేడా చూడడం మావోయిస్టులు అలవరచుకోవాలి. ప్రత్యేకించి, తమ విధానాల పట్ల వ్యతిరేకతను అవతలి పక్షం ఒక ప్రజా ఉద్యమంగా సమీకరిస్తున్నప్పుడు దానిని ఎదుర్కొనడానికి విల్లంబులతోనూ, ఆయుధాలతోనూ జనాన్ని సమీకరించి దాడులు చేసినట్టయితే అమాయక ప్రజల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వారు గ్రహించాలి. పోలీసులు శాంతిభద్రతల పేరిట ఒకరి హింసాకాండకు వ్యతిరేకంగా మరొకరి హింసాకాండను సమర్థించడం మానుకోవాలి.

3. తమ ఆదేశాలను అమలు చేయించడానికి మావోయిస్టులు ఆదివాసీ ప్రజానీకాన్ని ఒత్తిడికి గురిచేయకూడదు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా మావోయిస్టులను బలహీనపరచడం కోసం ఆదివాసుల జీవనాన్ని దెబ్బతీసే పని చేయకూడదు.

4. ఇరుపక్షాలూ అనుసరిస్తున్న హింసా ప్రతిహింసల పద్ధతులు ఇప్పటికే ఆ ప్రాంతంలో ఒక భయానక స్థితిని తీసుకొచ్చాయి. అది సాధారణ ప్రజల మానవ హక్కులకు భంగకరం. ఇరుపక్షాలూ ఈ విషయాన్ని గుర్తించి తమ చర్యలను అదుపు చేసుకోవాలి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒకవైపు భారీగా పారామిలటరీ బలగాలను దించే ఆలోచన చేస్తుండడం, బలప్రయోగాన్ని బలప్రయోగంతో ఎదుర్కొనడానికి మావోయిస్టులు సిద్ధపడడం చూస్తుంటే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం కనిపిస్తున్నది. దేశంలోని అన్ని హక్కుల సంఘాలూ తమ తమ పద్ధతులలో ఈ పరిస్థితికి స్పందించి సాధారణ ప్రజల జీవించే హక్కును కాపాడడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

3 ఆగస్టు 2005
హైదరాబాద్



# అనుబంధం III

**దం**తెవాడ జిల్లా దక్షిణబస్తర్‌లోని బిజాపూర్ తాలూకాలో నక్సలైట్ వ్యతిరేక ఉద్యమం అయిన సల్వాజుడుం, పోలీసులు అనేక గ్రామాలలో జరిపిన అత్యాచారాలపైన, చేసిన హత్యలపైన ఉన్నతస్థాయి విచారణ కోరుతూ సిపిఐ సమర్పించిన వినతిపత్రం.

(హిందీ నుంచి అనువాదం)

తేది : 16-11-2005


**ప్రధానమంత్రి గారికి,**

**అయ్యా,**

సల్వాజుడుం పేరుతో 2005 జూన్ నెల నుంచి దంతెవాడ జిల్లా బిజాపూర్ తాలూకాలో సాగుతున్న జనజాగరణ్ ఉద్యమం శాంతియుతమైన రాజకీయేతర ఉద్యమం అనీ, అందులో 10,000 మంది గ్రామీణ ఆదివాసులు పాల్గొంటున్నారనీ, అది నక్సలిజాన్ని అంతం చేయగల ఆదివాసీ తిరుగుబాటు అనీ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ రమణ్‌సింగ్ చెప్తున్నది అబద్ధం అని మేము చెప్పదలచుకున్నాము.

వాస్తవమేమిటంటే నక్సలైట్లు, పోలీసుల చర్యలను సంవత్సరాల తరబడి చూస్తున్న గ్రామాలకు చెందిన ఆదివాసీ యువకులు కొందరు ఈ పరిస్థితిని ప్రతిఘటించే ఉద్దేశంతో సంప్రదాయక ఆయుధాలు, విల్లంబులు చేతబట్టారు. నక్సలైట్లను వ్యతిరేకించారు. ఈ దశలో రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్షనేత, దంతెవాడ ఎంఎల్ఏ అయిన మహేంద్రకర్మ వారిని ప్రోత్సహించి, సల్వాజుడుం అని నామకరణం చేసిన సంస్థలోకి వారిని తీసుకురావాలని చూశాడు.






వాస్తవానికి గతంలో రెండు పర్యాయాలు ఈ వ్యక్తి నక్సలైట్ వ్యతిరేక జనజాగరణ్ అభియాన్‌లలో పాల్గొని అభాసుపాలయ్యాడు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం సల్వాజుడుంలో పాల్గొంటున్న వారికి అన్ని రకాల భద్రత, ప్రచారం, పోలీసు రక్షణ కల్పిస్తున్నది. ఆ ఉద్యమం ఖర్చంతా తానే భరిస్తున్నది. బస్తర్‌లో వివిధ సంక్షేమ చర్యల కోసం కేటాయించిన నిధులన్నీ దీనికోసమే వాడుతున్నారు. బిజాపూర్ తాలూకాకు సంబంధించినంత వరకు ఇతర పథకాల అమలు నిలిచిపోయింది. ఒక అంచనా ప్రకారం, సల్వాజుడుం పైన, దాని రక్షణ కోసం వినియోగిస్తున్న పోలీసు బలగాలపైన అవుతున్న ఖర్చు దాదాపు 48 కోట్ల రూపాయలు.

ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కలిసి ఈ మధ్య కొత్త ఢిల్లీకి వెళ్ళి కేంద్ర హోంమంత్రిని కలిసి సల్వాజుడుంను బలోపేతం చేయడానికి, దాని సహాయంతో నక్సలిజాన్ని అంతం చేయడానికి కేంద్రం తగిన ఆర్థిక వనరులు కేటాయించాలని, తగిన పోలీసు బలగాన్ని పంపాలని కోరారు. దీనిపైన కేంద్రం వారికి హామీ కూడా ఇచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం గానీ కేంద్ర ప్రభుత్వం గానీ సల్వాజుడుం నైజమేమిటో, ఆదివాసీ పల్లె ప్రజలపైన దాని ప్రభావం ఏ విధంగా ఉంటుందో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. వాస్తవమేమిటంటే మొదటి నుంచి కూడా సిపిఐ సల్వాజుడుం వల్ల ఉండగల ప్రయోజనాన్ని గురించి ప్రశ్నలు లేవదీసింది. ఆ ఉద్యమం ఎంతవరకు రాజకీయాలకు అతీతం అన్న సందేహాన్ని వ్యక్తం చేసింది. ఆదివాసులు ఎంతవరకు దానిలో హృదయపూర్వకంగా పాల్గొంటున్నారన్న అనుమానమూ వ్యక్తం చేసింది. ఈ రాష్ట్రానికి చెందిన చాలామంది కాంగ్రెస్, బిజెపి నాయకులు, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం ఎంఎల్ఏ మాత్రమే అయిన అజిత్‌జోగి, ఎంఎల్ఏ నందకుమారసాయి, మాజీ కేంద్రమంత్రి అరవింద్ నేతం, దంతెవాడ జిల్లాలోనే కుంట, బిజాపూర్‌లకు చెందిన కాంగ్రెస్ నాయకులు సల్వాజుడుం ప్రస్తుతం తీసుకున్న రూపాన్ని బహిరంగంగా వ్యతిరేకించారు.


పోలీసులు సల్వాజుడుం అండదండలతో నిరాయుధులైన గ్రామీణ ఆదివాసుల పైన క్రూరమైన అణచివేత ప్రయోగిస్తున్నారని, ఆ క్రమంలో చాలామంది ఆదివాసులు చనిపోయారని, దంతెవాడ జిల్లా సిపిఐ అధ్యక్షుడు అనగా ఆ జిల్లా ఎస్‌పి ఆ సూచనలకు నక్సలైట్లను బాధ్యులను చేయాలని చూశాడు. ఈ విధంగా ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను ఖాతరు చేయకుండా



ప్రస్తుతం నడుస్తున్న సల్వాజుడుం ఉద్యమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చేశారు. ప్రజలు సల్వాజుడుంలో స్వచ్ఛందంగా చేరడం లేదు. ఒక పక్క నక్సలైట్ల ఒత్తిడి, ఒక పక్క పోలీసు నిర్బంధం వారిని నొక్కేస్తుండడం వల్ల చేరుతున్నారు. ఆదివాసీ యువకులకు ప్రత్యేక పోలీసు అధికారులుగా తర్ఫీదు ఇచ్చి వాళ్ళ చేతిలో ఆయుధాలు పెట్టి నక్సలైట్ దళాలతో తలపడమంటున్నారు. ఈ క్రమంలో ప్రతీ గ్రామంలోనూ అంతర్యుద్ధ వాతావరణం ఏర్పడబోతోంది. గడచిన కొన్ని నెలలలో బిజాపూర్ తాలూకాలో పోలీసులకూ, నక్సలైట్లకూ జరిగిన ఎదురుకాల్పులలో 100 మంది నిరాయుధులైన పౌరులు చనిపోయారు. నిజానికి, పైన వివరించిన ఘటనలు జరుగుతున్న క్రమంలో బస్తర్‌లోని షెడ్యూల్డు ప్రాంతానికి రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు ఇచ్చిన విశేష అధికారాలు, గ్రామ పంచాయతీలకూ, గ్రామ సభకూ 1996 పంచాయతిరాజ్ చట్టం ఇచ్చిన ప్రత్యేక హక్కులూ మృగ్యమై పోయాయి.

సిపిఐ అభిప్రాయంలో నక్సలైట్ తీవ్రవాదులు (ప్రస్తుతం వీరిని సిపిఐ - మావోయిస్టులు అంటున్నారు) ప్రవేశపెట్టిన సాయుధ పోరాటం, ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులకు వారు కల్పించిన అవరోధం, పోలీసులనూ ప్రజాప్రతినిధులనూ నిరాయుధులైన ఆదివాసులనూ వారు హతమార్చడం ఈ ప్రాంతంలో శాంతియుతమైన అభివృద్ధి పనులకు ఆటంకం అయింది. ఈ ఆటంకాన్ని అధిగమించాలి. అయితే నక్సలైట్లను అంతమొందించే పేరిట నక్సలైట్ ప్రభావిత గ్రామాలలో నిరాయుధులైన ఆదివాసీ గ్రామీణ ప్రజలకు ప్రమాదం కలిగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ప్రస్తుతం అదే జరుగుతున్నది. సల్వాజుడుం పేరిట పోలీసు బలగాలు దక్షిణ బస్తర్‌లో, ప్రత్యేకించి బిజాపూర్ తాలూకాలో చేస్తున్న క్రూరమైన అత్యాచారాల గురించి, అనేక హత్యల గురించి మీకు తెలియజేయాలని సిపిఐ భావిస్తున్నది. సిపిఐ ప్రధాన కార్యదర్శి అయిన ఎ.బి.బర్దన్ గారి ఆదేశాల మేరకు, చిత్తరంజన్ బక్షి బిజాపూర్ తాలూకాలో 2005 నవంబర్ 9, 10 తేదీలలో ఒక నిజ నిర్ధారణ కమిటీని తీసుకుపోయారు. సల్వాజుడుంలో భాగమైనందుకు నక్సలైట్లు దాడిచేస్తారని భయపడి ఊర్లు విడిచిపోతున్న గ్రామస్తులను వారు ఆపారు. వివిధ రహదారి శిబిరాల వద్ద వాకబు చేశారు. నిజనిర్ధారణ కమిటీతో బాటు చాలామంది విలేకరులు కూడా వెళ్ళారు. నిజనిర్ధారణ కమిటీ సేకరించిన వివరాలనూ అభిప్రాయాలనూ దిగువ ఇస్తున్నాము.






బైరంగఢ్ బ్లాక్ కార్యాలయంలో ఒక శిబిరం నడుపుతున్నారు. ప్రస్తుతానికి అక్కడ 2,000 మంది ఉన్నారు. వారు అత్యంత అమానుషమైన జీవితం గడుపుతున్నారు. బైరంగఢ్ శిబిరంలో 5 – 16 మీటర్ల వైశాల్యం గల గుడారం కింద సాల్దా గ్రామానికి చెందిన 107 మంది గత మూడు నెలలుగా నివసిస్తున్నారు. అందరూ అక్కడే తింటారు, అక్కడే వండుకుంటారు. ఈ రకమైన ఏర్పాటు ఇతరులకూ చేయబడింది. వీరంతా వారి గ్రామాలను తగలబెట్టిన తరువాత వచ్చారు. వారి ఆవులు, ఎడ్లు, పందులు, కోళ్లు లూటీ చేయబడ్డాయి. వరిపంట కొల్లగొట్టబడింది. ఈ ప్రజలందరినీ శిబిరంలోకి చేరదీయడంతో పోలీసుల పని అయిపోయింది.

కొత్రాపాల్ గ్రామానికి చెందిన సరండర్ అయిన యువకులు 48 మంది కూడా బైరంగఢ్ శిబిరంలో ఉన్నారు. వారిని 2005 అక్టోబర్ 30 నాడు వారి గ్రామాల నుంచి తీసుకొచ్చి మహేంద్రకర్మ సమక్షంలో సరండర్ చేయించారు. సరండర్ అయిన నక్సలైట్లకు పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది కాని వారికి ఏ రకమైన ఆర్థిక సహాయమూ ఇవ్వలేదు. అయితే పని కల్పించడానికి ఏర్పాట్లు జరిగాయి. శిబిరంలో నివసించడానికి వారు నిర్మాణాలు చేపడుతున్నారు. దీనికి అవసరమైన కలప, ఇతర వస్తువులు వారే అడవి నుంచి తెచ్చుకుంటున్నారు. వారిని ప్రశ్నించినప్పుడు తామసలు ఎప్పుడూ నక్సలైట్లు కాదనీ, తమను బలవంతంగా శిబిరానికి తీసుకొచ్చి సరండర్ నాటకం ఆడించారనీ అన్నారు. మహేంద్రకర్మ ఇచ్చిన ఒక ప్రకటన ప్రకారం, ఇప్పటికి అటువంటి నక్సలైట్లు 900 మంది సరండర్ అయ్యారు. శిబిరాలలో ఉన్న వారితో మేము మాట్లాడినప్పుడు మీకేం కావాలని అడిగితే, తిరిగి తమ గ్రామాలకు పోవాలని ఉందనీ, అయితే పోలీసులు అనుమతించరనీ అన్నారు.

బైరంగఢ్‌కు 7 కిలోమీటర్ల దూరాన ఉన్న పాదుం గ్రామానికి చెందిన ఐతు తన ఊరిలో 200 ఇళ్ళుండేవనీ, ఇప్పుడందరూ శిబిరంలోనో ఉన్నారనీ అన్నాడు. మొదట్లో వారికి అన్నం వండుకోవడానికి సరుకులు ఇచ్చేవారు గానీ ఇప్పుడు అదీ ఆగిపోయింది. బైరంగఢ్ ప్రజలు ఏమంటారంటే రోడ్లు వేయడం వంటి బాధ్యతలు ఇప్పుడు గ్రామ పంచాయతీ చేతిలో నుంచి తీసేసి ప్రభుత్వం చేతిలో పెట్టారు. రోడ్డు పనులన్నీ అసంపూర్ణంగా ఉన్నాయని వారు అన్నారు. మట్వాడ గ్రామ శిబిరంలో ఉన్న కొత్రాపాల్ నివాసి అయిన సుక్కు తమ గ్రామానికి పోలీసులు జూన్ నెలలో వచ్చారనీ, ఏడుగురిని చంపారనీ అన్నాడు.




ఇప్పుడు వారు వెనక్కిపోతే నక్సలైట్లు చంపుతారని చెప్పి పోలీసులు వారిని వెనక్కి పోనివ్వడం లేదు. ఈ శిబిరంలోని ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లభించడం లేదు. వారు తమ ఊరినుంచి తెచ్చుకున్న ధాన్యమే తింటున్నారు. ఈ శిబిరంలో 100 మంది ఉన్నారు. యువకులు పగలు గ్రామానికి పోయి అక్కడ దొరికిన ధాన్యం తెచ్చుకుంటున్నారు.

సిపిఐ నిజనిర్ధారణ కమిటీ దట్టమైన అడవిలో ఉన్న మంకేలి గ్రామానికి కూడా వెళ్ళింది. ఆ ఊరిలో 40 ఇళ్ళున్నాయి. కమిటీని కలిసిన గ్రామస్తులు, సల్వాజుడుం తమ గ్రామానికి వచ్చినప్పుడు వారితో పాటు వచ్చిన సిఆర్‌పిఎఫ్ వాళ్లు చాలా ఇళ్లకు నిప్పు పెట్టారని చెప్పారు. మాసా మురియం అనే ఆదివాసీ మహిళ పందుల కోసం విడిగా కట్టిన గుడిసెను ధ్వంసంచేసి తగలబెట్టి పందులను పట్టుకొని తీసుకుపోయారని చెప్పింది. ఇతర గ్రామస్తులు కూడా సల్వాజుడుం వారు ప్రతి ఇంటి నుంచీ విప్పపువ్వు, మేకలు, పందులు, కోళ్ళు ఎత్తుకుపోయారని చెప్పారు. ఆ ఊరిలో తగలబెట్టిన ఒక ఇల్లు లచ్చుది. అతని భార్య సుక్లి కోసాతో 'మీరు నక్సలైట్లకు ఆశ్రయం ఇస్తున్నారు కాబట్టి మీకు ఈ బజార్లో ఏదీ అమ్మరు' అని చెప్పారు. ఆమె కొడుకు తమ్మును చాలా నెలల కింద పోలీసులు అరెస్టు చేసి బైరంగఢ్ తీసుకుపోయారు. ఆ తరువాత అతని ఆచూకీ ఆమెకు తెలీదు. అదే ఊరిలో అంగన్‌వాడీ బిల్డింగ్‌ను తగలబెట్టారు. చింతపండు, విప్పపువ్వు మొదలైన సరుకుల నిల్వలను దోచుకున్నారని ప్రజలు చెప్పారు. ఎవరు చేశారని అడుగగా తగులబెట్టింది సల్వాజుడుం వారని ఒకరు అన్నారు.

లోహుగాంలో కూడా 2005 నవంబర్ 10వ తేదీన ఇద్దరిని చంపారు. బైలడిల్లా గనులకు పశ్చిమాన ఉన్న గ్రామాల ప్రజలు కూడా తమకు కలిగిన నష్టాన్ని గురించి చెప్పారు. హింద్‌బేడి గ్రామంపైన ఒక నెల కింద సిఆర్‌పిఎఫ్ వారు, 50 మంది సల్వాజుడుం వారితో కలిసి దాడిచేశారని ఆ ఊరి వాళ్ళు చెప్పారు. నాను ఇంటినుంచి 40 కిలోల బియ్యం ఎత్తుకుపోయారు. చేతికి చిక్కిన పందులూ, మేకలూ, కోళ్ళూ ఎత్తుకుపోయారు. కమాద్ గ్రామంలో 36 ఇళ్ళున్నాయి. సల్వాజుడుం వాళ్ళు పోలీసులతోపాటు వచ్చి నాలుగు ఇళ్ళకు నిప్పు పెట్టారు. ఇళ్ళ నుంచి 20 కోళ్ళు, 20 కిలోల బియ్యం, ఒక పందిని తీసుకుపోయారు. భయంకొద్దీ ప్రజలు అడవులలోకి పారిపోయారు. పోతూపోతూ సల్వాజుడుం వాళ్ళు 2.25 క్వింటాళ్ళ కోస్రాను, 40 కిలోల ధాన్యాన్నీ తగలబెట్టారు. కవాద్ సమీపంలో ఉన్న హరిల్ గ్రామంలో సల్వాజుడుం






అత్యాచారాలు అధికంగా జరిగాయి. ప్రతీ ఇంటినీ తగలబెట్టారు, హత్యలు చేశారు. కవాద్ గ్రామానికి చెందిన లక్ష్మా ఈ విషయం మాకు చెప్పాడు. 2005 సెప్టెంబర్ 30 నాడు సల్వాజుడుంవాళ్ళు తమ ఊరికి బంబలూరు వైపునుంచి వచ్చి ఆరు పందులను, ఆరు కోళ్ళను చంపి అక్కడే వండుకొని తిన్నారని గుర్జి గ్రామస్తులు చెప్పారు. ఆ తరువాత 30 పాత్రలు ఎత్తుకు పోయారని చెప్పారు. ఒక నిమ్మచెట్టును, మరొక చెట్టును నరికారనీ, ఒక సైకిల్‌ను విరగ్గొట్టారనీ కూడా చెప్పారు. ప్రతి ఇంటినుంచి ధాన్యం, విప్పపువ్వులు తీసుకుపోయారు. 60 లేక 70 మంది గ్రామస్తులు భయంకొద్దీ పారిపోగా, దాడి చేసిన వారు 10,000 రూపాయల నగదు తీసుకుపోయారు. అక్టోబర్ నెలలో 1,000 మంది సల్వాజుడుం వాళ్ళు సిఆర్‌పిఎఫ్ వాళ్ళతో కలిసి తమ ఊరికి వచ్చి 17 మందిని పట్టుకొని బాగా కొట్టి తీసుకుపోయి సల్వాజుడుంలో భాగం చేశారని ముల్లూరు గ్రామస్తులు అన్నారు. సిఆర్‌పిఎఫ్ వాళ్ళు ఐతు కుమారుడు ఉత్సా పొన్నును పట్టుకొని గొంతుకోసి వీధిలో పడేశారు. ఆ ఊరిలో 50 ఇళ్ళు ఉన్నాయి. ఈ గ్రామంలో కూడా దాడి చేసినవారు కోళ్ళు, ఇతర జంతువులను తీసుకుపోయారు.

పొల్నార్ 30 ఇళ్ళున్న ఊరు. ఆ ఊరి ప్రజలు ధాన్యం దాచుకుంటే సల్వాజుడుం వాళ్ళు ధాన్యం దాచుకున్న ఇళ్ళకు నిప్పు పెట్టారు. ఇది 2005 సెప్టెంబర్ తొలి భాగంలో జరిగింది. ఇళ్ళలోని అన్ని గిన్నెల్ని పగులగొట్టి పారేశారు. 30 మందిని పట్టుకొని, వారిలో ఒకడైన బోడి కొడుకు సుఖ్‌రాంను చంపారు. పిడియా గ్రామంలో 450 ఇళ్ళున్నాయి. అది ఈ ప్రాంతంలోని పెద్ద గ్రామాలలో ఒకటి. సిఆర్‌పిఎఫ్ వాళ్ళు సల్వాజుడుంతో సహా ఈ గ్రామంలోకి వచ్చి 30 ఇళ్ళు తగలబెట్టారు. ఐతు మరో కొడుకు సంతును సిఆర్‌పిఎఫ్ వాళ్ళు చంపారు. ఈ ఊరిలో రెండు పందులు, 200 కోళ్ళు, దాదాపు 10,000 రూపాయల నగదు తీసుకుపోయారు. అక్కడే వండుకొని తిన్నారు. చంపిన వ్యక్తి ఇంటిని, అయిదు క్వింటాళ్ళ ధాన్యాన్ని తగలబెట్టారు. తమతో ముగ్గురు మగవాళ్ళను తీసుకుపోయారు.

ఆంద్రీ గ్రామస్తుడైన ఖాసా సల్వాజుడుంవాళ్ళు ఆంద్రీకి కవాడగాం నుంచి వచ్చారని చెప్పాడు. ఆ ఊరిలో ఏమీ తగలబెట్టలేదు గానీ కోళ్ళు, మేకలు తీసుకుపోయారు. దానికి పొరుగున ఉన్న తామాడి ఎక్కువ ఇళ్ళున్న పాత ఊరు. సల్వాజుడుం వాళ్ళు, సిఆర్‌పిఎఫ్ వాళ్ళు ఆ ఊరిలో ఆరు ఇళ్ళు తగలబెట్టారు.



పై సమాచారాన్ని అనుసరించి ఇదంతా బిజాపూర్ తాలూకా గ్రామాలలో నివసిస్తున్న ప్రజలకూ సమీపంలోని అడవులలో ఉన్న నక్సలైట్లకూ మధ్య వైరుధ్యం సృష్టించడం కోసమే జరుగుతున్నదనేది స్పష్టమే. ఈ గ్రామాలు ఒక దానికొకటి దూరంగా ఉండడం వల్ల ఈ అత్యాచారాలను ఎదుర్కొనడానికి ప్రజలు సంఘటితం కాలేకపోతున్నారు. ఇదంతా జూలై నుంచి సాగుతున్నది. ఇక్కడి ప్రజలకున్న ఒకే ఆదాయమార్గం వ్యవసాయం, లేక చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణ. ఇదంతా ఇప్పుడు నిలిచిపోయింది. ఆదివాసులిప్పుడు విపరీతమైన ఆవేదన అనుభవిస్తున్నారు. ఈ సంవత్సరం బిజాపూర్ తాలూకాలోని లోతట్టు గ్రామాలలో ధాన్యం దిగుబడి చాలా తక్కువగా ఉండింది. ఈ లోతట్టు గ్రామాలలో పనికి ఆహారం వంటి పథకాల అమలు కూడా శూన్యమే.


ప్రధానమంత్రికి మా విజ్ఞప్తి ఏమిటంటే దక్షిణ బస్తర్ అడవులలో నివసిస్తున్న దురదృష్టవంతులైన ఆదివాసులకు నక్సలైట్ల బీభత్సకాండ నుంచి, పోలీసు నిర్బంధం నుంచి, రాష్ట్ర ప్రభుత్వం చర్యల నుంచి పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని. దీనికోసం కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి విచారణ సంఘాన్ని నియమించి ఈ విషయంపైన వివరమైన పరిశోధన జరిపించాలి. సిపిఐ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి ఏమిటంటే బస్తర్‌లో నక్సలిజంపైన పోరాటం చేయడం కోసం త్వరితగతిన ఈ ప్రాంత నివాసులైన అత్యంత వెనుకబడిన వర్గమైన షెడ్యూల్డు తెగల ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచాలి, నిరుద్యోగ యువతకు యుద్ధ ప్రాతిపదికన పనులు కల్పించాలి. దానితోబాటు, నక్సలైట్ తీవ్రవాదుల నుంచి ఈ ప్రాంతాన్ని విముక్తం చేయడం కోసం సిపిఐ (మావోయిస్టు) నాయకులతో సీరియస్‌గా శాంతి చర్చలు ప్రారంభించాలి. గౌరవనీయులైన గవర్నర్ గారు ఆ కోరికను ఇప్పటికే వ్యక్తం చేసి ఉన్నారు.

# Civil war in Chathisgarh Adivasi Community

'సల్వాజుడుం' పేరు వినని వాళ్ళు ఇప్పుడెవరూ లేరు. మావోయిస్టులను ప్రతిఘటిస్తున్న ఆదివాసీ ప్రజా ఉద్యమంగా కొందరి చేత ప్రశంస అందుకున్న ఈ సంస్థ ఆవిర్భవించి ఇప్పటికి రెండేళ్ళయింది. ఈ రెండేళ్ళలో అక్కడ 700 మంది (95 శాతం ఆదివాసులే) ప్రాణాలు కోల్పోయారు. కొన్ని వందల ఇళ్ళు బుగ్గి అయ్యాయి. ఊళ్లకు ఊళ్లే తగలబడ్డాయి. దాదాపు లక్షమంది ఆదివాసులు బలవంతంగా నిర్వాసితులయ్యారు.

ఇది ప్రభుత్వం చెపుతున్నట్టుగా మావోయిస్టులపైన ఆదివాసీ ప్రజల తిరుగుబాటా? మావోయిస్టులు చెపుతున్నట్టుగా ఆదివాసీ ఉన్నత వర్గాన్ని వాడుకుని ప్రభుత్వం ఆదివాసుల పైన చేయిస్తున్న దాడా? అడవులను ఖాళీ చేయించి బడా పెట్టుబడిదారీ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం పన్నిన కుట్రా?

గత ఏడాదిలో ఏడుసార్లు ఛత్తీస్‌గఢ్ వెళ్ళి నిజనిర్ధారణ జరిపిన మానవ హక్కుల వేదిక నివేదిక ఇది. కారణాలేవైనా ఇప్పుడక్కడ జరుగుతున్నది మాత్రం అక్షరాలా అంతర్యుద్ధమేనని మానవహక్కుల వేదిక అభిప్రాయం.




A HRF Publication



# విచారణలు, విషాదాలు!

'సల్వాజుడుం' అని పిలవబడే సంస్థ లేక ఉద్యమం లేక రౌడీమూక ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అండదండలతో నిరాయుధులైన ప్రజల మీద హింసకు పాల్పడుతున్నదన్న అభియోగంపైన విచారణ జరిపి నివేదిక ఇమ్మని జాతీయ మానవహక్కుల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించటం చాలామందికి సంతోషం కలిగించింది. సంతోషించడంలో ఆక్షేపించడానికేం లేదుగానీ, ఎవరిమీదనయితే విచారణ జరపబోతున్నారో వారు దాన్ని సాగనివ్వరనీ, ఏ ప్రభుత్వం అండదండలతో వాళ్లు యథేచ్ఛగా హింసకు పాల్పడుతున్నారన్న అభియోగాన్ని కమిషన్ విచారించబోతున్నదో ఆ ప్రభుత్వం అండదండలతోనే అడ్డుపడబోతారనీ నిస్సంకోచంగా చెప్పవచ్చు.


విచారణ వస్తువే విచారణ ప్రక్రియకు ఆటంకమయితే విచారణ కమిషన్ ఏం తేల్చగలుగుతుంది? దాదాపు 14 ఏళ్ల కింద ఇదే జాతీయ మానవహక్కుల కమిషన్ ఆంధ్రప్రదేశ్‌లో ఒక విచారణ కోసం తరలివచ్చింది. పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలకు పాల్పడుతున్నారన్న అభియోగాన్ని విచారణకు స్వీకరించాక ఈ విషయంలో ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవడానికి అది బయలుదేరి వచ్చింది. వచ్చినవాళ్ళు చిన్నాచితక మనుషులు కారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఒకరు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు, ఇద్దరు హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, ఒక రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ అధికారీ వచ్చారు. కరీంనగర్, వరంగల్, నల్లగొండలలో విచారణ నిర్వహించారు. వారికి తెలిసిన ఏకైక పద్ధతిలో నిర్వహించారు. ఒక ప్రభుత్వ అతిథి గృహాన్ని విచారణ కేంద్రంగా ఎంచుకున్నారు. ఫలాన తేదీ పొద్దున్న 10 గంటల నుంచి ఫలానాచోట విచారణ జరుగుతుందనీ, ప్రజలెవరైనా వచ్చి ఎన్‌కౌంటర్ల విషయంలో గానీ మొత్తంగా నక్సలైట్ ఉద్యమం, ప్రభుత్వ చర్యలు అనే అంశాల మీదగానీ చెప్పవలసిందేమైనా ఉంటే చెప్పవచ్చునని పత్రికా ప్రకటన ఇచ్చారు.



మేము మూడు జిల్లాలలోనూ ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలను ఒక జీపులో పట్టేంత మందిని సమీకరించి తీసుకుపోయాము. అంతకంటె మాకు స్తోమతా లేదు, బాధితులలో కదలికా లేదు. ఒక్క కరీంనగర్‌లో మాత్రం విచారణ సక్రమంగా జరిగింది. అంటే పోలీసులు జోక్యం చేసుకోలేదు. మేము విచారణ స్థలానికి పోగానే కరీంనగర్ డిఎస్‌పి వచ్చి కరచాలనం చేసి 'ఇది మీ రోజు మా జోక్యం ఉండదు' అన్నాడు. మేము తీసుకొచ్చిన పోలీసు బాధితులు చెప్పవలసింది చెప్పారు. నక్సలైట్ బాధితులు కూడ కొందరొచ్చి వాళ్ళు చెప్పవలసిందీ చెప్పారు. మమ్మల్ని ఒకటి రెండు సూటి పోటి మాటలన్నారు గానీ అల్లరేం జరగలేదు. మరుసటిరోజు వరంగల్‌లో విచారణ జరగవలసిన చింతగట్టు గెస్ట్‌హౌస్‌కు మేము వెళ్లేసరికి అప్పటికే చాలా పెద్ద గుంపు అక్కడ పోగయి ఉంది. మేము చూస్తూ ఉండగానే గుంపు ఇంకా పెద్దదయింది. అది మమ్మల్ని అల్లరి పెట్టడానికి పోలీసులు పోగుచేసిన గుంపని అర్థం అయింది. మేము కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి గెస్ట్‌హౌస్ లోపలికి వెళ్లి విజిటర్స్ రూంలో కూర్చున్నాము. అయితే ఈ నాటకానికి డైరెక్టర్ అయిన అప్పటి వరంగల్ ఒ.ఎస్.డి. ఉమేష్ చంద్ర వచ్చి 'ఇది మీరు కూర్చోవలసిన చోటు కాదు. బయటకు వెళ్లండి' అన్నాడు. తాను పోగుచేసిన గుంపు చేత దెబ్బలు తినకుండ మేము తప్పించుకుంటామేమోనని అతని ఆదుర్దా.

కొంతసేపటికి కమిషన్ తన విచారణ మొదలుపెట్టింది. మేము తీసుకొచ్చిన పోలీసు బాధితులు కొంచెం చెప్పారు. ఇంతలో పోలీసులు తెచ్చిన గుంపు దాడికి దిగారు. మాపైన చేయిచేసుకున్నారు. అక్కడున్న పోలీసులు చోద్యం చూస్తూ నిలబడ్డారు. కొంచెం సేపటికి మానవహక్కుల కమిషన్ పెద్దలు జోక్యం చేసుకొని అందరినీ శాంతంగా ఉండవలసిందిగా కోరుతూ మాట్లాడారు. ఆ తరువాత సద్దుమణిగింది గానీ పోలీసు బాధితులెవ్వరూ అక్కడ మిగలలేదు. నక్సలైట్ బాధితులు మాత్రం మిగిలారు. కమిషన్ వారి వాంగ్మూలాలు స్వీకరించి విచారణ ముగించింది. పోలీసుల లక్ష్యం నెరవేరింది. మరుసటి దినం నల్గొండలోనూ అదే జరిగింది. మాకు హాని జరగగలదని భయపడి కణ్ణబిరాన్‌గారు స్వయంగా రాగా ఆయనపైన కూడ చేయి చేసుకున్నారు.

రేపు సుప్రీంకోర్టు ఆదేశం మేరకు జాతీయ మానవహక్కుల కమిషన్ ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టబోయే విచారణ ఇంతకంటే కూడ ఏకపక్షంగా ముగియగలదు. దానికి రెండు కారణాలున్నాయి. ఇక్కడ నిరంతరాయంగా ప్రజల హక్కుల కోసం పనిచేస్తున్నవారమున్నాము. ఆనాడు జాతీయ మానవ




హక్కుల కమిషన్‌ను రప్పించగలిగాము, స్తోమత ఉన్న మేరకు బాధితులను తీసుకురాగలిగాము. ఛత్తీస్‌గఢ్‌లో హక్కుల కోసం పనిచేసే ఏకైక స్థానిక సంస్థ పియుసిఎల్. వారికి విస్తృత నిర్మాణం లేకపోగా ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బినాయక్ సేన్ ఇప్పటికి ఒక సంవత్సరంగా జైలులో ఉన్నాడు. మరొక కార్యకర్త టి.జి.అజయ్‌ని సుప్రీంకోర్టు ఆదేశం (జాతీయ మానవహక్కుల కమిషన్ విచారణకు ఆదేశించాక) తరువాత అరెస్టు చేశారు. డాక్టర్ సేన్ మీద అభియోగం జైలులో ఉన్న సన్యాల్ అనే మావోయిస్టు నాయకుడిచ్చిన ఉత్తరాలను బయటున్న మావోయిస్టు పార్టీ నాయకులకు చేరవేశాడని. చేరవేశాడనే అనుకున్నా ఆ ఉత్తరాలలో ఏ హత్యకు పురమాయింపు లేదు, ఏ విధ్వంసానికీ పథక రచన లేదు. అటువంటప్పుడు అది నేరం ఎట్లాగయింది? ఒక వేళ అయిందనుకున్నా జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా అన్ని న్యాయస్థానాలలోనూ ఒక సంవత్సర కాలం బెయిల్ నిరాకరించవలసిన అవసరం ఏముంది?

అజయ్ మీద కేసు మరీ అన్యాయమైనది. అతను 2004 ఎన్నికలప్పుడు పరిశీలన నిమిత్తం తిరుగుతుండగా మావోయిస్టు సానుభూతిపరులు అతనిని పోలీస్ ఏజెంట్‌గా అనుమానించి, నిర్బంధించి కెమెరా గుంజుకున్నారు. ఆ కెమెరా తిరిగి ఇప్పించమని అతను మావోయిస్టు నాయకత్వానికి రాసిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, దాన్ని చూపెట్టి మావోయిస్టులతో సంబంధాలున్నాయని అజయ్ పైన కేసు పెట్టారు. పాపం అతనికి బెయిల్ దొరకడానికి ఎంతకాలం పడుతుందో! ఒక పక్క పరిస్థితి ఇది కాగా రెండవ పక్క పోలీసులు ఇక్కడ లాగ అక్కడ ప్రత్యేకంగా నక్సలైట్ వ్యతిరేక గుంపును పోగు చేయనక్కరలేదు. సల్వాజుడుం ఇప్పటికే తయారయి వుంది. వాళ్ల చర్యల గురించే జాతీయ మానవహక్కుల కమిషన్ రేపు విచారణ చేపట్టబోయేది. కోర్టు విచారణను కాదు కదా, వారికి ఏ ప్రమాదమూ కలిగించబోని జర్నలిస్టులు, హక్కుల సంఘాల వాళ్ల విషయ సేకరణను కూడ వారెన్నడూ సహించలేదు. సహించకపోవడం అంటే ఊరికే అభ్యంతరం చెప్పడం కాదు. మీదపడి కొడతారు, నిర్బంధించి కెమెరాలూ పుస్తకాలూ గుంజుకుంటారు, వెంబడించి తరిమేస్తారు. ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగు మీడియా ప్రతినిధులు ఈ చేదు అనుభవాన్ని చాలాసార్లు రుచి చూశారు.

అయినప్పటికీ సుప్రీంకోర్టు ఆదేశించిన విచారణ సక్రమంగా జరిగేట్టు చూడడం చాలా అవసరం. ఎందుకంటే మావోయిస్టుల ప్రభావాన్ని ఎదుర్కొనడానికి చట్టబద్ధమైన మార్గాలేవీ అనుసరించడం సాధ్యం






కాదనుకున్న పాలకులు, మావోయిస్టు బాధితులు, వ్యతిరేకులు పాల్పడే ప్రతీకార హింసకు చట్ట విరుద్ధంగా లైసెన్స్ ఇచ్చి సమాజం మీద వదిలే వికృత మార్గాన్ని ఎంచుకున్నారు. అది సల్వాజుడుం రూపంలో ఛత్తీస్‌గఢ్‌లో 'సఫలం' అయిందని భావించడం వల్ల జార్ఖండ్‌లోనూ, ఒరిస్సాలోనూ అదే ప్రయత్నం మొదలయింది. మణిపూర్‌లో జరుగుతున్న జాతి పోరాటానికి వ్యతిరేకంగానూ అదే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఎత్తుగడ కేవలం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన కాదు. కేంద్ర హోంశాఖే తన 2005-2006 నివేదికలో నక్సలైట్ ప్రభావం ఉన్న రాష్ట్రాల్లో స్థానిక ప్రతిఘటనా దళాలనూ గ్రామ రక్షణ దళాలనూ ప్రోత్సహించాలని సలహా యిచ్చినట్లు రాసుకుంది. సల్వాజుడుం ఒక మంచి ఉదాహరణ అని ప్రశంసించింది.

సల్వాజుడుం స్వభావాన్ని బహిర్గతం చేయగల మానవ హక్కుల కమిషన్ విచారణ సఫలమైతే ఈ క్రమానికి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేయగలదు. దీనికి ఒక మార్గం కమిషన్ తన విచారణను కేవలం దంతెవాడ జిల్లాలో జరపకుండ భద్రాచలంలో గానీ ఏటూరునాగారంలో గానీ కనీసం రెండు మూడు రోజులు కూర్చుని మన రాష్ట్రంలోకి పారిపోయి వచ్చిన ఛత్తీస్‌గఢ్‌వాసుల వాంగ్మూలాలు స్వీకరించడం. ఎంతలేదన్నా 30 వేల మంది ఇప్పటికి పారిపోయి వచ్చారు. ఎక్కువ భాగం ఖమ్మం జిల్లాలోనూ తక్కువగా వరంగల్ జిల్లాలోనూ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని బతుకుతున్నారు. వాళ్లందరూ మావోయిస్టు అభిమానులు కారు గానీ మినహాయింపు లేకుండ అందరూ సల్వాజుడుం బాధితులే. రకరకాల భయాలు వారి మెదళ్లపైన పనిచేస్తున్న కారణంగా వారిలో చాలామంది మాట్లాడకపోవచ్చు. కానీ ప్రయత్నం చేస్తే కొద్దిమంది ముందుకొచ్చి విచారణలో పాల్గొంటారు. ఈ అవకాశం మానవహక్కుల కమిషన్ ఇవ్వకపోతే వారి విచారణ ఘోరంగా విఫలం అయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు కేంద్ర ప్రభుత్వం దర్శకత్వంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినాశనకరమైన వ్యూహం అప్రతిహతంగా వ్యాపించే ప్రమాదం ఉంది.

ఆంధ్రజ్యోతి దినపత్రిక
20 మే 2008





# ఈ వేట ఆపమని నినదిద్దాం


'గ్రీన్‌హంట్' మొదలయింది. హోం మంత్రి చిదంబరం సెప్టెంబర్‌లో మొదలుపెడతామని చెప్పి నవంబర్‌కు వాయిదా వేసిన మావోయిస్టుల 'ఏరివేత' కార్యక్రమం ఇప్పుడు మొదట అనుకున్నట్టుగా సెప్టెంబర్‌లోనే ప్రారంభమయింది. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వార్తల విశ్వసనీయత స్వల్పమే కాబట్టి ఎంతమంది కోబ్రాలు దంతెవాడ జిల్లాలోకి ప్రవేశించారు, కేంద్రం ఎన్ని బెటాలియన్ల పారామిలటరీని పంపింది, కాల్పులలో ఇప్పటికి ఇటువైపూ అటువైపూ ఎంతమంది చనిపోయారు ఇత్యాది విషయాలపై పత్రికలు ఇస్తున్న గణాంకాలు పూర్తిగా సత్యాలు కాకపోవచ్చును. సిబ్బంది సంఖ్య తెలుసుకోవడం కొంచెం ప్రయత్నం చేస్తే అసాధ్యం కాకపోవచ్చును గానీ మరణాల గురించి ఆ మాట అనలేం. మరణానికి సాక్షి మృతదేహం. కానీ ఛత్తీస్‌గఢ్ పాలకులు తమ వారి మృతదేహాలను మాత్రమే స్వాధీనం చేసుకొని పంచనామా, పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. మావోయిస్టులు, వారి సానుభూతి పరుల మృతదేహాలను అడవి జంతువులకు వదిలేసి రావడం తరచుగా జరుగుతుంది. ఒక సంవత్సరం క్రితం వరకు ఎప్పుడూ అదే జరిగేది. ఈ మధ్య కొన్ని సందర్భాలలో వారి మృతదేహాలను కూడ తీసుకొచ్చి పంచనామా చేస్తున్నట్టున్నారు. చనిపోయిన వారు సాయుధ నక్సలైట్లు కాక గ్రామీణ ప్రజలయితే, వారి మృతదేహాలను అడవిలోనే వదిలేయడం పాలకుల దృష్టిలో తెలివయిన పని. నిజంగా సాయుధ కార్యకర్తలయినా కూడ, ఆ విద్రోహుల శవాలకు ఇన్ని మర్యాదలు, దానికోసం తమకింత శ్రమ అనవసరం అన్న అభిప్రాయం ఛత్తీస్‌గఢ్ పాలనా యంత్రాంగంలో ఉన్నట్టుంది. శ్రీలంకలో ఎల్‌టిటిఇపైన జరిగిన పోరులో చనిపోయిన తమిళుల మృతదేహాలకు జరిగిన పంచనామాలో వారిని చిత్రహింసలు పెట్టి చంపిన దాఖలాలున్నాయని బయట పడిన తరువాత, పంచనామా చేయకుండ ఖననం



చేయొచ్చునని ఆ దేశ ప్రభుత్వం ఆర్డర్ జారీచేసింది. మన ప్రభుత్వాలు అటువంటి ఆదేశాలు జారీ చేయడానికి రాజ్యాంగం అడ్డం రావచ్చును కాబట్టి అలిఖిత ఆదేశాల ద్వారా ఛత్తీస్‌గఢ్ పాలకులు దానిని అమలుచేస్తున్నారు.

మీడియా ఆ ఛాయలకు రాకూడదని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తాఖీదు జారీచేసిందని కూడ పత్రికలు చెప్తున్నాయి. 'గ్రీన్‌హంట్'లో వేటాడబడుతున్నది సాయుధులా లేక వారి వెంబడి ఉన్న ఆదివాసులా అన్నది బయటపడకుండ ఉండడానికి ఈ ఆంక్ష సహితం అవసరం అని రమణ్ సింగ్ ప్రభుత్వం భావించినట్టుంది. ఈ ఆంక్షను ధిక్కరించే ధైర్యం మీడియాకు ఉంటే గెలవగలరు. ఎందుకంటే పత్రికా స్వేచ్ఛ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగం అని సుప్రీంకోర్టు రాజ్యాంగం రాసిన తొలినాళ్లలోనే వ్యాఖ్యానించింది. దానిని రాజ్యాంగం ఆమోదించిన పరిమితుల మేరకు, అదీ చట్టం చేసి, నియంత్రించవచ్చును గానీ ఏ కారణం చూపించకుండ జీవోల ద్వారా మీడియాను నిషేధించే అధికారం ప్రభుత్వానికి లేదు. తుపాకులు పట్టుకొని అడ్డం నిలబడ్డ కోబ్రాలతో రాజ్యాంగాన్ని గురించి వాదించి ప్రాణాలతో బయటపడడం సాధ్యమని కాదు గానీ, కనీసం ఈ ఆంక్ష చట్ట రీత్యా అక్రమం అని తెలుసుకోవడం అవసరం. లేకపోతే మీడియాను రానివ్వం అని ప్రభుత్వాలు ఒకదాని తరువాత ఒకటి నిషేధాలు పెట్టడం మొదలుపెడితే ప్రజాస్వామ్యానికి చాలా నష్టం. లాల్‌గఢ్‌లో వామపక్ష ప్రభుత్వం మొదలుపెట్టిన దానిని ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. అయితే ఈ విషయంలోనూ శ్రీలంక ఇన్స్‌పిరేషన్ ఉన్నట్టుంది. ఎల్‌టిటిఇపైన పోరు జరిగేటపుడు చివరి మూడునెలల్లో శ్రీలంక పాలకులు మీడియాను దేశ ఉత్తర ప్రాంతానికి రానివ్వలేదు. ఆ దశలో 20 వేల మంది సాధారణ తమిళ పౌరులు చనిపోయారని ఐక్యరాజ్య సమితి అధికారులు ఆంతరంగిక ఉత్తర ప్రత్యుత్తరాలలో చెప్పుకున్న విషయాన్ని చూస్తే శ్రీలంక పాలకుల ఉద్దేశ్యం అర్థం అవుతుంది.

శ్రీలంక ప్రస్తావన ఇప్పటికి రెండుసార్లు వచ్చింది. మూడవసారి వస్తేగానీ కథ పూర్తి కాదు. ఎల్‌టిటిఇ సైనిక పతనం తరువాత ఇండియా పాలకులకొక ధైర్యం వచ్చింది. మిలిటెంట్ రాజకీయ పోరాటాలతో శాంతిచర్చలు, రాజకీయ పరిష్కారాలూ అక్కరలేదనీ, గట్టిగా పూనుకుంటే వారిని భౌతికంగా ఏరివేయవచ్చుననీ ఇప్పుడు మన పాలకులు కూడ నమ్ముతున్నారు. ఇప్పటికే దేశ ఆంతరంగిక భద్రతకు ప్రధాన ప్రమాదం అని ప్రకటించబడ్డ మావోయిస్టులను ఏరివేయాలన్న సంకల్పం దీనితో బలపడింది. దేశ ఆంతరంగిక భద్రతకు మావోయిస్టుల కంటే పాలక పార్టీల అవినీతి, అక్రమ




పరిపాలన, అసమానతలను వికృతంగా పెంచుతున్న ఆర్థిక విధానాలు ఎక్కువ ముప్పు కాదా అని సాధారణ మానవులకు సహితం సందేహం రావొచ్చు. కానీ ప్రస్తుతం హోం మంత్రిగా ఉన్న మన మాజీ ఆర్థిక మంత్రి, దేశ 'అభివృద్ధి' విధానకర్తలలో ఒకడు అయిన చిదంబరానికి తెలిసిన విషయమేమిటంటే ఆంతరంగిక భద్రత సంగతి ఎట్లాగున్నా మధ్యభారత అడవి ప్రాంతాలలోని అపారమయిన ఖనిజ సంపదను వెలికి తీసి 'అభివృద్ధి' వనరుగా వినియోగించే ప్రయత్నానికి మావోయిస్టుల ఉనికి అడ్డం కాగలదని. మావోయిస్టులు తమకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో బడా పెట్టుబడిదారుల ఉనికికీ విస్తరణకూ అన్ని సందర్భాలలోనూ అడ్డుపడలేదుగానీ, అడ్డుపడగలరన్న భయం వల్ల పెట్టుబడిదార్లు ముందుకు రాకపోవచ్చునని ఆ ఆందోళన.

అన్నీ కలిసి మావోయిస్టుల ఏరివేత ప్రక్రియకు దారితీసాయి. భారీగా పారా మిలటరీని, గెరిల్లా తరహా శిక్షణ పొందిన కోబ్రాలను దించి భౌతికంగా మావోయిస్టులను తుదముట్టిస్తాం అని చిదంబరం టూత్‌పేస్ట్ చిరునవ్వు చెదరకుండ చేస్తున్న సవాలు అమలుకావడం మొదలయింది. ఈ ఏరివేతకు అర్థం ఆదివాసుల హననం కాగలదని నిన్న మొన్న దంతెవాడ కాల్పుల గురించి అరకొరగా వస్తున్న వార్తలు తెలుపుతున్నాయి. అయితే మావోయిస్టులూ అదే భాష మాట్లాడుతున్నారు. తమ తడాఖా చూడమని ప్రభుత్వానికి ఎదురు సవాలు విసురుతున్నారు. అబుజ్‌మఢ్‌లో పారామిలటరీని దించుతాం అని చిదంబరం ప్రటించిన రెండవరోజే రాజ్‌నంద్‌గాంలో వారు పోలీసులను పెద్ద సంఖ్యలో చంపారు. సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకున్నవారు యుద్ధం వచ్చినప్పుడు యుద్ధం చేయక తప్పదుగానీ ప్రజల మధ్య బతుకుతూ యుద్ధాన్ని ఆహ్వానించే పనులు చేయకూడదు. నివారించడానికి ఎంత చేయగలిగితే అంత చేయాలి. ఏం చేయవచ్చునంటే చాలా చర్చ పెట్టుకోవచ్చును గానీ, అసలు ఆ వైఖరి ఉందా అనేది ప్రశ్న. మావోయిస్టు నాయకులకు ఇటువంటి ప్రశ్నలు నచ్చవు. 'మీరు ఎవరి పక్షం?' అని అడుగుతారు. రాజకీయ పక్షపాతాన్నే కాక విలువల పక్షపాతాన్ని కూడ గుర్తించేట్టయితే మేము న్యాయం పక్షం అని జవాబు చెప్పవచ్చు. న్యాయం ఎక్కువ భాగం ప్రజల కోసం పోరాడేవారి వైపే ఉంటుంది గానీ, వారు ప్రజల క్షేమం కంటే తమ రాజకీయ లక్ష్యాన్ని ప్రధానంగా ఎంచినప్పుడు అది అన్యాయం అనక తప్పదు.

'ప్రభుత్వం మాత్రం ఎంతకాలం చూస్తూ ఊరుకుంటుంది' అని అడిగే వారూ ఉంటారు. ప్రజల అవసరాల కోసం మిలిటెంట్






పోరాటాలు చేయడం వేరు, రాజ్య సార్వభౌమత్వాన్నే సాయుధంగా సవాలు చేయడం వేరు. మొదటిదాని పట్ల కొంత ఉదారంగా ఉండగల పాలకులు రెండవదాని పట్ల ఉండలేరని అంటారు. మావోయిస్టులయినా రేపు అధికారానికి వస్తే ఇంతకంటే భిన్నంగా నడుచుకుంటారా అని ప్రశ్నిస్తారు. ఇది న్యాయమైన ప్రశ్నే గానీ, ఎటువంటి సవాలునైనా ప్రజాస్వామికంగానే ఎదుర్కోవాలనేది ప్రజాతంత్రవాదులివ్వగల ఏకైక సమాధానం. దీనికి మార్గం చెప్పమని కోరుతూ 11వ ప్రణాళికా సంఘం ఒక నిపుణుల కమిటీని నియమించగా మావోయిస్టుల వల్ల ప్రజలు ఏ హక్కులు, ఏ స్వతంత్రం, ఏ జీవనావకాశాలు పొందారో అవి నీ సార్వభౌమాధికారాన్ని వినియోగించి నువ్వే కల్పించడం ఒక్కటే వారిని ప్రజాస్వామికంగా ఎదుర్కొనే మార్గం అవుతుందని వారు చెప్పడం జరిగింది. మన్మోహన్ సింగ్ గానీ చిదంబరం గానీ ఆ నివేదిక చదివిన దాఖలాలు లేవు.

చివరిగా, దంతెవాడ జిల్లాలోని సంఘర్షణ ఎప్పటిలాగే భద్రాచలం డివిజన్‌లో ప్రతిధ్వనించడం మొదలయింది. చింతూరు నుంచి వాజేడు దాకా పోలీసులు ఆదివాసులను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు రప్పించి, అక్రమంగా నిర్బంధించి, తీవ్రంగా హింసించి 'బైండోవర్' చేస్తున్నారు. చర్ల పోలీసులు చేతులూ కాళ్లూ కట్టి కొక్కానికి వేళ్లాడదీసి చితకగొట్టిన ఆర్. కొత్తగూడెం కాలనీవాసి కొమురం నరసింహారావు, మళ్లీ ఏం చేస్తారో అన్న భయానికి ఈ నెల 7వ తేదీన తన ఊరి సమీపంలో ఆత్మహత్య చేసుకోవడంతో ఈ విషయం బయటి ప్రపంచానికి తెలిసింది. ఇక్కడే పరిస్థితి ఇట్లా ఉంటే దంతెవాడలో ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. అందుకే ప్రభుత్వం ఈ వేట ఆపాలని అందరమూ నినదించడం అవసరం. మావోయిస్టులూ ఆ దిశగా ఒత్తిడి పెంచే పద్ధతిలో నడుచుకోవాలని కోరడమూ అవసరం.

ఆంధ్రజ్యోతి దినపత్రిక
23 సెప్టెంబర్ 2009






# సంఘ్‌పరివార్ హింసాకాండను వ్యతిరేకిద్దాం రండి

ఒరిస్సా రాష్ట్రంలోని కంధమాల్ జిల్లాలోనూ, దానికి ఆనుకొని ఉన్న ఇతర జిల్లాలలోనూ ఆగస్ట్ 24వ తేదీన మొదలయి ఈనాటికీ ఆగకుండ క్రైస్తవులపై జరుగుతున్న దాడులలో 41 మంది (ప్రభుత్వ లెక్కల ప్రకారం) చనిపోయారు. దాడులు మొదలయిన వారం రోజులలోనే 24,000 మంది తమ ఊర్లు వదిలిపెట్టి ప్రభుత్వము, క్రైస్తవ సంస్థలు నిర్వహిస్తున్న శిబిరాలను చేరారు. సరయిన లెక్కలు లేవుగానీ ప్రస్తుతం 40 నుండి 50 వేలమంది దాకా జిల్లా బయట ఎక్కడో ఒకచోట తలదాచుకొని ఉండవచ్చునని అంచనా. తగలబడిన, ధ్వంసమైన క్రైస్తవుల ఇళ్ళు, ప్రార్థనా స్థలాలైతే వేల సంఖ్యలో ఉంటాయి.

దాడి చేసినవారు భజరంగ్‌దళ్ నాయకత్వంలో సమీకరించబడ్డ ప్రజలు. అధికభాగం కంధ లేక కంధా (మన దగ్గర కోందు) తెగకు చెందిన ఆదివాసులు. అయితే వారితోబాటు హైందవ అగ్రకులాలకు, బిసిలకు చెందినవారూ ఉన్నారు. దాడికి గురయిన వారంతా క్రైస్తవులే. అందులో అధికభాగం పాణోలనే దళితకులానికి చెందినవారు. తక్కినవారు మళ్లీ కోందులే - అయితే క్రైస్తవ కోందులు.

దాడి ఎందుకు జరిగింది? భజరంగ్‌దళ్, దాని రాజకీయ సంరక్షకులయిన భారతీయ జనతాపార్టీ రెండు కారణాలు చెప్తున్నారు. లక్ష్మణానంద సరస్వతి అనే స్వామీజీని క్రైస్తవులు హత్యచేసిన కారణంగా, ఆయన చేసిన సంఘసేవా కార్యక్రమాల వల్ల ప్రయోజనం పొందిన ఆదివాసులు క్రైస్తవులపైన ప్రతీకారం తీర్చుకున్నారనేది ఒక కారణం. ఎస్.టిలు అయిన కోందులు




ఎస్.సిలయిన పాణోల కుతంత్రాల వల్ల నష్టపోయారు. ఆ వైరుధ్యం కారణంగా వారు పాణోలపైన తిరుగుబాటు చేశారు. క్రైస్తవులయిన పాణోలు క్రైస్తవ మిషనరీలకు అడ్డు తగులుతున్న 'స్వామీజీ'ని చంపటం ఈ తిరుగుబాటుకు ప్రేరణ ఇచ్చింది. ఇది రెండవ కారణం. ఇది నిజమా?

పాణోలపైన కోందులు తిరుగుబాటు అన్న వాదనే మొదట తీసుకుంటే, దాడులు కేవలం క్రైస్తవం పుచ్చుకున్న పాణోలపైనే జరిగాయి. ఇతర పాణోలపైన జరగలేదు. అంతేకాక క్రైస్తవులుగా మారిన కోందులపైన కూడ జరిగాయి. కాబట్టి ఇది క్రైస్తవులపైన దాడే తప్ప పాణోలపైన తిరుగుబాటు కాదు.

'స్వామీజీ'ని చంపినందుకే క్రైస్తవులపై దాడులు చేశారా? కానీ స్వామీజీని చంపింది క్రైస్తవులు కాదే, మావోయిస్టులు. ఆ విషయం మావోయిస్టులు వెంటనే ప్రకటించారు. ఎందుకు చంపారో వివరిస్తూ కరపత్రమూ వేశారు. అయినప్పటికీ క్రైస్తవులపైన దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. 'స్వామీజీ' అనుయాయుల సంగతేమోగానీ సంఘ్‌పరివార్ సంస్థలు మాత్రం చంపింది మావోయిస్టులు కారనీ, మావోయిస్టులే చెప్పినా నమ్మేది లేదనీ, క్రైస్తవ మిషనరీలే చంపారనీ ఇవాళ్టి దాకా అంటున్నారు. మావోయిస్టులను విమర్శించడంలో మామూలుగా అందరికంటే ముందుండే సంఘ్‌పరివార్ వారు ఇట్లా అంటున్నారంటే చంపింది క్రైస్తవులేనని నమ్మడంలో వారికి ఏదో ప్రయోజనం ఇమిడి ఉందనుకోవాలి. ఆ ప్రయోజనం ఏమిటంటే ఆ హత్యను కారణంగా చూపించి క్రైస్తవులపైన దాడులు చేయడం, ఆ దాడులను సమర్థించుకోవడం.

మూడు వారాల తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని మూడు పశ్చిమ జిల్లాలలో సెప్టెంబర్ 14వ తేదీన ఒకే సమయంలో 17 వేరు వేరు చర్చిలపైన దాడులు జరిగాయి. విధ్వంసం చేశారు. పాస్టర్లను తీవ్రంగా కొట్టారు. కొన్ని చర్చిలను పూర్తిగా నేలమట్టం చేశారు. అన్ని చోట్లా ముఖాలకు ముసుగులేసుకున్న వ్యక్తులు అయిదారు మోటార్ సైకిళ్ళపైన వెళ్ళి దాడిచేశారు. జై భజరంగ్‌బలి అనీ, భారత్ మాతాకీ జై అనీ నినాదాలు ఇచ్చారు. దాడి చేసింది భజరంగ్‌దళ్ కార్యకర్తలేననటంలో సందేహం లేదు. దీనినెవరూ కాదనడమూ లేదు.

ఈ దాడులు ఎందుకు జరిగినట్టు? 'న్యూలైఫ్' అనే క్రైస్తవ సంస్థ హైందవ దేవతలను కించపరిచే ప్రచురణ తెచ్చిందనీ, మనసు గాయపడిన హిందువులు దాడి చేశారనీ సంఘ్‌పరివార్ వ్యాఖ్యానం. ఒక మతం



వారు మరొక మతాన్ని విమర్శించేటపుడు కించపరిచే వ్యాఖ్యలు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయటం అనుచితం అనడంలో సందేహం అక్కరలేదు. అయితే ఆ తప్పు చేసింది న్యూలైఫ్ అనే చర్చి కాగా దాడి చేసింది వారి మీద మాత్రమే కాదు. కాథలిక్, బాప్టిస్టు, సి.ఎస్.ఐ., పెంతెకోస్తు, సకల క్రైస్తవ శాఖల చర్చిలపైనా దాడి చేశారు. చర్చిలపైనే కాదు, మంగుళూరు పట్టణంలో క్రైస్తవ సన్యాసినులు బాహ్య ప్రపంచానికి శాశ్వతంగా దూరమై దైవ ధ్యానంలో కాలం గడిపే అడోరేషన్ సెంటర్‌పై కూడా దాడి జరిపారు. న్యూలైఫ్ వారు ప్రచారం చేశారని చెప్తున్న ప్రచురణ వారిదేనా, వారు దానిని ఉపయోగించి ప్రచారం చేసినట్టు ఫిర్యాదులేవయినా ఉన్నాయా అని స్థానిక ఐ.జి ని ప్రశ్నిస్తే ఫిర్యాదులేవీ లేవనీ, ఆ ప్రచురణ ఎవరిదన్న విషయం ఇంకా పరిశోధనలో ఉందనీ అంటున్నారు. పోనీ అన్నీ వారు చెప్పినట్టే అనుకొన్నా మనసు దెబ్బతిన్న హిందూ ప్రజలు వారంతట వారు ఒకే రోజు ఒకే ఘడియలో దక్షిణ కన్నడ, ఉడిపి, చిక్‌మగళూరు అనే మూడు వేరు వేరు జిల్లాలలో 17 చర్చిలపైన దాడులు చేశారనడం నమ్మదగ్గ విషయమేనా? న్యూలైఫ్ అనే సంస్థ కొంతకాలంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టి నడుపుతుండగా, దానివల్ల మనసు గాయపడ్డ హిందువులు రాష్ట్రంలో యెడ్యూరప్ప ప్రభుత్వం ఏర్పడేదాకా ఎందుకాగినట్టో!


ఒక పద్ధతి ప్రకారం భజరంగ్‌దళ్ చేసిన దాడికి ఇది కూడా ఒక సాకేనని అర్థం అవుతుంది.

ఒరిస్సాకు తిరిగి వద్దాం. లక్ష్మణానంద సరస్వతి సంస్కర్త అనీ, ఆదివాసులకు చదువు చెప్పే పాఠశాలలు నెలకొల్పాడనీ, శుభ్రంగా ఆరోగ్యంగా బతకడానికి కావలసిన నియమాలు నేర్పాడనీ అంటున్నారు. క్రైస్తవ మిషనరీవాళ్లూ అదేపని చేశారు మరి. వారిని తప్పుపట్టడం ఎందుకు? వారు ప్రజలను ఆకర్షించి క్రైస్తవంలోకి చేర్చుకోవటం కోసం సేవా కార్యక్రమాలు చేపట్టారని వారిపైన ఆరోపణ. లక్ష్మణానందకూ అదే వర్తిస్తుంది మరి. ఆదివాసులకు మంచి బతుకు నేర్పుతూ వారిలో హిందూమత వ్యాప్తికోసం ఆయన కృషి చేశాడు. హిందూ దేవుళ్ళ పూజలు ప్రవేశపెట్టాడు. వారికి బొట్లుపెట్టి జంధ్యంవేసి స్నానం చేయించి మాంసాహారాన్ని (ప్రత్యేకించి గోమాంసాన్ని) తినబోమని ప్రతిజ్ఞ చేయించాడు. క్రైస్తవ మిషనరీలు దళితులను క్రైస్తవంలోకి తీసుకుపోతే మతమార్పిడి అయినప్పుడు, లక్ష్మణానంద ఆదివాసులలో హైందవాన్ని వ్యాపింపజేస్తే



అది మతమార్పిడి ఎందుకు కాదు? ఆదివాసులు హిందువులు కారని సామాజిక పరిశోధనలే కాదు, చట్టాలు కూడ అంటాయి. మరి మతమార్పిడి క్రైస్తవ మిషనరీల విషయంలో తప్పయితే లక్ష్మణానంద చేసినప్పుడు తప్పెందుకు కాదు? ఈయన చేసింది ఒప్పయితే వారు చేసింది ఒప్పెందుకు కాదు?

ఈ మేరకు లక్ష్మణానంద సరస్వతికీ క్రైస్తవ మిషనరీలకూ తేడా ఏమీ లేదు. అయితే వారు చేయని పని అదనంగా ఈయనొకటి చేశాడు. క్రైస్తవం ఉనికినీ వ్యాప్తినీ బలప్రయోగంతో అడ్డుకోవడం ఒక కార్యక్రమంగా తీసుకొన్నాడు. 1971లో ఆయన కంధమాల్ జిల్లాలో తన కార్యకలాపాలు మొదలుపెట్టిన తరువాత క్రైస్తవులపైన తాను హైందవీకరించిన ఆదివాసులను రెచ్చగొట్టడం ఒక పనిగా పెట్టుకున్నాడు. దానికోసం కోందులకూ పాణోలకూ మధ్యనున్న వైరుధ్యాన్ని నిర్మొహమాటంగా వాడుకున్నాడు. ఈ మధ్య కాలంలో ప్రతీ సంవత్సరం గుడ్‌ఫ్రైడే, క్రిస్మస్ సంబరాలను అడ్డుకోవడం ఆయన అనుయాయులు తప్పనిసరిగా చేస్తున్నారు. పండగ దగ్గరికొచ్చినప్పుడు ఏదో ఒక అల్లరి చేస్తారు. పండగ సంబరాలు జరుపుకోవాలన్న ఉత్సాహాన్ని భయంతో కప్పేస్తారు. 2007 క్రిస్మస్ వేడుకలప్పుడు దరింగబాడి బ్లాక్‌లోని బ్రాహ్మణిగావ్‌లో అక్కరకురాని వివాదం లేవదీసి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులపైన దాడులు చేశారు. ఒకపక్క ఈ పనులు చేస్తూ, తమతో సఖ్యత కోరుకున్నట్టయితే క్రైస్తవాన్ని విడిచిపెట్టి వెనక్కిరావాలని బలవంతం చేస్తున్నారు. ఈ 'ఘర్‌వాపసీ' (పునరాగమనం) కోసం లక్ష్మణానంద ఒక కర్మకాండను కూడ రూపొందించాడు. ఆవుపేడతో కలిపిన నీళ్ళు తాగాలి, గుండు గీయించుకొని స్నానం చేసి గుడిలో దండం పెట్టుకొని బైబిల్‌ను చింపేసి ఇంకెప్పుడయినా చర్చికిపోతే చచ్చిపోయినట్లేనని రాసివ్వాలి. ఇప్పుడు కంధమాల్ జిల్లా నుండి పారిపోయి వచ్చిన క్రైస్తవులు వెనక్కిపోయి తమ ఊర్లలో బతకదలచుకుంటే ఈ కర్మకాండను ఆచరించి హిందువులుగా మారాలన్నది భజరంగ్‌దళ్ పెడుతున్న షరతు. బిజెపి భాగస్వామిగా ఉన్న ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్మార్గాన్ని ఉపేక్షించడమే కాక, కాలిపోయిన, కూలిపోయిన ఇళ్ళు తిరిగి కట్టుకోవడానికి సహాయం అందియ్యడం మాత్రమే తమ పని అనీ, వాళ్ళు ఆ తరువాత పోయి ఊర్లో ఉండవలసిందేననీ ఒత్తిడి పెడుతున్నది. వారిని బలి పశువులుగా అలంకరించి భజరంగ్‌దళ్‌కు అప్పగిస్తున్నది. దళితులను ఎన్నడూ హిందూ సమాజంలో భాగంగా చూడనివారు,



అంటరానితనానికీ వెలివేతకూ జవాబుగా దళితులు ఎంచుకున్న క్రైస్తవ మతం నుండి వారిని బలవంతంగా వెనక్కి రప్పించడం ఒక గొప్ప కార్యక్రమంగా పెట్టుకున్నారు.

బలవంతపు మత మార్పిడులు, ప్రలోభాలు అంటూ వారు ప్రచారం చేసుకొంటున్నారు గానీ ఆ మేరకు ఒక్క కేసు లేదు, ఒక్క ఫిర్యాదు లేదు. ఇది భారత దేశాన్ని హిందూదేశంగా, భారత రాజ్యాన్ని హిందూ రాష్ట్రంగా తయారు చేయడానికొక కుట్ర తప్ప వేరే ఏమీ కాదని ప్రజలు గుర్తించాలి. అమాయకులయిన ఆదివాసులనూ, ఇతర అణగారిన వర్గాలనూ దీనికి పావులుగా వారు ఉపయోగించుకుంటున్నారు. ఇది ఒరిస్సాలో మాత్రమే కాదు, ఇతర ప్రాంతాలలోనూ జరుగుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం సృష్టికర్త కాంగ్రెస్ నాయకుడు కావచ్చును గానీ దాని పోషకులు, దానిని ప్రభుత్వం చేతిలో సాధనంగా మలచుకున్నవారు ఆ రాష్ట్ర బిజెపి పాలకులు. మావోయిస్టుల అనుయాయులయిన ఆదివాసులకూ వారి రాజకీయ ప్రత్యర్థులయిన ఆదివాసులకూ మధ్యనున్న వైరుధ్యాన్ని వాడుకొని, ప్రత్యర్థి వర్గానికి ఆయుధాలిచ్చి, చంపే లైసెన్స్ ఇచ్చి బీభత్సకాండ సృష్టించారు. గుజరాత్‌లోని ఆదివాసీ ప్రాంతాలలో కిరాణా వర్తకులయిన బోహ్రా ముస్లింలపట్ల కిరాణా కొట్లో అప్పులు చేయకపోతే గడవని పేదలకుండే నిరసనను వాడుకొని ముస్లిం షాపులు లూటీ చేయించారు, తగలబెట్టించారు. కంధమాల్‌లో ఎస్.టిలకూ వారి కంటే చదువులో కొంత మెరుగుగా ఉన్న ఎస్.సిలకూ వైరుధ్యాలున్నాయి. క్రైస్తవ సంస్థలు తమ స్కూళ్ళనూ, ఆస్పత్రులనూ క్రైస్తవులకే ఎక్కడా పరిమితం చేయకపోయినప్పటికీ క్రైస్తవులయిన వారిలో చదువుపట్ల ఆసక్తి పెరగడం, చదువులో ప్రవేశం మెరుగుపడడం మామూలే. చదువుతో వచ్చిన తెలివితేటలతో ఆదివాసుల భూములను పాణోలు స్వంతం చేసుకున్న ఘటనలు, దొంగ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందిన ఘటనలూ కొన్ని లేకపోలేదు. ప్రజా శ్రేయస్సు కోరేవారెవరయినా అణగారిన వర్గాల మధ్యనున్న ఈ వైరుధ్యానికి చట్టపరమైన పరిష్కారమో, రాజీమార్గమో ఎంచుకుంటారు. కానీ సంఘ్‌పరివార్ అజెండా ప్రజా శ్రేయస్సు కాదు, సమాజంపైన తమ ఆధిపత్యం. అందువల్ల ఆ వైరుధ్యాన్ని వాడుకొని ఈ రక్తపాతం సృష్టించారు.

వారి లక్ష్యమైన హిందూ రాష్ట్రానికి అర్థం కేవలం మత రాజ్యం కాదు. కరుడుగట్టిన నిచ్చెనమెట్ల సమాజాన్ని రూపొందించి ఇండియాను






సైనిక అగ్రరాజ్యంగా మలచడం. మనుధర్మాన్నీ పెట్టుబడిదారీ ధర్మాన్నీ రంగరించిన అసమ సమాజాన్ని నెలకొల్పి ప్రపంచంలో అగ్రరాజ్యంగా వెలుగొందడం. వికృతమైన ఈ లక్ష్యం దిశగా సాగుతున్న సంఘ్‌పరివార్ హింసాకాండను వ్యతిరేకించడానికి ప్రజాతంత్ర వాదులంతా ముందుకు రావాలని పిలుపునిస్తున్నాం.

మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది

7 నవంబరు 2008





కంధమల్ నుండి కరావళి దాకా

# ప్రజాస్వామ్యంపైన సంఘ్‌పరివార్ దాడి

క్రిస్టియన్ల మీద దాడులపై
మానవహక్కుల నివేదిక

# కంధమాల్ నుండి
# కరావళి దాకా




# ప్రజాస్వామ్యంపైన
# సంఘ్‌పరివార్ దాడి

ఈ రిపోర్టులో ఒరిస్సాలోని కంధమాల్‌తో పాటు కర్ణాటకలోని మంగళూరు పరిసర ప్రాంతాలలో, అంటే కరావళి కొండల ప్రాంతంలో, చర్చిలపైన, ఇతర క్రైస్తవ ప్రార్థనా స్థలాలపైన ఆగస్టు–సెప్టెంబర్ 2008లో సంఘ్‌పరివార్ జరిపిన దాడుల వివరాలు కూడా ఉన్నాయి. కాని ఇది ఆదివాసుల సిరీస్‌లో వస్తున్న పుస్తకం కాబట్టి కంధమాల్ భాగాన్ని మాత్రమే దీనిలో చేర్చాము.

ఈ రెండు ఘటనలపై విషయ సేకరణ కోసం వెళ్లిన నిజనిర్ధారణ బృందంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పుదుచ్చేరి, తమిళనాడు, ముంబాయిలకు చెందిన 9 సంఘాలవారు ఉన్నారు. అవి–మానవహక్కుల వేదిక, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామ్యహక్కుల పరిరక్షణ సంస్థ, పీపుల్స్ డెమొక్రాటిక్ ఫోరం (పి.డి.ఎఫ్), పి.యు.సి.ఎల్ (ఒరిస్సా, కర్ణాటక శాఖలు), ఫెడరేషన్ ఫర్ పీపుల్స్ రైట్స్, సి.పి.సి.ఎల్, పి.యు.హెచ్.ఆర్, సి.పి.డి.ఆర్‌లు. ఇంగ్లీషులో ఉమ్మడి నివేదికగా వచ్చిన ఈ రిపోర్టు తెలుగులో మానవహక్కుల వేదిక ప్రచురణగా వచ్చింది.

**ముద్రణ :** అక్టోబర్ 2009




# ప్రస్తావన

ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలలో 2008 ఆగస్ట్–సెప్టెంబర్ నెలలలో క్రైస్తవులపై భజరంగ్‌దళ్ తదితర సంఘ్‌పరివార్ సంస్థలు చేసిన హింసాత్మక దాడులు దేశవ్యాప్తంగా ఆగ్రహాన్నీ ఆవేదననూ కలుగజేసాయి. క్రైస్తవులే కాదు, భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశంగా, నాగరిక సమాజంగా ఉండాలని కోరుకునే వారందరూ తీవ్ర ఆందోళనకు లోనయ్యారు.

కానీ ఆశ్చర్యపోయి ఉండే అవకాశం లేదు. తమకు అధికారం ఉన్న ప్రాంతాలను హత్యారాజకీయాల ‘ప్రయోగశాలలు’గా సంఘ్‌పరివార్ ప్రకటించిన నాడే ఇటువంటివి జరగగలవని వారికి అర్థం అయి ఉండాలి. 2002లో గుజరాత్‌లో జరిగిన మారణకాండను ప్రస్తావిస్తూ ‘గుజరాత్ ప్రయోగం’ విజయవంతమయిందనీ దానిని దేశమంతటా అమలు చేస్తామనీ ప్రవీణ్ తొగాడియా వంటి దురహంకారి మాత్రమే కాదు, మేధావులుగా గుర్తింపు ఉన్న అరుణ్‌జైట్లీ, జస్వంత్ సింగ్ వంటి వారు, పెద్దమనుషులలాగా కనిపించే సుష్మాస్వరాజ్, వెంకయ్య నాయుడు వంటివారు ఆనాడే ప్రకటించారు. ఒరిస్సాకు సంబంధించినంతవరకూ ఒక సంవత్సరం కిందనే భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ సుభాష్ చౌహాన్ ఒక సామాజిక శాస్త్రవేత్తతో మాట్లాడుతూ ‘భారతదేశంలో ఒరిస్సా రెండవ హిందూ రాష్ట్రం’ అన్నాడు (గుజరాత్ మొదటిది కాబోలు).

గుజరాత్ ‘ప్రయోగం’ వారికి దేశమంతటా అమలు చేయడానికి అందిచ్చిన సూత్రం ఏమిటంటే, బల ప్రయోగంతో మైనారిటీల మెడలు వంచినట్టయితే హిందూ దేశంగా తాము రూపొందించగోరే భారతదేశంలో రెండవ శ్రేణి పౌరులుగా నోరు మూసుకుని బతకడానికి వారు సిద్ధపడతారనేది. ఇప్పటికే దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో చాలా చోట్ల వారు మైనారిటీలను ఈ స్థితికి తీసుకొచ్చారు. కర్ణాటకను వారు






చాలాకాలంగా దక్షిణ భారతానికి ముఖద్వారంగా వర్ణిస్తున్నారు. ఇక ఒరిస్సాలోని కంధమాల్ జిల్లా అంటారా, అది మనం చూసేదాన్ని బట్టి దక్షిణానికైనా తూర్పుకయినా ముఖద్వారమని వ్యాఖ్యానించవచ్చు. 2008 ఆగస్ట్–సెప్టెంబర్ నెలలలో హింసాత్మక దాడులకు గురయిన కంధమాల్‌వాసులు రెండు వైపులా పారిపోయారు. దక్షిణం లేక ఆగ్నేయం దిశగా విశాఖపట్నంవైపు, తూర్పు లేక ఈశాన్యం దిశగా కటక్ వైపు.

ఒరిస్సా, కర్ణాటకలలో జరిగిన దాడుల మధ్య ఒక విచిత్రమైన సంబంధం ఉంది. ఒరిస్సాలో దాడులు 2008 ఆగస్ట్ 24న మొదలయ్యాయి. 29వ తేదీనాడు ఈ దాడులపట్ల నిరసన తెలుపుతూ కర్ణాటకలో క్రైస్తవ సంస్థల యాజమాన్యంలో వున్న విద్యాలయాలను ఒక దినం మూసేయడం జరిగింది. అటువంటి నిరసన చర్యలు ఇతర రాష్ట్రాలలోనూ క్రైస్తవ విద్యాసంస్థలు చేపట్టే ఉంటాయి గానీ కర్ణాటకలో సంఘ్‌పరివార్ ప్రభుత్వం అధికారంలో ఉంది. వారు ఈ నిరసనను సీరియస్‌గా తీసుకున్నారు. విద్యా సంస్థలను ఏ అధికారంతో మూసేసారో వివరణ ఇయ్యవలసిందిగా క్రైస్తవ సంస్థలకు కర్ణాటక ప్రభుత్వం నోటీసు జారీ చేసింది. ఇంతకూ కర్ణాటక ప్రభుత్వానికి ఈ విషయంలో ఫిర్యాదు చేసింది ఎవరు? భజరంగ్‌దళ్ చేసిన ఫిర్యాదు మీదే నోటీసు ఇచ్చినట్టు ఆ నోటీసులే తెలుపుతాయి! తరువాతి నెలలో కర్ణాటకలో క్రైస్తవులపైన జరిగిన దాడులకు ఇదే నాంది అని వారు భావిస్తున్నారు. యెద్యూరప్ప బెంగుళూరులో గద్దెనెక్కిన నాటినుండి ఇటువంటి సందర్భం కోసం భజరంగ్‌దళ్ ఎదురు చూస్తున్నట్టు అర్థం అవుతుంది.

సంఘ్‌పరివార్ ఒక పద్ధతి ప్రకారం అబద్ధాలను ప్రచారం చేస్తుంది, పథకం రచించి క్రూరమైన హింసకు పాల్పడుతుంది. అబద్ధాలను కేవలం ప్రచురణల ద్వారానే కాక బ్రాహ్మణీకరణ చెందిన సామాజిక వర్గాల మాధ్యమం ద్వారానూ ప్రచారం చేస్తుంది. ఈ మాధ్యమం సంఘ్‌పరివార్ సంస్థల సభ్యత్వాన్ని దాటి చాలా దూరం పోతుంది. సెక్యులర్ రాజకీయ శక్తుల ప్రభావంలో ఉన్నట్టు భావించే సామాజిక వర్గాలలోకి కూడ ఇది చొచ్చుకు పోతుంది. వారు ప్రచారం చేసే అబద్ధాల పరిధి విస్తృతమైనది. దేశ చరిత్ర, మన సమాజం, సమకాలీన వ్యక్తులు, సమకాలీన సంఘటనలు అన్నిటినీ అది తాకుతుంది. భౌతిక దాడి మొదలు పెట్టేముందు అబద్ధాలను ఒకదానిమీద ఒకటి పేర్చి కుప్ప చేస్తారు. దాడి మొదలయ్యే నాటికి దానిని సమర్థించుకోవడానికి అవసరమైన అబద్ధాలన్నీ తయారుగా ఉంటాయి.




సంఘ్‌పరివార్ భౌతిక దాడితోనే మొదలుపెట్టదు. సంస్కృతి గురించి, భారతీయత గురించి మాట్లాడుతుంటుంది. గణేశ్ నిమజ్జనాలు, దుర్గ పూజలు చేస్తుంటుంది. త్రిశూలాలు, తల్వార్లు బయటకు తీసే సమయం ఆసన్నమయేదాకా తన బ్రాండు సాంస్కృతిక ప్రచారం ప్రదర్శనాత్మకంగా చేస్తూ ఉంటుంది. తరచుగా దాడి చేసే అదను కోసం తన రాజకీయ బంధువయిన భారతీయ జనతాపార్టీ ఆ రాష్ట్రంలో లేక ప్రాంతంలో అధికారంలోకి వచ్చి పోలీసు యంత్రాంగాన్ని అదుపులోకి తెచ్చుకునేదాకా ఆగుతుంది.

హెడ్గెవార్, గోల్వాల్కర్ల వారసుల నైజం ఇదని హక్కుల సంఘాలకు తెలుసు. ఇది మళ్ళీ మళ్ళీ కనిపెట్టవలసిన విషయం కాదు. మరి కంధమాల్ అడవులలోనూ, పశ్చిమ కర్ణాటకలోని కారావళి ప్రాంతపు కొండల్లోనూ నిజనిర్ధారణ చేయడం దేనికోసం అంటే ఈ సత్యాన్ని రుజువు చేయడం కోసం కాదు. దాని వ్యక్తీకరణ రూపాలను అధ్యయనం చేయడం కోసం, అది మన సమాజంలో ఉన్న పగుళ్లను, నెర్రెలను వాడుకునే వైనాన్ని అర్థం చేసుకోవడం కోసం, ఇతర 'ప్రయోగశాలల'లో వారి 'ప్రయోగాలను' నివారించడానికి ఏం చేయాలో తెలుసుకోవడం కోసం.

సంఘ్‌పరివార్ పైన పోరాటం – భారతదేశాన్ని మనం ఏ విధంగా భావించుకుంటాం, ఏ విధంగా రూపొందించుకుంటాం అనే విషయాలకు సంబంధించిన పోరాటం. ఆ పోరాటం రాజకీయరంగంలో ఉండవచ్చు, పౌర సమాజంలో ఉండవచ్చు, అధికారం గురించి కావచ్చు, విలువలకు సంబంధించినది కావచ్చు. మనము ఏ రకమైన భారతదేశాన్ని కోరుకుంటున్నాం? సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయానికి కట్టుబడి ఉన్న సమాజం, భయం నుండీ లేమి నుండీ విముక్తమైన సమాజం, ఆలోచనలకూ విశ్వాసాలకూ స్వేచ్ఛ ఉండే సమాజం, మనిషికి మనిషిగా విలువ ఇచ్చే సమాజం, సమాన అభివృద్ధికీ ఇతర సమాజాలతో శాంతియుత సంబంధాలకూ ప్రకృతితో సమతుల్య సహజీవనానికీ భరోసా ఇచ్చే సమాజం (ఒక్క మాటలో చెప్పాలంటే సమానతా విలువను ప్రాతిపదికగా గల సమాజం) కోరుకుంటున్నామా? లేక హెచ్చుతగ్గుల నిచ్చెనమెట్ల నమూనాలో రూపొంది అధికార కాంక్షను వ్యవస్థీకరించిన సమాజం కోరుకుంటున్నామా? ప్రశ్న ఈ విధంగా వేస్తే జవాబు సులభమనే అనిపిస్తుందిగానీ జీవితంలోని అభద్రత, సంప్రదాయక అణచివేత వ్యవస్థల నుండి పుట్టిన అమానుషత్వం, వృద్ధిరేటును ఆరాధించే






రాజకీయార్థిక వ్యవస్థ నుండి ఉత్పన్నమయిన సంక్షోభం దానిని కష్టతరం చేస్తున్నాయి. సంఘ్‌పరివార్ ఆ అభద్రతను, లేమిని అవకాశంగా తీసుకొని, తాను నమ్మే నిచ్చెనమెట్ల వ్యవస్థ వల్ల నష్టపోయే సామాజిక వర్గాలలో సహితం ఆవేశాలు రెచ్చగొడుతుంది. విధ్వంసకరమైన వారి ఆచరణను ఎదుర్కొనడానికి నిర్దిష్టమైన కార్యాచరణ అవసరం. అది సాధ్యం కావాలంటే ఆ విధ్వంసం ఏ విధంగా పనిచేస్తుందో తెలుసుకోవడం అవసరం. ఈ నివేదిక తయారు చేయడంలో మేము ఆ అవసరాన్ని దృష్టిలో పెట్టుకున్నాము. అందుకోసం చారిత్రక పూర్వరంగాన్ని ఒకసారి స్పృశించి ఘటనల వివరాలలోకి పోదాం.

# ఒరిస్సా : పూర్వరంగం

**ఒ**రిస్సా రాష్ట్రంలో హింసాకాండ ప్రధానంగా కంధమాల్ జిల్లాలో జరిగింది. వేరే ఎక్కడయినా జరిగి ఉండవచ్చును గానీ కంధమాల్ లక్ష్మణానంద సరస్వతి కార్యక్షేత్రం కావడం వల్ల, అతని హత్య హింసాకాండకు నాంది కావడం వల్ల ఆ జిల్లాలోనే జరిగింది. యాభై సంవత్సరాలకు పైగా ఆర్.ఎస్.ఎస్ఒరిస్సా రాష్ట్రమంతటా తన అజెండాను అమలు చేస్తున్నది. దాని రాజకీయ ప్రతినిధి అయిన బిజెపి అప్పటికి రెండు పర్యాయాలు బిజు జనతాదళ్ (బిజెడి)తో కలిసి ఆ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఆర్.ఎస్.ఎస్అనుబంధ సంస్థలయిన భజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ తదితరుల అక్రమాలను బిజెడి చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నది. దీనికి గల కారణాన్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు. హైందవ సమాజానికి తానే ఏకైక ప్రతినిధి అన్న సంఘ్‌పరివార్ ప్రకటన ఇతర రాజకీయ పార్టీలను అభద్రతకు గురిచేస్తున్నది. వారికి నిజానికి తాము ప్రకటించుకునే లౌకికత పట్ల గట్టి నమ్మకం లేదు. అది ఒక అసహజమైన విలువ అని వారి మనసులలోనే సందేహం ఉంది. అందువల్ల బిజెపిని గట్టిగా వ్యతిరేకిస్తే హిందూ ఓటర్లు తమకు దూరం అవుతారేమోనని వారికి భయం. ఒరిస్సాలోనే కాదు, దేశమంతటా కూడ అగ్రకుల మధ్యతరగతి ఆలోచనా రీతులు ఆర్ఎస్ఎస్‌కు చాలా సన్నిహితం. మన దేశంలోని రాజకీయ పార్టీలు ఎక్కువ భాగం ఈ వర్గం పెత్తనం కిందే ఉన్నాయి. భారత రాజకీయాలలో లౌకికవాదం బలహీనంగా ఉండడానికి గల కారణాలలో ఇదొకటి. ప్రణయ్ కనుంగో అనే ఒరిస్సాకు చెందిన పరిశోధకుడు, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ 2003 ఆగస్ట్ 2వ తేదీ సంచికలో రాసిన ఒక వ్యాసంలో ఆ రాష్ట్రంలో ఆర్.ఎస్.ఎస్ఎదుగుదలకు దాని సభ్యులు కానటువంటి కాంగ్రెస్‌వారూ ఇతర ప్రముఖులూ ఎంతగా తోడ్పడిందీ వివరించారు. ఇది దేశమంతటికీ వర్తిస్తుంది.


ఆర్.ఎస్.ఎస్భావజాలం చాతుర్వర్ణాన్ని ప్రత్యక్షంగాను, ఒక్కొక్కసారి ఆధునిక పరిభాషలో ముస్తాబు చేసి పరోక్షంగాను అనుసరిస్తుంది. అది



బ్రాహ్మణులకు, బ్రాహ్మణీకరణ చెందిన ఇతర అగ్రకులాలకు మాత్రమే స్వతహాగా ఆకర్షణీయంగా ఉంటుంది. అయితే ఆ కులాలను దాటిన విస్తృత సామాజిక పునాదిని అన్వేషించే క్రమంలో ఆర్.ఎస్.ఎస్‌తన అనుబంధ సంస్థలయిన విశ్వహిందూపరిషత్ తదితర వేదికలద్వారా శ్రామిక ప్రజలు ఆదరించే దేవతల పూజలను వినియోగించుకొని ఈ పరిమితిని అధిగమించే ప్రయత్నం చేసింది. పైన ప్రస్తావించిన వ్యాసంలో పూరీజగన్నాధుని ఆదివాసీ మూలాలను అంగీకరించడం ద్వారా ఆదివాసీ ప్రజలను కలుపుకోవడానికి ఆర్.ఎస్.ఎస్‌చేసిన ప్రయత్నాన్ని ప్రళయ్ కనుంగో వివరించారు. పూరీజగన్నాధుడు ఒరిస్సాలో అత్యంత ఆదరణగల దేవుడు. దాదాపు ఒరిస్సాలో హైందవానికి అతడు చిహ్నమని చెప్పవచ్చు. అతని మూలాలు ఆదివాసీ ప్రజల పూజలలో ఉన్నాయని ఒప్పుకోవడం ఆదివాసులను హైందవం వైపు ఆకర్షించడానికి శక్తివంతంగా పనిచేస్తుందనడంలో సందేహం లేదు. ఆ రాష్ట్రంలో నాలుగవ వంతు జనాభా ఆదివాసులేనని గుర్తుంచుకుంటే దీని ప్రాముఖ్యం అర్థం అవుతుంది. ఇతర రాష్ట్రాలలో ఇతర అణగారిన సామాజిక వర్గాలను కలుపుకోవడానికి దుర్గపూజ, గణేశ్‌పూజ పనికొచ్చాయి. ఈ వర్గాలు తమను తాము 'హిందువులుగా' (కనీసం ఆర్.ఎస్.ఎస్‌ఉపయోగించే అర్థంలో) భావించవు. ఒకవేళ భావించినట్టయితే చాలా హీనమయిన స్థితిలో తమను తాము చూసుకోవలసి ఉంటుంది. అటువంటి ప్రజల హైందవీకరణ క్రమాన్ని ఆర్.ఎస్.ఎస్‌ఈ పద్ధతిలో చేపట్టింది.


## హైందవీకరణ

అయితే ఈ హైందవీకరణ వారికి దానంతటది ఒక లక్ష్యమేకాక వేరే లక్ష్యాలకు సాధనం కూడ. ఒరిస్సాకు సంబంధించినంత వరకు క్రైస్తవం వ్యాప్తిని నిరోధించడానికి అదొక సాధనం. క్రైస్తవం వ్యాప్తి తీర ప్రాంత మైదానాల కంటే ఆదివాసీ ప్రాంతాలలో ఎక్కువ జరిగింది. దీనిని నిరోధించడం కూడ దానంతటది ఒక లక్ష్యమే కాక వేరే లక్ష్యానికి సాధనం. ఆదివాసులలో హైందవ గుర్తింపును బలోపేతం చేసి వారిని సంఘ్‌పరివార్ గుప్పిట్లోకి తెచ్చుకొని భారతదేశ భవితవ్యానికి సంబంధించిన సంఘ్‌పరివార్ లక్ష్యానికి వారిని సాధనంగా వాడుకోవాలన్నది ఆలోచన. ఆదివాసులు, దళితులు, ఇతర అణగారిన వర్గాల ప్రజల దేవతలకూ పూజలకూ హైందవంలో ప్రదర్శనాత్మకమైన స్థానం కల్పించడం ద్వారా వారిని ఆకర్షించడం, ముస్లింలనూ క్రైస్తవులనూ ఈ హైందవానికి శత్రువులుగాను, ఈ హైందవానికి నిలయమైన భారత్‌లో



ద్రోహులుగాను చూపించడం, ఆ ప్రజలను ఈ ద్రోహులపైకి రెచ్చగొట్టడం, ఆ క్రమంలో వారికి హైందవంతో ఉన్న మమేకతను పెంచడం, సంఘ్‌పరివార్‌తో వారి అనుబంధాన్ని పెంచడం, దానిని వాడుకొని దేశంపైన తన ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకొని ఈ దేశ భవితవ్యాన్ని తిరగరాయడానికి కావలసిన శక్తిని పొందడం – ఇదీ ఆర్.ఎస్.ఎస్‌దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న విధ్వంసకరమైన వ్యూహం. దీనికి భజరంగ్‌దళ్ వంటి సంఘ్‌పరివార్ సంస్థలను సాధనాలుగా ప్రయోగించి తన ప్రభావం వ్యాప్తికి తన మనువాద దృక్పథం విధించే పరిమితులను అధిగమించే ఎత్తుగడ వేస్తున్నది. అయితే సంఘ్‌పరివార్ యావత్తు ఆర్.ఎస్.ఎస్‌యొక్క మనువాద ప్రాపంచిక దృక్పథం అదుపులోనే ఉంటుంది. అందులో రాజీ ఉండదు. అంతిమంగా ఆర్.ఎస్.ఎస్‌కాంక్షించేది మాత్రం అన్యమతస్తులు రెండవ శ్రేణి పౌరులుగా బతికే ఒక్కటే హిందూ రాష్ట్రం కాదు. ఆధిపత్యం, పెత్తనం అనే విలువలను నిక్షిప్తం చేసుకున్న సామాజిక ఆర్థిక వ్యవస్థ. ఇది పిడికెడు మంది పెత్తందార్లకు తప్ప అందరికీ శత్రువే. అందుకే సంఘ్‌పరివార్‌పైన పోరాటం కేవలం మైనారిటీల హక్కుల కోసం, మనుగడ కోసం పోరాటం కాదు. మన దేశం కోసం, మన సమాజం కోసం పోరాటం.

కంధమాల్‌లో జరిగిన హింసాకాండలో ఈ వ్యూహం ఫలితాలను చూడవచ్చు. 23 ఆగస్ట్ 2008 నాడు జాలస్‌పేటలో లక్ష్మణానంద సరస్వతి హత్యకు గురయ్యాడు. క్రైస్తవ మిషనరీలే అతనిని చంపారు లేక చంపించారనీ వారు ఘనంగా చెప్పుకునే విద్యాఆరోగ్య సేవలు అతను కూడ అందిస్తున్నందుకే చంపారనీ సంఘ్‌పరివార్ వెంటనే ప్రచారం చేపట్టింది. (క్రైస్తవ మిషనరీలు ఆ సేవలు అందిస్తున్నట్లు వీళ్లు ఒప్పుకున్నట్టయితే వాళ్లు దేశ ద్రోహులు, దేశానికి శత్రువులు ఎట్లా అయ్యారో!) క్రైస్తవ మిషనరీలు చేపట్టిన విద్యా తదితర సేవలకూ, లక్ష్మణానంద అందిచ్చిన సేవలకూ మూడు ముఖ్యమైన తేడాలున్నాయి. ఒకటి, మిషనరీలు మతమార్పిడి చేసారుగానీ వారి సేవలకు అది షరతు కాదు, పైగా అన్ని వేళలా అదే వారి లక్ష్యం కాదు. లక్ష్మణానంద సేవలకు ఆదివాసుల హైందవీకరణ ప్రత్యక్ష లక్ష్యం. రెండు, మిషనరీలు తమ స్కూళ్లలో పిల్లల చేత బైబిల్ చదివించి ఉండవచ్చును గానీ ప్రాథమికంగా వారికి జీవితంలో ఉపయోగపడే లౌకిక విద్యను బోధించారు. లక్ష్మణానంద పాఠశాలలు సంస్కృతం నేర్పాయి, సంఘ్‌పరివార్ నమ్మే హైందవ సంస్కృతి నేర్పాయి. మూడు, మిషనరీలు మతమార్పిడి కోసమైనా, మతం మార్చుకున్న వారు వెనక్కి పోకుండ నిరోధించడం కోసమైనా హింస ఎప్పుడూ ప్రయోగించలేదు.




లక్ష్మణానంద క్రైస్తవం వ్యాప్తిని నిరోధించడానికి అత్యంత హింసాత్మకమైన పద్ధతులు ప్రయోగించాడు. మతం మార్చుకున్న వారిని హిందువులుగా మార్చడానికి అత్యంత అవమానకరమైన తంతు రూపొందించాడు.

ఈ విషయాలు సులభంగానే అందరికీ అర్థం అయి ఉండాలి గానీ భారతదేశంలోని ఆదివాసులు, దళితులు హిందువులనీ, వారిని క్రైస్తవంలోకి మార్చడం మతమార్పిడి అవుతుంది తప్ప వారిని హైందవీకరించడం మతమార్పిడి కాదనీ, క్రైస్తవులుగా మారిన వారిని హైందవ సంప్రదాయంలోకి తీసుకురావడం కేవలం పునరాగమనమేననీ (లక్ష్మణానంద పరిభాషలో 'ఘర్‌వాపసీ' అని) అనాలోచితంగా చాలామంది నమ్ముతుండడం వల్ల లక్ష్మణానంద చర్యలతో ఏకీభావం లేని వారికి సహితం ఈ విషయాలు చెప్తే తప్ప అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. భారతదేశపు ఆదివాసుల పూజలు, సంప్రదాయాలు కాలక్రమంలో కొంత హైందవీకరణ చెంది ఉండవచ్చును గానీ వారు హిందువులు కారు. ఈ విషయం మానవ శాస్త్రమేకాక చట్టం కూడ గుర్తించింది. హిందువుల సంప్రదాయాలను క్రోడీకరించే అన్ని చట్టాలలోనూ హిందువు అనే వర్గీకరణలో షెడ్యూల్డు తెగలు రారని చట్టసభలు అన్నాయి. ఇక దళితులు నాలుగు వర్ణాల హైందవ వ్యవస్థకు వెలుపల ఉన్న అవర్ణులు. ఈ రెండు వర్గాల క్రైస్తవీకరణ లాగే హైందవీకరణ కూడ మతమార్పిడియే. కంధమాల్ జిల్లాలో బలవంతపు మతమార్పిడిని నిషేధించే 'ఒరిస్సా మత స్వేచ్ఛ చట్టం, 1967' కింద అందరికంటే ముందు అరెస్టు చేయవలసింది మతమార్పిడికి బలప్రయోగంతో కూడిన సంస్కారాలను తయారుచేసి అమలు చేసిన లక్ష్మణానంద సరస్వతిని. దీనిని వివరించి చెప్తే తప్ప అర్థం కాకపోవడానికి ఒక కారణం మెజారిటీ మతతత్వాన్ని కూడ మైనారిటీ మతతత్వంలాగ ఒక మతతత్వంగా చూడలేకపోవడం. అంతేకాక ఇండియాను హైందవంతో సమానంగా చూసే భావజాలాన్ని ఛేదించలేకపోవడం. ఈ భావజాలానికి కర్త కేవలం ఆర్.ఎస్.ఎస్‌కాదు. ఏ దురుద్దేశ్యం లేనట్టు కనిపించే జాతీయవాదులు చాలామంది పాత్ర కూడా ఇందులో ఉంది.

## కంధాలు, పాణోలు

ముందు మరికొన్ని విషయాలు చూద్దాం. కంధమాల్ హింసలో ప్రధానంగా దెబ్బతిన్నది క్రైస్తవ పాణోలు. పాణో అనేది ఒక దళిత కులం. ఈ జిల్లా పాణోలలో అందరూ కాకున్నా చాలామంది క్రైస్తవం పుచ్చుకున్నారు. వారిపైన దాడి చేసింది భజరంగ్‌దళ్. భజరంగ్‌దళ్ ఈ దాడిలో ప్రధానంగా సమీకరించింది కోందు లేక కంధా అనే ఆదివాసీతెగను. కంధాలు కంధమాల్ జిల్లాలోని



ప్రధాన ఆదివాసీ తెగ. కంధమాల్ ఒరిస్సా మధ్యభాగాన ఉంది. అది కొండలమయమైన జిల్లా. మొదట్లో బౌధ్‌తో కలిసి బౌధ్‌కంధమాల్ జిల్లాలో సగభాగంగా ఉండేది. అయితే 1994 ఏప్రిల్ 1న బౌధ్‌ను వేరే జిల్లా చేసి మిగిలిన దానికి ఫూల్‌బని జిల్లా అని పేరు పెట్టారు. కాని మళ్లీ అదే సంవత్సరం ఫూల్‌బని తీసేసి పేరు కంధమాల్ జిల్లాగా మార్చారు. ఈ పేరు మార్పిడి న్యాయమైనదే, ఎందుకంటే ఆ జిల్లా జనాభాలో మెజారిటీ ఆదివాసులు, వారిలో అత్యధికులు కంధాలు. అయితే ఈ మార్పు ఒక వికృతమైన మతఘర్షణ పెట్టిన ఒత్తిడి కారణంగా జరిగింది.


కంధమాల్ జిల్లా జనాభాలో 52.7 శాతం ఆదివాసులు. అందులో 89 శాతం కంధాలు (తక్కిన వారు గోండు, సవర మొదలయినవారు). దళితులు జిల్లా జనాభాలో 16.9 శాతం. వారిలో అత్యధికులు పాణోలు (తక్కిన వారు డోం, ఘాసి తదితర కులాలవారు). మిగిలిన దాదాపు 30 శాతం జనాభా సవర్ణ హిందువులు. వీరిని కంధాలు, పాణోలు కూడ 'ఒరియాలు' అని పిలుస్తారు. భాష దీనికి కారణం కావచ్చు. సవర్ణ హిందువులు ఒరియా మాట్లాడతారు. అది కంధాల భాష కాదు, పాణోల భాషా కాదు. ఈ ఒరియాలలో బ్రాహ్మణులు, కరణ్ లేక కాయస్తులు, సారా వ్యాపారులయిన సుందీలు, తెలుగు కోమట్లు ప్రధాన కులాలు.

కంధమాల్ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఒకటి కంధమాల్ కాగా రెండవది బాలిగుడ. కంధమాల్ డివిజన్ 1500 అడుగుల ఎత్తున ఉన్న దట్టమయిన అడవుల మయమయిన పీఠభూమి. దాని చుట్టూ ఎత్తయిన కొండలున్నాయి. బాలిగుడ కొండ ప్రాంతం. దాని ఎత్తు 3300 అడుగుల దాకా పోతుంది. అయితే తూర్పున సస్యశ్యామలమయిన లోయలున్నాయి. బాలిగుడలోని దరింగబాడిని 'ఒరిస్సా రాష్ట్రపు కాశ్మీర్' అంటారట. ఎందుకంటే అక్కడ శీతాకాలంలో మంచు కురుస్తుందంట. అది నిజమయితే తూర్పు కనుమలలో మంచు కురిసే ఏకైక ప్రదేశం దరింగబాడి అయివుండాలి. మంచు సంగతి అట్లాగుంచి, ఇవ్వాళ అక్కడ నెలకొన్న భీతావహ వాతావరణం కారణంగా దానిని 'ఒరిస్సా రాష్ట్రపు కాశ్మీర్' అనడం ఉచితమేనేమో!

2008 నాటి హింసాకాండ ప్రధానంగా బాలిగుడ డివిజనలోనే జరిగింది. బాలిగుడ, జి.ఉదయగిరి ఈ డివిజన్‌లోని తాలూకాలు. పంచాయతి బ్లాకులు బాలిగుడ, చకాపద, దరింగబాడి, జి.ఉదయగిరి, కె.నువాగాం, రైకియా, తికాబలి, తుమిడిబంద. పాణోలకూ కంధాలకూ మధ్యనున్న









లక్ష్మణానంద
మృత దేహాన్ని
ఊరేగించిన మార్గం

వైరం ఈ హింసాకాండకు మూలం అని చూపబడుతున్నది కాబట్టి వారి మధ్యనున్న సంబంధాన్ని కొంచెం వివరంగా చూద్దాం. కంధాలు నిస్సందేహంగా ఆ ప్రాంతానికి స్థానికులు కాగా పాణోలు కోస్తాప్రాంతం నుండి వచ్చిన బయటివారు. అయితే వాళ్లు వచ్చింది ఈ మధ్య కాదు. 200 సంవత్సరాలకు పైగా అక్కడున్నారు. బ్రిటిష్ జమానాలో 1908లో ప్రచురించిన జిల్లా గెజిటీర్ వారిని కంధాల భూములు సాగుచేసే కౌలుదార్లుగా పేర్కొంది. వారి స్థితి బానిసల వంటిదని సూచించే పదాలు గెజిటీర్‌లో ఉన్నాయి. ప్రతీ కంధా గ్రామానికీ అనుబంధంగా పాణోల గూడెం ఒకటి ఉండేదని అంటారు. వలస వచ్చిన పాణోలు కంధాలకు ఎంత దగ్గరంటే, మైదాన ప్రాంతంలో ఉండిపోయిన పాణోలను దేశీపాణోలు అనీ, అడవులలోకి వలస వెళ్ళిన వారిని కోందు పాణోలు అనీ పిలిచేవారని మానవ వికాస శాస్త్రజ్ఞుడు థర్‌స్టన్ అంటాడు. 1891 జనాభా లెక్కలలో పాణోలు అనేకులు తమను తాము కంధాలు అని చెప్పుకున్నారని కూడ ఆయన అంటాడు. ఆనాడు ఎవరికీ ప్రత్యేకమైన హక్కులు లేవు కాబట్టి ఇందులో దురుద్దేశ్యం ఉండే అవకాశం లేదు.

ఈ రోజు కూడ ఇతర గిరిజనేతరులు రహదార్లమీద ఉన్న పెద్ద ఊర్లలో నివసిస్తుండగా పాణోలు మాత్రమే కంధాలతోబాటు అడవి లోతట్టు గ్రామాలలో నివసిస్తున్నారు. బాలిగుడ సమీపంలోని దమీకియా



గ్రామానికి చెందిన ఒక కంధా మాతో మాట్లాడుతూ, పాణోలు ఈ నాటికీ వేరే పద్ధతిలో కంధాల భూములు కౌలుకు తీసుకుంటున్నారని అన్నాడు. ఆదివాసీ గ్రామ కమిటీ అనుమతితో పాణోలు ఒకటి రెండేళ్ల పాటు కొంత భూమిని సాగుచేసి తిరిగి ఇచ్చేస్తారని చెప్పాడు. బహుశా, భూమిలేని అవర్ణులైన పాణోలు జీవనం కోసం అన్వేషిస్తూ అడవులలోకి వచ్చి, ఆహార సేకరణ చేస్తున్న ఆదివాసుల భూములను వారి అనుమతితో తీసుకొని సాగుచేసి ఉండవచ్చు. బ్రిటిష్ పాలకులు అటువంటి వలసలను ప్రోత్సహించారని ఒక వామపక్ష సంస్థ ప్రచురించిన కరపత్రం పేర్కొంది. సాగు విస్తీర్ణాన్నీ భూమి శిస్తు పరిమాణాన్నీ పెంచడం కోసం వారు ప్రోత్సహించి ఉండవచ్చు. కంధమాల్ డివిజన్‌లోని గ్రామాలలో కంధాలు పాణోలను అంటరానివారిగా చూస్తారుగానీ బాలిగుడ డివిజన్‌లో అది లేదు. అక్కడ కుయి సంస్కృతి, కుయి సమాజం అనే భావనలు నిన్న మొన్నటి దాకా బలంగా ఉండేవి. ఆ కుయి సమాజంలో కంధాలు, పాణోలు ఇద్దరూ భాగమే.

1908 నాటి గెజిటీర్ ప్రకారం పాణోలు కంధాలకు సలహాదార్లు, అప్పులవాళ్లు కూడ. బయటి ప్రపంచానికీ కంధాలకూ మధ్య సంధానకర్తలుగా కూడ వ్యవహరించేవారు. మైదాన ప్రాంతానికి చెందినవారు కాబట్టి వారికి ఈ పాత్ర తగినది. అయితే కంధాలు ధరణిపేను (భూమి దేవత)కు ఇచ్చే మానవ బలి విషయంలో పాణోలకు ఇబ్బందికరమైన పాత్ర ఉండింది. బలి ఇవ్వబడే వ్యక్తిని ‘మెరయ్యా’ అనేవారు. ఈ మెరయ్యాను మైదాన ప్రాంతాల నుండి కొని, లేక అపహరించి పాణోలు తీసుకువచ్చి కంధాలకు ఇవ్వాలి. లేకపోతే తమ పిల్లలనే అప్పగించాలి. ఈ మెరయ్యాలను కంధాలు వెంటనే చంపరు. వారు కంధాల గ్రామంలో అందరితోబాటు పెరుగుతారు. బలి ఇచ్చేదాకా బాగానే చూసుకునేవారు.

సారాంశంలో, కంధాలకూ పాణోలకూ మధ్య సంబంధం ఇబ్బందికరంగా ఉండి ఉండాలి. 1908 గెజిటీర్ పాణోలను ‘దుర్మార్గులు, చతురులు, నీతిలేనివారు’ అని వర్ణించడాన్ని 1983లో ఒరిస్సా ప్రభుత్వం ప్రచురించిన గెజిటీర్ తప్పుబట్టింది. బహుశా మెరుగయిన పంట తీయడం కోసం మైదాన ప్రాంతాలవాళ్లను కౌలుదార్లుగా నియమించినప్పటికీ, వారిని అనుమానంగా చూసిన ఆదివాసుల వైఖరినే వలసకాలం నాటి గెజిటీర్ అనుకరించిందేమో. ఈ సంబంధం గురించి ప్రఖ్యాత మానవ వికాస శాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్ ఈ విధంగా అన్నాడు. ‘కంధాలు పాణోలను బయటి ప్రపంచం నుండి






తమను కాపాడే కవచంగా వాడుకుంటారు... పాణోలు కంధాలను దోచుకుంటారు గానీ కాపాడతారు... కంధాలకు పాణోలంటే సాంఘికంగా చిన్నచూపు గానీ ఆర్థికంగా వారిపైనే ఆధారపడతారు'.

ప్రస్తుత విషయానికొస్తే ఒరిస్సా రాష్ట్రం దేశంలోని అతి పేద రాష్ట్రాలలో ఒకటి. అక్కడ సగటు తలసరి వార్షిక ఆదాయం 790 రూపాయలు. బీహార్ రాష్ట్రమొక్కటే అంతకంటే పేదది. ఎస్.సి, ఎస్.టిల తలసరి ఆదాయం (558 రూ.), గ్రామీణ ప్రాంతాల సగటు తలసరి ఆదాయం (422 రూ.). రెండూ బీహార్ కంటే తక్కువే. అలాంటి ఒరిస్సాలో కంధమాల్ జిల్లా మరీ పేదది. మానవ అభివృద్ధి సూచిక ప్రకారం ఆ రాష్ట్రంలోని 30 జిల్లాలలో 29వ స్థానంలో ఉంది. ఆ జిల్లాలోని 20 లక్షల ఎకరాల భూభాగంలో 12 శాతం మాత్రమే సాగు యోగ్యమయినది. (రెండు పంటలు వేసే భూమిని లెక్కబెట్టినట్టయితే నికర సాగుభూమి 14.5 శాతం). 71.19 శాతం భూభాగంలో అడవులున్నాయి. తక్కినది (16.8 శాతం) బంజరు భూమి. దళితుల వద్ద (వారిలో పాణోలు అత్యధిక సంఖ్యాకులు) ఉన్న భూమి చాలా స్వల్పం. 80 నుండి 90 శాతం మంది భూమిలేని వారే. జిల్లా జనాభాలో దళితులు 16.9 శాతం కాగా సాగుయోగ్యమైన భూమిలో 9 శాతం మాత్రమే వారి వద్ద ఉంది. జిల్లా తొలినాటి నివాసులయిన ఆదివాసుల దగ్గర 77 శాతం ఉంది. వర్తకులుగా, అధికారులుగా వచ్చిన సవర్ణ హిందువుల (స్థానిక పరిభాషలో 'ఒరియాలు') వద్ద 14 శాతం ఉంది. అయితే ఇదంతా సాగుయోగ్యమైన 12 శాతం భూభాగంలోనే.

కంధమాల్ కొండలను బ్రిటిష్ పాలకులు లోబరచుకున్న క్రమమే సవర్ణ హిందూ కులాలవారి ప్రవేశానికి బాట వేసింది. కంధాల 'మెరయ్యా' నరబలి అమానుషమైనదని చెప్తూ, దానికి ముగింపు పలికే నెపంతో బ్రిటిష్‌వాళ్లు కంధమాల్ కొండలలోకి ప్రవేశించారు. అయితే వారి సంస్కరణ కార్యక్రమం బలప్రయోగంతో సాగడాన్ని బట్టి, అది చివరికి కంధమాల్ కొండలను బ్రిటిష్ ప్రభుత్వ అజమాయిషీలోకి తీసుకురావడంతో ముగియడాన్ని బట్టి కారణమేమి చెప్పినా సామ్రాజ్య విస్తరణే అసలు లక్ష్యమని అనుమానించడంలో తప్పు లేదు. ఇందులో వారికి సహకరించిన గిరిజనేతరులకు ఆ తరువాత వారి పాలనా యంత్రాంగంలో చోటు కల్పించారు. కంధమాల్ జిల్లా బ్రిటిష్ పాలిత ప్రాంతంలో చేర్చబడ్డ తర్వాత కంధమాల్ డివిజన్ బెంగాల్ ప్రెసిడెన్సీలోనూ, బాలిగుడ డివిజన్ మద్రాసు ప్రెసిడెన్సీలోనూ భాగం అయ్యాయి. బెంగాల్ ప్రెసిడెన్సీలోని ప్రాంతంలో ముఠా వ్యవస్థ ఏర్పాటు చేసారు. బ్రిటిష్ వాళ్లు కొన్ని



గ్రామాలను కలిపి ఒక ముఠాగా ఏర్పరచారు. దానికి ఒక ముఠాదారు లేక సర్దారు పెద్ద. అతనికి ఆ గ్రామాలలో శాంతి భద్రతలు నెలకొల్పి రెవెన్యూ సేకరించే అధికారం ఇవ్వబడింది. సేకరించే రెవెన్యూలో 12.5 శాతం ముఠాదారుకు చెందుతుంది. అయితే చాలాచోట్ల ముఠాదారుగా గిరిజనేతరుడిని నియమించడం జరిగింది. ప్రతి ముఠాదారు ఆ గ్రామాల రైతుల నుండి 9 రకాల 'మామూళ్లు' సేకరించే అధికారం కలిగి ఉండేవాడు. దీని అర్థం వెట్టిచాకిరీ తప్ప వేరే ఏమీ కాదు. బాలిగుడ డివిజన్ ప్రాంతం మద్రాసు ప్రెసిడెన్సీలోని గంజాం జమీందారీలో భాగం అయింది. అయితే 1839లో బ్రిటిష్‌వాళ్లు ఆ జమిందారీని రద్దుచేసి అక్కడ కూడ ముఠా వ్యవస్థ నెలకొల్పారు.

బ్రిటిష్ పాలనలో భాగంగా రోడ్లు వేయడం, స్వంత ఆస్తి వ్యవస్థనూ వర్తకాన్నీ ప్రవేశపెట్టడం కూడ గిరిజనేతరుల ప్రవేశానికీ, వ్యాప్తికీ దారి సుగమం చేసింది. సారా వ్యాపారం సుందీలను తీసుకొచ్చింది. ఇది వేగంగా భూమి పరాయీకరణకు దారి తీసిందనడానికి బ్రిటిష్ పాలకులు రెండు ప్రెసిడెన్సీలలోనూ (బెంగాల్‌లో 1902లో, మద్రాసులో 1917లో) జారీ చేసిన భూమి బదలాయింపు నియమాలు తెలుపుతాయి. వీటి సారాంశం ఏమిటంటే ఆదివాసుల భూమిని ప్రభుత్వ అనుమతి లేకుండ ఆదివాసీయేతరులు కొనుక్కోవడానికి వీలు లేదు. అయితే దీనివల్ల ఫలితం పెద్దగా రాలేదనడానికి బెంగాల్ ప్రాంతంలో ఈ రెగ్యులేషన్స్ జారీ చేసిన 25 ఏళ్లకు చేపట్టిన సర్వే తెలుపుతుంది. అప్పటికీ ఆదివాసుల భూమిలో నాలుగోవంతు చేతులు మారిందని తేలింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఒరిస్సా రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంత భూమి బదలాయింపు నియమాలను (రెగ్యులేషన్ 2 ఆఫ్ 1956) కూడ అదే ఉద్దేశ్యంతో జారీ చేసారు. దీని ఫలితం కూడ స్వల్పమేననడానికి రుజువు 2002లో చేసిన సవరణ. ఈ సవరణ ప్రకారం 1956 తరువాత జరిగిన అన్ని అమ్మకాలనూ ప్రభుత్వం పరిశీలించి అవి చట్టబద్ధమో కాదో తేల్చాలి. అవి చట్టబద్ధమని రుజువు చేసుకునే బాధ్యత భూమిని పొందిన గిరిజనేతరుడిపైన ఉంటుంది.

ఈ చరిత్ర పర్యవసానమేమిటంటే జిల్లాలోని సాగుభూమిలో 14 శాతం సవర్ణ హిందువుల (స్థానిక పరిభాషలో 'ఒరియా'ల) చేతిలోకి మారింది. 9 శాతం భూమి వ్యాపారస్తులుగా, పెత్తందార్లుగా కాక ఆదివాసుల భూమిని కౌలుకు సాగు చేసిన కూలి రైతులుగా ప్రవేశించిన పాణోల చేతిలోకి పోయింది. మొత్తంగా సాగుభూమే చాలా తక్కువగా ఉన్న కారణంగా అడవిలో పోడుకొట్టుకోవడం తరచుగా జరిగేది. కంధాలతోబాటు కొన్ని చోట్ల పాణోలు కూడ ఈ పని






చేసారు. ఒక కంధా అడవిని కొట్టి సాఫు చేసిన భూమిని ఒక పాణో ఆక్రమించుకున్న ఉదంతాలు లేకపోలేదు. పాణోలలో కొందరు వ్యాపారం, ప్రత్యేకించి పశువుల వ్యాపారం చేపట్టారు. కంధాలకు పాణోలు అప్పులిచ్చే సంప్రదాయమూ కొనసాగింది. అయితే ఇప్పుడు భూమిని తనఖా పెట్టుకోవడం మొదలయింది. తనఖాపడ్డ భూమిని అప్పు తీరేంతవరకు అప్పిచ్చినవాడే అనుభవిస్తాడు. అప్పుకు వేరే వడ్డీ ఉండదు. అప్పు తీరిన తరువాత భూమి వెనక్కి ఇవ్వబడుతుంది. ఈ రకమైన తనఖా విస్తృతంగానే అమలయిందని కె.నువాగాం లోని జుగాపదర్ బస్తీకి చెందిన ఒక పాణో నాయకుడు మాతో అన్నాడు. ఇది తరచుగా భూమి పరాయీకరణకు దారితీసి ఉండాలి. అందుకే కాబోలు ఈ రకమైన అప్పులన్నీ రద్దు చేయాలన్నది కంధాలు తమ ఆందోళనలో లేవదీస్తున్న బలమైన డిమాండ్లలో ఒకటి.

ఇదీ స్థూలంగా పాణోలకూ, కంధాలకూ మధ్యనున్న సంబంధం. దీనిని అణచివేత లేక దోపిడీ సంబంధంగా సూత్రీకరించలేము. పాణోలలో అత్యధికులు భూమిలేని కూలీలు. భూమిగలవారిలో కూడ చిన్నకారు సన్నకారు రైతులే అధికం (95 శాతం). ఆదివాసులలో ఆ సంఖ్య 84 శాతం. పైగా ఆదివాసుల భూములను ఆక్రమించుకున్న వారిలో పాణోల కంటె సవర్ణ హిందువులే (ఒరియాలు) ఎక్కువ అని ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగపు ఉన్నతాధికారి ఒకరు మాతో మాట్లాడుతూ అంగీకరించాడు. అయినా వారికి వ్యతిరేకంగా సంఘ్‌పరివార్ ఏరోజూ కంధాలను సమీకరించలేదు. సంఘ్‌పరివార్ కంధాలను పాణోలు దోచుకుంటున్నారని ప్రచారమైతే చేస్తుందిగానీ నిజానికి కేవలం మతపరమైన సమీకరణ మాత్రమే చేపట్టింది.


విద్యార్హతల విషయంలో పాణోలకూ కంధాలకూ మధ్య అంతరం చెప్పుకోదగినంత ఉంది. ఇది పాణోల తప్పు కాదుగానీ కంధాలలో ఇది కొంత నిరసనకు దారితీసిన మాట వాస్తవం. క్రైస్తవ విద్యాసంస్థలలో ప్రవేశానికి క్రైస్తవులయి ఉండాలన్న షరతు ఎప్పుడూ లేకపోయినప్పటికీ, క్రైస్తవం తీసుకోవడం విద్యకు ప్రోత్సాహకంగా పనిచేసే మాట వాస్తవం. దీనివల్ల పాణోలు ప్రయోజనం పొందారు. సగటున క్రైస్తవ పాణోల విద్యాస్థాయి ఆదివాసులతో పోలిస్తే ఎక్కువే. దీనివలన ఉద్యోగాలు తదితర విషయాలలో కొంతమేరకు ముందున్నారు.

పాణోలు షెడ్యూల్డు తెగగా గుర్తింపు పొందడానికి ప్రయత్నం చేస్తున్నారనీ, హైకోర్టు నుండి ఆ మేరకు ఆదేశం పొందారనీ కూడ




వారిపైన అభియోగం ఉంది. ఈ విషయంలో వాస్తవాల కంటె అపోహలెక్కువ ఉన్నాయి. నిజానికి హైకోర్టుకు ఒక కులాన్నో, తెగనో షెడ్యూల్డు తెగ (ఎస్.టిగా) గుర్తించమని ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చే అధికారం లేదు. ఎస్.సి, ఎస్.టి జాబితాలను 1950లో రాష్ట్రపతి తొలుత ప్రకటించారు. ఆ తరువాత వాటిలో మార్పులూ చేర్పులూ పార్లమెంటు చట్టంద్వారా చేయాలి. జరిగినదేమిటంటే 2002లో ఒరిస్సా ప్రభుత్వం అభ్యర్థన మేరకు 'కుయి' అనే తెగను పార్లమెంటు చట్టం ద్వారా ఒరిస్సాకు చెందిన ఎస్.టి జాబితాలో చేర్చింది. నిజానికి కుయి అన్న తెగ ఏదీ లేదు. అది ఒక భాష. ఒక సంస్కృతినీ జీవన విధానాన్నీ కూడ సూచిస్తుంది. బాలిగుడ డివిజన్‌లో కంధాలు, పాణోలు ఇద్దరూ కుయి భాష మాట్లాడతారు. వారిద్దరూ భాగమైన 'కుయి సమాజం' అనే భావన బాలిగుడలో ఉండేది. అక్కడి పాణోలను 'హరిజనకుయి' అని పిలిచేవారని జి.ఉదయగిరి బ్లాక్‌లోని కొటింగియా గ్రామానికి చెందిన పాస్టర్ సుఖ్‌దేవ్ డిగాల్ మాతో అన్నాడు. 1926లో బాలిగుడ ప్రాంతంలో నిఖిల్ ఉత్కల్ కుయి సమాజ్ సంఘం అనే సంస్థ ఏర్పడింది. అందులో కంధాలు, పాణోలు ఇద్దరూ సభ్యులుగా ఉండేవారు.

ఈ గుర్తింపు కాలక్రమంలో బలహీనపడింది. కుయి సమాజ్ సంఘంలో పాణోలు కూడ ఉండడాన్ని కంధాలు వ్యతిరేకించసాగారు. కేవలం కంధాలకే పరిమితం అయిన కుయి సమాజ్ సేవాసమితి 1945లో ఏర్పడింది. అయితే 1980-81 దాకా బాలిగుడ ప్రాంతంలో రెవెన్యూ రికార్డులలో కుయి అన్న తెగ పేరు ఉండేది. ఆ తరువాత పాణోలు, కంధాలని వేరువేరుగా రాయడమేకాక పాత రికార్డులను కూడ మార్చారు. ఈ నేపథ్యంలో, 2002లో కుయి అన్న తెగను రాష్ట్ర ఎస్.టి లిస్టులో చేర్చేసరికి పాణోలకు ఆశ కలిగినట్టుంది. కుయి అనే వేరే తెగ ఏదీ లేదనీ, బాలిగుడ డివిజన్‌కు సంబంధించినంతవరకు పాణోలూ కుయిలేననీ, కాబట్టి తమకు కూడ ఎస్.టి సర్టిఫికేట్లు ఇవ్వాలనీ వారు కోరసాగారు. స్వాతంత్ర్యానికి పూర్వం బాలిగుడ డివిజన్‌లోని పాణోలకు 'హిల్‌ట్రైబ్' (గిరిజన తెగ)గా గుర్తింపు ఉండిందనీ, స్వాతంత్ర్యం తరువాతే పోయిందనీ కూడ గుర్తుచేసారు. ఒక్క పాణోలే కాదు, మొత్తంగా మద్రాసు ప్రెసిడెన్సీలోని ఏజెన్సీ ప్రాంతాలలో నివసించే అవర్ణులందరినీ అప్పుడు గిరిజన తెగలుగానే గుర్తించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాతే వారిని ఎస్.టిలుగా కాక ఏజెన్సీలో సైతం ఎస్.సిలుగానే గుర్తించారు. బాలిగుడ అప్పట్లో గంజాం జిల్లాలో భాగంగా మద్రాసు రాష్ట్రంలో ఉండిందని ఇదివరకే చెప్పాము.



చరిత్ర, భాష, సంస్కృతి మొదలయిన ఈ ఆధారాలన్నీ పట్టుకొని ఫూల్‌బని కుయికళ్యాణ్ సమితి అనే సంస్థ పాణోల తరఫున హైకోర్టుకెక్కింది. పాత రెవెన్యూ రికార్డులలో 'కుయి'ని పాణోగా మార్చిన చోట తిరిగి కుయి అని రాయాలని కోరింది. హైకోర్టు ఆ మేరకు ఒరిస్సా ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీని అర్థం పాణోలకు కుయి అన్న గుర్తింపు లభించేసిందనీ, వారంతా ఎస్.టి జాబితాలో వచ్చి చేరిపోయారనీ కాదు. దానికింకా చాలా జరగవలసి ఉంది. అయితే కంధాలు ఆందోళన చెందడం సహజమే. తమకంటే ఇప్పటికే కొంతబాగున్న వారిని ఎస్.టి జాబితాలో చేరిస్తే ఎస్‌టి.లుగా తాము పొందే ప్రయోజనాలు దెబ్బతింటాయన్న ఆదుర్దా న్యాయమైనదే. కానీ పాణోల కళ్లతో చూసినప్పుడు వారి కాంక్షను కేవలం అత్యాశ అనలేము. రాజ్యాంగంలోనే షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు కులాల నిర్వచనంలో ఒక అసంబద్ధత ఉంది. షెడ్యూల్డు తెగకు చెందిన వ్యక్తి ఏ మతం పుచ్చుకున్నా షెడ్యూల్డు తెగ గుర్తింపు పోదు. కానీ షెడ్యూల్డు కులం అనే గుర్తింపు 'హైందవేతర మతాన్ని ఆచరించేవారికి వర్తించదు' అని రాజ్యాంగ (షెడ్యూల్డు కులాల) ఆదేశం, 1950 అంటుంది. దళితులసలు హిందువులేనా అన్న ప్రశ్న పక్కనపెడితే, దీని భావం ఏమిటంటే అవర్ణులయినవారు క్రైస్తవంగానీ ఇస్లాంగానీ, వేరే ఏ మతమైనా గానీ పుచ్చుకుంటే ఎస్.సిలుగా గుర్తింపు కోల్పోతారు. ఆ తరువాత దీనిని సవరించి సిక్కు మతాన్నీ, బౌద్ధమతాన్నీ స్వీకరించిన వారికి ఈ నిషేధం తొలగించారు గానీ క్రైస్తవానికీ ఇస్లాంకూ అది కొనసాగుతున్నది. దళితులు 'పరాయి మతాలు'గా భావించబడే ఈ రెండు మతాలలోకి పోయినట్టయితే ఎస్.సిలుగా పొందే ప్రయోజనాలను కోల్పోవలసి వస్తుందని బెదిరించి వారిని హైందవ సమాజం అంచున ఉండేటట్లు నిర్బంధించాలన్న సంకుచితమైన ఆలోచన తప్ప దీనికి హేతుబద్ధమైన కారణమేమీ లేదు. కుయి అన్న గుర్తింపు ద్వారా ఎస్.టి జాబితాలోకి ప్రవేశిస్తే క్రైస్తవం తీసుకున్నా ఆ గుర్తింపు పోదు కాబట్టి, అధికంగా క్రైస్తవులైన పాణోలు ఆ ప్రయత్నం చేయడంలో వారిని నిందించడానికేమీ లేదు.

కంధాలకూ పాణోలకూ మధ్యనున్న వైరుధ్యాల స్వరూపం ఇది. ఇవి నిజమయిన వైరుధ్యాలే గానీ పాణోలపైన జరిగిన అత్యంత క్రూరమైన దాడిని ఇవి వివరించజాలవు. ఒకటి – కంధాల ఆగ్రహానికి భూమి పరాయీకరణ, ఆర్థిక దోపిడీలు కారణమయి వుంటే పాణోల కంటె ఎక్కువ సవర్ణ హిందువుల (ఒరియాల)పైన దాడి జరిగి ఉండాలి. అది జరగకపోగా, చాలాచోట్ల సవర్ణ హిందువులు కంధాలతో కలిసి క్రైస్తవ పాణోలపైన దాడి చేసారు.




రెండు – క్రైస్తవ పాణోల పైననే కాక మతం మార్చుకోని పాణోలపైన కూడ దాడి జరిగి ఉండాలి. అది జరగకపోవడమేకాదు వారు సహితం కొన్నిచోట్ల క్రైస్తవ పాణోలపైన జరిగిన దాడిలో పాల్గొన్నారు. చివరిగా, క్రైస్తవ కంధాలపైన దాడి జరిగి ఉండకూడదు. కానీ చాలాచోట్ల వారిపైన కూడ దాడులు జరిగాయి, చాలామంది క్రైస్తవ కంధాలు పాణోలతో బాటు క్యాంపులలో ఉన్నారు కూడ.

## లక్ష్మణానంద సరస్వతి

కంధమాల్ హింసాకాండను అర్థం చేసుకోవడానికి విశ్లేషించవలసింది కంధా–పాణోల వైరుధ్యాలను కాదు. లక్ష్మణానంద సరస్వతి కంధమాల్‌లో సంఘ్‌పరివార్ కార్యకలాపాలను చేపట్టినప్పటి నుండి అమలు చేసిన కార్యాచరణను. అతని అసలు పేరు లక్ష్మణ్ సేథి. అతను 1969లో కంధమాల్ జిల్లాలో ప్రవేశించాడు. అతని కేంద్రం చకాపద గ్రామం. అక్కడ గురుకుల సంస్కృత మహావిద్యాలయం నెలకొల్పాడు. ఆదివాసుల హైందవీకరణకోసం సంఘ్‌పరివార్ స్థాపించిన వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ 1979 నుండి చకాపద కేంద్రాన్ని నడుపుతున్నది. ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఆదివాసీ విద్య పైన లక్ష్మణానంద దృష్టి పెట్టి ఆదివాసీ పిల్లలకు విద్యావకాశాలు కల్పించారని సంఘ్‌పరివార్ అతనిని పొగుడుతుంటుంది గానీ ఆ మహావిద్యాలయంలో చెప్పేది సంస్కృతం చదువు. ఆదివాసుల జీవితాలు బాగుచేసుకోవడానికి అది ఎంతమాత్రం ఉపయోగపడదు. సంఘ్‌పరివార్ భావజాలాన్ని వారి మెదళ్ళలోకి ఎక్కించడానికి మాత్రం బాగానే ఉపయోగపడి ఉంటుంది. నిజానికి ఈ విద్యాసంస్థను అందరూ నిందించే ముస్లిం మదరసాల కంటే ఏరకంగానూ భిన్నమైనదిగా చూడలేము. లక్ష్మణ్ సేథిని కంధమాల్‌కు పంపించడంలోగల ఉద్దేశ్యమే సంఘ్‌పరివార్ భావజాలాన్ని ఆదివాసులలో ప్రచారం చేయడం, క్రైస్తవం వ్యాప్తిని నిరోధించడం. జాలస్‌పేటలో సంస్కృత కన్యాశ్రమం 1985లో వచ్చింది. అది కూడ సంస్కృత పాఠశాలే. రెండుచోట్లా ఆర్.ఎస్.ఎస్‌శాఖలు నిర్బంధంగా జరుగుతాయి. విశ్వహిందూ పరిషత్ వారి సత్సంగ్‌లూ జరుగుతాయి. అక్కడ వారి ప్రచారకులు దేశాన్ని గురించి, దేశసమస్యల గురించి తమ అవగాహన నేర్పుతారు. అందులో దేశం ఎదుర్కొంటున్న సకల సమస్యల విషయంలో తప్పు మైనారిటీలమీద, లౌకిక పార్టీల 'బుజ్జగింపు' విధానాలమీద పెడతారు. అసలు జాలస్‌పేట విద్యాలయం లక్ష్మణానంద నెలకొల్పింది కాదనీ, స్థానిక ప్రజలు దానిని నెలకొల్పగా లక్ష్మణానంద దానిని






స్వాధీనం చేసుకొని అక్కడ పనిచేస్తున్న అధ్యాపకులను తొలగించి కాషాయవిద్య బోధించే అధ్యాపకులను తీసుకొచ్చాడనీ విన్నాము.

మొదటినుండి కూడ లక్ష్మణానంద ఆదివాసీ గ్రామాలు తిరుగుతూ 'సరయిన జీవన విధానం' పేరుమీద బ్రాహ్మణీయ విలువలనూ పద్ధతులనూ నేర్పించేవాడు. తరచుగా సంకీర్తనలను యాగాలను జరిపేవాడు. 'మేము ప్రజలకు క్రైస్తవానికి దూరంగా ఉండమనీ, హిందూ ధర్మాన్ని ఆచరించమనీ బోధించాము. భారతదేశం హిందూరాష్ట్రం అని బోధించాం'. ఈ మాటలు మాతో అన్నది లక్ష్మణానంద అభిమాని అయిన శివరాం డిగాల్. జి.ఉదయగిరి బ్లాక్‌లోని కటింగియా గ్రామస్తుడయిన ఇతను పాణో కులస్తుడు. అయితే క్రైస్తవం పుచ్చుకోనివాడు. లక్ష్మణానంద వెంట ఊరూరూ తిరిగేవాడు. భారతదేశం హిందూరాష్ట్రం అన్న అబద్ధాన్ని క్రైస్తవుల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టే పద్ధతిలో అమాయకులయిన ఆదివాసీ గ్రామాలలో ప్రచారం చేయడం ఎటువంటి దుష్ప్రభావం వేయగలదో ఊహించవచ్చు. లక్ష్మణానంద చేపట్టే యాగాలు వగైరాలకు హాజరయ్యే కంధాలకు జంధ్యం వేసి గాయత్రీమంత్రం నేర్పించే తంతు కూడ జరిగేది.

క్రైస్తవానికి వ్యతిరేకంగా ద్వేషపూరిత ప్రచారం చేపట్టడం లక్ష్మణానంద కార్యక్రమాలలో ముఖ్యమైనది. 'మీరు పేదరికంలో ఉన్నారు. క్రైస్తవుల దగ్గర విదేశీ డబ్బు ఉంది కాబట్టి వాళ్లు ధనవంతులు' అని కంధాలకు చెప్పేవాడు. ఆయన నిర్వహించే సభలలో 'చర్చిలపైన దాడిచేయడానికి సిద్ధంగా ఉన్నవాళ్లు చేతులెత్తండి' అని అడిగేవాడు. ప్రతీ సంవత్సరం గుడ్‌ఫ్రైడే, క్రిస్మస్ పండగలప్పుడు కావాలని ఏదో ఒక అల్లరి చేసి ఆ పండగలు ప్రశాంతంగా జరుపుకోవడం సాధ్యంకాని పరిస్థితి కల్పించేవాడు. అతని రెచ్చగొట్టే మాటలు, చర్యలచేత ప్రభావితులయిన ఆదివాసులు క్రైస్తవులను పట్టుకొని మతం మార్చుకొమ్మని బలవంతం చేసేవారు. దీనికి లక్ష్మణానంద ఒక తంతును రూపొందించాడు. ఆ తంతు వివరాలను కటక్‌లోని ఒక శరణార్థుల శిబిరంలో తలదాచుకొన్న జి.ఉదయగిరి బ్లాక్ పిరిగడ గ్రామ వాసి అయిన సైమన్ నాయక్ నుండి వివరంగా విన్నాము. ముందుగా క్రైస్తవుడికి గుండు గీయిస్తారు. నుదుటిమీద తిలకం దిద్దుతారు. అతని చేత పేడనీళ్లు తాగిస్తారు. ఆ తరువాత నెయ్యి కలిపిన అన్నం తినిపిస్తారు. ఒక బైబిల్ ప్రతి అతని చేతికి ఇస్తారు. దానిని అతను చింపి తగలబెట్టాలి. ఆ తరువాత తాను ఎప్పుడయినా మళ్లీ చర్చికి పోయినట్టయితే చచ్చిపోయినట్టేనని ఒక కాగితం మీద రాసి




సంతకం పెట్టాలి. ఇంత తతంగం ఉంది. అయితే మతం పుచ్చుకున్న ఆదివాసీకి వేసినట్టు దళితుడికి జంధ్యం వేయడం, గాయత్రీ మంత్రం  నేర్పించడం ఉండదు.

లక్ష్మణానంద కార్యక్రమాల ఫలితంగా 1986 నుండి క్రైస్తవులపైన దాడులు జరగసాగాయి. 1986-87 సంవత్సరాలలో లక్ష్మణానంద అనేక గ్రామాలలో యజ్ఞాలు నిర్వహించాడు. 1987లో జగన్నాథ రథయాత్ర జరిపాడు. ఆ సంవత్సరం 20 చోట్ల క్రైస్తవులపై దాడులు జరిగాయి. 1989 నాటికే అతను 18 వేల మంది క్రైస్తవులను హిందువులుగా మార్చినట్టు 17 మార్చి 1989 నాడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురితమైన ఒక రిపోర్టు పేర్కొంది. ఆ తరువాత కూడ 'పునరాగమనం' అని పిలవబడే ఈ బలవంతపు మత మార్పిడి కొనసాగింది. 2006 ఏప్రిల్ నెలలో గోల్వాల్కర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా చకాపదలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో 342 మంది క్రైస్తవులను హిందువులుగా మార్చడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఒరిస్సా న్యాయశాఖమంత్రి, కొందరు ఎం.పిలు, ఎం.ఎల్.ఏలు కూడ హాజరుకావడం విశేషం.

## కుయి సంఘాలు

ఈ హింసాకాండలో, దాడులలో లక్ష్మణానంద వెంట పోయిన వారిలో సవర్ణ హిందువులతోబాటు కంధాలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. 2008లో జరిగిన హింసాకాండ కొచ్చేసరికి ప్రధానంగా కంధాలే సంఘ్‌పరివార్ కాల్బలంగా పనిచేశారు. అయితే కంధాలు కేవలం విశ్వహిందూపరిషత్ చేతిలోను, భజరంగ్‌దళ్ చేతిలోను పావులన్న అభిప్రాయం కలిగిస్తే పొరపాటవుతుంది. పాణోలతో వారికి ఉన్న వైరుధ్యాల కారణంగా వారిని రెచ్చగొట్టే అవకాశం ఉండిందని పైన వివరించాము. భజరంగ్‌దళ్ దౌర్జన్యాన్ని తిరస్కరించినవారు, ప్రతిఘటించి ప్రాణం కోల్పోయినవారు కూడ కంధాలలో ఉన్నారనేది తరువాత చూద్దాం. ప్రస్తుతానికి చెప్పవలసిందేమిటంటే పాణోలకు వ్యతిరేకంగా కంధాలు చేపట్టిన ఆందోళన, క్రైస్తవులపైన భజరంగ్‌దళ్ సాగించిన దౌర్జన్యకాండ సమాంతరంగా సాగిన రెండు వేరువేరు ఉదంతాలు. తరచుగా రెండింటి గొంతులూ కలిసినప్పటికీ, భజరంగ్‌దళ్ కూడగట్టిన గుంపులో కంధాలే అధికంగా ఉన్నప్పటికీ రెండూ ఒకటి కాదు. గడచిన దశాబ్దకాలంగా కంధాలకు పాణోలపైన ఉన్న ఫిర్యాదుల ప్రాతిపదికన ఆందోళన నిర్వహిస్తున్న సంస్థ ఒకటి ఉంది. దాని పేరు కుయి సమాజ్ సమన్వయ సమితి (క్లుప్తంగా సమితి అందాం.) ఇది 1998లో ఏర్పడింది. 1926లో బాలిగుడ ప్రాంతంలో కంధాలనూ






పాణోలనూ కలుపుకొని ఏర్పడిన నిఖిల్ ఉత్కల్ కుయి సమాజ్ సంఘం గురించి పైన చెప్పాము. అది ఇప్పటికీ కొనసాగుతున్నది. 2008 దాడులప్పుడు దాడులలో పాల్గొనవద్దని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు శంతను ప్రధాన్ తన అనుచరులకు చెప్పాడు.

అయితే 'కుయి' పేరుమీద పాణోలను కలుపుకోకూడదన్న నిర్ణయంతో 1945లోనే కుయి సమాజ్ సేవా సమితి అనే సంస్థ ఏర్పడిన విషయం కూడ చెప్పాము. దీని కేంద్రం ఫూల్‌బని. 1982లో బాలిగుడలో కుయి కులసమితి అనే సంస్థ ఏర్పడింది. ఇవన్నీ కంధాల సంఘాలు. 1998లో కంధాల ఆందోళనను సమన్వయపరిచే ఉద్దేశ్యంతో కుయి సమాజ్ సమన్వయ సమితి ఏర్పడింది. దాని నాయకుడైన లంబోదర్ కన్హర్ సంఘ్‌పరివార్‌కు బాగా సన్నిహితుడేగానీ స్వంత రాజకీయ అజెండా గలవాడు. అప్పుడప్పుడు విశ్వహిందూపరిషత్ గొంతుతో మాట్లాడతాడు. అప్పుడప్పుడు వ్యతిరేకంగానూ మాట్లాడతాడు. ఒక్కొక్కసారి ఆదివాసులు ప్రకృతి ఆరాధకులే తప్ప హిందువులు కారనీ, గొడ్డుమాంసం తినడం వారి అలవాటనీ, అది మాన్పించాలన్న సంఘ్‌పరివార్ ప్రయత్నం ఖండించవలసిందనీ అంటాడు. తాగడం కూడ ఆదివాసుల సంప్రదాయం అంటాడు. తాగుడు మాన్పించాలన్న సంఘ్‌పరివార్ ప్రయత్నం తప్పంటాడు. లక్ష్మణానంద చేసే యాగాలలో నిప్పులో సారాయి పోయమని కంధాలకు అతను పిలుపు ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. కానీ క్రైస్తవుల గురించి, వారిపైన లక్ష్మణానంద ఆధ్వర్యంలో జరిగిన దాడుల గురించి మాత్రం పూర్తిగా విశ్వహిందూపరిషత్ గొంతుతోనే మాట్లాడతాడు.

## లంబోదర్ కన్హర్

లంబోదర్ కన్హర్ మొదట 1994లో వార్తలకెక్కాడు. ఖజురిపద బ్లాక్‌లోని ఖుడుటెంటులి గ్రామంలో 15 జనవరి 1994 నాడు ఒక పాణో యువకుడు శివాలయంలోకి ప్రవేశించడాన్ని ఆ ఆలయం భక్తులయిన కంధాలు వ్యతిరేకించారు. అంటరానితనం కారణంగా వ్యతిరేకించలేదనీ, ఆ గుడి రిపేర్‌కు డబ్బులు ఇమ్మన్నప్పుడు పాణోలు ఇవ్వలేదనీ, అందువల్ల పాణో యువకుడు రావడాన్ని ఆదివాసులు వ్యతిరేకించారనీ కన్హర్ వివరణ ఇచ్చాడు గానీ అది నమ్మేవాళ్లెవరూ లేరు. వాళ్లు వ్యతిరేకించినా ఆ పాణో యువకుడు మొండిగా తన హక్కు వినియోగించుకుంటానని అనడంతో అది రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. లంబోదర్ కన్హర్ రంగంలోకి దిగి కంధాలను



పెద్ద సంఖ్యలో సమీకరించాడు. అవతలి వైపు పాణో నాయకులూ అదే పని చేసారు. దళితుని ఆలయ ప్రవేశం హక్కు గురించి ఒక వికారమయిన దళిత – ఆదివాసీ ఘర్షణ ఆర్నెల్ల పాటు అంటే జూన్ నెలదాకా సాగింది. 18 మంది చనిపోయారు. పాణోలు గ్రామాలు వదిలి ఫూల్‌బనికి పారిపోయి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరంలో తలదాచుకున్నారు. ఆ ఘర్షణలో భాగంగా లంబోదర్ కన్హర్ 5000 మంది కంధాలతో ఏప్రిల్ 6వ తేదీన తీసిన ఊరేగింపులో 'మీదగ్గర ఉన్న ఆయుధాలు తీసుకురండి, పాణోలను హతమార్చండి' అన్న నినాదం పదేపదే ఇచ్చాడు. ఆ ఘర్షణ క్రమంలోనే ఫూల్‌బని జిల్లా పేరును కంధమాల్‌గా మార్చాలని డిమాండ్ చేసి సాధించుకున్నారు.

లంబోదర్ కన్హర్ ఏ రోజూ కూడ కంధాలను సవర్ణ హిందువుల దోపిడీకీ దౌర్జన్యాలకూ వ్యతిరేకంగా సమీకరించలేదు, కదిలించలేదు. భజరంగ్‌దళ్ ఎట్లాగూ ఆ పని చేయలేదు. భూమి పరాయీకరణ, వడ్డీ వ్యాపారం మొదలయిన విషయాలలో పాణోల కంటె సుందీలు, ఇతర సవర్ణ హిందూ కులాలు కంధాలకు ఎక్కువ శత్రువులయి ఉండాలి. కానీ వారిపైన ఏ పోరాటం లేకపోగా వారు సంఘ్‌పరివార్‌లో చేరి కంధాలను ముందుపెట్టి క్రైస్తవ పాణోలపైన భీకరమైన దాడులకు పాల్పడుతున్నారు.






# ఒరిస్సా : హింసాకాండ

**2008** ఆగస్ట్–సెప్టెంబర్ నెలల్లో కంధమాల్ జిల్లాలో జరిగిన హింసాకాండ గురించి మాట్లాడుకోవడానికి ముందు 2007 డిసెంబర్‌లో మొదలయి 2008 జనవరిలోకి సాగిన దాడుల గురించి చెప్పుకోవాలి. నిజానికి బాధితులెవ్వరితో మాట్లాడినా 'గత డిసెంబర్' గురించి, 'ఈ ఆగస్టు' గురించి మార్చి మార్చి చెప్పడం నిజనిర్ధారణ కమిటీలుగా వెళ్లిన వారందరి అనుభవం. సంఘ్‌పరివార్ కూడ రెండవ ఘటనను మొదటిదాని కొనసాగింపుగానే భావిస్తుంది. ఎటొచ్చీ రెండింటినీ తలక్రిందులుగా చూపిస్తుంది. ఒక్క మావోయిస్టులు మాత్రమే ఈ విషయాన్ని గ్రహించనట్టున్నారు. గ్రహించి ఉంటే లక్ష్మణానందపై హత్యాప్రయత్నం జరిగిందన్న కల్పితమైన సాకుని వాడుకొని 2007 డిసెంబర్‌లో క్రైస్తవులపైన జరిగిన దాడుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని లక్ష్మణానంద సరస్వతిని చంపేవారు కారేమో. 2007 క్రిస్మస్ దినానికి ముందు మొదలయి ఆ పండగ తరువాత కూడ కొనసాగిన దాడులలో 600 నుండి 700 దాకా ఇళ్లు, 90 చర్చిలు, వంద దాకా ఇతర క్రైస్తవ సంస్థల బిల్డింగ్‌లు ధ్వంసం అయ్యాయి. ఇతర సంస్థలలో కుష్టురోగుల పునరావాస కేంద్రం కూడ ఒకటి. త్రిశూలాలతో తల్వార్లతో జరిగిన దాడులలో చాలామందికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల సంఖ్య 11 అనేది అనధికార అంచనా.

## డిసెంబర్ 2007

ఈ హింసాకాండ పూర్వరంగాన్ని గురించి హిందుత్వవాదులదొక కథ ఉంది. దరింగబాడి బ్లాక్‌లోని బామునిగాం (బ్రాహ్మణిగాం) గ్రామంలో క్రిస్మస్ వేడుకలలో భాగంగా దుర్గ గుడికి అడ్డంగా క్రైస్తవులు ద్వారం కట్టారని వారి అభియోగం. ఇది రోడ్డుకడ్డంగా కట్టిన ద్వారం కాదు. రోడ్డు మార్జిన్ వెంబడి కట్టినది. ఆ దుర్గ గుడికి నవరాత్రులప్పుడు తప్ప ఎవరూ పోరనీ, ఈ దారం క్రిస్మస్




సందర్భంగా తాత్కాలికంగా కట్టినదనీ క్రైస్తవుడయిన మాజీ ఎంఎల్ఏ సలూజా ప్రధాన్ అంటాడు. అంతేకాక బాలిగుడ సబ్‌కలెక్టర్ అనుమతితోనే ఆ ద్వారం నెలకొల్పారని, డిసెంబర్ 19 నాడు అనుమతి తీసుకున్నామని తారీఖుతో సహా చెప్పాడు. 2006లో అదేచోట ద్వారం పెట్టినా అప్పుడేం అభ్యంతరంగానీ గొడవగానీ లేదు. దానికి ఇటూ అటూ రోడ్డువెంబడి ఉన్న అంగళ్లన్నీ క్రైస్తవులవే. అయితే సంఘ్‌పరివార్ ప్రతినిధి అయిన రాంమాధవ్ జనవరి 8వ తేదీన విడుదల చేసిన ప్రకటనలో ఏమంటాడంటే అప్పటికే ఒక ద్వారం ఉండగా క్రైస్తవులు ఏ సంవత్సరం లేనిది ఆ సంవత్సరం రెండవ ద్వారం నెలకొల్పారనీ, దానిని ఇతరులు నిరసించారనీ. మత సంబంధమైన సంబరాలలో పొదుపు ఎవరైనా ఎప్పుడు పాటించారో వారే తెలపాలి. సంఘ్‌పరివార్ సంస్థలు నిర్వహించే గణేశ్ చతుర్థి, నవరాత్రి ఉత్సవాలలోనయితే పొదుపు పాటించడం అటుంచి ఎన్ని మండపాలు పెడితే అంత గొప్ప అనేది వారి వైఖరి.

అయితే ఇక్కడ సంఘ్‌పరివార్ అనుసరించే ఒక ఎత్తుగడను ప్రస్తావించాలి. వారి హింసాకాండ గురించి చర్చ వచ్చినప్పుడు దాని పరిమాణంతో పోలిక లేని చిన్న చిన్న కారణాలు చూపిస్తారు. చర్చిస్తున్నది మూకుమ్మడి హత్యాకాండ, విధ్వంసం, దహనకాండల గురించి కాగా చాయ్ దుకాణంలో కొట్లాట గురించి మాట్లాడుకుంటున్నట్టు జవాబు చెప్పి ఆ చర్చలోకి ఎదుటివారిని లాగుతారు. ఇది బాధితుల ఆవేదనను కించపరిచి వారి ఆగ్రహాన్ని చిల్లర సంభాషణ ద్వారా నీరసింపజేసే ఎత్తుగడ.

సంఘ్‌పరివార్ చూపించే మరొక కారణం డిసెంబర్ 24 సాయంత్రం లక్ష్మణానంద సరస్వతిపైన జరిగిన హత్యాప్రయత్నం, అది అతని అనుచరులలో కలిగించిన ఆగ్రహం. లక్ష్మణానందపైన నిజంగా హత్యా ప్రయత్నం జరిగిందా అన్నది తర్వాత చూద్దాం. అతనికి ఆ హత్యాప్రయత్నంలో గాయాలయ్యాయని సంఘ్‌పరివార్ సహితం అనడం లేదు. కాగా, దాడికి కారణాలుగా చూపించే ఈ రెండూ 2007 డిసెంబర్ నాటి హింసలో ఒక శతాంశాన్ని కూడ వివరించజాలవు. ఎందుకంటే క్రైస్తవులపైన దాడులు రెండవ ద్వారం 'అనవసరంగా' నిర్మించిన బామునిగాంలో మొదలు కాలేదు. లక్ష్మణానందపైన 'హత్యాప్రయత్నం' జరిగేంతవరకు వేచి ఉండలేదు. (బామునిగాంపైన జరిగిన విధ్వంసకమైన దాడి సహితం ఆ హత్యా ప్రయత్నం కంటే






ముందే జరిగింది). అప్పటికే చాలా ఊర్లలో దాడులు జరిగి ఉన్నాయి. వాస్తవానికి 2007 డిసెంబర్ మాసంలో జరిగిన దాడులు ఒక పథకం ప్రకారం, సువిశాల భూభాగంలో జరిగాయి. అనేక తాలూకాలనుండి, జిల్లా వెలుపలనుండి కూడ వచ్చిన వ్యక్తులు ఆ దాడులలో పాల్గొన్నారు. వాళ్ల చేతులలో మారణాయుధాలున్నాయి, బస్సులనిండా పెట్రోల్, డీజిల్ ఉన్నాయి. ముందుగా ప్రణాళిక వేసుకోకుండ ఇది సాధ్యం కాదు.

బాలిగుడ బ్లాక్‌లోని బారఖమా గ్రామం దాడులకు గురయిన ఊర్లలో ఒకటి. 2007 డిసెంబర్ నాటి హింసాకాండ గురించి వివరమయిన నివేదిక రూపొందించిన సామాజిక శాస్త్రవేత్త అంగనా ఛటర్జీ ఆ దాడిలో 4000 మంది పాల్గొన్నట్లు అంచనా వేసారు. మా బృందంతో ఈ దాడి గురించి కేశోమతి ప్రధాన్ అనే కంధా తెగకు చెందిన ఆదివాసీ స్త్రీ వివరంగా మాట్లాడింది. రైకియా బ్లాక్‌లోని సుకుడ్‌బాడి పంచాయితీలో ఉన్న కజూరి గ్రామ నివాసి అయిన ఈమె తన బంధువులను చూడడానికి డిసెంబర్ 21 నాడు బారఖమాకు పోయి డిసెంబర్ 25 దాకా అక్కడే ఉండింది. బారఖమాపైన దాడి జరిగింది ఆరోజే. కంధమాల్ నారీ జాగరణ్ మంచ్ అధ్యక్షురాలయిన ఈమె ఆ దాడికి ప్రత్యక్షసాక్షి. తన తోటి ఆదివాసులను ఆ దాడిలో పాల్గొనకుండ నిలువరించడానికి ఈమె చాలా కృషి చేసింది. ఈమె చెప్పిన విషయాలను అంగనా ఛటర్జీ చెప్పిన విషయాలతోనూ, అఖిలభారత కాథలిక్ సమాజం అధ్యక్షుడు జాన్‌దయాల్ చెప్పిన విషయాలతోనూ పోల్చి చూసుకున్నప్పుడు 2007 డిసెంబర్ నాటి దాడి గురించి ఈ కింది చిత్రం కనిపిస్తుంది.

లంబోదర్ కన్హర్ నేతృత్వంలోని కుయి సమాజ్ సమన్వయ సమితి 2007 డిసెంబర్ నెలలో ఆందోళన కార్యక్రమం చేపట్టింది. క్రైస్తవ పాణోలు ఎస్‌సి సర్టిఫికెట్లు పొందకుండ చూడాలనీ, కుయి మాట్లాడే పాణోలను ఎస్‌టిలుగా గుర్తించాలన్న డిమాండ్‌కు అంగీకరించకూడదనీ, పాణోలు స్వాధీనం చేసుకున్న కంధాల భూములు వెనక్కి ఇప్పించాలనీ వారి డిమాండ్లు. కంధాల న్యాయమైన ఆందోళనను సంఘ్‌పరివార్ అజెండాతో కలిపిన వైనం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. లేకుంటే ఈ మూడింటిలోని మొదటి డిమాండుతో ఆదివాసులకేం సంబంధం? క్రైస్తవ పాణోలు ఎస్‌సి సర్టిఫికెట్లు ఒకవేళ పొందుతున్నట్లయితే దాని గురించి ఆందోళన చెందవలసింది క్రైస్తవేతర పాణోలే తప్ప ఆదివాసులు కారు. సంఘ్‌పరివార్ అజెండాను మరింత స్పష్టంగా



బయటపెట్టే విషయం – ఈ ఆందోళనలో భాగంగా డిసెంబర్ 24, 25 తేదీలలో జిల్లాలో బంద్ పిలుపు ఇవ్వడం. క్రిస్మస్ వేడుకలను ఆటంకపరచడం తప్ప దీనికి వేరే కారణంగానీ లక్ష్యంగానీ లేదు.



కేశోమతి ప్రధాన్


డిసెంబర్ 22 నుండి గ్రామాలలో పెద్దెత్తున ఊరేగింపులు తీశారు. అన్నిచోట్ల క్రైస్తవ వ్యతిరేక నినాదాలు ఇచ్చారు. కొన్నిచోట్ల క్రైస్తవులను హతమార్చమంటూ పిలుపు ఇచ్చారు కూడ. 2008 ఆగస్టు – సెప్టెంబర్‌లలో జరిగిన దాడులలాగ ఆ రోజు సవర్ణ హైందవుల పాత్రను దాచిపెట్టే ప్రయత్నం జరగలేదు. లక్ష్మణానంద హత్య తరువాత జరిగిన దాడులను అతని మరణానికి ఆగ్రహించిన ఆదివాసుల చర్యగా చూపించి సవర్ణ హిందువుల పాత్రను దాచిపెట్టారు. కాని 2007 డిసెంబర్‌నాటి దాడులలో 'ఒరియాల' పాత్ర ప్రత్యక్షంగానే ఉంది. వారు కంధాలకు పెట్రోలు వాడడం నేర్పించారనీ, వాళ్ల నుదుట తిలకం దిద్ది భజరంగ్‌దళ్ చిహ్నమైన ఎర్రటిగుడ్డ తలకు చుట్టారనీ కేశోమతి అనింది. 'మీ దగ్గర ఏ ఆయుధాలుంటే అవి తీసుకురండి, పాణోలను చంపండి' అనే నినాదాలతో బ్యానర్లు రాసారు. 'క్రైస్తవులను చంపండి' అన్నది నాటి ఆందోళనలో సర్వత్రా వినపడ్డ నినాదం. ఇతర నినాదాలు 'జై భజరంగబళీ', 'భారత్‌మాతాకీ జై' మొదలయినవి.

బామునిగాంపైన దాడి డిసెంబర్ 24న జరిగింది. క్రైస్తవులు బంద్ పాటించడానికి నిరాకరించడంతో క్రిస్మస్ సంబరాలకోసం వారు చేసుకున్న ఏర్పాట్లపైన 150–200 సంఖ్యగల గుంపు దాడి చేసింది. 20 దుకాణాలు లూటీ చేసి తగలబెట్టి, ఒక చర్చికి నిప్పు పెట్టి, కొంతమందిని గాయపరిచారు. 25వ తేదీన ఈ గ్రామంపైన మళ్లీ దాడి జరిగింది. తమపైన దాడులు జరగవచ్చునన్న భయంతో క్రైస్తవులు 21వ తేదీనుండే బాలిగుడ సబ్‌కలెక్టర్‌కు, డిఎస్‌పికి అర్జీలు ఇస్తూ వున్నారు. అయినప్పటికీ ఊరిమీదికి గుంపు వచ్చే సమయానికి ఎటువంటి రక్షణా లేదు. దాడి అయిపోతుండగా సబ్‌కలెక్టర్, డిఎస్‌పి వచ్చారు. బామునిగాంలో దుర్గ గుడికి అడ్డంగా క్రైస్తవులు తాత్కాలికంగా ఒక





ద్వారం నిలబెట్టారన్న నిరసన హిందువులలో నిజంగానే ఉందనుకున్నా, ఆనాడు జరిగిన దాడి తీవ్రతను అది వివరించజాలదు. దాడి చేయడానికి క్రిస్మస్ పండగ ముందురోజును ఎంపిక చేసుకోవడాన్నీ ఆ నిరసన వివరించజాలదు. ఆ రోజును ఎంచుకోవడంలో క్రైస్తవులను రెచ్చగొట్టాలన్నది తప్ప వేరే ఉద్దేశ్యం కనిపించదు. ఆ సాయంత్రం బామునిగాం వైపు వస్తున్న లక్ష్మణానంద కారుపైన క్రైస్తవులు దసింగబాడి అనే గ్రామం దగ్గర దాడి చేసారని సంఘ్‌పరివార్ ఆరోపణ. (ఇంతకూ ఆ యోగి బామునిగాంకు ఆ సాయంత్రం ఎందుకొస్తున్నాడో!) 'ఆరోపణ' అని ఎందుకు అంటున్నామంటే అతనిపైన దాడి జరిగిందని సంఘ్‌పరివార్ తప్ప వేరెవ్వరూ నమ్మడం లేదు. జాన్‌దయాల్ సేకరించిన సమాచారం ప్రకారం బామునిగాంకు లక్ష్మణానందను తీసుకొస్తున్న కారు దసింగబాడి దగ్గర ఒక బస్సు సిబ్బందితో ఘర్షణ కారణంగా ఆగింది. కారు డ్రైవర్ బస్సు సిబ్బందితో గొడవపడుతుండగా, లక్ష్మణానంద అంగరక్షకులు క్రిస్మస్ వేడుకలకోసం రోడ్డుపక్కన తోరణాలు కడుతున్న క్రిస్టియన్ యువకులపైన దాడి చేసారు. వారు ఎదురుదాడికి దిగగా కొంతసేపు గొడవ అయింది. దీనిని లక్ష్మణానంద సరస్వతిపైన దాడిగా అభివర్ణించిన సంఘ్‌పరివార్ అందుకు నిరసనగా 36 గంటల బంద్ పిలుపు ఇచ్చింది. అప్పటికే డిసెంబర్ 24, 25 తేదీలలో కుయి సమాజ్ సమన్వయ సమితి బంద్ పిలుపు ఇచ్చి ఉంది కాబట్టి అదీ ఇదీ కలిసాయి. ఆ తరువాత విస్తృతంగా దాడులు జరిగాయి. దాడులకు గురయిన గ్రామాలలో బారఖమా ఒకటి. దాడుల్లో పెట్రోలు, ఇనుపరాడ్లు, త్రిశూలాలు, కత్తులు విరివిగా ఉపయోగించారు. ఇళ్లనూ, చర్చిలనూ తగలబెట్టి మనుషులపైన బలప్రయోగం చేసారు. డివిజన్ కేంద్రమయిన బాలిగుడలో సహితం 500 మంది గుంపు త్రిశూలాలు, కత్తులు పట్టుకొని చర్చిపైన దాడిచేసింది. బాధితులు ఊర్లనుండి పారిపోయి చలిలో, అడవులలో తిండిలేకుండ, కప్పుకోవడానికి గుడ్డలు లేకుండ కొన్ని రాత్రులూ, పగళ్లూ గడిపారు. కొంతమంది ప్రభుత్వం అనుమతించిన శిబిరాలలో చేరారు. బామునిగాం, ఆ పరిసరాలలో క్రైస్తవులు కొంతమేరకు ఎదురుదాడి చేయగలిగారు గానీ వారు అనుభవించిన నష్టంతో పోలిస్తే వారి ప్రతిచర్య చిన్నదే. ఈ ఘటనలలో నలుగురు చనిపోయారని ఒరిస్సా ప్రభుత్వం అంటుండగా, 11 మంది అని అంగనా ఛటర్జీ అంటారు. ఈ ఉదంతంపైన న్యాయవిచారణ జరపమని ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం బాసుదేవ్ పాణిగ్రాహి అనే రిటైర్డ్ హైకోర్టు జడ్జిని నియమించింది. ఆ విచారణ ఇంకా జరుగుతుండగానే 2008 ఆగస్ట్ నెలలో అంతకు ఎన్నోరెట్లు ఘోరమైన దాడి మొదలయింది.




2008 ఆగస్ట్ 23 రాత్రి 8.30 గంటలప్పుడు తుమిడిబంద బ్లాక్‌లోని జాలస్‌పేటలో ఉన్న సంస్కృత కన్యాశ్రమం వద్ద కొందరు సాయుధులు లక్ష్మణానంద సరస్వతినీ, అతని అనుచరులు నలుగురినీ కాల్చి చంపారు. అప్పటికి కొద్దిరోజుల ముందు మావోయిస్టుల నుండి లక్ష్మణానందకొక బెదిరింపు లేఖ వచ్చిందనీ, అందులో అతను తన మతతత్వ కార్యకలాపాలు ఆపకపోతే చంపుతాం అన్న బెదిరింపు ఉందనీ, అతను ఆ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు రక్షణ కల్పించలేదనీ పత్రికలు రాసాయి. ఏమయితేనేం, 23 రాత్రి 40-50 మంది సాయుధులు అతనినీ అతని అనుయాయులు నలుగురినీ కన్యాశ్రమం ఆవరణలోనే చంపారు.

చంపినవాళ్లు మావోయిస్టులన్న విషయంలో మొదటినుండీ ఎవరికీ సందేహం లేదు. మావోయిస్టులు సహితం అది తమ చర్యేనని ప్రకటించుకున్నారు. అయితే సంఘ్‌పరివార్ మాత్రం దీనిని నమ్మడం లేదని అంటుంది. లక్ష్మణానందను చంపింది క్రైస్తవులేనని వారి ఉవాచ. అబద్ధాన్ని నిలబెట్టుకోవడం మరీ కష్టమయినప్పుడు 'ఒకవేళ మావోయిస్టులు చంపి ఉన్నా, క్రైస్తవులు వారిని కిరాయి హంతకులుగా వినియోగించుకొని చంపించి ఉంటారు' అంటున్నారు. ఆర్.ఎస్.ఎస్‌ఏర్పడిన తొలిదినాల నుండి ముస్లిం-వ్యతిరేకత, క్రైస్తవ-వ్యతిరేకతతోపాటు కమ్యూనిస్టు-వ్యతిరేకతను కూడ సమపాళ్లలో ప్రకటించుకున్న హిందుత్వవాదులు కమ్యూనిస్టులు చేసిన ఒక హత్యను వారు చేసింది కాదంటూ క్లీన్ చిట్ ఇచ్చిన తొలిఘటన ఇదేనేమో! ఈ ఘటనలో చనిపోయింది తమ ప్రముఖుడైనా, అతనిని చంపింది తామేనని మావోయిస్టులు ఒప్పుకున్నా కూడా చంపింది వారు కాదని ఆర్.ఎస్.ఎస్ అనడం మరీ విడ్డూరం. ఇంతటి అవకాశవాదానికి ప్రేరణ ఒక్కటే. క్రైస్తవులపైన భారీగా దాడి చేయడానికి ఈ హత్య ఇచ్చిన సదవకాశాన్ని వదులుకోకూడదన్న దృఢమైన నిర్ణయానికి సంఘ్‌పరివార్ రావడమే.

లక్ష్మణానంద మృతదేహాన్ని అతని కార్యకలాపాలకు కేంద్రమైన చకాపదకు రోడ్డు మార్గాన తీసుకుపోతామని వారు పట్టుబట్టారు. అతని మృతదేహంతో విస్తృత ప్రదర్శన నిర్వహించాలనీ, దానివల్ల రెచ్చిపోయే ఆవేశాలను వాడుకోవాలనీ వారు కృతనిశ్చయులయ్యారు. తర్వాతి ఘటనలే దీనికి సాక్ష్యం. చకాపదకు సూటిగా వెళ్లేబాట వెంబడి పోకుండ బాలిగుడ సబ్‌డివిజన్ నలుమూలలా ప్రదర్శన నిర్వహిస్తూ వెళ్లారు. ఆ సబ్‌డివిజన్‌లోని 11






బ్లాకులలో 8 బ్లాకులను చుట్టారు. జాలస్‌పేట నుండి తుమిడిబందకు పోయి అక్కడినుండి తిరిగి జాలస్‌పేట మీదుగా కుర్తంగడ్ దాటి బాలిగుడకు పోయి అక్కడినుండి కె.నువాగాం బ్లాక్ మొత్తం దాటి రైకియాకు పోయారు. రైకియా నుండి కొటింగియా మీదుగా జి.ఉదయగిరి చేరుకున్నారు. అక్కడినుండి నేరుగా చకాపదకు పోయి ఉండవచ్చునుగానీ దాని బదులు టికాబలి బ్లాక్‌లో ప్రవేశించి, అక్కడినుండి ఫిరింగియా, ఫూల్‌బని బ్లాక్‌లకు పోయి తిరిగి టికాబలికి వచ్చి అక్కడినుండి చకాపద చేరుకున్నారు. మొత్తం 250 కిలోమీటర్లు తిరిగారు. నేరుగా పోయి ఉంటే అందులో సగం దూరం కూడ అయిఉండేది కాదు.

సెప్టెంబర్ 13వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో జాతీయ మైనారిటీస్ కమిషన్ – మృతదేహాన్ని యాత్రగా తీసుకుపోనిస్తే ఆవేశాలు పెరిగే అవకాశం ఉందని అధికార యంత్రాంగం గ్రహించకపోవడం పొరపాటనీ, ఏ కారణంగానయినా అంత్యక్రియలు జాలస్‌పేటలో జరపడానికి అతని అనుచరులు ఒప్పుకోని పక్షంలో హెలికాప్టర్‌తో మృతదేహాన్ని చకాపద తీసుకుపోవలసి ఉండిందనీ అనింది. పైగా తీసుకుపోయిన మార్గం, అంగీకరించిన మార్గం ఒకటి కాదు. కె.నువాగాం చేరుకోగానే అక్కడున్న లక్ష్మణానంద అనుయాయులు మృతదేహాన్ని చూసే అవకాశం అందరికీ కల్పించడం కోసం మరింత ఎక్కువ తిరగాలని ఒత్తిడి పెట్టారు. లక్ష్మణానంద కార్యకలాపాల చరిత్ర ఎరిగిన అధికార యంత్రాంగం, అతని మృతదేహ ప్రదర్శన ఇంతగా జరిగితే సంభవించగల పరిణామాలను గ్రహించి ఉండవలసింది. అయితే మేము గమనించింది ఏమిటంటే ఒరిస్సాలోని పాలనా యంత్రాంగం దొమ్మీని అదుపు చేయాలంటే దొమ్మీ చేసే వారితో సున్నితంగా వ్యవహరించాలన్నది ప్రాథమిక సూత్రంగా భావించి నడుచుకుంది. ఉదాహరణకు జి.ఉదయగిరిలోని శరణార్థుల శిబిరం వర్షంనీరు మడుగయి నిలిచిన బహిరంగ ప్రదేశంలో ఉన్న సంగతి గమనించిన మా బృందం ఒరిస్సా రాష్ట్ర (దక్షిణ ప్రాంత) రిలీఫ్ కమిషనర్‌తో 2008 సెప్టెంబర్ 22 నాడు ఫోన్‌లో మాట్లాడి శిబిరాన్ని ఏదయినా పక్కా బిల్డింగ్‌లో నెలకొల్పడం సాధ్యం కాదా అని ప్రశ్నించగా శరణార్థులకు పక్కా ప్రభుత్వ భవనాలలో వసతి కల్పించడానికి 'ఇతర వర్గాలు' ఒప్పుకోవడం లేదు కాబట్టి సాధ్యపడదని జవాబు చెప్పాడు. వారిని శరణార్థులుగా మార్చింది ఆ 'ఇతర వర్గాలే' అయినప్పుడు వారి అభిప్రాయాన్ని లెక్కచేయాలని భావించడం వింత వైఖరే.

లక్ష్మణానంద మృతదేహాన్ని 24వ తేదీన ఈ విధంగా తీసుకుపోయిన ప్రదర్శకులు మార్గమధ్యంలో రైకియా, జి.ఉదయగిరి,






కంధమల్ జిల్లాలో ఇలా ధ్వంసమైన ఇళ్లు 5వేల పైనే

టికాబలి, పపూరియాలలో క్రైస్తవుల షాపులు తగలబెట్టారు. అయితే అసలు హింస తరువాతి రోజు జరగనుంది. దానికి ప్రేరణ అంత్యక్రియలప్పుడు చేసిన ఉపన్యాసాలు. చకాపదలో జరిగిన అంత్యక్రియలకు ప్రవీణ్ తొగాడియాతో సహా చాలామంది సంఘ్‌పరివార్ నాయకులు హాజరయ్యారు. ప్రవీణ్ తొగాడియా తన మామూలు శైలిలో క్రైస్తవులపైన హింస రెచ్చగొడుతూ ఉపన్యసించాడు. అతను భారతీయ రాజకీయాల ప్రధాన లైసెన్స్‌డ్ నేరగాడు. బహిరంగ సభలలో అతనంతగా హింసను వేరెవరయినా రెచ్చగొట్టే పని పెట్టుకున్నట్టయితే వారు తమ జీవితంలో అధికభాగం జైలులో గడుపుతూ ఉందురు. తొగాడియాకు ఆ గతి పట్టకపోవడం భారతపాలనా రంగంలో అప్రకటితంగా వచ్చి చేరిన పక్షపాతానికి తార్కాణం.


అంత్యక్రియల నుండి 25 ఆగస్ట్‌నాడు తిరిగివచ్చిన ప్రదర్శకులు భారీగా విధ్వంసానికీ, దహన కాండకూ, హత్యలు, లైంగిక అత్యాచారాలకూ పాల్పడ్డారు. దీనిని చావు తప్పించుకున్న బాధితుల మాటలలోనే చెప్పుకుంటే బాగుంటుంది. కొందరు బాధితులు మాకు చెప్పిన కథనాలు దిగువ ఇస్తున్నాం. అయితే వారు అనుభవించిన హింస గురించి వారిచేత చెప్పించడం మాకు గగనమైందని చెప్పాలి. బీభత్సకాండకు అది కలిగించే భయం కంటే వేరే సాక్ష్యం అక్కరలేదు. బాలిగుడ సబ్‌డివిజన్‌లోని అడవులలోనూ గ్రామాలలోనూ






భయం పుష్కలంగా ఉండడం మేము చూశాము. సెప్టెంబర్ 20 సాయంత్రం దరింగబాడి బజారులో పాలక బిజు జనతాదళ్‌కు చెందిన మాజీ ఎంఎల్ఏ, పాణో క్రైస్తవుడు అయిన సలూజా ప్రధాన్ మాకు తారసపడ్డాడు. అప్పటికి చీకటి పడుతూ ఉంది. బజారు నిండా జనం ఉన్నారు. మమ్మల్ని మేము పరిచయం చేసుకోగా అర్థంకానట్టు చిరునవ్వు నవ్వాడు. ప్రశ్నలకు సైగలతో సమాధానం చెప్పాడు. ఆ తరువాత తనవెంట రమ్మన్నట్టు సైగచేసి మోటార్ సైకిల్ ఎక్కి ఊరి బయటకు పరుగుతీసాడు. అతనిని సరిగ్గా అర్థం చేసుకున్నామో లేదో అన్న సంశయంతోనే మేము మా వాహనంలో అతనిని వెంబడించాము. ఊరు దాటిన తరువాత అతని బండి ఎడమపక్కకు తిరిగి ఒక పర్యాటక ప్రదేశంవైపు వెళ్లింది. అక్కడి నుండి పర్యాటకులు చుట్టుపక్కల ఉన్న కొండలూ లోయలూ చూసి ఆనందిస్తారంట. కాని ప్రధాన్ అక్కడికి దారితీసింది అందుకోసం కాదు. ఇక మా విషయమంటారా, సుందర దృశ్యాలు తిలకించే మానసిక స్థితిలో మేము లేము, ఉన్నా దానికి కావలసిన వెలుతురూ లేదు. ఆ స్థలం దరింగబాడి గ్రామానికే కాక దరింగబాడి నుండి బాలిగుడకు వెళ్లే రహదారికి కూడ కనిపించనంత లోపలికి ఉంది. అందుకే ప్రధాన్ అక్కడ ఆగాడు. అతని వెంటే బండ్లమీద వచ్చిన అతని అనుచరులు కూడ ఆగారు. అప్పుడుగానీ అతను మాట్లాడలేదు. అతను మాకు చెప్పిన విషయాల కంటే ఆ విషయాలు చెప్పడానికి అతను–పాలక పార్టీకి చెందిన మాజీ ఎంఎల్ఏ–తీసుకున్న జాగ్రత్తలు మాకు ఎక్కువ అవగాహన కల్గించాయి.

ఆ రాత్రి, మరుసటిరోజు పొద్దున్న మేము బాలిగుడలో కొందరితో మాట్లాడి ఆ తర్వాత అత్యధికంగా దాడులకు గురయిన రైకియా బ్లాక్ వైపు వెళ్లాము. రైకియాకు చెందిన కొందరు పాణో క్రైస్తవుల ఫోన్ నెంబర్లు మాకెవరో ఇచ్చారు. వారికి ఫోన్ చేయగా రైకియాలో తాము మాట్లాడలేమనీ, ఆ ఊరిలోకి ప్రవేశించకముందే ఫలాన చోట ఆగమనీ చెప్పారు. అక్కడికి వారు మోటార్‌సైకిళ్లపైన వచ్చారుగానీ రోడ్డు పక్కన మాట్లాడడానికి ఇష్టపడలేదు. ఒక కచ్చారోడ్డులోకి తమ బండ్లను పోనిచ్చి మమ్మల్ని వెంటరమ్మన్నారు. ఆ కచ్చారోడ్డు భజరంగ్‌దళ్‌వాళ్ళు సాధారణంగా పోని గ్రామానికి దారితీస్తుందని మాకు వివరించారు. అందులో కొంత దూరం పోయి అక్కడ ఆగి రోడ్డు మీద కూర్చుని మాట్లాడసాగారు. అయినప్పటికీ కొద్దిసేపటికి వారిని భయం ఆవరించింది. తాము రైకియా నుండి బయటికొచ్చి చాలాసేపు అయిందనీ, ఇంకా ఎక్కువసేపు ఉంటే అనుమానిస్తారనీ చెప్పి వెళ్లిపోయారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని గురించి కొంత మేరకయినా వివరంగా మాట్లాడగలిగింది శిబిరాలలోనే.



కంధమాల్ జిల్లాలోని శిబిరాలలో కాదు, భువనేశ్వర్‌లోనూ, కటక్‌లోనూ ఉన్న శిబిరాలలో; విశాఖపట్నం వంటి పట్టణాలలో తలదాచుకున్న స్థలాలలో.




నేల కూలిన శిలువ

## కొన్ని ఉదంతాలు

రవీంద్రనాథ్ ప్రధాన్ మాజీ సైనిక ఉద్యోగి. పాణో క్రైస్తవుడు. అతనిది చకాపద సమీపంలోని గటర్‌గాం గ్రామం. 24 ఆగస్టునాడు, లక్ష్మణానంద మృతదేహం చకాపద చేరుకోకముందే 350 మంది 'జైభజరంగ్‌బలి', 'జైమాతా', 'భారత్‌మాతాకీ జై' అన్న నినాదాలు ఇచ్చుకుంటూ కత్తులు చేతబట్టుకొని అతని గ్రామం మీదికొచ్చారు. గ్రామంలోని చర్చిని ధ్వంసం చేసారు. కాగడాలు వెలిగించి క్రైస్తవుల ఇళ్లు తగలబెట్టసాగారు. క్రైస్తవులంతా పారిపోయారుగానీ రవీంద్రనాథ్ తమ్ముడు రసానంద ప్రధాన్ (35) పక్షవాతం కారణంగా పారిపోలేక ఇంట్లో ఉండిపోయాడు. 'నన్ను ఇంటినుండి బయటకు లాగిపడేసి ఏమయినా చేసుకోండి' అని అతను కేకలు వేసినా దుండగులు ఖాతరు చేయలేదు. దూరంనుండి చూస్తున్న రవీంద్రనాథ్‌తో వాళ్లు హేళనగా నీ తమ్ముడ్ని చంపుతున్నాం చూడు అంటూ, రసానంద ఇంట్లో ఉండగానే వారి ఇంటికి నిప్పుపెట్టారు. అతను సజీవంగా దహనమై చనిపోయాడు. మొత్తం 37 ఇళ్లు ఆ రోజు ఆహుతి అయ్యాయి. పారిపోయిన క్రైస్తవులు ఆ రాత్రీ, మరొక రెండు పగళ్లూ రాత్రులూ తిండి లేకుండ అడవిలో దాక్కొని చివరికి కాలినడకన కంధమాల్ జిల్లాను దాటి భువనేశ్వర్ చేరుకున్నారు. అక్కడ వైఎంసిఎ లోని శిబిరంలో వారికి చోటు దొరికింది. అక్టోబర్ 8వ తేదీన రవీంద్రనాథ్ గ్రామానికి తిరిగి వెళ్లగా, కాలిపోయిన తన యింటి గోడలమీద 'క్రైస్తవ రాజ్యం సాగనివ్వం. హిందుస్తాన్‌లో హిందువులు మాత్రమే ఉంటారు. క్రైస్తవరాజ్యం నెలకొల్పాలని చూస్తే అగ్గి పుడుతుంది' అని రాసి ఉండడం చూసాడు. ధ్వంసమైన గ్రామ చర్చి గోడలమీద జైశ్రీరాం, జైభజరంగ్‌బలి అని రాసి ఉంది. అతని తమ్ముడి ఎముకలు రెండు లభ్యంకాగా వాటిని ఖననం చేసాడు.








చంపి పడేసిన మృతదేహాలు

క్రైస్తవ పాస్టర్‌ను పెళ్లిచేసుకున్న రైకియా నివాసి అయిన బ్రాహ్మణ స్త్రీ పుష్పాంజలి పాండా విషయం మీడియాలో బాగానే ప్రచారం అయింది. తనతో పాటు అధ్యాపకుడిగా ఉండిన దివ్య సుందర్ డిగాల్ అనే పాణో క్రైస్తవుడిని ఆమె పెళ్లిచేసుకుంది. తదుపరి డిగాల్ కె.నువాగాం బ్లాక్‌లోని ద్రెపంగా గ్రామంలో పాస్టర్ వృత్తిని స్వీకరించి, రైకియాకు నివాసం మార్చాడు. పుష్పాంజలి కూడా రైకియాలోనే టైలరింగ్ పని నేర్పే ఉద్యోగం సంపాదించుకుంది. వాళ్లకు మోనాలిసా అనే కుమార్తె ఉంది. డిగాల్ 23 ఆగస్ట్‌నాడు ఎప్పటిలాగే చర్చికి వెళ్లాడు. 24వ తేదీన లక్ష్మణానంద హత్య గురించి విని, ఆరోజు ఇంటికి రాననీ తనూ పాపా జాగ్రత్తగా ఉండాలనీ పుష్పాంజలికి కబురు పంపాడు. 24 రాత్రి రైకియాపైన దాడి చేసిన వారు పుష్పాంజలి ఇంటి తలుపులు పదేపదే కొట్టారు. ఆ యింటిని కిరోసిన్ పోసి తగలబెడతాం అని బెదిరించారు. పుష్పాంజలి వారిని ప్రాధేయపడి ఆ రాత్రి గట్టెక్కించింది. 25న డిగాల్ ఫోన్ చేసి మరుసటిరోజు వస్తానన్నాడు. రైకియాలో అప్పటికే జరిగిన హింసాకాండను చూసిన ఆమె ఇక అక్కడ ఉండవద్దని నిర్ణయించుకుని కుమార్తెను తీసుకుని ద్రెపంగాకు బయలుదేరి వెళ్లింది. ఇంకా ఊరిబయట ఉండగానే ఎదురుగా వస్తున్న హిందువులు 'పాస్టర్‌ను చంపేసారు' అని ఆమెకు చెప్పారు. కుమార్తెతోబాటు ఆమె వెనక్కి తిరిగొచ్చి రైకియాలోని శిబిరానికి వెళ్లింది. అయితే అక్కడ ఆర్‌ఎస్‌ఎస్‌కు





దాదాపు 50 వేల మంది ఇళ్లు, ఊర్లూ వదిలిపెట్టి
ఇలా శరణార్థుల శిబిరాలకు తరలి వెళ్లారు.

చెందినవారు తిరిగి హైందవం తీసుకొమ్మని ఆమెపైన ఒత్తిడిపెట్టారు. ఆమె తండ్రి కూడ హైందవం తీసుకుంటేనే ఇంటికి రానిస్తానని అన్నాడు. ఈ ఒత్తిడులు తప్పించుకోవడానికి ఆమె ఒక రాత్రి శిబిరం నుండి పాపతోసహా జారుకొని 20 లేక 25 కిలోమీటర్లు నడిచి ఏదో ఒక బండి పట్టుకొని భువనేశ్వర్ చేరుకుంది. అక్కడ వైఎంసిఎ క్యాంపులో ఉంటున్నది.

చాలా క్రూరంగా చంపబడ్డ అక్బర్ డిగాల్ అనే పాస్టర్ గురించి అతని సోదరుడు బుల్గన్ డిగాల్ చెప్పిన కథ ఇది. బుల్గన్ డిగాల్ కూడ మాజీ సైనికుడు. పాణో క్రైస్తవుడు. జి.ఉదయగిరి బ్లాక్‌లోని సులేసారుగ్రామ నివాసి. ఆగస్టు 25 నాడు లక్ష్మణానంద సరస్వతి అంత్యక్రియల కోసం కొన్ని వాహనాలు ఆ గ్రామం మీదుగా పోవడం క్రైస్తవులు చూసారు. వాహనాలలో ఉన్నవారు విద్వేష పూరితమైన నినాదాలు ఇవ్వడం విన్నారు. ఏమవుతుందో అని భయపడిన ఆ ఊరిలోని 22 క్రైస్తవ కుటుంబాలవారు ఒక టెంటు తీసుకొని పక్కనే ఉన్న గుట్టపైకి పోయారు. రాత్రి వాహనాలు వెనక్కి వెళ్లడం చూశారు కాని రెండు ఇంకా రాలేదని గమనించి గుట్ట సగభాగం దాకా కిందికి దిగి ఆ రెండు కూడ వచ్చేదాకా ఆగారు. ఆ జాగ్రత్త వాళ్ల ప్రాణాలు కాపాడింది. రాత్రి 9.30కు ఆ రెండు వాహనాలు (అవి ట్రాక్టర్లు) వెనక్కి వెళుతూ ఊరిలో






రవీంద్రనాథ్ ప్రధాన్

ఆగాయి. అందులో ఉన్నవారు క్రైస్తవుల ఇళ్ల దగ్గర దిగి అన్ని ఇళ్లనూ తగలబెట్టారు. దాంతో క్రైస్తవులు మళ్లీ గుట్ట ఎక్కి రాత్రంతా నడిచి నడిచి జి.ఉదయగిరిలోని శిబిరం చేరుకున్నారు. బుల్గన్ డిగాల్ ఆ రకంగా తన ప్రాణం కాపాడుకున్నాడుగానీ టొటోమహా గ్రామనివాసి అయిన అతని సోదరుడు అక్బర్ డిగాల్ (47)కు ఆ అదృష్టం లేకపోయింది. ఆ గ్రామంపైన దాడి ఆగస్టు 28న జరిగింది. దాడి మొదలు కాగానే అతను తన కుటుంబాన్ని పంపించేశాడు. కొంతసేపటికి అతను కూడ చెట్టు చేమలను చాటుచేసుకుని ఊరు విడిచిపెట్టి పోయే ప్రయత్నం చేసాడు గానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. దుండగులు అతనిని చుట్టుముట్టి పట్టుకున్నారు. మొదట అతని కాళ్లు నరికారు. తరువాత గొంతుకోసి చంపారు. (ఈ కేసులో ఐదుగురికి ఫూల్‌బని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ 2009 సెప్టెంబర్ 22వ తేదీన జీవిత ఖైదు విధించింది.)

ప్రమోద్‌కుమార్ ప్రధాన్ కంధా క్రైస్తవుడు. జి.ఉదయగిరి బ్లాక్‌లోని బాఖికంబ నివాసి. రాష్ట్ర ప్రభుత్వ సాయిల్ కన్సర్వేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆ ఊరిలో కంధా క్రైస్తవులు చాలామందే ఉన్నారు. కంధాలు కావడం వల్ల కాబోలు వారిపైన వెంటనే దాడి జరగలేదు. అయితే క్రైస్తవం విడిచిపెట్టమని వారిపైన ఒత్తిడి పెట్టారు. ఒకతను ఒత్తిడికి లొంగి మతం మార్చుకొని మరొక నలుగురిచేత కూడ మార్పించాడు. ఈ అయిదుగురూ కొంత ఆస్తిపరులనీ, ఊరు విడిచిపెట్టి వెళ్లిపోవడానికి సిద్ధంగా లేరనీ ప్రమోద్‌కుమార్ ప్రధాన్ అంటాడు. వీరి మత మార్పిడి సెప్టెంబర్ 16, 17 తేదీలలో జరిగింది. అప్పటినుండి మతం మార్చుకోవడానికి ఇష్టపడని వారి బతుకులు ప్రమాదంలో పడ్డాయి. 23 రాత్రి వారిపైన దాడి జరిగింది. పారామిలటరీ బలగాలు అప్పటికి ఆ ప్రాంతంలో పహారా కాస్తున్నాయిగానీ దుండగులు వారిని తప్పుబాట పట్టించి రాత్రి 10 గంటలప్పుడు క్రైస్తవుల ఇళ్లపైన దాడిచేసారు. ఆరు ఇళ్లు తగలబెట్టారు. క్రైస్తవులు పారిపోతుంటే వారు వెంటబడ్డారు. వీళ్లు ఊరిపక్కన ప్రవహిస్తున్న వాగులో నిలబడ్డారు. వాళ్లు వాగు దగ్గరకొచ్చి కూడా టార్చిలైటు వేసి



వెతికారు. కిందికి వంగి నీళ్లలో మునిగి ఊపిరి బిగబట్టి తమ ఆచూకీ తెలియకుండ జాగ్రత్తపడ్డారు. తరువాత జి. ఉదయగిరికి పోయి మంటలు ఆర్పడానికి అగ్నిమాపకదళ సిబ్బందిని గ్రామానికి రమ్మని అడిగారు. పోలీసులు అడిగితే తప్ప రామని వారు అన్నారంట. తెల్లారాక వాళ్లు గ్రామానికి తిరిగి వచ్చారు. తమపైన దాడిచేసింది తోటి ఆదివాసులే కాబట్టి వారిని నిలదీసారు.




పుష్పాంజలి పాండా

అయితే వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండ, దాడి చేసింది బయటివారనీ తాము కాదనీ దబాయించారు. తమకు గ్రామంలో భద్రత లేదని అర్థం చేసుకున్న క్రైస్తవులు ఊరు విడిచిపెట్టి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. క్రైస్తవేతరులు వారిని చుట్టుముట్టి వెళ్లిపోకుండ నిరోధించాలని ప్రయత్నించారు గానీ వారు తప్పించుకుని జి. ఉదయగిరి శిబిరం చేరుకున్నారు. అయితే ఆ శిబిరంలోకి ఆర్. ఎస్. ఎస్‌వాళ్లు యధేచ్ఛగా వచ్చి పోతుండడం గమనించి భువనేశ్వర్ సమీపంలోని జాన్లా శిబిరానికి వెళ్లిపోయారు.

సైమన్ నాయక్ కె. నువాగాం బ్లాక్‌లోని పిరిగడ నివాసి. పాణో క్రైస్తవుడు. 24 ఆగస్ట్‌నాడు భజరంగ్‌దళ్ వాళ్లు వస్తున్నారని విని ఆ ఊరిలోని 15 క్రైస్తవ కుటుంబాలవారూ అడవిలోకి పారిపోయారు. అడవిలోనే మూడు రోజులు తిండి లేకుండ ఉన్నారు. 27వ తేదీన ఆ గ్రామానికి చెందిన క్రైస్తవేతర పాణోలు వచ్చి వారిని తిరిగి గ్రామానికి రమ్మన్నారు. వెళ్లారు. 28వ తేదీన ధరంపూర్‌లో ఒక మీటింగ్‌కు వారిని రమ్మని పిలిచారు. దాని భావం వారికి అర్థం అయింది. ధరంపూర్ ఆర్. ఎస్. ఎస్‌నాయకుల కేంద్రం. వారంతా గిరిజనేతరులు. అక్కడ వారిని మతం మార్చుకొమ్మని ఒత్తిడి చేసారు. సంఘ్‌పరివార్ దానిని 'పునరాగమనం' అంటుందని పైన చెప్పాము. ఒక కాగితం తీసుకొచ్చి దానిపైన సంతకం చేయమన్నారు. దానిపైన తాము విదేశీ మతాన్ని విడిచిపెట్టి హిందూ సమాజంలోకి తిరిగివస్తున్నట్టు రాసి ఉంది. అందరూ దానిపైన సంతకం చేసారు. ఆ తరువాత వారందరికీ గుండుగీసి, నుదుటిమీద తిలకం దిద్ది ఆవుపేడ కలిపిన నీళ్లు (గోబర్‌పానీ) వారిచేత తాగించి, నెయ్యి కలిపిన అన్నం తినిపించారు. అయితే అక్కడినుండి వాళ్లెవరూ తిరిగి గ్రామానికి








బుల్గన్ డిగాల్

వెళ్లలేదు. నేరుగా కె.నువాగాంలోని శిబిరానికి వెళ్లారు. వాళ్ల 'పునరాగమనం' స్వచ్ఛందం కావడానికి ఇంతకంటే రుజువు అక్కరలేదు. అయితే అక్కడ కూడ భద్రంగా అనిపించక కటక్ పట్టణంలో ఎల్‌టిఎఫ్ సెంటర్ వాళ్లు నెలకొల్పిన శిబిరానికి వెళ్లిపోయారు.

జి.ఉదయగిరి బ్లాక్‌లోని కొటింగియా గ్రామపంచాయితిలో సిపాయెజు అనే ఊరు ఉంది. రహదారి నుండి బాగా లోపలికి ఉన్న ఈ ఊరులోని 119 కుటుంబాలలో 50 క్రైస్తవులవి. లోపలికి ఉన్నాము కాబట్టి ఏమీ కాకపోవచ్చునని వారు భావించినట్టున్నారు. అయితే ఆగస్ట్ 26వ తేదీన 150 మంది గుంపు ఒకటి క్రైస్తవబస్తీ మీదికి దాడికి వచ్చింది. క్రైస్తవులంతా అడవిలోకి పారిపోయారు. దాడిచేసిన వారు వాళ్ల ఇళ్లన్నీ తగలబెట్టి వాళ్ల వెంటపడ్డారు. పొదలచాటున దాక్కున్న పాస్టర్ సుఖదేవ్ డిగాల్‌ను చూసి బయటకు లాగారు. కర్రలతో విపరీతంగా కొట్టారు. వాళ్లు పని ముగించుకొని వెళ్లిపోవాలన్న తొందరలో ఉండడం అతని ప్రాణాన్ని కాపాడింది. క్రైస్తవులంతా నాలుగురోజులు తిండి, నీళ్లు లేకుండ అడవిలోనే ఉండిపోయారు. తర్వాత నెమ్మదిగా బయటికొచ్చి రహదారిపైన ఉన్న బాంజ్‌నగర్ చేరుకున్నారు. జి.ఉదయగిరిలో శిబిరం ఆ బ్లాక్‌లోని వారికోసం నెలకొల్పినదే కానీ 'దారిలో హిందూ గ్రామాలు చాలా ఉండడం వల్ల' అక్కడికి పోలేదని పాస్టర్ డిగాల్ అంటాడు. భువనేశ్వర్‌కు పోయి వైఎంసిఎలోని శిబిరంలో చేరారు.

కె.నువాగాం బ్లాక్‌లోని పిరిగుడకు చెందిన ప్రభాసేని నాయక్ సాహసి. 24 ఆగస్ట్‌నాడు గ్రామంలో పెద్దపెట్టున నినాదాలు వినపడడంతో 'ఊరు వదిలిపెట్టి పోవలసి వస్తుందేమోనని క్రైస్తవులు అన్నం కూడ వండుకోలేదు' అంటుంది ఆమె. తక్కిన వాళ్లంతా అడవులోకి పారిపోయారుగానీ ఆమె భర్త ఆంథోనికి తీవ్ర అనారోగ్యం ఉన్న కారణంగా ఆయనకు తోడుగా ఆమె ఒక్కతే ఉండిపోయింది. 15వ తేదీన దాడి జరిగింది. ఆంథోనిని ఇనుపరాడ్లతో బాగా కొట్టారు. క్రైస్తవేతర పాణోలు ఆమెను కూడ వెళ్లిపొమ్మని చెప్పారు. అయినా ఆమె పారిపోకుండా భర్తనూ తొమ్మిదేళ్ల కొడుకునూ తీసుకుపోయి బాలిగుడలోని ఆస్పత్రిలో చేర్పించింది. 17 సెప్టెంబర్‌నాడు ఇంటి సామాన్లేమయినా ఉంటే



తెచ్చుకుందామని గ్రామానికి తిరిగిపోయింది కాని అప్పటికే క్రైస్తవుల ఇళ్లన్నీ కాలిపోయి ఉన్నాయి. సగం కాలిన బైబిల్ ప్రతి ఒకటి దొరకగా అది తీసుకుని వెనక్కి వచ్చేసింది.



సైమన్ నాయక్

కంధమాల్ ఘోరానికి ప్రతీకగా నిలిచిన ఉదంతం సిస్టర్ మీనా లలితపైన జరిగిన మూకుమ్మడి లైంగిక హింస. ఆమె అక్టోబర్ 24న ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు బయటపెట్టేదాకా ఆ నోటా ఈ నోటా ఒక వదంతిగా వినడమే తప్ప వివరాలు ఇరుగు పొరుగు ఊర్లవాళ్లకు సహితం తెలియలేదు. ఆగస్ట్ 25న కె.నువాగాంలో ఒక క్రైస్తవ సన్యాసిని పైన అత్యాచారం జరిగిందని మాత్రమే – అనేక దుర్మార్గాలలో ఒక దుర్మార్గంగా – బయటినుండి వెళ్లిన నిజనిర్ధారణ కమిటీలకు స్థానికులు చెప్పారు.


సిస్టర్ మీనా కె.నువాగాంలోని దివ్యజ్యోతి పాస్టరల్ సెంటర్‌లో ఉండేది. 24 ఆగస్ట్ సాయంత్రం ఒక పెద్దగుంపు ఆ సంస్థ గేట్ దగ్గర గుమికూడి ద్వేషపూరితమైన నినాదాలు ఇవ్వసాగారు. సంస్థలోని వారు వెనక తలుపునుండి అడవిలోకి పారిపోయారు. రాత్రయ్యాక బయటికొచ్చి ప్రహ్లాద్ అనే హిందువు ఇంట్లో తలదాచుకున్నారు. అప్పటికే దివ్యజ్యోతి సెంటర్ అగ్నికి ఆహుతి అయిపోయింది. 25వ తేదీ మధ్యాహ్నం ఒక గుంపు ఆ యింటికి వచ్చి సిస్టర్ మీనాను జుట్టు పట్టుకొని బయటకు గుంజుకుపోయారు. బయట గొడ్డళ్లు, కత్తులు, కర్రలు, కొడవళ్లు, ఇనుపరాడ్లు పట్టుకున్న 40–50 మంది ఉన్నారు. అప్పటికే ఫాదర్ థామస్ చెల్లన్ అనే మతగురువును కూడ పట్టుకున్నారు. ఇద్దరినీ తగలబడుతున్న జనవికాస్ కేంద్రం అనే సంస్థ భవనం దగ్గరికి తీసుకుపోయారు. తమను ఆ మంటలలో వేస్తారేమోనని వారు అనుకున్నారు. అయితే ఆ భవనం వరండాలోకి వారిని తీసుకుపోయాక సిస్టర్ మీనా బట్టలు చింపి కిందపడేసి రెండు చేతులమీద ఇద్దరు నిలబడ్డారు. ఫాదర్ థామస్ చెల్లన్ అభ్యంతరం తెలపగా ఆయనను కొట్టి అక్కడినుండి తీసుకుపోయారు. సిస్టర్ మీనాను మూడవ వ్యక్తి రేప్ చేసాడు. ఆ తరువాత మరొకడు ఆమెను మెట్ల దగ్గరికి తీసుకుపోయి కిందపడేసి రేప్ చేయబోయాడుగానీ అంతలో పెద్ద



గుంపు అక్కడికి వచ్చింది. గుంపులో ఒకరు వారించగా అతను ఆగాడు. సిస్టర్ మీనా మెట్లకింద దాక్కునే ప్రయత్నం చేసింది. ఆమెను బయటకు లాగమని జనంనుండి కేకలు వినిపించాయి. వందమంది ఆమెను రేప్ చేయాలని అరిచారు. తర్వాత ఆమెను రోడ్డు మీదికి గుంజుకొచ్చారు. అక్కడ ఫాదర్ థామస్ చెల్లన్‌ను మోకాళ్లమీద నిలబడిన జనం కర్రలతో కొడుతుండడం ఆమె చూసింది. ఇద్దరినీ తాడుతో కట్టి మంటలలో వేయాలని ఒకరు, నగ్నంగా ఊరేగించాలని ఒకరు తలా ఒక విధంగా కేకలు వేసారు. చివరికి ఇద్దరినీ కె.నువాగాం మార్కెట్‌దాకా నడిపించారు. సిస్టర్ మీనా దాదాపు ఒంటిమీద బట్టలు లేకుండా ఉంది. మార్కెట్‌లో ఆమె స్పెషల్ పోలీసు బృందాన్ని చూసి వారి దగ్గరకు వెళ్లి వాళ్లమధ్య కూర్చుంది. ఆ పోలీసులు కనీసం ఆమె వైపు చూడను కూడ లేదు. జనం మళ్లీ ఆమెను గుంజుకుపోయారు. పోలీసులు ఆమెను కాపాడడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. చివరికి జనమే ఆమెనూ, ఫాదర్ థామస్ చెల్లన్‌నూ కె.నువాగాం పోలీస్ అవుట్‌పోస్ట్‌లో అప్పగించారు. అక్కడ ఆమె ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ 'ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుకుంటున్నావా?' అని అడిగాడు. 'దాని పర్యవసానాలు ఎట్లా ఉంటాయో తెలుసా?' అన్నాడు. ఆమె తన ఫిర్యాదు వివరంగా రాయబోతే 'అంతెందుకు రాస్తున్నావు, అట్లాగా రాసేది' అంటూ మూడుసార్లు దానిని కుదించి రాయించాడు.

## పథకం ప్రకారం జరిగిన దాడులు

ఒక్కొక్క ఘటన గురించి విడివిడిగా చెప్పుకుంటూ ఉంటే వాటివెనక ఉన్న పథకం కనిపించకపోవచ్చు. కానీ ఈ మొత్తం హింసాకాండ పథకం ప్రకారమే జరిగిందనడానికి దాఖలాలున్నాయి. లక్ష్మణానందను మావోయిస్టులు చంపుతారని సంఘ్‌పరివార్ ఊహించి ఉండకపోవచ్చునుగానీ, ఏ అవకాశం లభించినా క్రైస్తవులపైన దాడి చేయడానికి కావలసిన సంసిద్ధత వారి చర్యలలో స్పష్టంగా కనిపిస్తుంది. రైకియా, కె.నువాగాం బ్లాక్‌లను ఉదాహరణలుగా తీసుకోవచ్చు. అత్యధికంగా దాడులు ఈ రెండు బ్లాక్‌లలో జరిగాయి. రైకియాలోనయితే ఆగస్ట్ 24 నుండి 28 దాకా నిర్విరామంగా దాడులు జరిగాయి. 25వ తేదీ నుండి ఆ ప్రాంతమంతా 144 సెక్షన్ అమలులో ఉన్నా దాడులకు అది ఆటంకం కాలేదు. పెద్దపెద్ద చెట్లు కొట్టి రహదార్లకు అడ్డం వేసారు. సెప్టెంబర్ 9 నాటికి 500 చెట్లను ఆ విధంగా కొట్టి పడేసారని అధికారులు లెక్కించారు. రాకపోకలను ఈ విధంగా అటకాయించిన గుంపులు ఆ





ఘర్‌వాపసి పేరిట జరిగే ప్రక్షాళన


తర్వాత ఒక ఊరినుండి ఇంకొక ఊరికి పోతూ దహనాలకూ, హత్యాకాండకూ పాల్పడ్డారు. రైకియా బ్లాక్‌లో ఒకే గుంపు మొదట కటింగియా గ్రామానికి, అక్కడినుండి గుడ్రికియాకు, అక్కడినుండి కిటింగియాకు, అక్కడినుండి మొండేకియాకు వెళ్లి బీభత్సకాండకు పాల్పడింది. కె.నువాగాం బ్లాక్‌లోనయితే ప్రధాన గ్రామమే పెద్దెత్తున హింసాకాండను చవిచూసింది. సిస్టర్ మీనాపైన అత్యాచారం జరిగింది ఇక్కడే. ఒక కాథలిక్ చర్చినీ, ఒక పెంతెకోస్త్ చర్చినీ, జనవికాస్, దివ్యజ్యోతి అనే సంఘసేవా సంస్థల కట్టడాలను కూడా తగలబెట్టారు. ఇక్కడ కె.నువాగాంను ఆనుకొని ఉన్న జుగాపదర్ అనే క్రైస్తవ బస్తీని పూర్తిగా కాలబెట్టారు. బయటినుండి వచ్చిన గుంపు వెళ్లిపోయిన తరువాత ఆ ఊరికే చెందిన 200-300 మంది గుంపు కత్తులు, పెట్రోల్, డీజిల్ పట్టుకొని 11 పంచాయితీలలో అన్ని చర్చిలను, క్రైస్తవులందరి ఇళ్లను దహనం చేసింది. ఈ దాడిలో కంధాలతోబాటు 'ఒరియాలు' (అంటే సవర్ణ హిందువులు) కూడ పాల్గొన్నారని జుగాపదర్ బస్తీకి చెందిన పాస్టర్ సూరత్ నాయక్ కరాఖండిగా చెప్పారు.



ప్రభాసేని నాయక్

హత్యలు ఆగిన తరువాత కూడ ఇళ్లనూ చర్చిలనూ తగలబెట్టడం కొనసాగింది. ఉదాహరణకు సెప్టెంబర్ 18 నాడు బాలిగుడను జి.ఉదయగిరికి కలిపే రహదారిపైన ఉన్న అనేక గ్రామాలలో








సిస్టర్ మీనా లలిత

దహనకాండ జరిగింది. వాటిలో ఒక గ్రామమయిన లకెబాడిలో క్రైస్తవ పాణోలతో మేము మాట్లాడగలిగాము. అక్కడ క్రైస్తవుల ఇళ్లు 40 దాకా ఉన్నాయి. అవి ఊరికి కొంత దూరంగా విడిగా ఉన్నాయి. ఆ ఊరినీ చర్చిని ఆగస్ట్ 25న తగలబెట్టారు. సెప్టెంబర్ 18నాడు చీకటి పడుతుండగా తుపాకులు పట్టుకున్న గుంపు ఒకటి 'భారత్‌మాతాకీ జై' అనీ, 'జైశ్రీరాం' అనీ నినాదాలు ఇస్తూ లకెబాడిపైన దాడి చేసింది. వారిని చూసి భయపడిన పాణోలు అడవిలోకి పారిపోగా, దుండగులు ఒక్కొక్క ఇల్లు తీరికగా లూటీచేసి 40 ఇళ్లూ కాలబెట్టారు.

## పోలీసులు ఏం చేస్తున్నారు?

ఏం చేయడం లేదు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదు, దాడి గురించి సమాచారం ఇస్తే విచారించడానికి ఎవరినీ పంపలేదు. ఎవరి స్టేషన్‌లో వారు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు. క్రైస్తవులను సంఘ్‌పరివార్ గుంపులకు అప్పగించి చేతులు కట్టుకుని కూర్చున్నారు. రాపిడ్ ఫోర్స్‌ను దించిన తరువాతే క్రైస్తవులకు కొంత రక్షణ లభించింది, వారి ఫిర్యాదులకు కొంత స్పందన లభించింది. స్థానిక పోలీసుల ఆలోచనలు సంఘ్‌పరివార్ దృక్పథానికి అనుకూలంగా ఉండడం దీనికి కారణం కావచ్చు. మైనారిటీల పట్ల సగటు పోలీస్ సిబ్బంది సంఘ్‌పరివార్ వైఖరే ప్రదర్శించడం చాలామందికి ఎదురయిన అనుభవం. లేదా సంఘ్‌పరివార్ రాజకీయ ముఖం అయిన భారతీయ జనతాపార్టీ ఒరిస్సాలో అప్పట్లో అధికారం పంచుకుంటున్న కారణంగా భజరంగ్‌దళ్‌పైన ఎంత తీవ్రంగా చర్యలు చేపట్టవచ్చునో పోలీసులకు అర్థంకాక తటపటాయించారనుకోవాలి. 'తుపాకులు మా చేతిలో ఉన్నాయి గానీ తూటా నవీన్ పట్నాయక్ చేతిలో ఉంది. ఆయన ఊ అంటే రెండురోజులలో అల్లర్లను అదుపుచేస్తాం' అని పోలీస్ అధికారులు తమతో అన్నట్టు చాలామంది చెప్పారు. మూడవ కారణం భయం కావచ్చు. 'మీ ప్రాణాలు మీకెంతో మా ప్రాణాలు మాకు అంతే"నని పోలీసులు తమతో అన్నట్టు కూడ జనం చెప్పారు. వెరసి దాడులు జరుగుతున్నప్పుడు క్రైస్తవులకు పోలీసుల నుండి లభించిన సహాయం శూన్యం. తిరిగి తమ స్వంత గ్రామాలకు




పోయి ఉండడానికి పోలీసులు సహాయం చేస్తారన్న నమ్మకమూ వారికి లేదు. వాళ్లు తిరిగి వెళ్లాలంటే క్రైస్తవాన్ని విడిచిపెట్టాలన్న షరతు సంఘ్‌పరివార్ నిర్ద్వంద్వంగా పెడుతున్నది. అయినా శరణార్థులుగా మారిన క్రైస్తవులలో అత్యధికులు శాశ్వతంగా కాందిశీకులుగా ఉండడానికి సిద్ధపడ్డారే తప్ప ఈ షరతుకు తలవొగ్గలేదనేది చెప్పుకోదగ్గ విషయం. టికాబలి బ్లాక్‌లోని బడిముండా గ్రామానికి చెందిన గేబ్రియల్ నాయక్‌ను మేము భువనేశ్వర్ సమీపంలోని జాన్లా శిబిరంలో కలిసాము. వాళ్ల ఊరిలో ఆగస్ట్ 25న ఒక వ్యక్తి చనిపోగా, 26వ తేదీన అతని అంత్యక్రియలు జరుగుతుంటే క్రైస్తవులంతా అక్కడ ఉండగా ఊరిపైన భజరంగ్‌దళ్ దాడిచేసింది. 500 మంది భజరంగీలు దాడిచేసి కమ్యూనిటీహాలు, మూడు ఇళ్లు ధ్వంసం చేసారు. ఊరిలోని 80 క్రైస్తవ కుటుంబాలూ ఊరు విడిచిపెట్టి అడవిలోకి వెళ్లిపోయాయి. దుండగులు అక్కడినుండి దోమగుడకు పోయి అక్కడ కూడ చాలా ఇళ్లు తగలబెట్టారు. బడిముండాకు చెందిన క్రైస్తవులు కొంతకాలం తరువాత గ్రామానికి తిరిగి వెళ్లారు. వెళ్లిన రెండు రోజులకే వారికి బెదిరింపులు వచ్చాయి. తమకు చర్చి ఫాదర్లు, సిస్టర్లు డబ్బులివ్వగా తాము మతం మార్చుకున్నామనీ, ఇప్పుడు తిరిగి హైందవం స్వీకరిస్తున్నామని రాసివ్వాలనీ, లేకపోతే మళ్లీ దాడి తప్పదనీ వారిని బెదిరించారు. 80 కుటుంబాలకుగాను 33 కుటుంబాల పెద్దలు రాసిచ్చారు. తక్కినవారు దానికి ఇష్టపడక ఊరు విడిచిపెట్టి టికాబలిలోని శిబిరంలో చేరారు. అయితే టికాబలి శిబిరంపైన దాడి చేసి పాస్టర్లను చంపే పథకం ఉందని ఒక హిందూ స్నేహితుడు హెచ్చరించగా పాస్టర్ అయిన గేబ్రియల్ నాయక్ అక్కడినుండి జాన్లాకు పోయి అక్కడి శిబిరంలో చేరాడు. గ్రామాలలో శాంతి పునరుద్ధరణ గురించి అతనిని అడిగితే 'ఏ రోజయితే ఆ 33 కుటుంబాలు తాము క్రైస్తవులమని ప్రకటించుకుంటాయో ఆ రోజు శాంతి తిరిగి వచ్చిందని నమ్ముతాను' అంటాడు.

## శరణార్థులు 50 వేల పైనే


ఒరిస్సా ప్రభుత్వం అభిప్రాయం మాత్రం అది కాదు. శిబిరాలలోని నిర్వాసితుల సంఖ్యను తగ్గించి చూపించడంపైననే మొదటినుండి వారి దృష్టి. బాధితులను వీలయినంత త్వరగా వెనక్కి పంపించేయాలనే చూసారు. శిబిరాలు ఆగస్ట్ 26న మొదలైతే 30 నాటికి శిబిరాలలో 7500 మంది ఉన్నారు. సెప్టెంబర్ 1 నాటికి 12,500 మంది, మరుసటి రోజు సాయంత్రానికి 19,642 మంది, 3వ తేదీనాటికి 18 శిబిరాలలో కలిపి 23,746 మంది ఉన్నారు. దాడులు ఎంత ఘోరంగా జరిగాయనడానికి వేగంగా పెరిగిన ఈ శరణార్థుల సంఖ్య కంటే వేరే తార్కాణం అవసరం లేదు. పైగా ఇది కంధమాల్ జిల్లాలో





ఉన్న గుర్తింపు పొందిన శిబిరాలలోని సంఖ్య మాత్రమే. దూరం పారిపోయి తమంతట తాము నీడ వెతుక్కున్నవారి కచ్చితమైన లెక్క ఆనాడు, ఈనాడు కూడ లేదు. మొత్తం 50,000 మంది శరణార్థులయ్యారన్న క్రైస్తవ సంస్థల అంచనా వాస్తవికమనే అనిపిస్తుంది. కాగా సెప్టెంబర్ 3 తరువాత శిబిరాలలోని సంఖ్యను ఎట్లాగయినా తగ్గించాలన్నదే ఒరిస్సా ప్రభుత్వం వైఖరిగా ఉంది. క్రైస్తవులు గ్రామానికి తిరిగి రావాలంటే మతం విడిచిపెట్టాల్సిందేనని భజరంగ్‌దళ్ పెట్టిన షరతులలో సడలింపు ఏమీ లేకపోయినప్పటికీ శిబిరాలలోని శరణార్థుల సంఖ్య వేగంగా తగ్గసాగింది. సెప్టెంబర్ 20న మా బృందం కంధమాల్ వెళ్లేసరికి 13,000 కు దిగింది. 12,934 అని అక్టోబర్ 12న ఒరిస్సా ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెప్పింది. డిసెంబర్ వచ్చేసరికి 8,200 కు దిగింది. దీనివెనక ఉన్న రహస్యాన్ని ఆ రాష్ట్ర దక్షిణ ప్రాంత రిలీఫ్ కమిషనర్ మా బృందానికి వెల్లడించారు. ఇళ్లు కోల్పోయిన వాళ్లకు మాత్రమే అధికారిక శిబిరాలలో ఉండే హక్కు ఉందని, అందువల్ల ఇళ్లు భద్రంగా ఉన్నవాళ్లను వెనక్కి పంపించేస్తున్నామనీ ఆయన చెప్పాడు. ఇంకా స్పష్టంగా, 'కేవలం భయంవల్ల పారిపోయిన వాళ్లు వెనక్కి పోవాల్సిందే' అన్నాడు. దీని ఫలితం ఏమిటంటే శిబిరాల నుండి వెనక్కి పంపించబడ్డవారిలో అత్యధికులు తిరిగి గ్రామాలకు పోలేదు. ప్రభుత్వ శిబిరాల నుండి చర్చిలు, ఇతర క్రైస్తవ సంస్థలు నిర్వహించిన శిబిరాలకు వెళ్లారు. లేదా ఆంధ్రప్రదేశ్‌తో సహా ఇతర రాష్ట్రాలకు పారిపోయి అనువయిన చోట తలదాచుకొన్నారు. వీరి సంఖ్య ఎంత అన్నదానికి కచ్చితమైన లెక్క లేదు.

ఈ శరణార్థులు అనుభవించిన హింస గురించి తెలుసుకుంటే తప్ప కేవలం భయం వల్ల పారిపోయినవారు వెనక్కి పోవలసిందేనన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలోని అమానుషత్వం అర్థం కాదు. ఎవ్వరూ నేరుగా ఇంటినుండి శిబిరాలకు పోలేదు. ఊరిమీద భజరంగ్‌దళ్ దాడిచేయగా పారిపోయి అడవులలో మూడు నాలుగు రోజులు తిండీ నీళ్లూ లేకుండ దాక్కున్నారు. గ్రామానికి తిరిగి పోయే అవకాశం లేదని గ్రహించిన తరువాతే కాలినడకన రహదార్లు, గ్రామాలు తగలకుండ శిబిరాలకు నడిచి వెళ్లారు. చాలా సందర్భాలలో పగలు ఇక్కడా అక్కడా దాక్కొని రాత్రివేళ మాత్రం ప్రయాణం చేశారు. కంధమాల్‌లోని శిబిరాలలోకి సంఘ్‌పరివార్ కార్యకర్తలు యథేచ్ఛగా వచ్చి పోతుండడంవల్ల అక్కడ కూడ వారికి భద్రత అనిపించలేదు. ముఖ్యంగా పాస్టర్లు, సిస్టర్లు అక్కడినుండి రోజుల తరబడి నడిచి హైవే ఎక్కి భువనేశ్వర్ చేరుకున్నారు. ఏ దశలోనయినా భజరంగ్‌దళ్‌కు సరండరయి తిలకం పెట్టించుకొని 'జైశ్రీరాం' అని ఉంటే క్షేమంగానే ఊరికి తిరిగి పోగలిగి ఉందురు. ఆ రాజీ అతికొద్దిమంది మాత్రమే




ఎంచుకున్నారన్నది బలవంతపు మతమార్పిడి అన్న నింద ఎంత అబద్ధమో తెలుపుతుంది. ఆ స్థితిలో బాధిత కంధమాల్ క్రైస్తవులను ప్రధానంగా నడిపించింది వారి బలమైన ఆత్మాభిమానమే.

శ్రీకాకుళం జిల్లాలో రెండుచోట్ల భాష కూడ తెలియని ఊర్లలో శరణుపొందిన వారిని మా బృందం అక్టోబర్ 30న కలిసింది. మందస మండలం కుదంసింగిలో 112 మంది, మెళియాపుట్టి మండలం సవరకుల్లిగాంలో 140 మంది ఉన్నారు. వీళ్లంతా బాలిగుడ సబ్‌డివిజన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవ పాణోలు. ఆగస్ట్ 25న వాళ్ల గ్రామాలపైన దాడి జరిగినాక ఊర్లనుండి కట్టుబట్టలతో పారిపోయి వారంరోజులు నిర్జన ప్రదేశాలలో తలదాచుకుని ప్రభుత్వ శిబిరాలు చేరుకున్నారు. అయితే శిబిరాలు కూడా వారికి అభద్రంగా అనిపించాయి. ఎందుకంటే భజరంగ్‌దళ్, దుర్గావాహిని కార్యకర్తలు శిబిరాలలోకి వచ్చి వారిని బెదిరించారు. శిబిరాల నీటి సరఫరాలో విషం కలిపారన్న వదంతులూ వ్యాపించాయి. దాంతో శిబిరాలలో 10–15 రోజులు గడిపి అక్కడినుండి బరంపురం వెళ్లారు. బైబిల్ సెంటర్డ్ మినిస్ట్రీస్ అనే చర్చి సహాయం కోరారు. వారికి శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే అంతమంది తలదాచుకోగల నిర్మాణాలు ఉండడం వల్ల ఈ జనాన్ని అక్కడికి తరలించారు. కేవలం తినడానికింత తిండి తప్ప వేరే ఏ సదుపాయమూ కల్పించే స్థితిలో ఆ చర్చి నిర్వాహకులు లేకున్నప్పటికీ అక్కడే ఉన్నారు. ఆత్మగౌరవం కాపాడుకోవాలన్న వారి ఆరాటమే ఇన్ని కష్టాలు భరించేటట్టు చేస్తున్నదని గ్రహించలేని ప్రభుత్వం వారిని అర్థమూ చేసుకోలేదు, వారి ఆకాంక్షను ఆదరించనూలేదు.

వేదన కారణంగా బాధితులలో ఆగ్రహం వ్యక్తం కావడం సహజం. భువనేశ్వర్ సమీపంలోని జాన్లాలో ఉన్న మదర్ థెరెసా సెంటర్‌లో ఒక శిబిరం ఉందని తెలిసి మేమక్కడికి వెళ్లగా, దాని నిర్వాహకురాలయిన సిస్టర్ సుజిత్ చాలా కోపంగా మాట్లాడింది. శిబిరంలోని ప్రజలతో మాట్లాడడానికి మాకు మొదట అనుమతి ఇవ్వలేదు. తానూ, 12 మంది ట్రైనింగ్‌లో ఉన్న అమ్మాయిలు దుండగులనుండి తప్పించుకోవడానికి పడిన పాట్లు ఆమె చెప్పగా విన్న తరువాత ఆమె కోపానికి కారణం మాకు అర్థం అయింది. ఆమె జి.ఉదయగిరి బ్లాక్‌లో ఉన్న సుకానంద అనే గ్రామంలో ఒక కాన్వెంట్‌లో ఉండేది. ఆమెతోబాటు ఆ 12 మంది అమ్మాయిలు ఉండేవారు. పక్కనే ఉన్న కె.నువాగాం బ్లాక్‌లో సిస్టర్ మీనా లలితపైన జరిగిన అత్యాచారం గురించి వారు విన్నారు. భయం భయంగా ఉన్నారు. సెప్టెంబర్ 15వ తేదీన గ్రామస్తులు వచ్చి ఇక్కడ ఉండడం ఇక మంచిది కాదనీ వెళ్లిపొమ్మనీ ఆమెకు సలహా ఇచ్చారు. ఆ హెచ్చరికను






వాళ్లు లెక్క చేయడం మంచిదయింది. వాళ్లు ఖాళీ చేసిన రెండవరోజే ఆ కాన్వెంట్‌పైన దాడి జరిగింది. అది పూర్తిగా ధ్వంసం అయింది. అప్పటికే సిస్టర్ సుజిత్, 12 మంది ట్రైనీలు అడవి చేరుకున్నారు. తిండీనీళ్లూ లేకుండ నాలుగు రోజులు అడవిలో ఉండి జి.ఉదయగిరిలోని శిబిరం చేరుకున్నారు. అయితే అక్కడి వాతావరణం కూడ భద్రంగా తోచక ఆ అమ్మాయిలను తీసుకొని ఆమె భువనేశ్వర్ వచ్చి జాన్లా శిబిరానికి నిర్వాహకురాలయింది. మేమెవరమో, ఎందుకోసం వచ్చామో గ్రహించిన తరువాత ఆమె మాతో పూర్తిగా సహకరించింది. శిబిరంలోని బాధితులతో వివరంగా మాట్లాడనిచ్చింది.

## ఇంతకీ మృతులెందరు?

ఇక గణాంకాలు చూద్దాం. ఒరిస్సా ప్రభుత్వం లెక్కల ప్రకారం కంధమాల్ దాడులలో మరణించినవారి సంఖ్య 32. క్రైస్తవ సంస్థలు మృతుల సంఖ్య 75 నుండి 123 దాకా ఉందంటున్నాయి. భువనేశ్వర్ ఆర్చ్‌బిషప్ రాఫెల్ చీనత్ సుప్రీంకోర్టుకు ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సమర్పించిన 75 మంది మృతుల జాబితాలో మృతుని పేరు, గ్రామం, కొన్ని సందర్భాలలో చనిపోయిన తేదీ కూడ ఉంది. అందులో ఒక్కరి గురించయినా వారు బ్రతికే ఉన్నారనీ ఫలానచోట ఉన్నారనీ ఒరిస్సా ప్రభుత్వం అనలేదు కాబట్టి ఆ జాబితాను కాదనాల్సిన అవసరం లేదు. ఆవాసాల (ఇళ్లు, చర్చిలు, ఇతర క్రైస్తవ సంస్థల) విధ్వంసం లెక్క కూడ ఆర్చ్‌బిషప్ నిర్దిష్టంగా ఇచ్చారు. బ్లాక్‌ల వారీగా ఇచ్చిన ఈ గణాంకాల ప్రకారం మొత్తం 5031 నిర్మాణాలు ధ్వంసం అయ్యాయి. ఎక్కువ భాగం లూటీ చేసి తగలబెట్టారు. కొన్నిటిని సంపూర్ణంగా కూలగొట్టారు. అందులో 250 చర్చిలే ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం 3776 ఇళ్లు, 195 చర్చిలు ధ్వంసం అయ్యాయంటోంది.

హింసాకాండ గురించి మొదట్లో బాధితులు ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోలేదు. చాలామంది దాడి జరగగానే అడవులలోకి, అక్కడినుండి శిబిరాలలోకి పారిపోయారు కాబట్టి అందరూ ఫిర్యాదులు వెంటనే ఇవ్వలేదు. కొందరు శిబిరాలలోకి చేరిన తర్వాత ఇచ్చారు. తాము గుర్తించనవారి పేర్లు ఫిర్యాదులలో చేర్చారు. మొత్తం 784 ఫిర్యాదులు నేరాలుగా నమోదయ్యాయనీ, అందులో పేరు పెట్టిన ముద్దాయిల సంఖ్య 11,348 అనీ, 'గుర్తు తెలియనవారు' అందుకు 8 రెట్లనీ పోలీసుల గణాంకాలు తెలుపుతాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ నాటికి అందులో 633 మందిని అరెస్టు చేసినట్టు ఒరిస్సా ప్రభుత్వం తెలిపింది. తక్కిన వాళ్లనెందుకు అరెస్టు చేయలేదో చెప్పలేదు. గ్రామాల నుండి నిర్వాసితులయిన వారి సంఖ్య 50 వేలు అన్న క్రైస్తవ సంస్థల



అంచనాను పైన ప్రస్తావించాము. అది వాస్తవికమైనదేనని అన్నాము కూడ. కంధమాల్ జిల్లాలో క్రైస్తవుల జనాభా 1,17,000. అంటే శరణార్థులు మొత్తం జనాభాలో దాదాపు 43 శాతం అని అర్థం. కంధమాల్ హింసాకాండ యావత్తూ లక్ష్మణానంద సరస్వతి హత్య అతని అనుయాయులలో కలిగించిన 'ధర్మాగ్రహం' ఫలితమేనన్న సంఘ్‌పరివార్ దబాయింపును ఈ గణాంకాలతో పోల్చి చూడాలి.

## మృతుల జాబితా

ఆర్చ్‌బిషప్ రాఫెల్ చీనత్ సుప్రీంకోర్టుకు సమర్పించిన మృతుల జాబితా. ఇందులో మొదటి 32 పేర్లను మాత్రమే ప్రభుత్వం ఒప్పుకుంటున్నది.

| నెం. | మృతుని పేరు | ఊరు | చనిపోయిన తేదీ |
|---|---|---|---|
| 1. | త్రినాథ్ డిగాల్ | బూడెదిపద | 25 ఆగస్ట్ |
| 2. | దశరథ్ ప్రధాన్ | తియాంగియా | 25 ఆగస్ట్ |
| 3. | బిక్రంకుమార్ నాయక్ | బూడెదిపద | 25 ఆగస్ట్ |
| 4. | పరిఖిత నాయక్ | బూడెదిపద | 27 ఆగస్ట్ |
| 5. | దీనబంధు ప్రధాన్ | లముంగియా | 29 ఆగస్ట్ |
| 6. | గోపన్‌కుమార్ నాయక్ | బడీముండ | 26 ఆగస్ట్ |
| 7. | శిబన ప్రధాన్ | సిసాపంగ | 25 ఆగస్ట్ |
| 8. | అక్బర్ డిగాల్ | సులాసేరు | 26 ఆగస్ట్ |
| 9. | రసానంద ప్రధాన్ | గద్రగాం | 24 ఆగస్ట్ |
| 10. | అభిమన్యు నాయక్ | బరాపలి | 27 ఆగస్ట్ |
| 11. | రమేశ్‌చంద్ర డిగాల్ | డకారపంగ | 25 ఆగస్ట్ |
| 12. | దివ్యసుందర్ డిగాల్ | సిపాయెజు | 25 ఆగస్ట్ |
| 13. | మాథ్యూ నాయక్ | కన్యాగిరి | 26 ఆగస్ట్ |
| 14. | జనమతి నాయక్ | బకింగియా | 26 ఆగస్ట్ |
| 15. | సామ్యూల్ నాయక్ | బకింగియా | 26 ఆగస్ట్ |
| 16. | ఫిదెం నాయక్ | బ్రేకా | 25 ఆగస్ట్ |
| 17. | పబిప్తి నాయక్ | అదాసికుప | 25 ఆగస్ట్ |
| 18. | సిద్దేశ్వర ప్రధాన్ | సులాసేరు | 25 ఆగస్ట్ |
| 19. | మదన్ నాయక్ | బ్రేకా | 25 ఆగస్ట్ |
| 20. | శశికాంత్ నాయక్ | దాకేడి | 25 ఆగస్ట్ |
| 21. | రమణీ నాయక్ | రుడాంగియా | 30 సెప్టెంబర్ |
| 22. | మేఘానంద డిగాల్ | శంకర్‌ఖోల్ | 25 సెప్టెంబర్ |
| 23. | ప్రియతమ డిగాల్ | శంకర్‌ఖోల్ | 25 సెప్టెంబర్ |

| | | | |
|---|---|---|---|
| 24. | రాఘబ్ డిగాల్ | సిసాపంగా | 25 సెప్టెంబర్ |
| 25. | కంఠేశ్వర డిగాల్ | శంకర్‌ఖోల్ | 24 సెప్టెంబర్ |
| 26. | లాలాజీ నాయక్ | గదాగుడ | 30 సెప్టెంబర్ |
| 27. | పురందర మల్లిక్ | నిలుంగియ | 14 సెప్టెంబర్ |
| 28. | ప్రఫుల్ల ప్రధాన్ | బరాఖమ | 26 ఆగస్ట్ |
| 29. | అజుబాకుమార్ డిగాల్ | బరాఖమ | 26 ఆగస్ట్ |
| 30. | గయాధర్ డిగాల్ | సలపసాహి | 26 ఆగస్ట్ |
| 31. | దుశ్శాసన్ మాఝి | సింధిపన్‌ఖల్ | 2 అక్టోబర్ |
| 32. | సన్యాసి మాఝి | కందామి | 2 అక్టోబర్ |
| 33. | నిరుపమ | కంజమెండి | ---- |
| 34. | రాజేశ్ డిగాల్ | బటగుడ | 26 ఆగస్ట్ |
| 35. | బన్సీధర్ నాయక్ | ----- | ---- |
| 36. | నాథూరాం నాయక్ | దకేడి | ---- |
| 37. | పేస్కర్ మల్లిక్ | దకేడి | ---- |
| 38. | రాంసేన్ నాయక్ | గదాబిస | ---- |
| 39. | శిశిదేవ్ డిగాల్ | దకేడి | ---- |
| 40. | బిధుబేంద్ర బిస్వాల్ | పదంపు | 15 సెప్టెంబర్ |
| 41. | బిద్యాధర్ డిగాల్ | కట్టాఘర్ | 15 సెప్టెంబర్ |
| 42. | రజని మాఝి | కాంటాపాలి | ---- |
| 43. | ఆంథే డిగాల్ | తేలపాలి | ---- |
| 44. | బిద్యాధర్ డిగాల్ | దిమిరిగుడ | ---- |
| 45. | సదానంద ప్రధాన్ | తేలపాలి | ---- |
| 46. | కుముద్ బర్దన్ | ముకుందపూర్ | ---- |
| 47. | బక్షీశ్ సింగ్ | సిసాపంగా | 25 సెప్టెంబర్ |
| 48. | బనదేవ్ ప్రధాన్ | పాజిమహా | 23 సెప్టెంబర్ |
| 49. | బస్తిన మంత్రి | ఖైలియపడ | 26 ఆగస్ట్ |
| 50. | డానియల్ మల్లిక్ | బకింగియా | ---- |
| 51. | గుండూరి నాయక్ | బుడమహ | 27 ఆగస్ట్ |
| 52. | జాకబ్ డిగాల్ | పెటాపంగ | ---- |
| 53. | జకా నాయక్ | బుడమహ | ---- |
| 54. | కమలిని నాయక్ | మందాకియ | ---- |
| 55. | కాశిపాత్ర డిగాల్ | తటామహ | 13 సెప్టెంబర్ |
| 56. | కృష్ణ ప్రధాన్ | పంగనాజు | 8 నవంబర్ |

| | | | |
|---|---|---|---|
| 57. | మైకెల్ నాయక్ | బకింగియా | ---- |
| 58. | నబఘన నాయక్ | బకింగియా | 26 ఆగస్ట్ |
| 59. | రమేశ్ డిగాల్ | బకింగియా | ---- |
| 60. | సువా నాయక్ | బుడ్రింగియా | 13 సెప్టెంబర్ |
| 61. | సునపుల నాయక్ | బుడ్రింగియా | 12 సెప్టెంబర్ |
| 62. | బిసింగ రైత | కమల్‌డిహ | ---- |
| 63. | బిరూపాఖ్య మాఝి | పతంగి | ---- |
| 64. | ఈశ్వర్ డిగాల్ | మల్లికపడి | 20 సెప్టెంబర్ |
| 65. | శబి నాయక్ | బ్రేకా | 25 ఆగస్ట్ |
| 66. | సిద్దేశ్వర్ డిగాల్ | సులాసేరు | ---- |
| 67. | బలియామాలిక్ | తెంగంపాడు | 13 సెప్టెంబర్ |
| 68. | బిసేంద్ర మాలిక్ | బనమిలా | 13 సెప్టెంబర్ |
| 69. | మేధా మాఝి | బినింగియా | 13 సెప్టెంబర్ |
| 70. | శరత్‌దేవ్ | కుర్తంగఢ్ | ---- |
| 71. | గులిక మాలిక్ | లుండుగుడ | ---- |
| 72. | ప్రియతమ డిగాల్ | ----- | ---- |
| 73. | శ్రీమతి నాయక్ | జంజాగుడ | ---- |
| 74. | సురేశన్ నాయక్ | ----- | ---- |
| 75. | జుబ్రాజ్ డిగాల్ | నూగాం | 16 డిసెంబర్ |

(చనిపోయినప్పుడు ప్రత్యక్ష సాక్షులెవరూ లేక, శవం ఆ తరువాత దొరికిన సందర్భాలలో చనిపోయిన తేదీ తెలీదు. అయితే ముగ్గురి విషయంలో పేరు తెలిసినా ఊరు తెలియదు. ఊరెందుకు తెలీదో వివరణ లేదు)

## దాడులలో ధ్వంసమైన ఆవాసాల సంఖ్య

| నెం. | బ్లాక్ | ఆవాసాల సంఖ్య | నెం. | బ్లాక్ | ఆవాసాల సంఖ్య |
|---|---|---|---|---|---|
| 1. | బాలిగుడ | 610 | 8. | కొట్టాఘర్ | 142 |
| 2. | చకాపద | 87 | 9. | ఫిరింగియ | 282 |
| 3. | దరింగబాడి | 148 | 10. | రైకియా | 1151 |
| 4. | ఫూల్‌బని | 36 | 11. | టికాబలి | 940 |
| 5. | జి.ఉదయగిరి | 822 | 12. | తుముడిబంద | 132 |
| 6. | ఖజూరిపద | 2 | | మొత్తం | 5031 |
| 7. | కె.నువాగాం | 679 | | | |

ఆర్చిబిషప్ రాఫెల్ చీనత్ సుప్రీంకోర్టుకు ఇచ్చిన జాబితా


ఒక వ్యక్తి హత్యకు జవాబుగా ఒక సామాజిక వర్గానికి చెందిన 75 మందిని చంపి ఆ వర్గం జనాభాలో 43 శాతాన్ని గ్రామాల నుండి బలప్రయోగంతో తరిమేసి 250 ప్రార్థనా స్థలాలతో సహా 5000కు పైగా నిర్మాణాలనూ కట్టడాలనూ బుగ్గిచేయడం దానంతటది పెల్లుబికిన ప్రతీకారం కాజాలదు. అది ఒక పథకం ప్రకారం, ప్రణాళిక ప్రకారం జరిగిన మూకుమ్మడి హింసాకాండ తప్ప వేరే ఏమీ అయిఉండే అవకాశం లేదు.

## ప్రభుత్వం ఏం చేస్తున్నది?

ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి గురించి ఇప్పటికే కొంత చెప్పాము. ఆగస్ట్ 25 నుండి కంధమాల్ జిల్లా అంతటా 144 సెక్షన్ ప్రకటించినప్పటికీ లక్ష్మణానంద అంతిమయాత్ర పేరిట సుదీర్ఘమైన మృతదేహ ప్రదర్శనను అనుమతించడం, 2007 డిసెంబర్ నాటి అనుభవం ఉన్నప్పటికీ క్రైస్తవులకు భద్రత కల్పించడానికి ఏ ప్రయత్నం చేయకపోవడం, కనీసం స్థానిక పోలీసు యంత్రాంగానికి కచ్చితమైన ఆదేశాలు ఇవ్వకపోవడం, శరణార్థులు తిరిగి గ్రామాలకు పోయి స్వేచ్ఛగా బతికే పరిస్థితి కల్పించడానికి ఏ కృషీ చేయకపోగా, వీలయినంత త్వరగా శిబిరాలు మూసేసి చేతులు దులిపేసుకోవాలని చూడడం ఇవన్నీ ఇప్పటికే ప్రస్తావనకు వచ్చాయి.

వాస్తవం ఏమిటంటే ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వంలో భారతీయ జనతాపార్టీ భాగస్వామి. హింసాకాండకు పాల్పడింది వారి సోదర సంస్థ అయిన భజరంగ్‌దళ్. ఆగస్ట్ 25న లక్ష్మణానంద హత్యకు నిరసనగా సంఘ్‌పరివార్ సంస్థలు బంద్ పిలుపు ఇచ్చి మరీ దాడులకు పాల్పడ్డాయి. ఆ బంద్‌ను భారతీయ జనతాపార్టీ సమర్థించడంతో ప్రధాన పాలక పక్షమైన బిజు జనతాదళ్ తన మిత్రపక్షాన్ని కాదని నిర్ణయాలు తీసుకోవడానికి ఇష్టపడలేదు. అంతేకాక సంఘ్‌పరివార్ భావజాలం ప్రభావం ఒరిస్సా సమాజంపైన బలంగా ఉండడం వల్ల కూడ అధికార యంత్రాంగంలో కదలిక లోపించింది.

పోలీసుల వైఖరి అదైతే శిబిరాల నిర్వహణ బాధ్యతగల ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వైఖరి కూడ అంతకంటే భిన్నంగా లేదు. హిందుత్వవాద సంస్థల కార్యకర్తలు శిబిరాలలోకి స్వేచ్ఛగా వస్తూ పోతూ, శిబిరాలలో తలదాచుకున్న క్రైస్తవులను మళ్లీ బెదిరింపులకూ భయానికీ గురిచేస్తున్నా పట్టించుకోలేదు. ఆ భయానికి రెండవసారి పారిపోయినవారు కూడా చాలామందే ఉన్నారు. కనీసం శిబిరాలలో పారిశుద్ధ్యం పాటించారా, కడుపునిండా తిండిపెట్టారా అంటే అదీ లేదు. పక్కా ప్రభుత్వ భవనాలలో శిబిరాలు



ఏర్పాటుచేస్తే భజరంగ్‌దళ్, దుర్గావాహిని లాంటి సంస్థలు జనాన్ని పోగుచేసి అల్లరి చేస్తారని భయపడ్డారంటే ఏమనుకోవాలి? బలవంతంగా విస్థాపితులయిన వారిపట్ల ప్రభుత్వానికి ఉండే బాధ్యతను వివరించి వారికి నచ్చజెప్పడమో లేక వారి అభ్యంతరాలను ఖాతరు చేయకుండ తమ విధి తాము నిర్వర్తించడమో ప్రభుత్వాధికారులు చేయవలసింది. దాని బదులు వారి అభ్యంతరాలను మన్నించి శిబిరాలను అధ్వాన్నమయిన స్థితిలో ఉంచారు. వర్షంనీరు నిలిచిన నేలలోనే గుడారాలు, అందులోనే వంటలు, అక్కడే తిరుగుతున్న పందులు – అత్యంత బాధాకరమయిన ఈ దృశ్యాలు శిబిరాలు ఉన్నన్నాళ్లూ దర్శనమిచ్చాయి.

సుప్రీంకోర్టులో క్రైస్తవ సంస్థలు వేసిన కేసుకు జవాబుగా ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం నేర పరిశోధన గురించి, కేసుల విచారణ గురించి, శరణార్థుల స్థితిగతుల గురించి అనర్గళంగా అబద్ధాలు చెప్పింది. అందువల్ల సుప్రీంకోర్టు ఒరిస్సా ప్రభుత్వాన్ని కొన్ని చీవాట్లు పెట్టినప్పటికీ – ఏదో చేస్తున్నారులెమ్మని నమ్మి ఆచరణాత్మకమైన ఆదేశాలు ఏవీ జారీ చేయలేదు. తనపైన జరిగిన అత్యాచారం కేసు పరిశోధన సిబిఐకి అప్పగించాలన్న సిస్టర్ మీనా లలిత అభ్యర్థనను సహితం రాష్ట్ర ప్రభుత్వంపైన విశ్వాసంతో సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.


ఇంతగా సంఘ్‌పరివార్‌కు అనుకూలంగా వ్యవహరించిన బిజు జనతాదళ్, మళ్లీ పార్లమెంటుకు ఎన్నికలొచ్చేసరికి బిజెపికి దూరమయి వామపక్షాలతో చేరి 'సెక్యులర్' ముద్ర వేసుకుంది.

## ఇప్పుడు మంచితనం గురించి..

ఘోరమయిన ఈ నివేదిక ముగించే ముందు, అన్యాయమైన ఒత్తిడికి తల ఒగ్గకుండ నిలబడి పాణోల ప్రాణాలను కాపాడిన కంధాల గురించి కూడ చెప్పుకోవాలి. మతాన్ని, జాతిని ప్రాతిపదిక చేసుకొని జరిగే ఏ హింసాకాండలోనయినా గుంపులో భాగం కాకుండ మానవత్వాన్ని నిలబెట్టిన వారి గురించి, అటువంటి ఉదంతాల గురించి చెప్పుకోవడం అవసరం. లేకపోతే భవిష్యత్తు గురించి ఆశపెట్టుకోవడానికి ప్రాతిపదిక ఏదీ మిగలదు. కంధమాల్‌లో అటువంటి వారు చాలామందే ఉన్నారు.


బాలిగుడ సమీపంలోని బుద్రుకియా గ్రామపంచాయితీలో దమీకియా అనే ఊరు ఉంది. ఆ పంచాయితీ సర్పంచ్ లూర్దుమాలిక్‌ది ఆ ఊరు. ఆమె పేరును బట్టి క్రైస్తవ మతస్తురాలు అయి ఉండవచ్చును గాని ఆమె భర్త దండపాణి మల్లిక్ క్రైస్తవుడు కాదు. వాళ్లు కంధాలు. ఆ గ్రామంలోనూ





పరిసర గ్రామాలలోనూ మతపరమైన దాడులు నివారించే బాధ్యత దండపాణి తనమీద వేసుకున్నాడు. 2007 డిసెంబర్ అల్లర్లప్పుడు కుయి సమాజ్ సమన్వయ సమితి పిలుపు మేరకు నడుస్తున్న ఆందోళనలో భాగంగా డిసెంబర్ 27, 28 తేదీలలో బాలిగుడలో ఊరేగింపు జరిగింది. ఈ ఆందోళన డిమాండ్ల గురించీ, అది క్రైస్తవ పాణోలపైన దాడి రూపం తీసుకున్న వైనం గురించీ పైన చెప్పాము. ఇక్కడ కూడ ఆ ప్రదర్శనలో పాల్గొన్నవారు బాలిగుడలోనే కాక పరిసర గ్రామాలలోనూ క్రైస్తవ నివాసాలపైన దాడి చేసారు. (కంధాల ప్రదర్శనలోకి ఆర్.ఎస్.ఎస్ వారు చొరబడి దాడులకు పాల్పడ్డారు అనేది దండపాణి వ్యాఖ్య). అప్పుడు దండపాణి దమీకియా, సిపంజరి, ముస్కుల్, బిరాగుడ గ్రామాలలోని కంధాలను, పాణోలను ఐక్యంచేసి ఆ గ్రామాలలో స్థానికులుగానీ బయటివారుగానీ హింసకు పాల్పడకుండ నిరోధించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసాడు. 2008 ఆగస్ట్ నెలలో ఆ కమిటీ అక్కరకు వచ్చింది. ఆగస్ట్ 27-28 తేదీలలో భజరంగ్‌దళ్ గుంపులు ప్రదర్శనగా ఒక ఊరునుండి ఒక ఊరికి పోతూ క్రైస్తవులపైన దాడులకు పాల్పడుతున్నప్పుడు ఈ నాలుగు ఊర్లకు రాకుండా వారిని ఆ కమిటీ నిలవరించగలిగింది. నాలుగు గ్రామాలలోనయినా మత హింసాకాండను ఆపగలిగినందుకు మేము అతనిని అభినందించగా దండపాణి మల్లిక్ నవ్వుతూ 'మావాళ్లే ఇప్పుడు నన్ను శత్రువుగా చూస్తున్నారు' అన్నాడు. అందరినీ అడిగినట్టే అతనిని కూడ మేము 'ఆదివాసులు తమను తాము హిందువులుగా పిలుచుకోవడం ఎప్పుడు మొదలయింది?' అని అడిగాము. కొందరు కాలక్రమంలో ఆదివాసుల హైందవీకరణ జరిగిందని అనగా, కొందరు లక్ష్మణానంద సరస్వతి ప్రచారంతోనే మొదలయిందని అన్నారు. దండపాణి మాత్రం 'క్రైస్తవం పుచ్చుకున్న ఆదివాసులు తమను తాము ఆదివాసీ క్రైస్తవులుగా పిలుచుకోవడం మొదలుపెట్టిన తరువాత మిగిలిన వాళ్లు తమను తాము ఆదివాసీ హిందువులమని చెప్పుకోవడం మొదలయింది' అన్నాడు.

కంధమాల్ నారీ జాగరణ్‌మంచ్ అధ్యక్షురాలు కేశోమతి ప్రధాన్ గురించి పైన చెప్పాము. ఆమె కంధా తెగకు చెందిన ఆదివాసీ. ఆమెది రైకియా బ్లాక్‌లోని సుకుడ్‌బాడి పంచాయితీ పరిధిలో ఉన్న కజూరి గ్రామం అని చెప్పాము. 2007 డిసెంబర్ దాడులప్పుడు ఆమె బారఖమా గ్రామంలో తన బంధువుల దగ్గర ఉండగా 25 డిసెంబర్‌న ఆ ఊరిపైన దాడి జరిగింది. ఆ దాడిలో పెద్దసంఖ్యలో పాల్గొన్న కంధాలకు 'ఒరియాలు' (సవర్ణ హిందువులు)



# మీడియా పాత్ర : సంఘ్‌పరివార్ రెండవ గొంతు

ఒరిస్సా దమనకాండ విషయంలో స్థానిక మీడియా పాత్ర గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత గౌరవంగా ఉంటుంది. ప్రధాన ఒరియా దినపత్రికలయిన సమాజ్, సంబాద్, ధరిత్రిలు క్రైస్తవులపైన అమలయిన హింసకు చాలా తక్కువ ప్రచారం ఇచ్చి హింసను సమర్థించడానికి సంఘ్‌పరివార్ చూపిన సాకులకు ఎక్కువ ప్రచారం ఇచ్చాయి. మావోయిస్టులు లక్ష్మణానందను తామే చంపామని చెప్పుకున్నప్పటికీ క్రైస్తవులే చంపారంటున్న సంఘ్‌పరివార్ వైఖరికి అనుకూలమయిన వ్యాఖ్యలు చేసాయి. శరణార్థుల శిబిరాలలోని అమానుష పరిస్థితుల గురించి దాదాపు రాయనే లేదు.

ఒరియా భాషలో అత్యధికంగా అమ్ముడుపోయే దినపత్రిక అయిన సమాజ్, ఒకవేళ లక్ష్మణానందను మావోయిస్టులే చంపి ఉన్నా కూడ క్రైస్తవ మిషనరీలే వారికి డబ్బులిచ్చి చంపించి ఉంటారని వ్యాఖ్యానించింది. 'అందులో ఆశ్చర్యమేముంది? మతమార్పిడి కోసం వాళ్లు డబ్బుల మూటలు వెదజల్లడం లేదా?' అనింది. క్రైస్తవులను బలవంతంగా హిందువులుగా మార్చే ప్రక్రియకు లక్ష్మణానంద సరస్వతి పెట్టిన ఘర్‌వాపసి (పునరాగమనం) అనే అబద్ధపు పేరును మీడియా స్వంతం చేసుకొని ప్రచారం చేయడం ద్వారా దానికి విశ్వసనీయత కల్పించింది.


పూరి శంకరాచార్యులు, ప్రవీణ్ తొగాడియా, అశోక్ సింఘాల్, ఇతర విశ్వహిందూ పరిషత్ నేతలు క్రైస్తవులపైన నిందలు వేస్తూ చేసిన ప్రకటనలను ఈ పత్రికలు మొదటి పేజీలో ప్రచురించాయి. కాని దాడులకు గురయిన బాధితులు రోజులతరబడి అడవులలో నడిచి భువనేశ్వర్‌కు వచ్చి రాష్ట్ర రాజధానిలోని విలేకరులకు చెప్పుకున్నాకనే వారిపైన జరిగిన హింసాకాండ కనీసం కొన్ని పేపర్లకయినా వార్త అయింది. సిస్టర్ మీనాలలితపైన జరిగిన లైంగిక అత్యాచారం గురించి 'ది హిందూ' దినపత్రిక విలేకరి బయటినుండి వచ్చి రాసేదాకా ఒరిస్సాలో ఎవరికీ తెలియదంటే మీడియా వైఖరేమిటో, పాత్ర ఏమిటో అర్థం అవుతుంది. వెరసి ఒరియా పత్రికలు ప్రచారం చేసిన వ్యాఖ్యలు ఏమిటంటే –

1. లక్ష్మణానందను చంపింది క్రైస్తవ మిషనరీలే తప్ప మావోయిస్టులు కాదు.
2. మూలకారణం మత మార్పిడియే.
3. లక్ష్మణానంద ఆదివాసులకు దేవుడు.
4. ఆదివాసులు హిందువులే, మత మార్పిడి అధర్మం.
5. పాణోలు బయటివారు, వారు కంధాల భూములు ఆక్రమించుకున్నారు.
6. క్రైస్తవులు – అంటే మతం మార్చుకున్న పాణోలు – చట్టం ఆదివాసులకిచ్చిన సదుపాయాలను మోసపూరితంగా గుంజుకున్నారు.
7. మతమార్పిడుల వల్ల హిందువులు కంధమాల్ జిల్లాలో మైనారిటీ అయిపోతున్నారు.
8. జరిగిన ఘటనలను క్రైస్తవులు ఎక్కువచేసి ప్రచారం చేయడం ద్వారా ఒరిస్సా రాష్ట్రానికి అమెరికాలో, ఇంగ్లండ్‌లో చెడ్డపేరు తెస్తున్నారు.
9. పునరాగమనం లేక ఘర్‌వాపసీ అత్యవసరమయిన కార్యక్రమం.

నాయకత్వం వహించడం గమనించింది. కంధాలకు వారు నుదుటిమీద తిలకం దిద్ది భజరంగ్‌దళ్ చిహ్నం అయిన ఎర్రగుడ్డను తలకు చుట్టడం చూసింది. ఆ దాడిలో పాల్గొనవద్దని ఆమె తనతోటి కంధాలకు నచ్చచెప్పింది. ‘అది మనకు మంచిది కాదు’ అని వారిని ఆపే ప్రయత్నం చేసింది. ఆ రోజున దాడి ఆపలేకపోయింది గానీ ఆ ఊరిలో మళ్లీ దాడి జరగకుండ మాత్రం నిరోధించగలిగానని చెప్పింది. 2008 ఆగస్ట్ నెలలో దాడులు జరుగుతున్నప్పుడు తన స్వంత ఊరయిన కజూరిలో ఆమె ప్రయత్నం ఫలవంతం అయింది. భజరంగ్‌దళ్ ఆ ఊరిమీదికి ఒక గుంపును తీసుకురాగా ఆమె అడ్డుపడింది. ఆమె మత మార్పిడుల్ని సమర్థిస్తున్నదనీ, పాణోలను ప్రోత్సహిస్తున్నదనీ, మావోయిస్టులకు డబ్బులిచ్చి లక్ష్మణానందను చంపించిందనీ భజరంగ్‌దళ్ నాయకులు నోటికొచ్చిన నిందలు వేసినా ఆమె వెనక్కి తగ్గలేదు. చంపుతామని బెదిరిస్తే ‘నేను మంచి చేస్తున్నాను, చంపినా చేస్తాను’ అనింది. ఆ ఊరిలోని ఏడు క్రైస్తవ కుటుంబాలను ఊరు విడిచిపెట్టి పోవద్దని నచ్చజెప్పి ఆపింది. ఊరు విడిచిపెట్టిపోతే మీ భూములు వేరేవాళ్లు ఆక్రమించుకుంటారని హితవు చెప్పింది. ఆ ఊరిలోని కంధాలెవరూ భజరంగ్‌దళ్‌తో చేతులు కలపకుండ ఆపగలిగింది.

జి.ఉదయగిరి బ్లాక్‌లోని తియాంగియాలో క్రైస్తవులపైన దాడి చేయడానికొచ్చిన భజరంగ్‌దళ్ గుంపుకు దశరథ్ ప్రధాన్, జగన్నాథ్ ప్రధాన్ అనే కంధాలు అడ్డుపడగా దుండగులు దశరథ్ ప్రధాన్‌ను నరికి చంపారు. జగన్నాథ్ ప్రధాన్ ఇల్లు కూల్చారు. రైకియాలో ప్రభుత్వ ఉద్యోగి అయిన సారంగధర్ ప్రధాన్ క్రైస్తవులపైన ఘోరమైన హత్యాకాండ జరుగుతున్న సమయంలోనే రెండు మూడు క్రైస్తవ కుటుంబాలకు తన యింట్లో ఆశ్రయం ఇచ్చాడు. దాడిచేస్తున్న గుంపు అతని ఇంటిమీదికి రాగా, వాళ్లను చంపదలచుకుంటే ముందు నన్ను చంపండి అన్నాడు. అతన్ని చంపడం ఇష్టంలేక కాబోలు రెండు చేతులపైనా కత్తులతో కొట్టి గాయపరిచి వెళ్లిపోయారు.

రాష్ట్ర రహదారి మీద ఉన్న బాంజ్‌నగర్‌లో ఒక పేరు తెలియని బ్రాహ్మణుడి గురించి శిబిరాలలోని క్రైస్తవులు చెప్పారు. ఒక తెల్లవారి ఇంటి తలుపు తెరిచిన ఆ వ్యక్తికి ఆవరణనిండా ఆకలిగొన్న క్రైస్తవులు కనిపించారు. జి.ఉదయగిరి బ్లాక్‌లోని గ్రామాల నుండి బరంపురానికో భువనేశ్వర్‌కో పారిపోతూ అక్కడ రాత్రి ఆగినట్టున్నారు. అతను వాళ్లందరికీ ఒళ్లు కడుక్కోడానికి నీళ్లిచ్చి అన్నంపెట్టి పంపించాడు.



# ఉపసంహారం

**మొ**దట్లోనే చెప్పినట్టు, మేము విషయ సేకరణ చేసేటప్పుడు సంఘ్‌పరివార్ పాల్పడుతున్న హింస, దాని విషయంలో ఆయా రాష్ట్రాల పాలనా యంత్రాంగం నిర్లిప్తత లేక లాలూచీ, ఇద్దరూ తమ చర్యలకు ఇచ్చుకుంటున్న వికృతమైన వివరణలపైన మాత్రమే దృష్టి పెట్టలేదు. సంఘ్‌పరివార్ తన లక్ష్యసాధన కోసం జనాన్ని పోగు చేసుకోవడానికి అనుసరిస్తున్న వ్యూహాల మీద కూడ దృష్టి పెట్టాము. ఒరిస్సాలో చారిత్రక కారణాల వల్ల కంధా, పాణో ప్రజల మధ్య నెలకొన్న వైరుధ్యాలను వారు వాడుకున్నారు. కర్ణాటకలో భావోద్వేగం కలిగించే చిహ్నాలను వాడుకున్నారు. జాతీయ జెండాను, ఆవును, హిందూస్వామి పీఠంగా చెప్పబడుతున్న స్థలాన్నీ వాడుకున్నారు. కరావళిలో అభివృద్ధి మిగిల్చిన నిరసనను వాడుకుని వెనుకబడిన వర్గాల ఆగ్రహాన్ని సొమ్ము చేసుకున్నారు. రెండు చోట్లా, సంక్షోభితమైన సామాజిక వ్యవస్థ కలిగించే అభద్రతా భావాన్ని వాడుకొని క్రైస్తవులను హిందువుల మాతృభూమి అయిన భారతదేశాన్ని నాశనం చేస్తున్న వైరి ప్రజలుగా చూపించారు. క్రైస్తవం ఉనికి, క్రైస్తవ ఆచరణే వారి దృష్టిలో విద్రోహ చర్యలు. 'మతమార్పిడి' అనేది ప్రశ్నించే వాళ్లను సంతృప్తి పరచడానికి ఇచ్చే వివరణ మాత్రమే. దాడి క్రైస్తవం మీదనే తప్ప క్రైస్తవ మతాంతరీకరణపైన కాదు. ఎవరికి అర్థం కాకపోయినా దాడికి గురయిన క్రైస్తవ ప్రచారకులకూ పాస్టర్లకూ ఈ విషయం అర్థం అయ్యే ఉంటుంది.

భారతదేశానికి గోల్వాల్కర్ వారసులు ఇవ్వాలని చూస్తున్న స్వరూపంతోను, వారు సాధించజూస్తున్న సామాజిక లక్ష్యాలతోనూ విభేదించేవారు తమకు తాము వేసుకోవలసిన ప్రశ్న – ఈ వ్యూహాలను గుర్తిస్తున్నారా, అర్థం చేసుకుంటున్నారా, వాటిని వ్యతిరేకించడానికి అదే ప్రజలలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారా అనేది. ఇది కేవలం ప్రశ్న కాదు. ఒక అత్యవసరమయిన కర్తవ్యం.







సంఘ్ పరివార్‌కు క్రైస్తవం ఉనికి, క్రైస్తవ ఆచరణే విద్రోహ చర్యలు. 'మతమార్పిడి' అనేది ప్రశ్నించే వాళ్లను సంతృప్తిపరచడానికి ఇచ్చే వివరణ మాత్రమే. దాడి క్రైస్తవం మీదనే తప్ప క్రైస్తవ మతాంతీకరణపైన కాదు. ఎవరికి అర్థం కాకపోయినా దాడికి గురైన క్రైస్తవ ప్రచారకులకూ పాస్టర్లకూ ఈ విషయం అర్థమయ్యే ఉంటుంది.


భారతదేశానికి గోల్వాల్కర్ వారసులు ఇవ్వాలని చూస్తున్న స్వరూపంతోను, వారు సాధించజూస్తున్న సామాజిక లక్ష్యాలతోనూ విభేదించేవారు తమకు తాము వేసుకోవలసిన ప్రశ్న- ఈ వ్యూహాలను గుర్తిస్తున్నారా, అర్థం చేసుకుంటున్నారా, వాటిని వ్యతిరేకించడానికి అదే ప్రజలలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారా అనేది. ఇది కేవలం ప్రశ్న కాదు. ఒక అత్యవసరమయిన కర్తవ్యం.


HRF
మానవహక్కుల వేదిక ప్రచురణ



# లాల్‌గఢ్: ఎవరి బాధ్యత ఎంత?


**లా**ల్‌గఢ్ ఉదంతం ఏ అర్థంలోనూ ముగింపుకు రాలేదు. పరిపాలనా వ్యవస్థను అక్కడ తిరిగి స్థాపించే పోలీసు చర్య ముగింపుకు రాబోతున్నదనీ చివరి దశ మొదలయిందనీ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వము, పారామిలటరీ దళాల అధికారులు అనగా వింటున్నాం. ఇప్పటివరకు ఈ పోలీసు చర్యలో రక్తపాతం భయపడినంతగా జరగలేదు గానీ 'చివరిదశ'లో ఎటువంటి వార్తలు వినవలసివస్తుందోనన్న ఆందోళన లేకపోలేదు. అయితే కొత్తగా ఠాణా అప్పగించబడ్డ ఎస్‌ఐలాగ ఉత్సాహపడుతున్న హోంమంత్రి చిదంబరం గాని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం గాని కోరుకున్న ఈ ముగింపు లభించినా కూడ అది వేరే ఏ అర్థంలోనూ లాల్‌గఢ్‌కు ముగింపు కాదు. ఆ రాష్ట్ర పాలకులు, ప్రత్యేకించి సిపిఎం నాయకులు ఇప్పటికైనా గ్రహించవలసిన సత్యాలు కొన్ని ఉన్నాయి. ఇవి నందిగ్రామ్ సమయంలోనే వెలికివచ్చాయి గానీ ఇప్పుడు మరింత స్పష్టం అయినాయి. ముప్పై ఏళ్ళకు పైగా వామపక్ష పార్టీలు ఆ రాష్ట్రాన్ని అవిచ్ఛిన్నంగా పరిపాలించిన క్రమంలో కొన్ని బలమైన అవలక్షణాలు పాలనా యంత్రాంగానికీ పాలక పార్టీలకూ అంటుకున్నాయి. ఆ రెండిటికీ తేడా చాలావరకు చెరిగిపోవడం మొదటి అవలక్షణం. ఇది సిపిఎంకు పత్యేకించి వర్తిస్తుంది. పాలక పార్టీయే ప్రభుత్వం, ప్రభుత్వమే పాలకపార్టీ అన్న స్థితి వచ్చింది. కోల్‌కతాలోనే కాదు, జిల్లాలలో సహితం సిపిఎం స్థానిక నాయకులు తాలూకా ఆఫీసు, పోలీసుస్టేషన్లతో మొదలుపెట్టి అన్ని కార్యాలయాలనూ శాసించడం రివాజు అయింది. ఈ ఫిర్యాదు కనీసం ఒక దశాబ్ద కాలంగా ఆ రాష్ట్రానికి ఎప్పుడు పోయినా వింటున్నాం. అయితే అది నందిగ్రామ్‌తో ప్రజల నిరసన రూపంలో బయటికొచ్చింది. లాల్‌గఢ్‌లో దాని ఛాయలు బలంగా ఉన్నాయి. లాల్‌గఢ్‌లో గడచిన మూడు నాలుగు నెలల కాలంలో మావోయిస్టులూ వారి అండ వున్న ఉద్యమకారులూ సిపిఎం కార్యకర్తలను ఏరి ఏరి చంపిన ఘటనలు కేవలం రాజకీయ హత్యలు కావనీ వాటిలో పాలనా యంత్రాంగం పట్ల నిరసన కూడా ఇమిడి ఉందనీ గుర్తించడం అవసరం. అయినప్పటికీ అటువంటి హత్యలు



అన్యాయమనీ, పైగా అవి నిరసనోద్యమాన్ని బలహీనపరుస్తాయే తప్ప దానికి బలం కల్పించవన్న విమర్శకు తావు వుంటుందన్నది వేరే విషయం.

తామే పాలనా యంత్రాంగమై వ్యవహరించే సిపిఎం కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ విధానాల అమలును తమ కర్తవ్యంగా మీద వేసుకోవడం, వాటిని వ్యతిరేకించే వారిపైన భౌతిక దాడులకు పాల్పడడం తరచుగా జరుగుతుంటుంది. నందిగ్రామ్‌లో సెజ్‌ను వ్యతిరేకించిన వారిపై సిపిఎం కార్యకర్తలు భౌతికదాడులు చేయడంతోనే సమస్య మొదలయింది. ఇది తప్పని సిపిఎం నాయకత్వం అంగీకరించక గత్యంతరం లేని పరిస్థితి ఇవాళ వచ్చింది. ఇంకనైనా ఆలస్యం చేయకుండ గ్రహిస్తారో లేదో చూడాలి. మూడు దశాబ్దాలుగా ఆ రాష్ట్రంలో అవిచ్ఛిన్నంగా గెలుస్తూ ఉండడానికి కారణాలేమిటన్న చర్చ ఎప్పుడొచ్చినా, కౌలురైతులకు (బర్గాదారులకు) భద్రత కల్పించారనీ, 73వ రాజ్యాంగ సవరణ కంటే ముందే పంచాయతీలకు బలం కల్పించారనీ చెప్తుంటారు. ఇవి ఎప్పటి విషయాలో! ఆ తరువాత ఏం చేశారు? ఆపైన ఏం చేశారు? లాల్‌గఢ్‌లో ఆదివాసులు తామే రోడ్లు వేసుకున్నారనీ చెరువులు తవ్వుకున్నారనీ వింటున్నాం. మూడు దశాబ్దాల వామపక్షాల పాలన తరువాత ఒక ఆదివాసీ ప్రాంతంలో వేయడానికి రోడ్లు, తవ్వడానికి చెరువులూ ఇంకా ఎందుకు మిగిలి ఉన్నాయి? ఆదివాసులకు పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం నేతృత్వంలోని ప్రభుత్వం తగినంత చేయకపోవడం వల్లనే లాల్‌గఢ్‌లో అసంతృప్తి చెలరేగిందని సిపిఐ నాయకుడు బర్ధన్ మొన్న అన్నారు. ఆ రాష్ట్రంలో అధికారం పంచుకుంటూ బయటకు వచ్చి సిపిఎంను విమర్శించడంలోని నిజాయితీ ఎంత అని వారిని అడగవచ్చును గానీ, ఈ విమర్శ నిజమే కదా? కనీసం ఆ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం చేత షెడ్యూల్డు ప్రాంతాలుగా ప్రకటింపజేయడానికి ప్రయత్నించిన దాఖలాలు కూడ లేవు. (ఈ విమర్శ వామపక్ష పార్టీలు పదే పదే అధికారానికొస్తున్న కేరళకు కూడా వర్తిస్తుంది.) ఆ గుర్తింపు ఉంటే కొన్ని హక్కులు స్వతహాగా వస్తాయి. కొన్ని కల్పించడం సులభం అవుతుంది.

కాగా, లాల్‌గఢ్ ఆదివాసీ పోరాటానికీ మావోయిస్టులకూ మధ్యనున్న సంబంధం ఇప్పటికీ స్పష్టంగా లేదు. ఎవరికి నచ్చిన చిత్రం వాళ్లు ఊహించుకుంటున్నారు. ఇతరులను అంగీకరించమంటున్నారు. ఆదివాసీ పోరాటం మొత్తం మావోయిస్టుల సృష్టి అనేది కేంద్ర 'ఇంటెలిజెన్స్' అని పిలవబడే వ్యవస్థ అభిప్రాయం. ఈ విషయం గ్రహించకపోవడం



పశ్చిమ బెంగాల్ పాలకుల తెలివితక్కువతనం అని వారి విమర్శ. ఆ రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 17 ఏదో ఒక మేరకు మావోయిస్టుల ప్రభావంలో ఉన్నాయనీ, కేవలం తూర్పు, పశ్చిమ మెదినీపూర్‌లు (మిద్నపూర్ అని అందరూ అంటున్న జిల్లాలు), పురూలియా, బంకూరాలకే వారి ప్రభావం పరిమితమయిందన్న సిపిఎం పాలకుల అభిప్రాయం హ్రస్వదృష్టి అనీ వారి నింద. మావోయిస్టులు కూడ తమ నాయకత్వంలోనే ఆ ఉద్యమం నడుస్తున్నదన్న అభిప్రాయం బహిరంగంగా కలిగిస్తున్నారు (అది నిజమైనా కూడా దానిని బహిరంగపరచడంలోని విజ్ఞత ఎంత?). దీనికి పూర్తిగా భిన్నంగా, పోలీస్ అత్యాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆదివాసీ ప్రజా ఉద్యమ నాయకుడు ఛాత్రధర్ మహతో, 'మాకు మావోయిస్టులతో ఏ సంబంధం లేదు. వారి ఆలోచనలు వేరు, మావి వేరు' అంటున్నాడు. ఇది ఆత్మరక్షణలో చేసిన ప్రకటనే అనుకున్నా అతనిని తప్పుపట్టలేము. అయితే ఇదే వ్యాఖ్య వేరే కారణంగా చేస్తున్న మేధావులూ చాలామంది ఉన్నారు. లాల్‌గఢ్‌లో ఆదివాసులు స్వయంపాలన నెలకొల్పి తమ బాగోగులు తాము నిర్ణయించుకుంటున్నారని ఈ వ్యాఖ్య అంటుంది. అందులో భాగంగా, పొరుగున ఉన్న సల్బోనిలో ఆదివాసులకు ఇస్తామని హామీ ఇచ్చిన 4500 ఎకరాల ప్రభుత్వ భూమిని జిందాల్ వారి స్టీల్ ఫ్యాక్టరీకి రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టగా దానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారనీ, ఈ స్వయం పాలన ఆకాంక్షను మావోయిస్టులు కబ్జా చేసుకొని లాల్‌గఢ్‌ను విముక్త ప్రాంతంగా చూపించి ప్రజాఉద్యమ స్థానంలో సాయుధ దళాల గెరిల్లా పోరాటాన్ని ప్రవేశపెట్టారని ఈ వ్యాఖ్య అంటుంది. మావోయిస్టులను తీవ్రంగా ఖండిస్తూ, ఆదివాసీ స్వయం పాలనా పోరాటాన్ని ప్రశంసిస్తుంది. ఇది నిజమయితే ఈ మాటలు అనడానికి సందేహించనవసరం లేదుగానీ ఇందులో నిజాన్ని బయటపెట్టాలన్న ఆరాటం కంటే మావోయిస్టుల ఉనికికి, వారి రాజకీయాలకు చోటు నిరాకరించాలన్న ఆరాటమే ఎక్కువగా కనిపిస్తోంది.

అది అవాస్తవికమైన, అహేతుకమైన వైఖరి. భారత ప్రజాస్వామ్యం వేరే లక్ష్యాల సంగతి అటుంచి, అది భారత రాజ్యాంగ ఆదర్శాలను సహితం ఒనగూర్చుతుందన్న కచ్చితమైన భరోసా ఇచ్చే స్థితిలో ఎవ్వరూ లేనప్పుడు రాజ్యాంగం నిర్దేశించిన రాజకీయ వ్యవస్థకు వెలుపల ప్రత్యామ్నాయాలను అన్వేషించే ప్రయత్నాలను అసలే కూడదనడం అవాస్తవికమైన వైఖరి.


అయితే ఈ గుర్తింపుతో పాటు మావోయిస్టులు జవాబుదారీతనాన్ని కూడ స్వీకరించవలసి ఉంటుంది. లాల్‌గఢ్ ఆదివాసీ పోరాటంతో





వారికి సంబంధాలు తొలి నుంచి ఉన్నాయన్నది స్పష్టమే. అందులో వారి పాత్ర ఉన్న విషయమూ స్పష్టమే. అయితే 4500 ఎకరాల కోసం ఆదివాసీ ప్రజలు ఉమ్మడిగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుద్ధదేవ్ భట్టాచార్యపైన హత్యా ప్రయత్నానికి పాల్పడడం ఏపాటి విజ్ఞత గల చర్య? దానితో మొదలయిన ఘటనలే కదా ఒకదానితో ఒకటి జత అయి ప్రస్తుత పరిస్థితికి దారితీశాయి? లాల్‌గఢ్‌లో దిగిన కేంద్ర పారా మిలటరీ బలగాలు ఆదివాసీ ప్రజల పోరాటఫలాలను చిదిమేసి పూర్వస్థితికి తీసుకొస్తే దానికి బాధ్యులెవరు? ఒక రకంగా ఈ చర్య పొరుగున ఒరిస్సా రాష్ట్రంలోని కంధమాల్ జిల్లాలో లక్ష్మణానంద సరస్వతి హత్యతో పోల్చదగ్గది. స్థానిక పరిస్థితులు చాలా భిన్నమైనవి కాబట్టి పర్యవసానాలు ఒకేరకంగా లేవుగానీ, రెండూ అనాలోచితమైన చర్యలే. అక్కడ ప్రతిచర్య వల్ల క్రైస్తవులు ప్రత్యక్షంగా భారీ మూల్యం చెల్లించగా, ఇక్కడ ప్రతిచర్య వల్ల ఆదివాసులు వేరే రూపంలో చాలా మూల్యం చెల్లించబోతారు. ఈ మాటలు అంటే 'తప్పంతా మావోయిస్టుల పైనే పెడుతున్నారు' అన్న ఎదురుదాడి తప్ప వేరే జవాబు రాదు. ఎవరి మీద ఎంత తప్పు పెట్టాలో అంత పెట్టే విజ్ఞత సమాజంలో లేకపోలేదని మావోయిస్టులు గుర్తించే రోజు వస్తే వారి నాయకత్వాన్ని అనుసరిస్తున్న ప్రజలకు వారు మేలు చేసినవారవుతారు. లేకపోతే కన్నీటి గాథలు మళ్లీ మళ్లీ పునరావృతమవుతూనే ఉంటాయి.

ఆంధ్రజ్యోతి దినపత్రిక
1 జూలై 2009



Adivasis: Reports, Essays on Chattisgarh and Kandhamal

గొత్తికోయలయినా కోయలయినా ఆదివాసులలో మిలిటెన్సీ ఎక్కువ. దానిని ఇరుపక్షాల నాయకులూ నిర్మొహమాటంగా వాడుకుంటున్నారు. తమ ప్రత్యర్థులుగా భావించిన వారిపైన మూకుమ్మడిగా దాడి చేయడానికి, గొర్రెలను నరికినట్టు నరకడానికి ఆదివాసులు వెనకాడరు. ఈ గుణాన్ని అటు సల్వాజుడుం నాయకులు, ఇటు మావోయిస్టు నాయకులు కూడ ప్రోత్సహిస్తున్నారు, వాడుకుంటున్నారు. 'వాళ్లు చేస్తున్నారు కాబట్టి మేము చేయక తప్పదు' అని ఇద్దరూ అనొచ్చు. ఏమయితేనేం ఇది జరుగుతున్న మాట సత్యం. దీని ఫలితం ఆదివాసీ హననం.

ఒక సంవత్సర కాలంలోనే ఒక్క దంతెవాడ జిల్లాలోనే ఈ హత్యాకాండలో 500 ప్రాణాల దాకా పోయాయి. అందులో 95 శాతం మంది స్థానిక ఆదివాసులే. విప్లవ సానుభూతిపరులు కావచ్చు, విప్లవ వ్యతిరేకులు కావచ్చు, సాదా కమ్యూనిస్టులు కావచ్చు, కాంగ్రెస్ అనుయాయులు కావచ్చు, అత్యధిక భాగం ఇవేవీ కాని అడవి బిడ్డలు కావచ్చు. మొత్తానికి అంతా ఆదివాసులే.